# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక డిసెంబరు, 2013 ₹ 20



ధనవంతుడు

# మిసిమి
మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**
*- Dammapada.*

**సంపుటి 24 డిసెంబరు 2013 సంచిక 12**

*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాంౖడేగుల నాగేశ్వరరావు

*సమాలోచక మండలి*

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి
డాక్టర్ ఈమని శివనాగి రెడ్డి
కుర్రా జితేంద్రబాబు
నందిగం కృష్ణారావు

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

ప్రతి : ₹20 సంవత్సరానికి : ₹240
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

(Library of Congress Control Number)
LCCN 91-903060


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు .......... 3
మా గురుదేవులు నాయుడు గారు .......... 5
– దేవులపల్లి కృష్ణశాస్త్రి
మిశ్రమంజరి / రాయప్రోలు(పురస్కార సాహిత్యం) .... 8
– ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
అనుభూతి పార్శ్వం .......... 19
– మాదిరాజు రంగారావు
ఆకాశవాణి – ఆచంట జానకిరామ్ .......... 23
– సేకరణ: జె. చంద్రమౌళి
అనువాద ప్రక్రియ .......... 33
– ఆర్. వెంకటేశ్వరరావు (ఆర్వీయార్)
కూచిపూడి – ఇతిహాస కథలు .......... 40
– భాగవతుల వెంకటరామ శర్మ
గాలిని గాలిలో చిత్రీకరించడమే సంగీతం .......... 42
– అజేయ చక్రవర్తి
కవిత్వం – ప్రాచీన భాషలు .......... 46
– కుర్రా జితేంద్రబాబు
నెల్లూరు కృష్ణపట్నం: మనుమసిద్ధేశ్వర ఆలయం .... 53
– డాక్టర్ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి
వీలునామా .......... 59
– రేబాల లక్ష్మీనరసారెడ్డి
పోలాండ్ కవిత్వం .......... 66
– ముకుంద రామారావు
క్రీస్తు చరిత్ర – జాషువా పద్యాలు .......... 73
లోకేష్ సాహస యాత్ర .......... 75
చదవండి (పుస్తక పరిచయం) .......... 76
నవలాహృదయావిష్కరణ .......... 78
– వాసిరెడ్డి నవీన్


*ముఖచిత్రం* : మడోనా
*రెండవ అట్ట* : అంద్రెయ్య
*మూడవ అట్ట* : ధనవంతుడు
*నాల్గవ అట్ట* : కారుణ్యమూర్తి
} చిత్రకారుడు : ఉదయ్

(వివరాలు : 39వ పుటలో...)

చూస్తూండగానే సంవత్సరాంతానికి చేరుకున్నాం. ఎప్పటిలానే ఈ సంవత్సరం కూడా ఈ నెల అట్టమీద బొమ్మలు, అట్టలోపలి బొమ్మలు బైబిలుకు చెందినవే, వాటికి సంబంధించిన కథాంశాలతో సహా-

వీరేశలింగం అనే వీరుడు, వెంకటరత్నం అనే ఋషి, దక్షిణ భారతదేశాన్ని పరిపాలించే రెండు నక్షత్రాలుగా ఉత్తర భారత పత్రికలచే కొనియాడబడ్డారు. నవ్యాంధ్ర నిర్మాతలలో ప్రముఖుడైన, తనగురువు రఘుపతి వెంకటరత్నం నాయుడి మూర్తిమంతమైన విగ్రహాన్ని మన కనుల ముందుంచారు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

జీవించినప్పుడే కాదు మరణానంతరం కూడా మానవతా వాదానికి కట్టుబడ్డ వదాన్యుడు రేబాల లక్ష్మీనరసారెడ్డి. వారు తమ వీలునామాలో బంధుమిత్రులకే కాక తనకు సేవచేసిన వారికి తన తదనంతరం ఆస్తిని సమపాళ్ళలో పంచిపెట్టారు. తన వద్ద ఐదు సంవత్సరాలు తక్కువ కాకుండా పనిచేసిన వారికి, అలానే మూడు సంవత్సరాలు పనిచేసిన వారికందరికి తలోకాస్త పంచారు. పనిచేసుకొనుటకు శక్తిలేని బీదలకు ప్రతిదినం అన్నం పెట్టేలా ఏర్పాటు చేయటం, ఆ పని నిజాయితీగా జరిగేలా కొన్ని నిబంధనలను ఏర్పాటు చేయటం- ఇలాంటి వితరణ రాబోయే తరాల్లో సదా స్మరించుకునేలా మిగిలాయి.

ఆలిండియా రేడియోలో మొదటి తరంలో నియమితులైన తెలుగువారిలో ముఖ్యులు ఆచంట జానకీరామ్. పంతొమ్మిది వందల నలభై నుంచి డెబ్భైయో దశకం వరకు తిరుగులేని మాధ్యమంగా, మిత్రవాక్యంగా, ఏక కాలంలో లక్షలాది మంది శ్రోతలను సంగీతం ద్వారా, విజ్ఞానాత్మక విశేషాలతో అందరినీ పలకరించింది ఆలిండియా రేడియో. వారి అనుభవాలు ప్రతిభకు, నిబద్ధతకు సాక్ష్యాలు. ఇది చదివి అప్పటి తియ్యటి రేడియో కబుర్లను ఒకసారి స్మృతిపథంలోకి తెచ్చుకొని ఆనందిద్దాం.

పై మూడు వ్యాసాలు ఆనాటి కాలంలోని తెలుగు భాషారీతిని మన ముందుంచుతాయి. రేబాలవారి వీలునామా కొంత భారంగా ఉందనిపించవచ్చు. అది ఏ మాత్రం అస్పష్టతకి, అసంపూర్ణతకి తావివ్వని ఆనాటి వ్యావహారిక సాంకేతిక భాష. దేవులపల్లి వారి వ్యాసం కవితాత్మకమైన రచనా వ్యాసంగం. ఆచంటవారిది శిష్టవ్యవహారికం.

భాష ఒకటే, అయినా విశ్లేషణా పథంలో మూడూ ముత్యాలసరాలవంటివే. తెలుగు తియ్యందనాన్ని తెలియజేసేవే.

ఇంతవరకూ ఎవరికీ తెలియని మనుమసిద్ధి ఆలయ విశేషాలపై వ్యాసం **మిసిమి**కి ప్రత్యేకం

ఏనాటిదో పట్టుదారాల బాటపట్టి సాహసయాత్ర చేసిన లోకేష్ అనుభవాలు కొన్ని...

**మిసిమి**లోని వ్యాసాలు ఆలోచనాత్మకమే కాదు, సదా ఆచరణాత్మకంగా కూడా వుండాలని మా ఆకాంక్ష.

**- సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

✶ "... 2013 అక్టోబరు ***మిసిమి*** సంచికలో వచ్చిన దామెర వేంకట సూర్యారావు గారి *వంశధారా సంస్కృతి* అనే వ్యాసం చాలా బాగున్నది. అయితే అందులో చోటు చేసుకున్న చిన్న చిన్న పొరపాట్లను ప్రస్తావించడం తప్పుకాదనుకుంటాను...

1. ..."గిడుగు రామమూర్తిగారి గురించి వ్రాస్తూ ఇంకా వంశధారాతీరంలోని తెలికి పెంట శాసనం, దీర్ఘాసి శాసనం మొదలయిన శాసనాలను అధ్యయనం చేసి *ఎపిగ్రాఫికా ఇండికా*లో వ్యాసం రాశారు"...

... తెలికి పెంట శాసనం గురించి వారు *ఎపిగ్రాఫికా ఇండికా*లో వ్రాయలేదు. *ఏన్ అకౌంట్ ఆఫ్‌ది ఆంటిక్విటీస్ ఆఫ్ ముఖలింగం అండ్ ఇట్స్ నైబర్ హుడ్* అనే సుదీర్ఘ వ్యాసంలో తెలికి పెంట శాసనం ఒక ప్రత్యేక విభాగంగా ప్రస్తావించబడింది. రామమూర్తిగారి ఆ వ్యాసం మద్రాసు *లిటరేచర్ అండ్ సైన్సు జర్నలు*లో ప్రచురించబడింది...

2. "పర్లాకిమిడి రాజా పర్లాకిమిడి తాలూకానంతటినీ ఒరిస్సా రాష్ట్రంలో చేర్చాలని ప్రయత్నించినపుడు రామమూర్తి ప్రతిఘటించి, న్యాయపోరాటం చేసి 700 గ్రామాలు ఆంధ్ర ప్రాంతంలో ఉండేలా చేయగలిగారు. పర్లాకిమిడి పట్టణం 1936లో ఒరిస్సాలో కలవగానే నిరసనగా పర్లాకిమిడి రాజు కొలువులో ఉద్యోగం వదులుకొని ఊరు దాటి వచ్చేశారు".

**అ.** ఈ 700 సంఖ్య పర్లాకిమిడి తాలూకా మొత్తం గ్రామాలకు చెందినది. 400 పైచిలుకు గ్రామాలు ఆంధ్రప్రాంతంలోకి రాగా మిగిలిన గ్రామాలు పర్లాకిమిడి పట్టణం ఒరిస్సా రాష్ట్రంలో చేరిపోయాయి.

"పర్లాకిమిడి తాలూకాలోని 800 గ్రామాలకు 200 గ్రామాలను పర్లాకిమిడి పట్టణాన్ని ఒరిస్సా రాష్ట్రంలో చేర్చడానికి ఆ కమిటీ వారు నిర్ణయించారు". *(గిడుగు సీతాపతి జీవితం – రచనలు, పేజీ 89; తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ)* "పర్లాకిమిడి తాలూకాలోని రెండువందల గ్రామాలు పర్లాకిమిడితో సహా ఒరిస్సాలో చేరగా, మిగతా నాలుగు వందల గ్రామాలు ఆంధ్ర ప్రాంతంలో చేరి పాతపట్నం తాలూకాగా ఏర్పడ్డాయి."

(గిడుగు రామమూర్తి రచయిత డా॥ దాశరథుల నర్సయ్య – పేజి 19; తెలుగు అకాడమీ ప్రచురణ)

**ఆ.** గిడుగు రామమూర్తి గారు 1911లోనే పర్లాకిమిడి కాలేజి నుంచి రిటైరయ్యారు. అప్పుడు వచ్చిన గ్రాట్యుయిటీలో తనకు నచ్చిన విధంగా నిర్మించుకున్న రెండంతస్థుల భవనాన్ని వదులుకొని 1936లో పర్లాకిమిడి విడిచిపెట్టి వచ్చేశారు. అంతకు ముందే, 1932లో తన కుమారుడైన గిడుగు సీతాపతిగారిని పర్లాకిమిడి కాలేజి కొలువునుంచి రాజా వారు తొలిగించారు.

– **కణుగుల వేంకటరావు,** శ్రీకాకుళం.

✶ "...మా తరము వారికి అనుపలభ్యములు, నలుబదేబదేడుల క్రితమే కేంద్ర సాహిత్య అకాదెమీచే పురస్కృతములనకు ఉత్తమాంధ్ర గ్రంథములపై సద్విమర్శ (తుందిల) సమీక్షల ప్రకటింపజేయుచున్నమీ ప్రణాళికయు, తదనుగుణముగ విశేషశ్రమకోర్చి వ్రాయుచున్న ఆచార్య రావినూతల వారి పరిశ్రమయు బహుధా ప్రశంసనీయము...

... సీతజోస్యముపైని సమీక్ష ప్రత్యేక అభినందనీయము. విజయవిలాసము వంటి శ్లేష ప్రబంధపు శ్రేష్ఠతను చూపునపుడెట్టును తప్పదగును... ప్రకృత లేఖార్థము. 'చిలువ చెలువంపు బలుకుల జిలువ చలువ' – అను మాటలుదహరించునెడ "... దీనికి మరొక పాఠము ఉండి ఉండవచ్చుననే ఆలోచన కలిగి ఉండవలసింది." అని వ్రాసినారు. ఈ భావన ఎవ్వరిది? మూలకర్త తాపీగారిదా? లేక సమీక్షకులదా? స్పష్టము కాలేదు. తాతాజీగారిదైనచో, ఆ పాఠమును వారు పేర్కొనక యుందరు. దానినిక్కడ ఉటంకింపలేదు. సమీక్షకులదైనచో, తమ పరముగ సూచించుట సమంజసము. అట్టి భావన స్వతంత్రమునజేయు సమీక్షకులు, పైమాటలలో తాతాజీగారు చూపని సొగసును,

సులభ గ్రాహ్యమగు దానిని, తాము చూపనోపడం కొంత వెలితిగనున్నది. చిలువ (నాగు) చెలువము రెండు విధములు. ఒకటి – ఆ మెలిక నడక. దీనినే ఆలంకారికులు 'వక్రత' అందురు; రెండు – ఆ మెరుపు, నిగనిగ. ఓజస్సు అందురు. కావ్యసరస్వతికి ప్రధానమగు ఆభరణములు ఈ రెండు. కనుకనే 'పలుకుల జిలువ చలువ' – అన్నాడు. ఆ రెండు లక్షణములున్న పలుకులు, పఠితలకు కలిగించు హాయే హాయి. అదియే 'చలువ'. కావ్యాస్వాదనమునకు తురీయమగు ఫలము. రెండవ 'చిలువ' శ్రేష్టతావాచకము. కులుకుచు నడచు కలికికి సర్వథా చెల్లెడి పలుకే. అట్టిది కాదన్నచో అచ్చట 'చిలుప' అను పాఠముండవలె. అప్పుడు 'చిలువ చెలువము గల మాటల జల్లిన కలిగెడి చలువ' అని గ్రహించదగును. (చిలప=చల్లిన)... పిండితార్థమేమనగా, మనకు తగుసత్వము లేదు కానీ, ప్రాచీన కావ్యముల పట్టిచూచిన కొలది కొత్త అందములు బయల్పడుచునే యుండును. కాలమున కెదురొడ్డి నిలిచినవే ప్రాచీన శ్రేష్ఠకృతులు. వాటిపై ఇట్టి విపుల సమీక్షలు బహుళోపయోగకరములు..."

**– జె.ఎల్. వీరనారాయణ,** అనంతపురం.

✶ "...***మిసిమి*** పత్రికను 1993లో మొట్టమొదట సారి హైదరాబాదుకు వచ్చిన సందర్భములో చూశాను. అప్పట్లో కర్నూలు జిల్లాలోని 'బనగానపల్లె'లో నా నివాసము. మా ప్రాంతంలో ***మిసిమి*** అప్పట్లో లభ్యమయ్యేదికాదు. ఇప్పుడయితే నేను కర్నూలులో ఉండటం వల్ల విరివిగానే లభిస్తోంది. ***మిసిమి*** రచనలు నా తాత్విక చింతనను 'నిర్వాణ' లాంటి అనుభవానికి దగ్గరగా తీసుకెళ్తున్నాయి... ఆగష్టు సంచికలోని సంపాదకీయం చదివి ఒక ఉద్వేగానికి లోనై స్పందించేలోగానే రెండు నెలలు గడిచి, అక్టోబరు సంచికను అందుకున్నాను. జితేంద్ర బాబుగారి సేకరణ బాగుంది. Will & Arial durant వారి భారతదేశం గురించిన భావనను ఇరవయ్యేళ్ల క్రింద జదివిన స్వామి రంగనాథానంద వారి 'మారుతున్న సమాజానికి శాశ్వత విలువలు'లో ఉటంకించినట్లు జ్ఞాపకం...

...ప్రస్తుతానికి వస్తే, De Profoundis అనువాదం ***మిసిమి***లో చదినప్పుడే ఒక ఆలోచన వచ్చింది. బుచ్చిబాబు గారి *సాహిత్యవ్యాసాలు* పుస్తకంలోని నన్ను *మార్చిన పుస్తకం* వ్యాసం నేను చదివిన కొద్ది సాహిత్యంలో ఉత్తమమయినది అని నా అభిప్రాయం. అందులో బుచ్చిబాబు గారి ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసిన Bertand Russel వ్యాసం *A freeman's worship* ని సంపాదించి చదవటానికి ఆరేడేళ్లకు పైగా పుట్టింది. అలాగే సర్వేపల్లి రాధాక్రిష్ణన్ గారి *An Idealist View of Life* కూడా అంత సులభంగా అభ్యం కాలేదు. మార్మిక వాదులకు *Russel* వ్యాసం *epitome* అనవచ్చు. అలాగే సర్వేపల్లి వారి వ్యాస సంపుటి కూడా...

...నా విన్నపమేమంటే Bertand Russel గారి *freeman's worship* ని తెలుగులోకి అనువదించి ***మిసిమి*** పాఠకులకు అందిస్తే బావుంటుంది. *freeman's* వ్యాసంలోని వస్తువు ఎంత ప్రధానమైనదో వ్యక్తీకరించిన భాష మరింత ప్రధానమైనదన్న విషయం విజ్ఞులకు విదితమే... ఇక సర్వేపల్లి వారి రచనలన్నీ తెలుగులోకి అనువదించ వలసిన అవసరం ఎంతో ఉంది. వారి భారతీయ తత్త్వశాస్త్రం ముసునూరి శివరామకృష్ణ తెలుగులోకి చాలా చక్కగా అనువదించారు. సర్వేపల్లి వారి *The Hindu View of Life* (ప్రసంగాల సంకలనం) కూడా మహోన్నతమైనదే. ఆగష్టు సంచిక సంపాదకీయంలో మీరు పేర్కొన్న *మాజిక్ రియలిజం, అభివృద్ధి, డయాస్పోరా,* లాంటి ప్రక్రియలకు, ప్రస్తావనలకు అతీతమైన తాత్త్విక దర్శనం సర్వేపల్లివారి భావజాలమని నా అభిప్రాయం. ఉద్దండ రచయితలు, భాషా కోవిదులు ***మిసిమి***కి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. వారందరికీ నా విన్నపమేమంటే ఇటువంటి రచనలను తెలుగులోకి తీసుకురావటం వల్ల ఇటు పాఠకలోకానికి, అటు భాషాభ్యున్నతికి బహుముఖ ప్రయోజనం కలుగుతుంది అనటంలో సందేహం ఉండబోదు..."

**– ద్వారం భాస్కరరెడ్డి,** కర్నూలు.

**✦ మంచి ఉత్తరానికి ఒక మంచి పుస్తకం బహుమతి! ✦**



రఘుపతి వెంకటరత్నం నాయుడు

### మా గురుదేవులు

# నాయుడు గారు

– దేవులపల్లి కృష్ణశాస్త్రి

**1962** మా నాయుడిగారి జన్మదిన శతవార్షికోత్సవ సంవత్సరం. మా నాయుడుగారంటే, రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు. రఘుపతి వెంకటరత్నం నాయుడుగారంటే ఎవరని చెప్పను? ఏమని చెప్పను? ఎంతని చెప్పను?

అర్ధ శతాబ్దానికి పూర్వం అయితే, అట్టి ప్రశ్నలు వెయ్యడానికీ, జవాబులు చెప్పడానికీ అవసరం ఉండేదికాదు. ఇప్పుడవసరం, అటువంటి కాలం వచ్చిపడింది. ఇవి పూర్తిగా “రాజకీయాల రోజులు. ఇతర కార్యరంగాలలో మొట్టమొదట కృషిచేసి, మనకు త్రోవ చదునుజేసి పెట్టి మనచేత కరదీపికలుంచి, అవి ఆరిపోకుండా అక్షయస్నేహం వీటిలో పోసి వెలిగించి మంగళ కార్యనిర్వహణకై భావి స్వర్గ నిర్మాణానికై లోకమార్గాల మీద మనం పయనించేటట్లు చేసిన మహాపురుషుల్ని కొంతవరకు ఇప్పుడు మరచి పోతున్నాం. కాకపోతే నాయుడుగారి శతవార్షిక జన్మదినోత్సవం ఎంత వైభవంగా జరగవలసింది!

యాభైఏళ్ళకి పూర్వం ఆయన అఖిలభారత ఆస్తిక మహాసభకు అధ్యక్షుడుగా కలకత్తాకు వెళ్ళబోయేముందు ఒక ఉత్తర *భారతపత్రిక* ఈ విధంగా రాసింది: “వీరేశలింగం అనే వీరుడూ, వేంకటరత్నం అనే ఋషి దక్షిణ భారతాకాశాన్ని పరిపాలించే రెండు జంట నక్షత్రాలు” అని. అప్పుడు నాయుడుగారు బహిర్వివేకం వంటి వారు (External conscience) అని వారి శిష్యులు ముట్నూరి కృష్ణారావుగారన్నారు.

నాయుడుగారు నవ్యాంధ్ర నిర్మాతలలో ప్రముఖులు. దాదాపు యాభై సంవత్సరాలు ఆంధ్ర యువ మనస్సులకు ఆశయ పక్షాలు తొడిగిన గురుదేవులాయన. ఆంధ్ర యువకులను ఇట్టే నాలుగు సోపానాలనెక్కించి సత్య సాన్నిధ్యమున నిలబెట్టిన సోక్రటీసు ఆయన. తర్వాత మన తెలుగునాట అనేక కార్యరంగాలలో నాయకులై నడిచి, దేశాభ్యున్నతికి కారకులైన ప్రముఖులెందరో, వారి శిష్యుల్లో, వారి ప్రభావంలో పడ్డవారో, ఇప్పుడో, నాయుడుగారెవరని మీరడిగితే గొప్ప అధ్యాపకుడనీ, ఒక కాలేజీ ప్రిన్సిపాలనీ, మదరాసు యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అనీ, చాలా గొప్ప వక్త అనీ, సంఘ సంస్కరణోద్యమానికి మూలపురుషులలో ఒకరనీ, అనేక విశ్వవిద్యాలయాలు ఆయనకు డాక్టరేట్ పదవినిచ్చి సన్మానించాయని అప్పటి ప్రభుత్వం భారతీయునికి ఇవ్వగల బిరుదులన్నీ ఆయనకిచ్చి గౌరవించిందనీ, ఇలాంటి వన్నీ ఎన్ని చెప్పినా, ఆయన ఔన్నత్యం మీకు ఎలా తెలుస్తుంది? ఇటువంటి వాళ్లెందరో ఉన్నారు గదా! వీటిని మించినదేదో మహత్తుగా గొప్పతనమూ వారిలో ఉండే ఉండాలి కదా!

“ఒక వత్తి తాను వెలుగుతుంటేనే గాని మరొక వత్తిని వెలిగించలేదుగదా! ఉపాధ్యాయుడూ అంతే” అని రవీంద్రుడన్నాడు.

తన మనస్సును కొంత సరుకుతో నింపుకోవడం, దానిని కొట్టుల ‘గొడౌను’లో సామాను పడవేసినట్లు శిష్యుల మనస్సులలోపడెయ్యడం అటువంటి గురువు. తాను వెలుగుతున్న దీపం ఎన్నడూ కాదు. కనుక, కొత్త దీపాల్ని వెలిగించలేడు. అతని చదువు మనోమందిర కవాటాలను తెరువదు. దానిలోనికి మంగళ ప్రభాత వాయువుల్నీ, కాంతుల్నీ ప్రవేశపెట్టదు. అది మనస్సునకు రెక్కలు తొడగదు. అది హృదయాలలో మధుర క్షీరం నింపదు. అది రక్త

నాళాలను చైతన్యంతో ఉచ్ఛలితం చెయ్యదు. అది జీవితాలను విద్యుచ్ఛకితం చేసే మార్గాలు వెయ్యలేదు. వేసిన మార్గాలను చదును చెయ్యలేదు. ఆ చదువుకీ, జీవితానికీ సంబంధం లేదు. అది ఆరిపోయిన దీపపు చదువు అయితే, ఒక్కొక్క గురుదేవుడుంటాడు. అతడు శిష్యుల మనః పేటికలలో అక్షయ పాథేయం నింపి, అమృత పదవియే గమ్యస్థానంగాగల అనంత ప్రస్థానం నిర్విఘ్నంగా సాగేటట్లు ప్రబోధిస్తాడు. మనకూ, చుట్టూ ఉన్న లోకానికి గాఢ స్నేహం. ప్రేమబంధం గ్రహించేటట్లు చేస్తాడు. మన జీవితం సార్థకం చేస్తాడు. అతని వాక్కులు పరమ పదానికి సోపానాలు. అలాంటి గురుదేవుడు నాయుడుగారు.

అధ్యాపకుడైన నాయుడుగారికి కొన్ని గొప్ప శక్తులుండేవి. కవికిలాగే, అధ్యాపకునికీ అవి అవుసరం. ఒకటి: ఆయన హృదయం ప్రతివాయునిహతికీ కంపించిపోయే శతతంత్రీ మహతివంటిది. ప్రతి శిష్యుని తోడి అనుభవాలేకాదు, లోకంలోని ప్రతివస్తువు మాత్రమే కాదు, ప్రతి కావ్యంలోని అనుభవాలు కూడా ఆయన మనస్సును కదిపివేసేవి.

He is tube through which all things blow into music.

రెండవది: వారి భావనాశక్తికి అవధి అంటూ లేదు. వారి భావన ఇట్టే పక్షాలను పరుచుకునేది. ఇట్టే వైదిక యోగులనాటి భాగీరథీ తీరానికో, బదరికాశ్రమానికో ప్రయాణమయ్యేది. అంతలో హాఫీజ్ సాదీ వంటి పారశీక భక్తుల మధువనాలలో వాలి కాలూనేది. అప్పుడే షేక్స్పియర్, వర్డ్స్‌వర్త్, గెటీ, కార్లైల్ వంటి పాశ్చాత్య ప్రవక్తల విజ్ఞాన గగన వీధులలో విహరించేది. వీటికి తోడు వీరికి అసాధారణమైన వాక్ప్రతిభ వుండేది. ఈ దివ్య శక్తులతో నాయుడు తన శిష్యుల్ని ముగ్ధుల్నిచేసి లోబరుచుకునే వారు.

నాయుడుగారు నాటి ఆంధ్రయువకులకు ప్రసాదించిన వరాలు రెండనుకుంటాను. అవి ఉదారాశయశీలమూ (Idealism) తత్త్వ దృష్టిన్నీ, జీవితాన్ని ధ్రువమండలానికి తగిలించి యాత్ర సాగించడమూ, ప్రత్యణువునందున్న అనంతత్వాన్నీ ప్రత్యనుభూతితోపరమార్థాన్నీపరిశీలింప యత్నించడమున్నూ. వారి సన్నిధానంలో ఉన్నప్పుడు ఒక చిన్న తలపో, ఒక చిన్న మాటో, ఒక చిన్న చేతో, అనంత విశ్వంలోనికి ఒక్కసారిగా గవాక్షం తెరచేది.

'To sit beside him is to pass out spiritually into the cecircuse, with the most accomplished of guides'

అయితే, వారి వైదుష్యమూ, గొప్పతనమూ శిష్యుల్ని హడలెత్తించేది కాదు. ఒక్కొక్కప్పుడు "నేనింత తెలుసుకున్న వాడనో" అన్నట్టుంటాడు. "నాకు తెలిసిందీ, నీకు నేర్పేదీ ఎంతబాగుందో" అన్నట్టుండడు. వాని పాండిత్యం తనమీదా, ఎదుటివాడిమీద పాషాణంలాగా కూర్చుని ఊపిరాడనీయదు. తన్ను సమీపించినవారికి ప్రతిభాపక్షాలు తొడగలేదది. యువకుడహంకారి కనుక, ఎదుటివానిలో అహంకారం ఓర్చుకోలేడు. అట్టి పాషాణపాండిత్యాన్ని తట్టుకోలేడు. "అది నీకు తగదు నీతి పద్ధతి ఇదీ" అంటే గూడా ఓర్చుకోలేడు. అలాగే, నేర్చుకో నాకు బోలెడంత తెలుసునంటే సహించలేడు.

గురుశిష్యులలో ఏకాత్మతను చిందించే సఖ్యం ఉండాలి. ఒక్కొక్కప్పుడు వారు తండ్రీ కొడుకూనూ. ఒక్కొక్కప్పుడు స్నేహితులున్నూ. అంత మహోపాధ్యాయుడైన నాయుడుగారు మాతోగూడా చదువుతూ వ్రాస్తూ నడుస్తూన్నట్లుండేవారు. మమ్మల్ని తన హృదయమందిరంలోనికి పిలిచి మంతనాలాడుతున్నట్లుండేవారు. వారు చదువు చెప్పడంకూడా క్లాసు రూములో ఆగిపోయేది కాదు. ఇంట్లో, వీధిలో విహార భూమిలో, ఉపాసనా మందిరంలో, సభాస్థలిలో, ప్రత్యేక కూటాలలో, ఎల్లవేళలా, అన్నిచోట్ల, మాకు పాఠశాలలే. వారున్నతావు గురుకులం. ఎప్పుడూ తోడునీడలా వారు వెన్నంటి ఉన్నట్లుండేది. వారు దగ్గరలేనప్పుడు కూడా సన్నిధానంలో ఉన్నట్లే ఉండేది. అలాగ ఆయన శిష్యుల అంతరంగాలలో నిండిపోయారు.

చివరికి ఆయన మాట్లాడబోవడం, వ్రాయబోవడం ఇలా ఎన్నో ఆయన రీతులూ, చేతలూ, అనుకరింపబోయేవాళ్ళం శిష్యులం. మమ్మల్ని ఎప్పుడూ అప్రమత్తులుగా ఉంచేవారాయన. మా హృదయాలను ఎప్పుడో తట్టి మాకు తెలియకుండానే ఎట్లో ప్రవేశించేవారు. మాలో దాగిన గూఢాలోచనలనూ, సంశయాలనూ అంతర్గత దౌర్బల్యాలనూ కనిపెట్టేవారు. వారి అంతేవాసులు ఒకరు చెప్పినట్లు "ఆ కనిపెట్టడం ఎందుకు? వెలుపలకు లాగి పోలీసు ఆఫీసరువలె భయపెట్టి వాఙ్మూలం పుచ్చుకొనుటకా? కాదు, రుగ్మత నెరిగిన వైద్యుని చికిత్సచేయుటకు. ఆ చికిత్సావిధానము పూర్వము మే మెప్పుడెట్టి ఔషధమును పుచ్చుకొనుచుంటిమో మాకు తెలియదు. షేక్స్పియర్ నాటక విమర్శనములలో,

కార్లైల్ ఎమర్సన్‌ల వ్యాఖ్యానములలో మహాపురుషుల జీవితాఖ్యానములలో, చిట్టి పొట్టి కథలలో, పరిహాసాలలో మాకు తెలియకయే మమ్ముల నెక్కడికో ఎత్తుకునిపోయి, చిత్త సంస్కారమును కలిగించెడివారు. వేశ్యలలో మాతృ రూపమును వెల్లడించినారు. అనదలలో వాత్సల్యమును చిలికించినారు. వారి స్పర్శకు ఎండిపోయిన మోడులు చిగిర్చినవి. పతితులు వుద్ధరింపబడిరి. నరకమున స్వర్గవీధులు తీర్చినారాయన. ఎట్టి అపూర్వమయిన ప్రబోధము! వారి వక్తృత్వమునకు ఆంగ్లభాషా ప్రభుత్వము అచ్చెరువందిన మాట నిశ్చయము.

కాని మా హృదయములను ఆకర్షించినది వారి సాధుసేవ. వారి సంస్కారోత్సవము మమ్ముల నుద్రేకపరచిన మాట నిశ్చయము. కాని మమ్ములను వారికి వశీభూతులుగా జేసినది వారి దయార్ద్రహృదయము. వారి ఆస్తిక సిద్ధాంతములు మాలో తత్త్వజిజ్ఞాసను పురికొల్పినమాట నిజము. కాని మమ్ములను భక్తిపరులనుగ జేసినది వారి పతితపావన దైవము. పాపపంకము చాటున పవిత్రతను చూడగల విశ్వాసము. దైన్యమున ఆత్మగరిమను ప్రతిష్ఠింపగల ధీరవృత్తి, దౌర్బల్యమున శక్తిని సాధింపగల ఉపాసనాబలము– ఇవీ ఏబదేండ్లపాటు ఆంధ్ర యువక జగత్తును వారి పాదపీఠమునకు కట్టివేసినది.

వారిని పదే పదే తలుచుకుని వివశులై ఇట్లు వ్రాసేరు. వారి శిష్య చూడామణులు ముట్నూరి కృష్ణారావుగారు, 'మే మెఱిగి యున్నంతవరకు మా నాయుడుగారి వంటి మహాపురుషులు ఆంధ్రసీమలో మరియొకరు లేరు. చనువుతో కూడిన భక్తి, స్నేహముతో కూడిన గౌరవం, నమ్రతతో కూడిన గర్వం, సరళమైన విశ్వాసం, కోమలమైన ఆదరం, మైమరుపును చిందించు బాంధవ్యమది. ఆ రసానుభవము వెనుక ఏదియో ఒక అనిర్వాచ్యమైన పూజ్యతకూ గూడ మించిన భయవిస్మయముల కాకరమైన ఒక దేవతా సంబంధము చూచుచుండగనే ఏ దివ్యవాహనమో అధిరోహించి, వారితో అమర వీధుల నూరేగుచుండెడి వారము. వారి సమ్ముఖమున ఎన్ని మారులు విశ్వరూప సందర్శనము సిద్ధించలేదు? ఆ ఘుట్టములలో కైలాసగిరి యందు శివసాన్నిధ్యము పొందినట్లయ్యెడిది. మానస సరోవరమున దివ్యహంసలతో క్రీడించునటుల తోచెడిది. దుష్ప్రాములగు భావశిఖరములపై ఎగిరినపుడు మమ్ములను వెన్నంటియే యుండి, ఆ విషమసానువుల ఎక్కింపుచూ, దింపుచూ చేయి అందించెడివారు. 'మా జీవితములను రసభరితములుగ చేసివైచిన ఆ దినములు వారికే అంకితములు. ఈశ్వరభక్తి, దీనజనసేవ, సంస్కారోత్సాహము, ఆంధ్ర మహాజనులలో నున్నంతకాలము నాయుడుగారి దివ్య జీవనము, అదృశ్యముగా అయిననేమి, అమరజ్యోతివలె సురవాణి వలె, తరతరాలకు ప్రబోధకమై వెలయగలదు.

మహాపురుషుల లక్షణములుగల మూర్తిమంతమైన విగ్రహమది. దాతృత్వం చేత పొడుగుసాగిన ఆజాను బాహువులవి. ఉదారాశయముల కాశ్రయమిచ్చుటచే ప్రవర్ధమానమైన ఉన్నత వక్షస్థలమది. యోగనిద్రయందు ప్రజ్ఞాచక్రము నిరంతరము పరిభ్రమించుటచే నునుపుబారిన విశాల ఫాలతలమది. ఎట్టి గహన తత్త్వముల లోతులనైనను చొచ్చుకొనిపోవు నేత్రయుగ్మమది. పర్వత శిఖరముంబోని ఊర్ధ్వలోకములకు సోపానములు వేయగల దేవతా విగ్రహమది.

ఆ విగ్రహము పార్థివమైనను ఆత్మజ్యోతి నిండు వెలుగున వెలుగుటచే చిన్మయరూపమైనది. అందలి ప్రత్యణువు, ప్రతికణము, ప్రతిబిందువు భక్తి రసాస్వాదనమున మధురమైనది. మర్త్యా మర్త్యములకు సంగమ స్థానమది. ఆ సంగమ స్థానమున నిలువబడి మా గురువర్యుల పాదపద్మముల నమస్కరించు చున్నాను."

*(15-10-64 ఆంధ్రప్రభ నుండి...)*



**దేవులపల్లి కృష్ణశాస్త్రి**



రాయప్రోలు సుబ్బారావు

# మిశ్రమంజరి

*- రావినూతల సత్యనారాయణ*

**ప్రవేశిక :**

**అవి** దేశం ఉద్యమాల ఉప్పెనలో ఊగిసలాడుతున్న రోజులు! ఒక వైపు స్వాతంత్రోద్యమము, మరోవైపు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రోద్యమము, మూడవ వైపు సంఘ సంస్కరణోద్యమము, నాల్గవ వైపు నవ్య కవితోద్యమమూ! - అలాంటి వాతావరణంలో ప్రారంభమయింది రాయప్రోలు వారి సాహిత్య ప్రస్థానం. సాహిత్యంలో అది ఒక విధమైన అస్పష్ట యుగంగా భావించవచ్చు.

రచనల్లో ప్రబంధ యుగంలోని శృంగార ప్రాముఖ్యం, పాండిత్య ప్రకర్ష బలంగా వ్యక్తమవుతూనే వుంది. ఆనాటి (19వ శతాబ్దం) కవిత్వం ఒక నిర్ణీత మార్గమంటూ లేక, దిశాహీనమై, అన్ని వైపులా పరుగులెత్తసాగింది! ఆ స్థితిలో, ఒక నూతన పంథాను చేబట్టి, అధునాతన భావజాలంతో కవిత్వానికి ఒక కొత్త విధానాన్ని రూపొందించినవారు ఆచార్య రాయప్రోలు సుబ్బారావు. అప్పట్లో రాయప్రోలు వారు ప్రారంభించిన కవితా విధానాన్ని *అభినవ కవిత* అని పిలిచారు. తర్వాత, తర్వాత ఆ కవితా రీతినే *భావకవిత్వ*మని వ్యవహరించారు. ఆ కొత్త పద్ధతికి ఆద్యుడు రాయప్రోలు సుబ్బారావేనని విజ్ఞుల అభిప్రాయం.

రాయప్రోలు వారి *దేశభక్తిగీతా*లు కవితావేశంతో పాటు అత్యంత మాధుర్యం నిండియుండుట వలన ఎక్కువ ప్రచారాన్ని పుంజుకొన్నాయి. వారి ఇతర కావ్యాలు తాత్త్విక చింతనతో కూడినవి కాబట్టి సామాన్యులు అవగాహన చేసుకొనుటలో కొంత కష్టం ఉండవచ్చు. అందుకే ప్రజా బాహుళ్యం దేశభక్తి ప్రబోధ కవిగా వారికి పట్టం కట్టింది! తెలుగు దేశం, తెలుగు భాష, తెలుగు సంస్కృతి వీరిని ఆవహించి కావ్యాలన్నింటినీ తెలుగుదనంతో నింపింది. తెలుగు భాష తియ్యదనం, తెలుగు జాతి ఔన్నత్యం వీరి కావ్యాలలో గోదావరిలా ప్రవహిస్తుంది. అంతేకాదు, నిత్య వ్యవహారములోని సామాన్య పదాలను, లోకోక్తులను, ప్రయోగించి కవిత్వానికి ఎనలేని ఆకర్షణ సృష్టించారు రాయప్రోలు వారు. వైదిక సాంప్రదాయానికి సంబంధించిన పదజాలాన్ని కూడా ఎక్కువగానే ప్రయోగించారు. రాయప్రోలువారి కావ్యాలలో వాడుక భాష, వైదిక భాష, రెండూ సమాన వేగంతో పయనిస్తాయి.

రాయప్రోలు వారు సాంప్రదాయ సిద్ధాంతాలను అభిమానిస్తారు. అందుచేత వీరి కావ్యాలలో ఆ ప్రభావం మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. మన ప్రబంధాలలో వ్యక్తమయ్యే శృంగార వర్ణనలు వీరికి సమ్మతం కాదు. అలాగని ప్రేమకు వ్యతిరేకి కారు. వారి రచనలలో స్త్రీలోని వాత్సల్యాది అమృత గుణాలకు ప్రాముఖ్యత కనిపిస్తుంది. వారి కావ్యాలలో మనకు పరి పూర్ణమైన స్త్రీరూపం దర్శనమిస్తుంది. మరో ముఖ్య విశేషం రాయప్రోలు వారి ఛందోరీతులలోని విశిష్టత. రాయప్రోలు వారు పాటించిన విధానం గతి గమనాన్ని, లయ విన్యాసాన్ని సాధించడమే గాక, భాష, భావాలు, భావాభివ్యక్తన లాంటి విషయాలలో వారి ఉక్తి వైచిత్రి కవిత్వానికి నూతనత్వం సమకూరుస్తుంది. నవ కవులకు భాషకంటేమరో తపస్సులేదని వీరి అభిప్రాయం. తెలుగులోని మాధుర్యాన్ని ఎవరికి వారు చవిచూడవలసిందే గాని - "ఎదుటి వారికి మాటల్లో ఆ రసానుభూతిని అభివ్యక్త పరచుట అతి కష్టం" అంటారు రాయప్రోలువారు.

1909 లో *లలిత*తో మొదలయిన రాయప్రోలు వారి 'సాహితి ప్రస్థానం' దాదాపు అర్ధ శతాబ్దం పాటు అత్యంత స్ఫూర్తితో సాగింది. ఈ సుదీర్ఘ కాలంలో రాయప్రోలు వారి తెనుగుతోటలో అనేక పువ్వులు పుష్పించాయి. కొన్నిటి పరిమళాలు భారతదేశంలోనే కాక, ఖండాంతరాలకు ప్రాకి

పోయి 'శాశ్వత సౌరభాలు వెదజల్లుతున్నాయి'. రాయప్రోలు వారి రచనలలో అత్యంత ప్రసిద్ధికెక్కిన కొన్ని రచనలను గూర్చి సంక్షిప్తంగా తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం. విజ్ఞులు ఈ వివరణను కేవలం పృష్ఠభూమిగా పరిగణిస్తారని ఆశిస్తాను.

**రాయప్రోలు వారి రచనలు :**

లలిత; అనుమతి; కష్టకమల; తృణకంకణం; స్నేహలత; తెనుగుతోట; మాధురీ దర్శనమ్; రమ్యాలోకమ్.

**రాయప్రోలు వారి కవిత్వ తత్త్వం :**

రాయప్రోలు వారి కవిత్వ తత్త్వ వివేచనపై విమర్శకులు ఆంగ్ల సాహిత్య ప్రభావాన్ని పసికట్టవచ్చు! అలాగే, భారతీయ అలంకారికులు చెప్పిన కవిత్వ లక్షణాలు కూడా సాదరంగా స్వీకరించారు ఆచార్యుల వారు. అంతేకాదు, వీటినన్నిటినీ, సమన్వయపరచుకొని, సమర్థవంతమైన నవ్య కవితా లక్షణాలను, తత్త్వాన్ని నిర్ధారించుకొన్నారు. ఈ లక్షణాలన్నీ క్రోడీకరించి, వ్యాఖ్యాన సహితంగా *రమ్యాలోకమ్*, *మాధురీ దర్శనమ్* అను గ్రంథాలు రచించారు. పూర్వ లక్షణ కర్తలను విమర్శించుట రాయప్రోలు వారి ఉద్దేశ్యము కాదు. కేవలం నవ్యుల దృష్టి వైశిష్ట్యాన్ని స్పష్టపరచుటయే వారి ధ్యేయం.

దండి, ఆనంద వర్ధనుడు, అభినవ గుప్తుడు, జగన్నాథ పండిత రాయలు, వామనుని వంటి లాక్షణికులు ఆచార్యుల వారిని కొంత మేరకు ప్రభావితం చేశారు. ముఖ్యంగా రాయప్రోలువారికి ఆనందవర్ధనునిపై అభిమానం యెక్కువ!? ఆ విషయం వారి లాక్షణిక గ్రంథానికి *రమ్యాలోకమ్* అని పేరు పెట్టుటలోనే సూచితమౌతుంది. అలాగే "ఈ అపార సంసార మందున కవి యొకండె బ్రహ్మ" అనే మాటలు ఆనందవర్ధనుని గుర్తుకు తెస్తాయి. అలాగే సహృదయ రంజకమైన కావ్యాన్ని గూర్చి ముచ్చటిస్తూ "కావ్యం పాడి ఆవు వంటి"దని చమత్కరిస్తారు.

రాయప్రోలు వారి దృష్టిలో "కావ్యంలో వాచ్యార్థం కంటె ధ్వని ప్రధానంగా చెప్పడంలో రమణీయత ఉందనీ, అంతేకాక, గూఢత తొలిగితే జుగుప్స కలిగే అవకాశం ఉందని ఆచార్యుల" వారి భావన.

ఈ విషయం *మిశ్రమంజరి* లోని *క్షమధ్యమ్* అనే కవితలో గమనించవచ్చు :

**"స్పష్టత లేదని యెద వీ – సృష్టిని విస్పష్ట మయిన దేదోయి బుధా!**
**క్లిష్టా వరణము చీలిచి – ఇష్టార్థ ఫలంబు వెదుక రేమొ సహృదయుల్"**

సహృదయులు తమ బుద్ధి కుశలతనుపయోగించి, కష్టతరంగాకనిపించే కావ్యార్థాన్ని సుబోధకరంగా మారుస్తారు. కావ్యధ్వనిలో సుతారంగా, సూక్ష్మంగా రమ్యార్థం భాసిస్తూ ఉంటుంది. *మిశ్రమంజరి*లోని *శ్రీరవ్యాత్* అనే కవితలో సరళమైన భాష రచనకు రమ్యత కలిగిస్తుందని సూచిస్తూ–

**"చెవికి తీయము చిలుకు శబ్దము – కంటి కింపగు కొంత కల్పన–**
**కలిసి హృత్కోశమును తడిపే – తొలక రింపులె కావ్యముల్"**

అంటారాయన.

మనోహరమైన వాఙ్మయ సృష్టికి మధురమైన భాష అత్యంత అవసరమని వారి నమ్మకం. మరియు కావ్యంలో ఉపయోగించే పదజాలం సామాజికులకు (చదువరులకు) శ్రుతి సుఖ మియ్యాలె. కర్ణ కఠోరంగా ధ్వనించకూడదు. రాయప్రోలు వారి దృష్టిలో నవ్య కవిత్వానికి వస్తు నియతి లేదు. "కవి తన కౌశలం చేత, రాళ్ళను ఏడిపించగలడు, సెలయేళ్ళతో జోల పాడించగలడు"! రస విషయమై చర్చిస్తూ మిశ్రమంజరిలోని కవితా ఖండిక *శ్రీరవ్యాత్*లో –

**"కరుణ శృంగార రసముల రెండే – ఋతురస ప్రతి పత్తి నందెడి;**
**ఒకటి కలుషము కడుగు; మరొకటి – కాల్చు కాయము శుద్ధికై"**

అంటారు రచయిత. అంటే ఆయన దృష్టిలో కరుణ, శృంగార రసాలు రెండే ప్రధాన రసాలు. అందుకే కాబోలు అదే కవితా ఖండిక లోనే –

**"జన్మ వర్ధన విలయములలో – త్రిగుణముల వలె నణిగి పెనవడు**
**శోకమే బ్రహ్మాండ లీలా – బంధమౌ నేమో కవీ"!**

రాయప్రోలువారి అభిమతానుసారం సాహిత్యంలో రమణీయ కల్పనలకు శోకమే ఆలంబనము (పట్టుకొమ్మ). కరుణారస ప్రధాన రచనలు హృదయక్షాళన గావించ గలవని వారి నమ్మకం. కావ్యంలో దుఃఖము సహితం ఆనందాన్నే కలుగ చేస్తుందని ప్రాచీన లాక్షణికుల భావన. కావ్య గతమైన దుఃఖ వర్ణన పాఠకుల హృదయాల్లో ఆనందాన్నే కలిగిస్తుంది! "ఈ ప్రకృతి అనంత రూపాల్లో ఆనందాన్నే ధరిస్తోంది కనుక ఆ ఆనందాన్నే కావ్యాలు ప్రధానం చేసుకోవాలన్న ఆకాంక్ష'' రాయప్రోలు సుబ్బారావుది. "కవులు మంగళ మిత్రులు, మాధుర్యోప దేశకులు, లోకానికి మంగళం కావలెను" అని ప్రబోధిస్తారు మహాకవి. రాయప్రోలు వారి ప్రబోధంలో అంతటా ఉత్సాహ ప్రవాహమే గాని దుఃఖం వెతికినా కనబడదు. ఈ విధమైన ఉన్నత భావాలతోను, నిర్దిష్ట అభిప్రాయాలతోను, భావ

కవితోద్యమానికి ఆద్యులై నిలిచారు ఆచార్య రాయప్రోలు వారు. పైన పేర్కొనిన వివరాలు రాయప్రోలు వారి కావ్యాలను అవగాహన చేసుకొనుటలో ఉపకరిస్తాయని ఇచ్చట చర్చించడమైనది.

**మిశ్రమమంజరి :**

ఇది ప్రసిద్ధి పొందిన 54 కవితలతో కూడిన ఖండ కావ్యం. పీఠికలో ఆచార్య రాయప్రోలు వారు ఇలా పేర్కొన్నారు.

**"పాయలు పాయలుగా విడి-పోయిన నా కన్నె రచన ముంగురులకు వేణీ యోగ్యముగా 'కుచ్చులు'- పాయనమై నిలుచుతన్ శుభంబన సుహృదుల్."**

అని *జడ కుచ్చులు* సమర్పించుచూ వ్రాసికొంటిని.

వ్రాసినది సురక్షితంగా ఉంచుకోవడము మొదటి నుంచీ అలవాటు లేదు. ఇటీవల పాత కాగితాలన్నీ వెతకడం మొదలెట్టాను. ఏవో లభించినవి, కొన్ని వెలుతురు చూడనివి ... అన్నిటినీ కలిపి *మిశ్రమంజరి* పేరుతో ప్రకటిస్తున్నాను. కలగూర గంపలాగా తయారయింది. "ఇందులో పుల్లనివీ, తీయనివి, చప్పనివి కూడా మిశ్రమమై గుత్తి కొన్నవి... రుచులలో భేదం సుతారం. నిమ్మ పండు పులుపూ, దానిమ్మ పండు పులుపూ ఒక్కటే అనదు నాలుక. తీపికీ, చెరుకు, పాల తీపికీ ఏదో రవపాలు భేదం లేకపోలేదు. ఇక కావ్య స్వాదిమం అంతటా ఏకైకంగా ఉండుననగలమా!" అంటూ కవితాత్మకంగా ముగిస్తారు పీఠిక. *మిశ్రమంజరి* ఖండ కావ్యంలో కొన్ని కవితలు అత్యంత ప్రసిద్ధికెక్కినవి. వానిని గురించిన విశేషాలు తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

*ఓం :* **పరమ పుణ్యవతికి - భరత భూదేవతకు**
**తేనె చవుల శ్రుతికి - తెనుగు వాగ్వతికి**
**శారదా భిరతికి - సాహితి శ్రీమతికి**
**సహృదయ సుకృతులకు - సాదర సమర్పణము.**

అను కవితతో మొదలవుతుంది *మిశ్రమంజరి*. మాతృదేశం రాయప్రోలు వారికి ఉపాస్య దేవత. అందుచేత తమ సాహిత్య సంపదను ముందుగా భూదేవికే సమర్పించారు. అలాగే *నమోవాకమ్* అనే కవితలో పూర్వ కవులను స్తుతిస్తూ "కాళిదాసుని భణితి కళలు సమర్తాడె" అన్న ప్రయోగం శేషేంద్ర శర్మ వంటి గొప్ప కవులను ఆకర్షించింది. ఆ కవితలో వాడిన పదజాలం అత్యంత సరళం గానూ, చక్కగాను అమరింది.

**"శూద్రకుని భావాల సుడిసె కోమలి కములు**
**అలసాని వీణె బ్రహ్మానందము ధ్వనించె"**
**"హాలు పదాలలో తేలె ననురాగంబు**
**చేమకూర పొలాల చినికె కమ్మ దనాలు".**

**ఆంధ్రనవమి :**

ఈ కవిత ఆంధ్ర రాష్ట్రం అవతరించిన తరుణంలో రచించినది. రాయప్రోలు వారి కావ్య భాషలో తరచు వైదిక పదాలు మనకు ప్రత్యక్షమౌతాయి. ఈ కవితా ఖండికలో-

**"జననీ! ఆంధ్ర మహా మహీ ఇది - భవత్స్వాతంత్ర్య పుణ్యాహవా**
**చన పారాయణ; మేల వించితిమి - స్వేచ్ఛా రక్త కంఠశ్రుతుల్"...**

పుణ్యాహవచనం అనేపదం వైదిక విధులకు సంబంధించినది. ఇటువంటి పదాలు అవలీలగా ఇతర పదాలతో కలిపి వాడుతారు రాయప్రోలు వారు. ఇది వారి ప్రత్యేకత. అలాగే, జాతి అభ్యుదయానికి ప్రజలు సహృదయంతో వ్యవహరించవలసి ఉంటుంది. రాష్ట్రావతార తరుణ ప్రబోధనలో పురోగమనాన్ని నిరోధించే దుష్ట శక్తులను కనిపెట్టి వాటి నిర్మూలనావశ్యకతలు సూచిస్తూ వ్రాసిన పద్యాన్ని పరిశీలించండి :

**"బంగారు పాతళ్ళ ప్రాణాలు విడిచె మ**
**హా కుబేరుల కాంక్షకాక దిగజార వలె**
**పెనుచీకటి బజార్ల ధనము రాసులు చేయు**
**వర్తకుల నడతలో వంకరలు తీరవలె**
**లంచాలు త్రాగి కల్మషమైన అధికార్ల**
**ముసుగు బొందల చాళ్ళు మొదలంట కదల వలె**
**పుట్టింటికే నిప్పు పెట్టగల రాక్షసుల**
**ఇనుప గుండెల తిత్తు లిరిగించి విరియ వలె**
**కూటికై అల్లాడి గుడ్డకై అట్టాడు**
**జన ఘోష పగబారి - రగిలి ప్ర**
**చండమై మండితే చల్లార్పగా రాదు**
**కాదోయ్ ఇది భేద వాదాల కాలంబు"**

అని అంటూ బంగారుకై ప్రాణాలు విడిచే ధనవంతుల దాహం, చీకటి బజారుల్లో డబ్బు పోగుజేసే వర్తకుల ప్రవర్తన, అధికార్లలో లంచగొండితనము, దేశద్రోహుల ఘాతుక చర్యలూ, అరికట్టాలనీ, అప్పుడే దేశం ప్రగతి మార్గంలో పయనిస్తుందని భావించారు.

అలాగే తినుటకు తిండి, కట్టుటకు గుడ్డలేని బీదల ఆక్రందన నాగరిక సమాజాభ్యుదయానికి ఆటంకం అని, బీదల ఆక్రందన రగిలి రగిలి మండితే ఆ మంట చల్లార్చుట అసంభవమని ఆంధ్ర దేశాన్ని హెచ్చరిక చేశారు. అలాగే రాష్ట్ర ప్రజలు ఏవిధంగా నడుచుకోవాలో, రాష్ట్రం ఏ విధంగా

ప్రస్ఫుటించాలో సూచిస్తారు మహాకవి.

**"మూడు మూలల మేయు పాడి యావుల పాలు**
**ఏక భాండమునందు పాకమై పొంగాలె,**
**గింజ కుంచంబుగా గెలవేల గుత్తిగా**
**పండ్ల తోటలు చేలు పండాలె నిండాలె**
**గౌతమీ కృష్ణానదీ తీర్థ బద్ధమై**
**రామపద సాగరము రావాలె రావాలె**
**వేంకటేశ్వర విశ్వవిద్యాలయమునందు**
**తెలుగు కన్యకు పసుపు తలంబ్రాలు పోయాలె"**

అని ఆకాంక్షిస్తారు.

పై కవితలో రాయప్రోలు వారి సామాజిక దృక్పథం మనకు విశదమౌతుంది. *ఆంధ్రాభిషేకం* అనే మరో కవితా ఖండికలో "విశాలాంధ్ర జననీమ తల్లికా" అని ఆంధ్ర మాతను సంబోధించి జయనాదాలు వినిపిస్తూ – రాష్ట్ర వికాసాన్ని కొనియాడి, తర్వాత అంటారు –

**"జయస్తే విశాలాంధ్ర జననీమ తల్లికా!**
**శ్రియస్తే తెలంగాణ చికుర నవ మల్లికా,**
**నాలుగు కోట్ల మహాంధ్ర నాగరక జనకాంక్ష,**
**నలుబదేండ్ల నిరూఢ బలవదుద్యమ దీక్ష,**
**ఇరుగు పొరుగులు నచ్చ – హితులు నహితులు మెచ్చ**
**ఈడేరినది ఆంధ్రులేకీభవింపండి**
**దేశ ప్రతిష్ఠల్ ప్రకాశంబు కావాలె**
**నడపండి రాష్ట్ర తంత్రము ముళ్ళు పడకుండ"**

అని హిత వచనాలు పలికారు. విధి విపరీతం కదా! రాష్ట్ర తంత్రము ముళ్ళు పడుతున్నది. కవులు ఋషి తుల్యులు వారి ఆకాంక్షలు, ఆశీస్సులు జరిగి తీరాలి కదా!

*పిలుపు, సోదరీ! సోదరా, భద్ర యాత్ర* అను కవితా ఖండికలు చైనాదేశము మనపై అధర్మ యుద్ధము మొదలెట్టిన సమయంలో చింతా క్రాంతుడై, వ్యధిత హృదయంతో ఆచార్య రాయప్రోలు స్పందించిన వైఖరి వెల్లడిస్తాయి. *పిలుపు, సోదరీ! సోదరా* చిన్న కవితా ఖండికలు కాని *భద్ర యాత్ర* అను కవిత వాటి రెంటికన్నా కొంచెం పెద్దది. ఈ కవిత రెండు భాగాలుగా రచింపబడినది. రాయప్రోలు వారికి భరతమాత పుత్రుడనని చెప్పుకొనడమే అత్యంత గర్వించదగిన విషయం. వారి దృష్టిలో జన్మ రాహిత్యంతో మోక్షం పొందుట కంటె భారతీయుడిగా తిరిగి జన్మించుట ప్రీతిపాత్రం. పురాకృత సుకృత ఫలంగా భారతదేశమనే స్వర్గంలో జన్మించుట కవకాశం కలిగింది. అవకాశం లభించినదే తడవుగా దేశ ఋణాన్ని తీర్చు కోవాలి. అందుకే చైనా దేశాన్ని ఆక్రమించినప్పుడు –

**"ఎత్తవోయి – పయికెత్త వోయి – నీ స్వేచ్ఛా భారత సీమల జెండా**
**మూడు వన్నెలును ముచ్చిచ్చులుగా – చీనా సేనల కాల్చాలోయ్"...**
**నీతి నియమములు పాతర పెట్టీ – కల్ల గజ్జలను కత్తులు దాచీ**
**కొండల మాటున కోడి పందెమును – చౌలై ఆడెను జాగ్రత్తోయ్.**
**సావాసంబని సంధి మాటలని – ఏమరించి వంచించి పయింబడె**
**మిత్ర ద్రోహము – మాతను తాకిన – మత్తుల హతమార్చాలోయ్ ...**

**దేశ ఋణమును – దేవ ఋణమును –**
**మాతృ ఋణమును – మనిషి ఋణమును**
**తీర్చ గలిగిన దీక్షితుడనని – తెలిసి తెలిపే సమయమోయ్**
**మానిసివిగా మసల వలెనో – బానిసవుగా బ్రతుక వలెనో**
**తేల్చుకో – తెగటార్చ వలెనోయ్ – దొంగ చైనా యెత్తులన్**

అని ఉద్బోధిస్తారు. రాయప్రోలు వారికి దేశం భగవత్స్వరూపం. అందుకే వారికి దేశఋణం, దేవఋణం, ఒకటిగానే కనిపిస్తాయి. ఆ ఋణాలు ప్రతి ఒక్కరూ తప్పక తీర్చుకోవలసినవి.

**మంగళ మాఘమ్ :**

ఈ కవితా ఖండికలలో వివిధ ఋతువులను వర్ణించారు రాయప్రోలువారు. వర్ణనలన్నీ కొత్తదనం ప్రకటిస్తూ ఆధునిక భావజాలాన్ని స్పష్టంగా వ్యక్తపరుస్తాయి. ఉదాహరణకు :

**"కొప్పు కందని కురుల పోలిక, – వెదల బెదిరిన పెయ్య లట్టుల,**
**కొదమ మబ్బులు పొదివికొన – పులకించె లోకము తొలకరిన్" ...**
**జున్ను గడ్డల భంగి చుక్కల – వెన్నెలను పెరుగన్న మట్టుల –**
**మింగె దయ్యము వంటి చీకటి – జడలు విడ మిట్టాడుచున్**

ఆచార్య రాయప్రోలువారికి పెరుగన్నంపై ప్రత్యేక మక్కువ! అందుకే కాబోలు వెన్నెల వారి దృష్టికి పెరుగన్నంలా కనిపించుట! చుక్కలు 'జున్నుగడ్డల' మాదిరి చిత్రిత మౌతాయి! చీకటి మాత్రం దయ్యంలాగానే గోచరిస్తుంది! వారి భావుకతకు తార్కాణంగా–

**"మెరప తోటలు మెరిసినవి పగ – డాల బోలిన పండ్ల గుత్తుల,**
**బంతి మొక్కల చాళ్ళు గొబ్బికి – పసుపు ముద్దలు పెట్టగాన్"**

*మంగళమాఘమ్*లోని కవితలన్నీ అలంకారయుక్త పుష్పగుచ్ఛాలే! ఒకదానిని మించి మరొకటి!

విశ్వవిఖ్యాతినార్జించిన మేధావి, తెలుగుగడ్డపై ఉదయించిన ప్రచండ భానుడు సర్వేపల్లి రాధాకృష్ణ. ఆ మహామహుడు 'రాష్ట్రపతి' అయిన సందర్భములో మహాకవి స్పందన గమనించండి! అపార గౌరవ ప్రాంజలి :–

**"నీధ్యాన ధారణకు – నీ యోగ సాధనకు**
**శత శతాయుః స్ఫూర్తి – అగును రాధాకృష్ణ!**
**అభినవ విద్యారణ్యుడ – వుభయ ప్రజ్ఞాన దీప్త సూక్తిని, అర్పింతు భవన్మూర్తికి, ఈ సుప్రభాత మంగల్య మాల – రాధాకృష్ణ!"**

పెండ్లిలగ్నం :

రాయప్రోలు సుబ్బారావుకు తెలుగు భాష, తెలుగు దేశం, తెలుగు ప్రజలు అంటే చెప్పరాని అభిమానం. వారి కావ్యాలలో తెలుగుదేశ ప్రకృతి సౌందర్యం, తెలుగింటి పరిసరాలు, ప్రజల జీవన విధానం, భోజన పద్ధతులు, పండుగలు, వేడుకలు, ఆటపాటలు, అన్నీ ప్రాముఖ్యతను సంతరించుకొని తెలుగుదేశ చిత్రణ అతిమనోహరముగా దర్శనమిస్తుంది. *పెండ్లిలగ్నం* అనే కవితా ఖండిక *మిశ్రమంజరి* సంకలనములో ప్రసిద్ధికెక్కిన కవిత. పల్లె జీవనంలో రైతులకు పంట పొలాలు, పాడి పశువులే సిరి సంపదలు. అందువలన పల్లె ప్రజల్లో పూర్తిగా తెల్లవారక ముందే, మంచం మీద పడుకొనే తమ పశువులను గురించి, పాకలను గురించి, పంటల వివరాల ఆలోచనలు మొదలెడతారు!. నీరు లేక వరి చేలు పొల్లుపోయాయని, సేద్యానికి వానలు ఆలస్యంగా కురిశాయని, చెరువు నిండింది కాబట్టి ఆయేడు కరువు రాదని, మిరపతోటకు పురుగు పట్టలేదని, జొన్న కంకులు అప్పుడే పాలు పోసు కుంటున్నవనీ, పూత పట్టిన కొతిమేర (ధనియాల పంట) మంచు తాకకుండా బాగా కాయాలనీ, అలా జరిగితే ఆ సంవత్సరమే ఎడ్లపాక కప్పించుకోవాలనీ, వానలకు పడిపోయిన గోడలకు మెత్తులు వేయించాలనీ, అప్పుల మీద వడ్డీ పెరిగి పోతున్నదనీ, ముచ్చటగా పెరుగుతున్న పెయ్య దూడలను అమ్మి అయినా సరే ఆ అప్పు తీర్చు కోవాలనీ, ఆలాంటివే ఇంకా ఎన్నెన్నో ఆలోచనలతో సతమతమయ్యే గ్రామ వాసులను అద్భుతంగా చిత్రిస్తారు రాయప్రోలు వారు! వారి ఆలోచనలకు అద్దం పట్టినట్లు వర్ణించారు కవితలో! పరిశీలించండి.

**"వెండి లాంతరు వెలిగించి వెడలె రజని–ఒడలు తెలియక నిదురించు చున్న జీవ కోటి నరసి కాపాడ–పక్షులను బోలె–చెట్లునున్ కదలవు సొమ్మ సిలిన యట్లు" ...**
**ఎదిగినది పిల్ల పెండ్లికి – ఎట్టులైన – ఎడ్ల కొట్ట మీ ఏడు నేయింప వలయు –**
**వానలకు కారిపోయిన పడమటింటి–గోడ కంద వేయక యున్న కుప్ప కూలు– ...**
**అనుచు తలపోయు చుండె రామన్న–చుక్కపొడిచి బారెడెక్కె–ఇరుగు పొరుగు లందు**
**చల్ల చిలుకు చప్పుళ్ళు – కావళ్ళ మ్రోత లును కలిసి చెట్ల మీద పక్షులను లేపె.**

రామన్న భార్య భూదేవి ఒక ఆదర్శ పల్లెటూరి పత్ని. ఆమెను రాయప్రోలు వారు ఎంత మనోజ్ఞంగా చిత్రించారో పరికించండి.

**బక్క పలచని నెమ్మేను పచ్చి పసుపు –**
**కొమ్మువలె మంగళ చ్ఛాయ క్రుమ్మరింప –**
**ఇంతలేసి కాటుక కండ్ల ఇంపు తోడ –**
**మగువ ఆకలి దప్పులు మాయ చేయు.**
**ఇల్లు మాయ నీయ దిల్లాలు – మాయదు –**
**కొప్పు గాని కట్టు కోక గాని – అబల కబ్బె నిర్మలాభ్యాసములు–**
**తన నిర్మలాత్మ వృత్తి నీడ లట్లు.**

అంతేకాదు, గృహిణిగా ఆమె –

**కడవతో నీళ్ళు తోడి, ముక్కాలి పీట –**
**వేసి, చాకింటి ధోవతి తీసియుంచె; –**
**భర్త కుపచారములు చేయ ప్రాలు మాల –**
**దెంత పని యున్న భూదేవి ఇంటిలోన**

కూతురి పెండ్లి మాటలకు ఆ ఊరి పెద్దలు రామన్న ఇంటికి వచ్చినప్పుడు ఒక సంస్కారవంతమైన గృహిణిగా భూదేవి వచ్చిన వారిని ఆదరించి తగిన మర్యాదలు చేస్తుంది. ఆ విధానం గమనించండి:

**నిలువు చెంబులతో వేడినీళ్ళు తెచ్చె –**
**అనువు గని పెట్టి భూదేవి అంతలోనె –**
**కిఱ్ఱుచెప్పులు విడచి ... కాళ్ళేలు కడిగి –**
**కూరు చుండిరి వారును కుశలమడిగి ...**
**వడ్డనలు చేసె చవులూరు వంటకములు –**
**క్రొత్త సాంబారు కారమున్ కొసరి కోర;**
**పైర వంకాయ తాలింపు – దోరవేపు –**
**కంది పప్పు కమ్మదనాలు చిమ్ము చుండ**
**ఇంట కాచిన కపురము వంటి నెయ్యి –**
**జిడ్డు మీగడ గట్టిన గడ్డ పెరుగు –**
**చవులు తెలిసిన భూదేవి స్వాదు పాక –**
**మే పదార్థ మింపితముగా దెవరి కేని –**
**మనువు తెచ్చిన పెద్దలు – మాట లాడ –**
**వచ్చినట్టి పెత్తన దార్లుభయ జనులకు నచ్చజెప్పి ...**
**రంగు చీరె – పదారు వరాల పసిడి –**
**ఉభయ గృహయోగ్యము లటంచు నొప్పికొనిరి ...**
**పెండ్లి లగ్నము జరిగెను పెద్ద లలర.**

పై విధంగా పల్లె జీవనం అద్భుతంగా చిత్రించి చలన చిత్ర శైలిలో మన ముందుంచారు నవ్య కవితా చక్రవర్తి రాయప్రోలు "పెండ్లిలగ్నం" కవితలో!

తెలుగు వారి సాంఘిక జీవనంలో పండుగలకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఆంధ్రదేశంలో సంక్రాంతి, ఉగాది, నవరాత్రి, విజయదశమి, ఈ పర్వదినాల వైపు ఆకర్షితులు కాని కవులు చాలా అరుదు. తెలుగుదనం అభిమానించి, ఆరాధించు రాయప్రోలు వంటి వారికి నోములు, వ్రతాలు, పండుగలు వారి సామాజిక దృక్పథాన్ని వ్యక్తపరచుటకు సందర్భాలను కలిపిస్తాయి. అందుకే ఆ సమయాల్లో వారు దర్శించిన అనుభూతులను కవితా ఖండికల రూపంలో మన ముందుంచారు. *మిశ్రమమంజరి*

కావ్యంలో పండుగలను పురస్కరించుకొని వ్రాసిన కవితలు పొందు పరచారు రాయప్రోలు వారు. కవితలలోని వర్ణనలు తెలుగుదేశాన్ని అద్దం పట్టి చూపిస్తాయి. మచ్చుకు –

**తెల్లవారగ మేలుకొలుపులు – పాడుచును హరిదాసు లాడగ**
**గొంతులెత్తు శకుంతములు ఆ – నందముగ సుతి కలుపుచున్ ...**
**నవ్య ధాన్య సువాసనలతో – పాలునిండిన భాండములతో**
**ఇండ్లు సిరి ముంగిళ్లయిన ఈ – పచ్చి పండుగ సందెలన్.**

అలాగే "నవరాత్రి" కవితా ఖండికలో

**నీలగిరులను బట్ట బయలున – పెరుగు ముద్దలు పంచు శారద**
**కవి కులంబుల కామెతలుగా – అందుకొను డిరు సందెలన్ ...**

**ఆషాఢి :**

"మిశ్రమంజరి" సంకలనములోని మరొక ముఖ్య కవితా ఖండిక "ఆషాఢి". అతి దీర్ఘ మైన ఈ కవితను ఏడు భాగాలుగా విభజించారు రాయప్రోలు వారు. "ఆషాఢి అని ఈ కవితకు పేరెందుకు పెట్టారో కవి హృదయం లోకి ప్రవేశించి అర్థం చేసుకొనుట కొంత క్లిష్టతరమే! ఆషాఢి అంటే "బ్రహ్మచారి" అనే అర్థాన్ని సూచిస్తుంది నిఘంటువు. కాని, మనం "సన్యాసి" అనే అర్థంలో గ్రహించవచ్చు. చేతనాచేతనాల్లో దేశమాత దివ్య స్వరూపాన్ని దర్శించి, తామారాధించిన భరతమాతకు హృదయ పూర్వక నివాళుల అర్పించారు ఆచార్య రాయప్రోలు గారు ఆషాఢి లో. పరికించండి –

**తుహిన ముక్తా సరులతో కొం – దంత కబరీ భరము శోభిల –**
**చీర చెఱగులు సాగరములై – జాఱు దేవీ రూపమున్**

ఒక విధంగా పరిశీలిస్తే, ఈ కవితా ఖండికలో తత్త్వ వివేచన స్ఫురిస్తుంది. ప్రాణికి, కర్మానుసారంగా భగవంతుడు జన్మను అనుగ్రహిస్తాడన్న సంప్రదాయ దృష్టినే రాయప్రోలు వారు వ్యక్తపరచారు ఈ కవితలో. అందుకే –

**ఈశ్వరున కుప సర్జనీ కృతు – దయిన మనుజుని సంస్కృతికి బహు**
**జన్మ జన్మాంతర కృతాకృత – ఫలవిపాకము కావలెన్**

ఈశ్వరుడు ప్రసాదించే జన్మలలో మానవ జన్మ ఉత్తమమయినది. మానవులలో కూడ విద్వాంసునిగా జన్మించుట సుకృత ఫలం అంటారు మహాకవి. మానవునిలో ఆధ్యాత్మికత రానురాను సన్నగిల్లుతున్నదని భౌతిక సుఖాలకే ప్రాముఖ్యం పెరుగుచున్నదన్న భావాన్ని వ్యక్తపరుస్తారు.

**"పరము వెనుకై ఇహము పైకొన – తన్నుకొనె సంశయ ఘనా ఘన**
**ఘటనమున మనుష్య వృత్తము – బురద బడ్డ గజం బటుల్."**

జాతులలో ఆచార వ్యవహారలలో అనేక మార్పులు వచ్చాయి. ఆదరాభిమానాలు తగ్గి, మనిషి భయ భ్రాంతులకు లోనయినాడు. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని కోల్పోయాడు.

**ఇంట మమతన్ బయటభీతిన్ – మానవుని వ్యక్తి స్వతంత్రము**
**అల్ల అల్లన కారి పోయెను, – చిల్లి కుండ జలా లటుల్.**

కాల క్రమేణ పరిస్థితులు మారి పోయాయి. అంతేకాదు, మార్పు సహజం. పాత నశిస్తుంది. క్రొత్తకు దారి తీస్తుంది.

**విత్తు నశియించి మొలకాయెను – పెరిగి పూచి ఫలించి విత్తన**
**మిచ్చుటకె; యిది సృష్టి నైజము – ఆది బీజము రాదెటున్.**

కవులను "రాగరక్తుల" గా భావిస్తారు రాయప్రోలు వారు. అటువంటి వారికి వైరాగ్యం అంతగా అభిలాషణీయం కాదు. అందుకే –

**కనుకనే వాచామ గోచర – మనిరి అపరోక్షాను భూతిని;**
**వదలు దది నిస్సంగులకు – ఏ – టికి గృహస్థులు తడవగన్.**

అద్వైతం అందనిదన్న భావం రాయప్రోలు వారిలో అక్కడా కనబడుతుంది. కాని వారు అద్వైత తత్త్వానికి వ్యతిరేకులు మాత్రం కాదు. భూత, వర్తమాన, భవిష్యత్తులను గురించి వాదోప వాదాలతో సమయాన్ని వృథాపుచ్చుట మంచిది కాదని ఆచార్యుల వారి అభిప్రాయం. ఆ విషయాన్ని ఈ విధంగా వ్యక్తపరుస్తారు.

**మునుపు మునుపని మొత్తు కొందుము – మునుపు కాదో నేడు రేపటి**
**కక్షయంబగు నీ ప్రవృత్తము – ఆగు టెపుడో ఎక్కడో,**
**పరిమితము ఆయుః ప్రమాణము, – సగము నిద్దుర; మిగత సగమున,**
**ఎందుకీ వంధ్యా స్తనంధయ – రూపరే ఖా తర్కముల్.**

రాయప్రోలువారి దృష్టిలో మానవ జీవితంలో కష్ట సుఖాలు వెలుగు–చీకట్లలాగా, ఒకదాని వెంట మరొకటి వచ్చి పోతుంటాయి. అందువలన కష్టకాలంలో నిరాశ చెందకూడదనే అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తారు. అంతేకాదు, వర్తమాన కాలం కంటే, భవిష్యత్తులో మంచి రోజులు రాగలవన్న ఆశతో నిరాశ, నిస్పృహ, నిరుత్సాహాలను దూరం చేసుకొని ముందుకు సాగిన నాడు జాతి అభ్యుదయాన్ని తప్పక పొందగలదన్న ఆశాతత్త్వం వెల్లడిస్తారు.

**కలదు కల దధిక ప్రకాశము – తోడ నారీ నర సమాజము**
**శాంతిగని సుఖించు కాలము; – ఏటికీ గుంజాటనల్?**

అని వక్కాణిస్తూ, కలతలు, కల్లోలాలు మరచి, రాబోయే మంచి రోజులకై శాంతితో నిరీక్షించమని ప్రబోధించారు.

**ఫాల్గుణి :**

తెలుగు పంచాంగానుసారం కాలమాన గణన అరువది సంవత్సరముల ఆవృత్తము. ఒక సంవత్సరములో పన్నెండు నెలలు ఉంటవి. అందులో ఫాల్గుణి చివరి నెల. ఫాల్గుణి

సంవత్సరాంతపు పౌర్ణిమ. వసంత కాల ఆగమనాన్ని సూచిస్తుంది. ఈ కవితా ఖండికలో రాయప్రోలు వారి భావపరంపర కాల గమనం వైపు ప్రసరిస్తుంది. అరువది సంవత్సరాల ఆవృత్తము పూర్తి అవుతుంది. కాల చక్రం తిరుగుతునే ఉంటుంది. కాలాను క్రమంగా ప్రకృతిలో మార్పులు సంతరించుకొంటవి. గతం వర్తమానానికి, వర్తమానం భవిష్యత్తుకు దారినిస్తుంది. కని పెంచిన పెద్దలు గతించారు. శిశువు పెరిగి పెద్దవాడై – మొలక మొగ్గకూ, మొగ్గ పూవుకూ, ఫలానికి మారి చివరకు విత్తు రూపాన్ని ధరిస్తుంది. ఈ జీవ చక్రం సాగుతూనే ఉంటుంది.

మనిషి జీవనోపాధికి బంజరు భూమిని బాగుజేసి, మల్లె తోటగా మార్చి పూలు పూయిస్తాడు, అరణ్యాలను నరకి కలప తయారు చేస్తాడు, గడ్డు భూమిని త్రవ్వి బొగ్గు తీస్తాడు, ఈ విధంగా ఒకొక్కడు ఒక్కో వృత్తికి అలవాటు పడతాడు! పూవులమ్మి ఒకడూ, కట్టెలమ్మి మరొకడూ, బొగ్గులమ్మి మూడవ వాడూ తమ తమ జీవనోపాధులను కల్పించుకొంటారు. వీరిలో ఎవరు ఘనులో ఎవరు కాదో అనేది ఎడ తెగని వివాదం! కాల చక్రం తిరుగుతూ యుగాలు గడుస్తాయి! జీవిత గమనంలో పండుగ రోజులు ఏర్పడతాయి.

**ఇంట పుట్టిన రోజు పండుగ – దోరపాకపు గారెలరిసెల**
**భోజనమునకు వేళ తప్పెను – కూరుచుంటిని అలసటతన్ ...**

సృష్టి విచిత్రమూ, అనంతమూ ఎటు చూచినా ఒకటిగా కనిపిస్తుంది. చేతనాచేతనలు రెండుగా జగతి పరిణమిస్తుంది. మనిషి వికసిస్తాడు.

**పర్ణ శాలల తపము సలిపెను – క్షేత్రముల కృషి కర్మ జరిపెను**
**గురువుగా కుల పెద్దగా – జన – నాయకుడుగా భాసిలెన్.**
**ఆత్మ యమ దమ నియత ధారణ – బాహు బల శస్త్రాస్త్ర సాధన –**
**లక్ష్య లక్షణ శిక్షలన్ – మా – నవులలో తెగ లేర్పడెన్ ...**

రాజులు రాజ్యాలు ఏర్పడ్డాయి. దాయాద మాత్సర్యాలు – రాజ్యాల కోసం యుద్ధాలు, మతాలు, కులాలు ఉద్భవించాయి. మనిషి ఆలోచనలు మారి భేదభావానికి దారితీసింది.

**కుచ్ఛితంబో – మచ్చరంబో – అంకురముగా అల్లు కొనె పగ**
**దాలివలె; సుడిగాలి కెపుడో – మండి గృహమును కాల్చదే!**

అదే జరిగింది. ...

కాలక్రమంలో భరతభూమి భాగ్యసీమగా మారి విదేశస్థుల దృష్టినాకర్షించ మొదలెట్టింది! కనుమల ద్వారా, భూమార్గాన, ఓడలలో సముద్ర యానాన పరదేశీయులు తండోప తండాలుగా వచ్చి దేశ సంపదలను కొల్ల గొట్ట నారంభించారు. వ్యాపారాల పేరుతో విచ్చేసిన విదేశీయులు రాజ్యా లేర్పరచుకొన్నారు. క్రమేణ భారతమాత పర హస్తాలలో చిక్కుకొన్నది. అన్యాధీన – అన్య ప్రభుత్వం పాతుకొని పోయింది. అనర్థాలకు ఆటపట్టు అయింది.

**కుల విభేదము – మత విరోధము – పొటమరించెను స్ఫోటకము వలె**
**ఇరుగు పొరుగుల యిష్ట బంధము – తెగెను పురి విడి కటకటన్**
**ఎగుమతులలో దిగుమతులలో – నిధులు నిక్షేపములు కరిగెను**
**ధనికులే అతి ధనికులుగ – నిరు – పేదలయి పో పేదలున్ ...**
**క్షుద్రమైనను సుస్వతంత్రము – అఖిల సుఖములకాట పట్టగు –**
**గొప్పదేని పరాయి పాలన – చీడ పురుగగు జాతికిన్**

పర పాలనలో మన సంస్కృతీ సభ్యతలు మంట కలిశాయి. సంపదలు సన్నగిల్లాయి. దేశం సర్వనాశన మయింది.

**ఒకటి వెనుక మరొకటి ఇటులా – నాటి భారత భార రూపము**
**పీడకలవలె కలత పెట్టెను; – తెల్ల వాఱవొ చీకటుల్.**

సూక్ష్మంగా పరిశీలిస్తే ఫాల్గుణి కవితా ఖండిక రాయప్రోలు వారి సామాజిక దృక్పథం వెల్లడిస్తుంది. వారు జాతి మతాలకు విరుద్ధులనీ, మతమనేది దైవాన్ని చేరడానికి సహాయ పడేది మాత్రమేననీ, ఏ మతమైనా మనుగడకు మార్గదర్శకంకావాలి. విశ్వ శాంతికీ, సాంఘిక సహజీవనానికి దోహదం కావాలని రాయప్రోలు వారి ఆకాంక్ష!

"పల్లెపడచు", "కాపుకన్నె" "మిశ్రమమంజరి" సంకలనము లోని మరో రెండు ప్రసిద్ధ కవితా ఖండికలు. ఈ కవితలలో రాయప్రోలు వారు తెలుగు దేశపు గ్రామ ప్రాంతాలను, అచ్చటి ప్రజల జీవన విధానం, స్త్రీల కట్టు బొట్టు, అలవాట్లు, అద్దం పట్టినట్లు చూపిస్తారు. వీరి స్త్రీ వర్ణనలో పూవులో తావిలా సహజత్వం ఉట్టి పడుతుంది. తెలుగు పల్లె పడచు సౌదర్యం రమణీయంగా వర్ణింపబడినది. రాయప్రోలువారి వర్ణనలలో అత్యుక్తులు గాని, పదాడంబరము గాని కనిపించవు. స్త్రీల సౌందర్యాన్ని వర్ణించుటలో వారు నిర్ణయించుకొన్న పరిధి, నియమావళి అత్యంత ప్రశంసనీయము. వీరి రచనలలో ఎక్కువగా స్త్రీ కన్నులు, శరీర కాంతి, ప్రాయము వంటి వాటిని గూర్చిన వర్ణనలే కనిపిస్తాయి. మొగలిపూవు వంటి దేహకాంతితో, పచ్చిపసుపుకొమ్ము వంటి మంగళ ఛాయతో స్త్రీలు వారి రచనలలో మనకు దర్శనమిస్తారు! రాయప్రోలువారు తమ కవితా ప్రతిభ అనే ప్రత్యేక సొమ్ముతో స్త్రీలను అలంకరించి తీర్చిదిద్దుతారు. అశ్లీలత మైక్రోస్కోపుతో పరిశీలించినా కనిపించదు! ఈ విషయాన్ని రూఢి పరచే ఉద్దేశ్యంతో కొన్ని

కవితలు తిలకించుట భావ్యమేమో!

**పల్లెపడుచు నుండి :**

**"ఊరికావలి చెరువులో నీరు తెత్తురు నిరతమున్**
**జారు సందెలు మెరయగా పల్లె పడుచులు కదవలన్" ...**
**పెద్దకాపయి గ్రామమున్ దిద్దు నాతడు చదురుతో**
**సద్దు చేయరు జనములున్ రద్దీ రచ్చలు లేమిచే.**
**కూతురొక్కతె అతనికిన్ చూత పల్లవ మన దగున్**
**మంచి గంధపు మొలకయో మించు ముద్దుల గిలకయో!**
**పూచి పూయవు చెలి యొదల్ లేచి లేవవు మనసులున్,**
**బాల మోమున చిరు నవుల్ తేలవింకను తేటగా**
**పాలధారల కడిగిరో పూల పొత్తుల పొదివిరో**
**బాలికా మణి ముఖ కళల్ చాల దుర్లభ మవనిలో.**
**ఏమి కావలె నంచునూ ప్రేమ తీయగ అడుగు నూ ...**
**గువ్వ జంటల దరియుచున్ బువ్వ పెట్టెద తినుమనున్**
**పూవుపై పదు తుహినమో - ఆవు పిండిన అమృతమో**
**అనగ ఆచెలి చెలువముల్ - పెనగె ప్రాయపు చేష్టలన్.**

పై కవిత చదివినంతనే పాఠకుల కనుల ముందు ఆ పల్లెపడుచు సజీవంగా ప్రత్యక్షమవుతుంది. తెలుగు పల్లెపడుచు పొలంలో తనకు తాను పశుపక్ష్యాదులతో మమేకమై ఆడుచూ, పాడుతూ సంతోషముతో ఎలా కాలక్షేపం చేస్తుందో సహజంగా చిత్రిస్తారు రాయప్రోలు వారు. అంతేకాదు ప్రకృతి సౌందర్యాన్ని స్వల్ప వర్ణనలతో చలనం, చైతన్యం మూర్తీభవించు విధంగా చిత్రపట ఫక్కీలో ప్రదర్శించి కళానుభూతిని పాఠకులకు అందిస్తారు రాయప్రోలువారు.

కాపుకన్నెలోని ఈ దిగువ పేర్కొనిన కవితా ఖండికను పరిశీలించండి:

**నడకల కుల్కు కల్కి చరణంబుల కింపులు పెంప చిన్ని చే**
**కొడవలి త్రిప్పి కొంచు కళుకుల్ వెదజల్లెడు కన్నులం, దెడా**
**పెడ నెరి వోయి కాటుక ద్రవింపగ పోవుచు నుండె కాపు లే**
**బదతుక యొంటిగా వయసు వాలకముల్ మురిపింప పాంథులన్.**

స్త్రీ సౌందర్యం దానంతట అదే పాఠక హృదయాలల్లో రూపు దిద్దు కొంటుంది! చలనాన్ని, చేతనాన్ని, మిళితపరచి పాఠకుని కనుల ముందు చలన చిత్రాన్ని ప్రదర్శిస్తుంది! మృదు పదాలతో భావాన్ని పఠితకు అందజేస్తుంది. అందుకే "ఈయన తెనుగు పడుచుల ప్రణయాలు, ప్రకృతి విలాసాలు సొగసుగా ప్రదర్శిస్తారు" అంటారు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

**శ్రీ రవ్యాత్ :** ఈ కవితా ఖండిక, రచయితలు-ముఖ్యంగా కవులుపయోగించదగిన భాషను గురించి విశ్లేషిస్తుంది. సరళ మైన భాష రచనకు రమ్యత కలిగిస్తుంది. మృదువైన శబ్దజాలం మనసుకు ఆహ్లాదం కలిగించుటయే గాక, కావ్యానికి శ్రావ్యతా శక్తి నిస్తుంది. గొప్ప కవులు శ్రావ్యమైన శబ్దాన్ని ఆదరిస్తారు. మహాకవులు, శ్రవణ సుఖానికి భంగకరాలు, భావాలకు బాధకాలు, రసభంగకాలు అయినటువంటి పద ప్రయోగాన్ని గర్హిస్తారు. మనోహరమయిన వాఙ్మయ సృష్టికి తీయని భాష అత్యవసరమని రాయప్రోలు వారి వాదం. అందుకే -

**చెవికి తీయము చిలుకు శబ్దము - కంటి కింపగు కాంత కల్పన -**
**కలిసి హృత్కోశమును తడిపే - తొలకరింపులె కావ్యముల్.**

అని వక్కాణించారు. జన బాహుళ్య వ్యవహారములోని సజీవ భాషకు సాహిత్య గౌరవం దక్కాలని రాయప్రోలు వారి అభిప్రాయం. నవ కవికి శ్రవణ సుఖదత్వమే ముఖ్యం. భాషకు మాధుర్యాన్ని చేకూర్చి వినసొంపుగా వుంటే, అన్యదేశ్యాలయినా, ప్రాచీన వాఙ్మయ ప్రయోగాలైనా, సమానంగానే స్వీకరిస్తారు. ఇటువంటి పదాల ఎన్నికలో మధురత్వం, అర్థ గౌరవము ముఖ్యమైన విషయాలు. తెలుగు భాషకు సహజ సౌందర్యము అబ్బిన పలుకుబడులను నవ్యులు ఆదరిస్తారు. లాక్షణికుల దృష్టిలో దోషాలనదగినవి సంధుల వంటివి శ్రావ్యతముందు లెక్క చేయదగినవి కాదని రాయప్రోలు వాదిస్తారు. అంతేకాదు -

**కావ్యమును రూపించె "విబుధో - ద్యాన" మని ఆనందవర్ధను**
**దుపనిషత్తులు పలికెడి "రసో - వైస హ" యటంచు ను కవీ!**
**కరుణ శృంగారములు రెండే - ఋతరస ప్రతి పత్తి నందెడి**
**ఒకటి కలుషము కడుగు; మతొకటి - కాల్చు కాయము శుద్ధికై.**

రాయప్రోలువారి దృష్టిలో నవకవులు (భావకవులు) సంభోగ శృంగారం కంటే వియోగ మాధుర్యాన్నే అధికంగా అభిమానిస్తారు. అదే విధంగా కరుణారసాన్ని కూడా ప్రధానమైన రసంగానే స్వీకరిస్తారు ఆచార్య రాయప్రోలు. సాహిత్యంలో అత్యంత రమణీయ కల్పనలకు శోకమే ప్రధానమైనదని రాయప్రోలు భావిస్తారు. ప్రధాన కావ్యాలన్నిటిలో శోకమే ముఖ్యంగా ఆలంబన అయినప్పటికీ హృదయ వేదనలో కొద్ది భేదం రసాను భూతిలో విశిష్టతను చేకూరుస్తుందని వారి నమ్మకం.

లౌకిక సుఖదుఃఖాలు, హెచ్చుగా దుఃఖాన్నే కలిగిస్తు న్నప్పటికీ, ప్రాచీన లాక్షణికుల అభిమతాను సారం కావ్యంలో దుఃఖము కూడా ఆనందాన్నే కలిగిస్తుంది. పాఠకులు ఆనంద రసాను భూతిని పొందుతారు. లోకమును చిత్రమనిరార్యులు - ప్రకృతి పురుష పరస్పరాంతర

**విరహ శోకము శ్లోకములుగా - కవులు ధ్యానింతురు కవీ!**
**జన్మ వర్ధన విలయములలో - త్రిగుణములవలె నణగి పెనవడు**
**శోకమే బ్రహ్మాండ లీలా - బంధమౌనేమో కవీ! ...**

**పెంచి పాలించిన శకుంతల - అంపకాలకు దడరె కణ్వుడు;**
**స్నేహ ధారణ చిందగా విల - పించె యక్షుడు విరహతన్.**

పెంచి పెద్ద దాన్ని చేసిన కణ్వ మహాముని శకుంతలను కాపురానికి పంపించు సమయాన దుఃఖానుభూతిని పొందుతాడట! ఆ మహర్షి సుఖదుఃఖాల కతీతుడు! అయినా ఆ మహర్షి కావ్యగతమైన రసానందం పొందాడని మనం ఊహించుకోవాలి.

**శుభమ్ :**

సాధారణముగా రాయప్రోలువారి దేశభక్తిని గూర్చిన చర్చలో వారి దేశభక్తికి ఆధ్యాత్మిక చింతన మూలాధారమని చెప్పారు. కాని, *శుభమ్* అనే కవితా ఖండిక రాయప్రోలు వారి దేశభక్తిని భౌతిక రూపంలో వెల్లడిస్తుంది. తల్లి దండ్రులు, తమ్ములాప్తులు, ఆశన, శయన, నివాస సుఖములు వదలి... నాళ్ళు నరములు కొఱుకు చలిలో, రక్త మాంసములుడుకు వడలో, ఓర్చి కిమ్మనకుండా - మర తుపాకులకు గుండెలొడ్డి దేశరక్షణకు కంకణము ధరించిన సైనికుల త్యాగనిరతిని స్మరిస్తూ భావోద్వేగంలో రచించిన కవిత *శుభమ్* హర్షించ దగినది. సైనికులయందు వారు వ్యక్తపరచిన ఆదరగౌరవాలు సైనికులకు ప్రేరణ నిస్తాయి. మచ్చుకు రెండు ఖండికలు పరికించండి -

**"అగ్ని కురిసే బాంబులకు,**
**పెను-సుళ్ళు తిరుగుచు త్రెళ్ళుపొగలకు, -**
**భయము విడి రొమ్మిచ్చి నిలుతువు -**
**భాయి! సైనిక కులమణీ! ...**
**సూర్య చంద్రులు వాయు జలములు -**
**కాల దేవత లోషదులు నిను**
**పృథివిలో కాపాడుదురుగా -**
**భాయి! సైనిక కులమణీ!"**

ఆలోచనాపరులకు *మిశ్రమమంజరి* కావ్యంలోని కవితలన్నిటిలోను ఏదో ఒక విశిష్టత గోచరించక మానదు. ఆచార్యుల వారు తమ మున్నుడిలో పేర్కొనినట్లు ఈసంకలనములో అన్ని రుచుల కవితలు పొందుపరచ బడ్డాయి. వాటిలో నాకు తీయని అనుభూతిని కలిగించిన కొన్ని ఖండికలలోని విశేషాలను నాదైన పద్ధతిలో పాఠకుల ముందుంచడమైనది. విజ్ఞులైన పాఠకులు సహృదయంతో స్వీకరిస్తారని ఆశిస్తాను. నా అవగాహనలోని కొఱతను తమ, తమ భావనా పటిమతో పూర్తి చేసుకొనెదరని నా నమ్మకం.

ఆచార్య రాయప్రోలువారి కావ్య వివరణ, విశ్లేషణా ఎవరు ప్రయత్నించినా అది రాయప్రోలు వారి "అమలిన శృంగార తత్త్వమును" స్పృశించకుండా పూర్తికాదు. అందుచేత ఈ వివరణాత్మక వ్యాసంలో సహితము ఆ విషయమై కొంత చర్చ ఆవశ్యనీయమని, ఆ తత్త్వమును గూర్చిన వివరములు పొందుపరచడమైనది. రస వికాసమునకు కరుణ శృంగార రసములు రెండే సమర్థములని రాయప్రోలు వారి అభిప్రాయం. పూర్వానందా స్వాదమునకు శృంగార రసము, మనోదోష శుద్ధికి కరుణ రసము ఉపయుక్తములని వారి భావము. రాయప్రోలువారు ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించుటకు రెండు కారణము లూహకందుచున్నవి.

**ఒకటి:** ప్రబంధ కావ్యములలో ప్రాయికము (తరుచు) గా స్త్రీ భోగ్య వస్తువుగా చిత్రింపబడినది. కచ, కుచ వర్ణనలతో కవులు తృప్తి పడక నాభిని, నూగారును, వళు లను గూడ వర్ణింపసాగిరి. ఈ విధముగా స్త్రీని కేళీ వస్తువుగా పరిగణించుట రాయప్రోలువారికి బాధాకరముగా తోచినది.

**రెండవది:** ఆనాటి సమాజమున అప్పుడప్పుడే ఆంగ్ల విద్యా నాగరికతల సంపర్కము వలన నూతన భావములు వీవసాగినవి. "కాలేజి విద్యల" వలన యువతీ యువకులు పరస్పరము చూచుకొనుటకు, కలసి తిరుగుటకు వీలు చిక్కినది. వారు ఒకరి నొకరు ప్రేమించు కొనసాగిరి. సమాజములో ప్రాచీన విశ్వాసములింకను పెళ్ళగిల్లి పోలేదు. నవీన భావములు స్థిరపడలేదు. ఒక విధముగా ప్రాచీన, నవీన భావములు ఘర్షణ స్థితిలో ఉన్న సంధి యుగమది. ఈ స్థితిలో యువతీ యువకుల స్వచ్ఛంద ప్రేమ ప్రతి ఘాతములకు దారితీసినది... ఈ విధముగా నాటి సమాజములో ప్రేమ సిద్ధాంతము వలన కలుగుచున్న దుష్పరిణామాలను గమనించి రాయప్రోలు వారు దానికి పరిష్కారముగా 'అమలిన శృంగార' తత్త్వమును, వియోగాధిక్యమును సిద్ధాంతీకరించిరి (సి.నా.రె.). స్త్రీని కేవలము భోగ్య వస్తువుగా చిత్రించిన ప్రాచీన వ్యవస్థను అదుపులో పెట్టుటకే 'అమలిన శృంగార' సిద్ధాంత ప్రతిపాదన జరిగినది.

ఆచార్య రాయప్రోలు సంభోగ శృంగారము అప్రధానమని పేర్కొనినప్పటికీ, స్త్రీని తక్కువగా చిత్రించ లేదు. మీదు మిక్కిలి స్త్రీని పురుషుని కంటే ఒక్క మెట్టు ఎత్తుగానే సూచించారు. రాయప్రోలువారి దృష్టిలో ప్రకృతికి

ప్రతినిధి స్త్రీ. ఆమె అవస్థా భేదమును బట్టి ప్రేయసిగా, ఇల్లాలుగా, భగినిగా, సహచారిగా, జననిగా రూపొందునని, "పురుషవృషభము" ల అంతరంగములను మసృణీకరించునది స్త్రీయే యని రాయప్రోలు వారి విశ్వాసం. వారి కావ్యములలో నాయికా, నాయకులు సమాన స్థాయిలో నుండి స్నేహము నెరపినారు.

అందుకే –

**కనుల నొండొరులను జూచుకొనుట కన్న**
**మనసు లన్యోన్య రంజనల్ గొనుట కన్న**
**కొసరి "యేమోయి" యని పిల్చుట కన్న**
**చెలుల కిల మీద నేమి కావలయు సఖుడ.**

అనిపిస్తారు తృణకంకణ నాయిక చేత.

"రాయప్రోలువారు శృంగారరస తత్త్వాన్ని అభినవంగా దర్శించారు. వారు శృంగారానికిచ్చే అన్వయం వేరు. కామం వర్తిస్తే అది పాశవికావస్థను దాటలేదు. సంతతి కోసం స్త్రీ పురుషులు దాంపత్యాన్ని భరిస్తారనేది ధర్మ సూత్రం. దంపతుల మధ్య చిరస్థాయిగా నిలిచే స్నేహం స్థాయిగా వర్తిస్తుంది." అని రాయప్రోలు వారు తమ దర్శన వివేచనాన్ని వివరించారు. అదే, అమలిన శృంగారం. సూక్ష్మంగా పరిశీలిస్తే, తాత్వికత, సంప్రదాయం, రాయప్రోలు వారి కవితకు ఆధారాలు. నవ్యత జీవం. అమలిన శృంగార సిద్ధాంతం శరీరం. సంప్రదాయ కవిత్వ పద్ధతులను గౌరవిస్తూనే, తమదైన నూతన మార్గాన్ని తామే నిర్ణయించుకొనినారు. వారివెంట ఎందరినో నడిపించారు. మిశ్రమమంజరి కావ్యంలోని వారి కవితా సౌరభాలను ఆఘ్రాణించ వలసినదిగా పాఠకులకు అభ్యర్థన.

**రాయప్రోలు రచనా వైశిష్ట్యం :**

రాయప్రోలు సుబ్బారావుగారు తమ రచనలన్నీ ఒకానొక పద్ధతి ననుసరించి వ్రాశారు. ఒక్కో కావ్యం, ఒక్కో ప్రేమ లక్షణాన్ని మనసులో ఉంచుకొని వ్రాయబడినది. వారు దర్శించిన ప్రేమతత్త్వ స్వరూపాన్ని వస్తువుగా గ్రహించి, కథాకథన శిల్పానికి ప్రాముఖ్యత నివ్వక, సంక్షిప్త పద్ధతిలో వీరు రచనలు సాగించారు. రాయప్రోలువారి కావ్య ఇతివృత్తాలు అధికంగా సామాజికాలనే చెప్పవచ్చు. వీరిని కదిలించిన అనుభూతులు, సంఘటనలూ, సన్నివేశాలు, అన్నీ వీరికి కవితా వస్తువులే! ఈ విధంగా వస్తు వైవిధ్యానికి, వస్తు నవ్యతకు ఉదాహరణలుగా నిలుస్తాయి వీరి కావ్యాలు. వీరి రచనావిధానం, భావ వ్యక్తీ కరణ, భాష, వాడిన ఉపమానాలు అన్నీ ప్రత్యేకత కలిగి ఉంటాయి. "రాయప్రోలు కవిత్వంలో కీలకం వక్రోక్తి. రాయప్రోలు తొలకరి ఉరుములు తెలుగు మీద వెదజల్లిన రాగరాగిణీల్లో తడిసి తెలుగు కవిత్వ భాషా స్వరూపమే మారిపోయింది" అంటారు శేషేంద్ర శర్మగారు. "...సమస్త శబ్ద జాలమూ లక్షణా శక్త్యావిర్భావమే. లేకపోతే కన్నె విరులు ఎలా సమర్తాడతాయి? వెన్నెలలు ఎలా నిద్రిస్తాయి? ఉషస్సు ఎలా పుష్పిస్తుంది?" ఈ పంక్తులన్నిటిలోను జన వ్యవహార ప్రసిద్ధార్థ వ్యతిరేకముగా శబ్దమును ప్రయోగించుట, తద్విధ ప్రక్రియా వైచిత్రి కారణముగా శబ్దమునందు అయస్కాంత శక్తిని ఉత్పాదన చేయుట అనే విశిష్ట కళా వ్యవహారముంది!" (శేషేంద్ర శర్మ)

వస్తువును ఎన్నుకొనుటలోనే కాక, కావ్యానికి పేరు పెట్టుటలో కూడా, కొత్త దనాన్ని కనబరచారు రాయప్రోలు వారు. కావ్యాలలోని ముఖ్య పాత్రలు గాని, సంఘటనలు గాని కావ్యాలకు పేర్లు (శీర్షికలు)గా వాడుట ఇదివరలో సాంప్రదాయం. అందుకే 'తృణకంకణం', 'జడకుచ్చులు' లాంటి పేర్లు కొత్తగా అనిపిస్తాయి. అలాగే, కావ్య పాత్రలకు పేర్లు పెట్టకుండా, కావ్య రచన చేయడం సాహిత్య జగత్తులో మొట్ట మొదట ప్రారభించిన వారు రాయప్రోలు వారే నెమో? కావ్యారంభము కూడా నూతన ఫక్కీలోనే మొదలెట్టారు. సాధారణంగా ఆంధ్ర సాహిత్య సాంప్రదాయం ప్రకారం కావ్యాన్ని ఇష్టదేవతా స్తుతితో ప్రారంభిస్తారు. ఇందుకు భిన్నంగానే 'సుగుణాలవాల' అనే పదజాలంతో ప్రారంభిస్తారు తమ తొలి కావ్యం 'లలిత'ను రాయప్రోలువారు.

రాయప్రోలువారి రచనకు కొత్తదనాన్ని కలిగించి నవి వారి భావాలు. భావనారీతిలో కొత్తదనం 'మిశ్రమమంజరి' కావ్యంలోని కవితా ఖండికలైన 'పెండ్లి లగ్నం', 'నవరాత్రి', 'మంగళమాఘమ్' మరియు 'ఏడుపూలు' మొదలగు వానిలో స్పష్టంగా కనబడుతుంది.

**వెండి లాంతరు వెలిగించి వెడలె రజని –**
**ఒడలు తెలియక నిదురించుచున్న జీవ**
**కోటి నరసి కాపాడ – పక్షులను బోలె –**
**చెట్లు నన్ కదలవు సొమ్మ సిలిన యట్లు**
**నీల గిరులను బట్ట బయలున –**
**పెరుగు ముద్దలు పంచు శారద**
**కవి కులంబుల కామెతలుగా –**
**అందుకొను డిరు సందెలన్**
**జున్నుగడ్డల భంగి చుక్కల –**
**వెన్నెలను పెరుగన్న మట్టుల –**
**మ్రింగె దయ్యము వంటి చీకటి – జడలు విడ మిట్టాడుచున్.**

పైన ఉల్లేఖించిన కవితలలో గమనించదగిన విశేషాలు: "చంద్రుని లాంతరుగా భావన చేయుట కొఱకు 'రజని' అన్న స్త్రీ లింగ శబ్దాన్ని ప్రయోగించి, కవిగారు దానికి మరింత సౌందర్యాన్ని ఆపాదించి అభిసారికను స్ఫురింప జేయుట! వెన్నెలను మన పూర్వ కవులెందరో వర్ణించారు కాని, "పెరుగన్నంగా భావించిన వారు లేరేమో?! ఆ విధంగానే ఈ క్రింది కవిత పరికించండి

**మొగ్గ నవ్వి తెక్కలు విచ్చు - పొట్ట పగల**
**నవ్వి శుక్తి ముత్యంబులన్ రువ్వు - చెట్లు**
**నవ్వి లేత కెంపుల వాయసంబు లెత్తు**
**శబ్దములు నవ్వి అర్థకోశముల తెరచు.**

సామాన్యుని దృష్టికి, కవి దృష్టికి హస్తిమశ బేధమున్నది. అదే, కవి భావనా పటిమ. సామాన్యునికి అత్యంత మామూలుగా గోచరించిన విషయాన్ని మహాకవి తన కల్పనా చాతుర్యముతో అత్యంత మనోహరంగాను, రసవత్తరంగాను చిత్రిస్తాడు. మొగ్గ విచ్చి పువ్వుగా మారడం, చెట్లు చిగురు తొడగడం, శబ్దం అర్థాన్ని స్ఫురింపజేయడం లాంటి దృశ్యాలను 'నవ్వడంగా' భావనచేసి చమత్కరించడం కవి ప్రజ్ఞా పాటవాలను, భావవైశిష్ట్యాన్ని వ్యక్తపరుస్తుంది! అలాగే, మిశ్రమంజరి కావ్యంలోని "కోయిల" అనే కవితా ఖండికలో-

**మావి కన్నె రికమే మరులు గొల్పెనొ నిన్ను**
**నీ పిలుపుతో మావి నిలువెల్ల పూచెనో - వచ్చావె కోకిలా -**

అన్న మాటలు రాయప్రోలు వారి ఊహాశక్తిని తెలియజేస్తాయి. మిశ్రమమంజరి కావ్యములోని 'కృష్ణాష్టపది' అనే ఖండికలో -

**అజు సృష్టి కంటె కవిత -**
**ల్లజు శిల్ప సృజన విలస దలంకృతమై ఆ**
**రజ మగు నంటివి దువ్విన-**
**నిజ కుంతలములు జడ రమణించెడి కరణిన్**

అంటారు మహాకవి. రాయప్రోలు వారు ప్రయోగించిన ఉపమానములు అతి సాధారణ విషయాలకు సంబంధించి నవి. అందువలన అవి సామాన్య పాఠకులకు విషయ స్వరూపాన్ని స్పష్టపరచేందుకు సహకరిస్తాయి.

అదే విధంగా, ఉపమానాన్ని ప్రధానం చేసి చెప్పడం, ఉపమాలంకారాన్ని ప్రయోగించడంలో రాయప్రోలు వారు అనుసరించినది కొత్త పద్ధతి. ఆ విషయాన్ని వారే స్వయంగా చెప్పారు. "ఉపమేయాన్ని చెప్పకుండా ఉపమానాన్నే ప్రధానం చేసి చెప్పాను ... తెలుగు కవిత్వంలోకి ఈ విధానాన్ని తెచ్చింది నేనే" పైన పేర్కొనిన సందర్భానికి ఉదాహరణంగా మిశ్రమమంజరి కావ్యం లోని 'బ్రహ్మముడి' కవితలోని ఓ ఖండికను ఉల్లేఖించడమైనది.

**పడుచు కరి యావులను పిండిన -**
**పాలు పోయుచు కలువ కడవల**
**పంచదారను పంచ వచ్చెను -**
**చందమామ జగంబునన్**

ఈ కవితలో మనం పాల వంటి వెన్నెలను నల్లని ఆవు వంటి ఆకాశాన్ని, ఉపమేయాలుగా అర్థం చేసుకోవాలి. ఆచార్య రాయప్రోలు వారు వాడిన కావ్య భాషలో నవ్యతా - సాంప్రదాయకతా రెండూ మిళితమై వాడబడినవి. వీరి కవితా శైలి ఒకప్పుడు సరళంగాను, మరొకప్పుడు అతి గంభీరంగాను కనిపిస్తుంది. ఈ రెండు లక్షణాల సమ్మేళన మే రాయప్రోలు వారి ప్రత్యేకత. ఈ విషయం నిరూపించుటకు మిశ్రమమంజరి కావ్యంలోని 'బ్రహ్మముడి', 'విజయదశమి' వంటి కవితలను పేర్కొన వచ్చును. పైన వివరించిన విధంగా రాయప్రోలు సుబ్బారావుగారి రచనా వైశిష్ట్యాన్ని గూర్చిన చర్చకు మిశ్రమమంజరి కావ్యం నుండి అనేక కవితలను ఉ దహరించవచ్చు.

"రాయప్రోలు వారి కవిత్వాన్ని గురించి ఒక్క మాటలో చెప్పాలంటే - ఆయన పద్యాలే మంత్రాలుగా జపించు కొంటూ వాటి మధ్య మాధురిలో మునిగిపోయి, మళ్ళీ పునర్జన్మ లేనట్లుగా మనిషి తరించి పోవచ్చు" అంటూ శేషేంద్ర శర్మ గారి మాటలతో ఈ వ్యాసాన్ని ముగిద్దాం!

**కృతజ్ఞత :** ఈ వ్యాస రచనకై అనేక సుప్రసిద్ధ రచయితల రచనలు పరిశీలించుట జరిగినది. కొందరి భావజాలం నన్ను అత్యంత ప్రభావితం చేసింది. కొందరిని అనుకరించాను కూడా! ఆయా మహారచయితలకు ఎంతో ఋణపడి యున్నాను. ఇందు మూలంగా వారందఱికి నా కృతజ్ఞత వ్యక్త పరచడమైనది. మిశ్రమమంజరి కావ్యం ఎంత ప్రయత్నించినా లభ్యం కాలేదని నా చిరకాల మిత్రులు డాక్టర్ వెలగా వెంకటప్పయ్యగారి సహాయం అర్థించాను. సుహృద్భావంతో, సహృదయంతో వారు నా అభ్యర్థనను మన్నించి, శ్రమ పడి ఒక Xerox Copy సాధించి నాకంద జేశారు. వారికి నా కృతజ్ఞతా పూర్వక నమస్సులు.

ప్రొఫెసర్ రావినూతల సత్యనారాయణ
ఫోన్ : 9618524702

# అనుభూతి పార్శ్వం

– మాదిరాజు రంగారావు

**ఇది** వైయక్తికతలంపై అనుభూతి ప్రధానంగా రూపొందింది. కళాత్మకంగానో, మనోవిశ్లేషణగానో, అనుభూతి ప్రత్యేకతను కలిగింది. దీనిలో ఒక విధం, ప్రాధాన్య వివక్షచేత తాత్త్వికస్పర్శతో మానసిక ప్రపంచాన్ని ప్రతిబింబించేదిగా కనిపిస్తుంది. వేగుంట మోహనప్రసాద్ కవిత్వంలో దీన్ని గమనించవచ్చు. మనోభూమిక మానసిక చిత్రణ కలిగింది. దీనికి ఇస్మాయిల్, కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ, అజంతా, సుమనశ్రీ, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, సౌభాగ్య మొదలైన కవుల కవిత్వంలో ఒక్కొక్క ప్రత్యేకతతో కన్పిస్తుంది. మరో విధం సాధారణమైన సామాజిక స్పర్శతో, కేవలం కాల్పనికమైన భావజగత్తును కలిగింది. దీనిలో స్పందనం వివిధ స్థాయిల్లో భావరూపం ఆధారంగా రూపొందుతుంది. బాలగంగాధర తిలక్ కవిత్వం స్థూలంగా ఈ విధానానికి చెందిందిగా కన్పిస్తుంది. వైయక్తికతలం నుండి కళాత్మక రూపానికి ప్రాధాన్యం ఇచ్చే అనుభూతి సాంద్రత వల్ల ప్రత్యేకమైన ఆకర్షణ కలిగింది. ఈ కారణంగా భావకవిత్వచ్ఛాయలు కన్పిస్తాయి.

వైయక్తిక పార్శ్వంలో వ్యక్తి స్వేచ్ఛ కేంద్ర బిందువు. నిర్నిరోధమైన స్వేచ్ఛాగుణంతో భావరూపాలు సూక్ష్మదశల్లో అర్థాంతరాన్ని అనుభవంలోకి తెస్తాయి. పదపదంలో, వాక్య వాక్యంలో సాధారణేతరమైన అర్థస్ఫూర్తి అనుభూతమవుతుంది. ఒక్కొక్కపుడు మార్మికతను పొందడం జరుగుతుంది. జీవితంలో వాస్తవాంశం, సూత్రప్రాయంగానో స్పర్శామాత్రంగానో ఉంటుంది. అంతరమైన వేదన అనుభవానికి వస్తుంది. ఇది సమాజం గురించి కావచ్చు, వ్యక్తి జీవితంలోది కావచ్చు, మానసిక స్థితి గురించి కావచ్చు. కవుల వ్యక్తిత్వాల వల్ల వివిధ ప్రత్యేకతలతో ఒక్కొక్కరి నుండి ఒక్కొక్క విధంగా, ఒకే విధమయినప్పటికీ సమయసందర్భాల్ని బట్టి వైవిధ్యంతో ఆవిష్కృతం కావడం గమనించవచ్చు. తెలుగు స్వేచ్ఛాకవిత్వంలో అతినవ్యతను పొందిన సోపానక్రమంలో ఈ పార్శ్వం పేర్కొనదగిందే కాక, ఇంకా విపులంగా సమాలోచన చేయదగింది. కొందరు ఒకటికన్న ఎక్కువ పార్శ్వాల్లో విశ్లేషణకందే కవిత్వం వ్రాసినవారూ ఉన్నారు.

అనుభూతి పార్శ్వంలో ఆధునిక జీవిత గమనంలో, యాంత్రిక వాతావరణానికి భిన్నంగా, కాల్పనిక వాతావరణం సృజింపబడుతుంది. మానసికమైన మూలరూపం గుర్తుకు వస్తుంది. రాజకీయధోరణులు, సామాజిక విశ్లేషణం, వాటి చిత్రణ కన్నా వైయక్తికమైన అనుభూతిదశలు కళాత్మకంగా మలచబడి కవితారూపం సిద్ధిస్తుంది. ఇందులో ఏకాంత ధోరణి సూత్రప్రాయంగా ఉండేమాట నిజమే. కాని ఇది వ్యక్తిలో బలహీనతలవల్ల ఏర్పడింది కాదు. సామాజిక స్పృహ కూడా అంతో ఇంతో ఉంటుంది. అయితే ప్రధానమైన పాత్రను నిర్వహించదు.

ఈ కవుల దృష్టిలో, కవిత్వంలో ప్రధానమైన పాత్రను నిర్వహించే అంశాలు వేరు. సిద్ధాంతాలకూ, రాజకీయమైన, సామాజికమైన అభిప్రాయధోరణులకూ, భిన్నమైన ఆలోచనా రూపం కన్పిస్తుంది. మనోగతమైన అనుభూతి స్పందనతో భౌతికేతరాలైన ప్రపంచంలోకి తీసుకెళ్ళే భావరూపనిర్మితి కన్పిస్తుంది. అజంతా మాటల్లో "సాహిత్యానికి సిద్ధాంతపరమైన కాలుష్యం అంటరాదు. ఈ సిద్ధాంతం ఏ సామాజిక, రాజకీయ సాహిత్య మార్గాలకు చెందిందైనా కావచ్చు. ఈ పార్శ్వం, కవిలో ప్రసరించే స్వేచ్ఛను పురస్కరించుకొని ప్రవృత్తమైంది. వ్యక్తిగతమైన అనుభూతి ప్రపంచం సాధారణీకృతమై, రచనలో విశ్వజనీనత్వాన్ని పొందుతూంది. మనిషీ, ప్రకృతితో స్పందన అనుభూతి గుణంతో పాటు సౌందర్యభావన ఇందులో కళాత్మకతను పొందుతుంది. సృజనరూపం, వేదన, చింతన అంచుల్ని స్పృశిస్తుంది. ఒక్కొక్క అనుభూతి కవిలో ఒక్కొక్కవిధంగా ఆవిష్కృతం కావడం సహజం. కవుల్లో ఆత్మప్రత్యయంతో పాటు, తమ అస్తిత్వం పట్ల శ్రద్ధకూడా కన్పిస్తుంది. కొందరు కవుల వ్యక్తిత్వాల్లో వైయక్తిక పార్శ్వంతో పాటు, సామాజిక పార్శ్వమూ లేకపోలేదు. అయితే వైయక్తిక ప్రభావం సామాజిక పార్శ్వాన్ని కప్పేస్తుంది. బాల గంగాధర్ వ్రాసిన కొన్ని రచనల్లో సామాజిక పార్శ్వం స్ఫుటత్వాన్ని పొందడమూ కన్పిస్తుంది.

ఈ కవుల్లో మొత్తం మీద వస్తువుపై కన్నా దాని విస్తరణరూపంపై కన్నా అభివ్యక్తిపై మనోజగత్తుపై శ్రద్ధ గమనించవచ్చు. శబ్దార్థ ప్రపంచం నుండి, భావనా రూపం వరకూ అనుభూతి ప్రత్యేకతను కలిగి ఉంటుంది. వ్యక్తి చైతన్యం రెండు దిశలుగా ప్రసరిస్తుంది. ఒకటి బహిర్ముఖం, రెండు అంతర్ముఖం. అయితే, ఈ కవిత్వంలో అంతర్ముఖం

రూపుదిద్దుకుంటుంది. జీవితంలో సమస్యను భౌతికేతర దృష్టితో పరిశీలిస్తుంది. ఆదర్శం మానసిక స్థాయిలో అనుభూతిగతంగా నిలుస్తుంది. కొన్నిటిలో ప్రకృతిని భూమికగా చేసుకున్న జీవిత చిత్రణం కనిపిస్తుంది. కొన్నిటిలో సంస్కరణమూ, జాతీయవాదమూ జోడింపబడి కాల్పనిక కవిత్వచ్ఛాయల్ని స్మరింపజేస్తుంది. కొన్నిటిలో జీవితంలో మానసికమైన బాధ, చింతన, వేదన, విషాదముద్రలతో చిత్రపరంపర దృష్టికి వస్తుంది. కేవలం 'కళ కళకోసమే' అన్న వాదానికీ దీనికీ సంబంధం లేదు. తెలుగులో ఈ కవిత్వంలో మనస్తత్వ చిత్రణం, సౌందర్యభావన, కళాదృక్పథం, మానవతాస్పృహ మొదలైన వివిధాంశాల మేళనంతో రూపొందిన వైవిధ్యంతో ఈ కవుల ప్రత్యేకతలకద్దం పడుతూంది. స్థిరమైన అస్తిత్వమూలాన్ని భావింపజేస్తుంది. మొదట్లో ప్రయోగాత్మకాలుగా కన్పించినా, ఆ తరువాత కవుల ప్రతిభచేత ఒక పరంపరగా ఏర్పడింది.

వ్యక్తి స్వేచ్ఛ కారకమైన పాత్ర వహించే ఈ కవిత్వంలో భావరూపం ఒక ఆకర్షణ. అభివ్యక్తిలో మానసిక ప్రపంచం విశ్లేషితమవుతుంది, బింబితమవుతుంది, చిత్రితమవుతుంది, వివృతమవుతుంది. ఆధునిక కవిత్వంలో ఈ ధోరణి అంతరమైన రూపాన్ని సంతరింపజేసింది. మనస్తత్వశాస్త్రానికి పని కల్పించింది.

వేగుంట మోహనప్రసాద్ *చితి-చింత, రహస్తంత్రి* మొదలైనవి జ్ఞాపకం వస్తాయి. 'ఎక్కడ మాత్రమేముంది? హృదయం లేని పర్వతాలూ, నదులూ, అరణ్యాలూ,' సమాజంలో నెలకొన్న దుస్థితి ప్రకృతిపరమైన దృశ్యభూమికలో సూచితం. తాత్త్వికస్పర్శనూ కలిగింది. "ఈ ఆనందాలు నాకోసం కాదు". వ్యక్తి స్థాయి నుండి సామాజిక వలయాన్ని స్పృశిస్తూ విశ్వజనీనస్థాయిని భావింపజేస్తూంది. ఒక్కొక్కపుడు ఈ కవిత్వం మార్మికతను పొందుతుంది. వాస్తవరేఖ మరొకపుడు తాత్త్వికస్పర్శతో ఉన్నతీకృతమవుతుంది. ఆంతరమైన అన్వేషణ కన్పిస్తుంది. ఈ కారణంగా అస్పష్టతకు అవకాశం ఏర్పడుతూంది కూడా. స్వప్నం లేదా స్వప్నతుల్యమైన స్థితుల్లో దుఃఖం, సంతోషం, నిరాశ, ఆశ, వేదన, శాంతి ఇట్లా విడివిడిగానూ, సంకీర్ణంగానూ మానసికస్థితులెదురౌతాయి. వస్తువు కన్నా శక్తివంతమైన భావం, భావం కన్నా భౌతికేతరమైన స్థితి అనుభూతికి వస్తుంది. అక్కడక్కడా ఇది అధివాస్తవిక ధోరణికి సమీపంగానూ వర్తిస్తుంది. ఇది ప్రతీక. భావరూపం సహాయంతో కళాత్మకతను పొందడమూ కన్పిస్తుంది. ఈనాటి సమాజంలో ఎదురయ్యే భౌతిక జీవన సంక్లిష్టతను ప్రతిఫలిస్తూ, వ్యక్తిలోని తాత్త్వికతను స్పృశిస్తూ, వ్యక్తి స్వేచ్ఛకు పట్టంగట్టే అస్తిత్వకళాత్మకమైన అనుభూతి పార్శ్వం, వేగుంట రచనల్లో ఆలోచనకందుతుంది.

ఇస్మాయిల్ *చెట్టు నా ఆదర్శం, మృత్యువృక్షం, చిలుకలు వాలిన చెట్టు, రాత్రివచ్చిన రహస్యపు వాన, బాల్చిలో చంద్రుడు కృతులు,* అనుభూతి పార్శ్వంలో రెండో విధానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. సత్యశ్రీమన్నారాయణ, సుమనశ్రీ, సౌభాగ్య, శ్రీకాంతశర్మ, గోదావరిశర్మ మొదలైన కవులీమార్గంలో తమ తమ ప్రత్యేకతలతో ఎదురౌతారు. వీరి కవిత్వంలో మానసిక ప్రపంచం, ప్రకృతిపరమైన భౌమికలో, సుకుమారమైన భావస్పందనలతో సాక్షాత్కరిస్తుంది. ఇది వీరు పుట్టి పెరిగిన వాతావరణాన్ని విశ్లేషణలో తలపుకు తెస్తుంది. బాహ్యజగత్తులోని జీవనవాస్తవం వెనుక నుండి, తాత్త్విక రేఖలు అవగతికి వస్తాయి. ఇస్మాయిల్, 'నాకు కావలసింది హృదయస్పర్శి అయిన కవిత్వం, ఇది ఎవరు వ్రాసినా ఆనందిస్తాను. నాకు మార్క్సిజంపై కోపం లేదు' – ఈ కవి మాటలు, సహనాన్నీ ఆత్మప్రత్యయాన్ని సూచిస్తాయి. ఇది ప్రజాస్వామ్యానికనుగుణమైన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. సాధారణతల నుండి పైకెదిగిన మానసిక శిఖర రూపం ఈ కవుల్లో దర్శనమిస్తుంది. ఇక ఇస్మాయిల్ కవిత్వానికి వస్తే, 'గడియేని ఆగని సూర్యుణ్ణి గడియారపు బాహువులు బంధిస్తాయి / దివిలో ఊగే విహంగాన్నీ, భువిలో పాకే పురుగు బంధిస్తుంది / ఈ మనిషి ఆ మనిషిని బంధిస్తాడు, ఇవన్నీ కలిపి బంధిస్తుంది మనీష' ఈ భావ చిత్ర పరంపర కాలాన్నీ, జీవనగమనాన్నీ, స్వేచ్ఛనూ, దాని పరిమితుల్నీ రూపిస్తూ మనిషి విశిష్టతనూ 'మనీష' ప్రాముఖ్యాన్నీ ప్రకటిస్తుంది. సూర్యుడు కాలానికి సంకేతం. కాలం ఆగేది కాదు. కాని వ్యవహారదశలో గడియారం ముళ్ళు దీన్ని నిలిపేస్తాయి. ఆకాశంలో పక్షి ఎంత ఎత్తులో, ఎంతసేపు ఎగిరినా ఆహారంకై నేలపైకి రావలసిందే, విశ్రాంతికై క్రిందికి దిగవలసిందే. తన ఇష్టంతో నిమిత్తం లేకుండానే కాలం నిలపబడుతుంది, అవసరాలకు పక్షి క్రిందికి దిగక తప్పదు. ఎన్నో పరిమితులు కలిగిన వాస్తవరేఖ పైకి రాక తప్పదు. అయితే మనిషిలో 'మనీష' పరిధి దీనికన్న విస్తృతమయింది. ఇట్లా కొన్ని అంతరువుల పరంపరతో, భావన, తాత్త్వికస్పర్శనను పొందుతూంది. స్థూలంగా జీవనరూపం వస్తువుగా మెదలుతుంది. అమూర్తస్థితి నుండి మూర్తస్థితికి తీసికొని రావడంలో కవి ప్రత్యేకత ఉంది.

ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛా మనోజగత్తుకు ప్రతీక అజంతా కవిత్వం. ఈ విధమైన కవిత్వంలో కేంద్రభూమి జీవితంలో విషమగతులకూ, అశాంతి స్థితులకూ స్పందించే మానసిక

ప్రపంచం. ఇది జీవితంలో బాధ, భయం, దుఃఖం, వేదన, అశాంతి, ఆలోచనలకు సంబంధించిన రేఖపై నిలుస్తుంది. విషాదస్థితి నుండి శబ్దతరంగాలు ప్రసరిస్తాయి. ఇది ఆధునిక జీవితంలో అశాంతినీ, ఆవేదననూ ప్రతిఫలింపజేస్తుంది. "బాధలో, దుఃఖంలో మండుతున్న గాయాలవలె ఉంటా నంటాడు'' కవి. ఇతని చుట్టూ కన్నీళ్ళతో మెరుస్తూన్న మనుషులు కన్పిస్తారు.

కవిత్వాన్ని ఒక స్వప్న క్రియగా, రహస్యక్రీడగా, మర్మక్రీడగా భావించే మనోరూప కవి అజంతా. ఇతని కృతి *స్వప్నలిపి* మనోగర్భం నుండి ఉద్గమించింది. అంతర్జగత్తులోని రహస్యరూపాల్ని ఆవిష్కరిస్తుంది. ఇది అధివాస్తవిక గుణంతోను చిత్రితమై కనిపిస్తుంది. తాత్త్విక స్పర్శతో ఉన్నతమై, అందని జీవితాన్ని భావింపజేస్తుంది. ఈ కవిత్వానికి ఒక చివర నుండి జీవిత వాస్తవ రూపం, మరో చివర నుండి జీవిత రహస్య రూపం నెలకొన్నాయి. ఇది నైరూప్యంగా ఆకర్షిస్తుంది. ఇవి ఒక చోట కలిసిన రూపం అనుభూతి పార్శ్వం, ప్రత్యేకతను కలిగింది. భౌతిక స్థితి వెనుక నుండి మనోదర్శనానికి ప్రాధాన్యమివ్వడం ఇందులోని ప్రత్యేకత అనవచ్చు. ఇదో కొత్తలోకంగా అనుభవానికి వస్తుంది. ఎప్పటికప్పుడు అడుగడుగునా అగమ్యంగా, అస్పష్టంగా, అగోచరంగా, అర్థరహితంగా, అజేయంగా కన్పించే జీవితాన్ని, మానసికమైన మెరుపు తీగెల వెలుగులో దర్శింపజేయడం ఇందులో విశేషం. ప్రతి మనిషిలో తన్ను అద్దంలో బింబంలా చూచుకోవడం ఈ కవికి మరీ ఇష్టం. ఇది సార్వజనీనమైన మానవదృక్పథం వైపు మరలిస్తుంది. 'చెట్లు కూలుతున్న దృశ్యంలో ఆశ లేదు, ఆస్కారం లేదు, ఫలానా రోడ్డు గమ్యం చేరుస్తుందనే సూచన ఎక్కడా కన్పించడంలేదు.' నిరుద్యోగి వెంకటరావు నడుస్తూన్నంతమేర అందమైన సాయంత్రం వేళ, నగరం అంతటా అపస్వరాలు, చెట్లు కూలుతున్న దృశ్యాలు కన్పిస్తాయి.

ఇందులో ఆధునిక జీవితం వ్యంగ్యం గర్భితంగా చిత్రితమైంది. వాస్తవానుభవానికి కవితాత్మకమైన భావరూపాలు జోడింపబడినాయి. ఇది బాధతో, విషాదంతో అలముకున్న యథార్థ ప్రపంచం. అజంతా కవిత్వం, దైనందిన జీవితంలో విషాద బీభత్సాల్ని చిత్రిస్తుంది. ఇది మానసికమైన భావవిన్యాసంతో అనుభూతి ప్రకంపనల్ని సృజించే శక్తి కలిగింది. ఇందులో, ఎడారిలో ఒంటరిమనిషే కన్పిస్తాడు. దుఃఖంలో మండుతున్న గాయం కన్పిస్తుంది. పతితుల ఆక్రందనమూ వినిపిస్తుంది. అంతటితో ఎట్టెదురుగ ప్రేమతో పైకి లేవనెత్తే కారుణ్య హస్తమూ కన్పిస్తుంది. ఇది విశ్వమానవరేఖలతో మనిషి బలహీనతల వెనుక నుండి బలమైన రూపమూ స్ఫురిస్తుంది. చివరి లక్ష్యం. ఆర్ద్రత, అనురాగం, అన్వేషణ, శాంతి, ప్రేమ ఆనందంగా పర్యవసించడం కన్పిస్తుంది. కవి సృజనశక్తిలో నిర్మాణాత్మక రక్తినీ స్ఫూర్తికి తెస్తుంది.

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ మనస్సు 'రంగుల చేప లోకపు ఉపరితలంపైకి మక్కువగా గిరికీలు కొట్టబోతే వాస్తవికత వలమీద పడుతుంది'. జీవితంలో తప్పించుకోరాని యథార్థానుభవం చిత్రితం. చేపకు చిరనివాసం జలం. అది సరస్సు కావచ్చు, నది కావచ్చు, సముద్రం కావచ్చు. అది అనుభూతిలో అస్తిత్వరూపానికి ప్రతీక. సుమనశ్రీ, "నా కవితాసామగ్రి అంతా ఒక మేఘశకలంలో నిక్షిప్తమై ఉంది" అంటాడు. మేఘశకలం ఆర్ద్రమైన, చైతన్యకారణమైన గతిశీలానికీ, గగనం మనోరూపానికీ ప్రతీకలు. ఈయన కవిత్వంలో అప్పుడప్పుడు అవచేతనలో పడియున్న వస్తువుల్ని పైకి తీసి చూపడమూ కన్పిస్తుంది. ఇది స్వప్నం లేదా స్వప్నతుల్యమైన స్థితినీ పొంది ఉండడం కద్దు.

సుమనశ్రీ విశిష్టమైన కృతి 'మహాస్వప్న', స్వేచ్ఛాకవిత్వంలో అనితరమైంది. ఇది స్త్రీభావన కేంద్రంగా, సౌందర్యం, వివశత్వం, రహస్యం, అద్భుతమనే దృక్కోణాల్లో దర్శితమైన అనుభూతి కావ్యం. ఇందులో భౌతికమైన మూర్తి తలం నుండి ఎగసి విస్తరించిన అనుభూతి పరంపర ఆవిష్కృతమైంది. భౌతికం, మానసికం, ఆత్మతలాలపై ఒక వలయం నుండి మరో వలయంలోకి భ్రమిస్తూ సాగింది. ఇది జీవితంలో వాస్తవ స్పర్శతో, కళారూపంతో, తాత్త్వికచ్ఛాయతో ప్రత్యేకతను పొందింది. పై మూడు తలాలపై స్త్రీ భావన ఒక దాని నుండి మరొకటి ఉన్నతీకృతమైంది. ఇందులో మనిషితో మనిషి చేసే ఆత్మ సంభాషణ మనస్సు లోతుల్ని స్పృశిస్తుంది. వైయక్తిక పార్శ్వంలోని సౌందర్యానుభవం, సాధారణీకృతమై విశ్వజనీనత్వాన్ని పొందుతూంది. *నేత్రం నా సంకేతం, రెప్పల మధ్య ఆకాశం* పేర్కొనదగినవి. నేత్రం నా సంకేతంలో నేత్రం, అసాధారణమైన వస్తు ప్రపంచాన్ని సమీపానికి తెచ్చే అనుభవ సాధనం. చెదిరిపోతున్న మనసులో నుండి కరగిపోతూన్న మనిషిలో నుండి 'నిశ్శబ్దంలోకి ప్రవహింపజేసే' స్వప్నపరిమళ సరోరూపం *మహాస్వప్న కావ్యం.*

కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ *వెలుతురు పిట్టలు,* వై. శ్రీరాములు *రంగులపక్షి* ఈ సందర్భంలో పేర్కొనదగినవి. వీటిలో ప్రతీకల వినియోగంతో నిర్మించిన అస్తిత్వంలో జీవితం దర్శితమైంది. ప్రకృతిపరమైన భూమికపై నిర్వహింపబడిన వస్తువు

భావరూపాల ప్రతీకల పరంపరలో వ్యాప్తమైంది. అనుభూతి కవిత్వంలో ఈ కృతులు రెండూ మైలురాళ్ళు. *వెలుతురు పిట్టలు* లో అడవి, ఆకాశం, చెరువు ఒక దాని సౌందర్యం ఒకటి ఆస్వాదిస్తాయి. ప్రకృతిపరమైన మూడు అంశాలు పరస్పర ప్రభావంతో ఏకరూపాన్ని పొంది, సౌందర్యానుభూతి కలిగిస్తాయి. 'నీటి ఆవిరిలా కొందరు పైకి లేస్తుంటారు. వర్షపుచినుకులా కొందరు కింద పడుతుంటారు. ఇవి మనిషి పొందే ఉత్థానమూ, పతనమూ ప్రకృతిలోని సాదృశ్య రూపాలతో సూచించే పద చిత్రాల్లో జీవితంలో భిన్న దశలూ స్ఫూర్తికి వస్తాయి. 'పైకిలేస్తున్నా, పతనమవుతున్నా, గుండెలోంచి అద్భుతమైన పాట బయటికి వస్తుంది'. జీవితంలో ఎటువంటి అనివార్య పరిస్థితులైనా ఎదుర్కొనే, అన్నింటినీ సమంగా తీసుకొనే, మనోరూపం పొందే అనుభూతి విశేషమే ఈ పాట. అనుభూతి పార్శ్వంలో కవిత్వం అందరిలో ఒకే విధంగా ఉండదు. ఇది సహజం కూడా. ఇది వాళ్ళ సృజనాత్మక శక్తినీ, అభివ్యక్తి శిల్పాన్నీ, ముఖ్యంగా జీవితాన్ని దర్శించే మానసిక వ్యక్తిత్వాన్ని బట్టీ భేదిస్తుంది. కవిత్వంలో వివిధాంశాలకిచ్చే ప్రాధాన్యాన్ని బట్టి రూపొందుతుంది. భావకవిత్వానికీ, అనుభూతి కవిత్వానికీ తేడా ప్రాధాన్యాన్ని బట్టీ రూపొందుతుంది. భావకవిత్వానికీ, అనుభూతి కవిత్వానికీ తేడా వుంది. భావకవిత్వం ఆత్మాశ్రయం, కాల్పనికం. అనుభూతి కవిత్వంలో మానవీయ స్పందనతో పాటు మానసిక చిత్రణంతో, ప్రతీకలతో రంజితమౌతుంది. అంతర్ముఖీనమైందీ, తాత్త్విక స్పర్శనను కలిగిందీ. ఇందులో సమాజం విస్తృతం కాదు. ఇది సర్థలమైన ఆకృతిరూపం మాత్రమే. తెలుగులో. ప్రజాస్వామ్యంలోని మానసిక స్వేచ్ఛ పొందిన కళారూపమే అనుభూతి పార్శ్వం. వెలుతురుతోపాటు చీకటినీ ప్రేమిస్తుంది. ఇది వ్యక్తి అస్తిత్వ మూలంగా వికాసరూపాన్ని పొందింది.

తిలక్ *అమృతం కురిసిన రాత్రి* ఈ సందర్భంలో ప్రత్యేకంగా మనముందు నిలుస్తుంది. తిలక్ మానసికంగా అనుభూతి వాది, సామాజికంగా మానవతావాది. 'నేనో మరి సమాజంలో స్థూలమైన ఆకృతిని ఊహా మరుత్తుని, ఏకాకిని' – ఇందులో ఏకాంతధోరణి ఉంది. దీనితోపాటు స్థూలతలంపై సామాజికావగాహన ఉంది. ఈతని కవిత్వం అస్తిత్వవాద ఛాయలతో "అగ్నిచల్లినా అమృతం కురిసినా అందం ఆనందం దాని పరమావధి" అంటాడు. ఇందులో కళాత్మకమైన అనుభూతి పార్శ్వం స్పష్టం. మధ్య మధ్య, ముఖ్యంగా చివరిదశలో వెలువడిన రచనల్లో గాఢమైన సౌందర్యభావనతో పాటు సామాజిక దృష్టి చోటు చేసుకుంది. ఇది మానవీయమైన విలువల్ని ప్రతిపాదిస్తుంది. "నా అక్షరాలు ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు, వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు". ఇందులో స్థూలమైన సామాజిక తత్పరత ఉంది. సౌందర్యభావన ఉంది. ఈ రెండూ అనుభూతి గుణంతో కళాత్మకతను పొంది శైలీరమణీయతతో ఆకర్షిస్తాయి.

దీన్ని మరోవిధంగా సాధారణీకృతం చేస్తే తిలక్ కవిత్వంలో రెండు పార్శ్వాలు 1. కాల్పనికం, 2. సామాజికం కన్పిస్తాయి. మొదటిదానికి *అమృతం కురిసిన రాత్రి, నువ్వులేక నీ పాట ఉంది.* రెండోదానికి *ఆర్తగీతం, ప్రార్థన, గొంగళిపురుగులు, తపాలాబంట్రోతు* మొదలైనవి నిలుస్తాయి. ఈ రెండో విధానికి చెందినవి, ప్రగతిశీల గుణంతో కూడిన మానవీయ చేతన కలిగినవీ, కవి సామాజిక స్పృహకు ప్రాతినిధ్యం వహిస్తాయి. "నా కవిత్వం కాదొక తత్త్వం మరికాదు మీరనుకునే మనస్తత్త్వం, కాదు ధనికవాదం, సామ్యవాదం, కాదయ్యా అయోమయం, జరామయం ఇట్లా వాదాలకూ, వివాదాలకూ, సిద్ధాంతాలకూ, తత్త్వాలకూ, ధోరణులకూ అతీతమైన అస్తిత్వాన్ని భావింపజేస్తుంది. ఈయన కవిత్వంలో ఆర్తీ, బాధ, కరుణ, రసప్లావితంగా హృదయాన్ని స్పృశిస్తుంది. "వర్ణ వర్గ మతభేద రాహిత్యం పునాదిగా' భావనా స్వాతంత్ర్యం, వ్యక్తి గౌరవం ప్రధానంగా ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛా సమానత్వాల్ని ఆకాంక్షించిన వైఖరి, తిలక్ అనుభూతి పార్శ్వానికాలంబమైన సామాజిక తలాన్ని భావింపజేస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ పట్ల ఆదరంతో మానవతను ప్రకాశమానం చేస్తూ కళాత్మకమైన తిలక్ అనుభూతి పార్శ్వం, స్వేచ్ఛాకవిత్వానికి ఎనలేని ప్రతిష్ఠను చేకూర్చింది. అక్కడక్కడా కాల్పనిక యుగానికి చెందిన భాష, శైలి, మర్యాద కన్పిస్తుంది. ఈయన కవిత్వం చిరంగా గుర్తుపెట్టుకోదగిందేకాక, స్థిరంగా నిలిచి ఉండేది. ఉదాత్తమైన స్థాయిలో అనుభూతి పార్శ్వంలో విశిష్టమైందీ, స్వేచ్ఛా కవిత్వానికి కీర్తికిరీటంగా వెలిసిందీ, మానవతా భావనతో కారుణ్యగుణంతో, అంతర్జాతీయ దృష్టితో కూడిన వ్యక్తిత్వం అనుభూతి హృదయానికి ప్రయోజన విస్తృతిని కలిగించింది. ఇదీ గొప్ప కవిలో అనుభూతి పార్శ్వంలో ప్రత్యేకంగా పేర్కొనదగిన అంశం. ఇది స్వేచ్ఛాకవిత్వంలో అనుభూతి పార్శ్వానికి వైవిధ్యాన్ని చేకూరుస్తుంది.

స్వేచ్ఛా కవిత్వంలో అనుభూతి పార్శ్వం, సమాజ వలయంలో వ్యక్తి బీజం నుండి ఉద్గమించింది. కాల్పనిక కళా తాత్త్విక మనోభావప్రపంచాల్ని దర్శింపజేస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో ఆకర్షణీయమైన పార్శ్వంగా స్థిరపడింది.

# ఆకాశవాణి : ఆచంట జానకిరామ్

ముందు ఏమవుతుందో మనకు తెలియదు. ఒక ఇరవై ఏళ్ళపాటు, ఈ జీవితాన్ని వింత వింత అనుభవాలతో నింపివేసి, వేలాది జనానీకానికి నిరంతర సంతోషాన్ని ఇచ్చే ఒక మహాకృషిలో పాల్గొనే అవకాశమిచ్చి, కవులతో, గాయనీ గాయకులతో, చిత్రకారులతో, మహారాజకీయవేత్తలతో పరిచయమూ వారిలో కొందరితో అనిర్వచనీయమైన ఆత్మీయత కలిగించిన 'ఆకాశవాణి' వ్యాసంగము నాకు లభిస్తుందని నేను నా ఇన్సూరెన్స్ ఉద్యోగము పోయినపుడు ఊహించనైనా ఊహించలేదు.

"మరి ఇప్పుడేమి చేయదలచుకున్నావు?" అని ప్రశ్నించాడు రావ్, నా చిరకాలమిత్రుడు, 1938, డిసెంబర్ నెలలో ఒకానొక రోజున, ఢిల్లీలో వారి ఇంట నన్ను.

రావ్ అన్నాడు : "కాదుగానీ, నాకో ఆలోచన తోస్తోంది. క్రొత్తగా వెలసిన ఆల్ ఇండియా రేడియో సంస్థవారికి నీవంటి వారు ఎంతైనా ఉపయోగపడవచ్చును. కంట్రోలర్ ఆఫ్ బ్రాడ్ కాస్టింగ్, లయొనెల్ ఫీల్డెన్, నాకు స్నేహితుడు. ఆయనను చూద్దాము, రా నాతో," అని.

బ్రిటిష్ ప్రభుత్వపు కట్టుదిట్టాలు ప్రబలంగా ఉండే రోజులవి. రావ్‌తో కలసి వెళ్ళబట్టిగాని, లేకపోతే నాకు కంట్రోలర్ దర్శనమై ఉండేది కాదు. కాని, రావ్ నన్ను వారికి పరిచయము చేసీ చేయడముతోనే ఫీల్డెన్ నన్ను కూర్చో నియమించి ఆప్యాయంతో పలుకరించారు.

నా వైపు చూస్తూ అన్నారు ఫీల్డెన్ : "నిన్ను ఆల్ ఇండియా రేడియో ఢిల్లీ కేంద్రంలో ప్రొబేషనరీగా తీసుకుంటాము. కాని, జీతము చాలా తక్కువ, ఏబది రూపాయలే. అంగీకారమేనా?" అని.

నేను వెంటనే అన్నాను : "నాకు చాలు, అసలు ఈ వ్యాపకము నాకు చాలా ఇష్టమైనది. ఇందు పాల్గొనాలని నాకు ఆసక్తి, అభిలాషా ఎక్కువ!" అంటూ, వారిని చూడటానికి బయలుదేరేముందు "భారతదేశములో భావి రేడియో విధాన వికాసము"ను గురించి వ్రాస్తూ ఇంటింటా రేడియో వెలసి భారతీయ సంస్కృతిని నేల నాలుగు మూలలా వ్యక్తపరుస్తూ అమల నిత్యజీవితాన్ని అద్భుతమైన ఆనందంతోనూ, విజ్ఞానంతోనూ నింపివేసే అవకాశం ఎంత ఉన్నదో వివరిస్తూ నేను వ్రాసిన చిన్న వ్యాసాన్ని వారిచేతికందించాను.

నా రచన పారజూచి మళ్ళీ ఆ అందమైన మందహాసంతోనే ఫీల్డెన్ అన్నారు : "ఎంతటి ఆశావాదివి నీవు అని.

ఫీల్డెన్ ఇచ్చిన కవర్ స్టేషన్ డైరెక్టర్‌కు ఇచ్చాను. ఆ కార్డ్‌పై వ్రాసిన మాటలను చాలా బిగ్గరగా చదివారు ఆయన:

"ఇతను, జానకిరామ్, మద్రాస్‌నుంచి వచ్చాడు. మీ స్టేషన్‌లో పని నేర్చుకునే అవకాశమియ్యవచ్చేమో చూడవచ్చు. జానకిరామ్ మనకు అక్కరకు వస్తాడనుకుంటాను, నేను,".... అని ఉన్నది.

ఆ రోజులలో ఆఖ్తరీబాయ్ పదహారేళ్ళ బాలిక. సుశ్రావ్యమైన కంఠస్వరము, ఆమెది. సౌజన్యశీలి, ఆమె. హిందూస్థానీ బాణీలోనే ఉన్నదేమో ఆ ఆర్ద్రత.... ఎంతో హృద్యంగానూ, మనోహరంగానూ ఒక్కొక్కమాటా ఒక్కొక్క భావమూ, పూర్తిగా అనుభవిస్తూ, గానము చేసేది ఆమె. ఉమ్రాజియా బేగమ్ లలిత సంగీతము పాడేవారు. ఆవిడ ప్రోగ్రామ్ ఉన్న రోజు ఉదయం ఒక నూరు టెలిగ్రాములూ, ఉత్తరాలూ వచ్చి ఉండేవి. ఆమెను "మేరీ సలామ్ లేలేవ్!" అనే పాట పాడమని కోరుతూ, శ్రోతలవద్దనుంచి. అద్భుతమైన భక్తి రసానందము కలిగించేది, ఆ చిన్నపాట. మక్కా ముసల్మానులకు అతి పవిత్రస్థలము. మక్కాను సందర్శింప కలిగితే జన్మతరించినట్టే! మక్కా సందర్శనము జీవిత పరమావధి వారికి. తాను స్వయంగా ఆ యాత్రపై వెళ్ళలేని ఒక భక్తుడు, ఆ వెళుతూన్న ఒక ఒంటెలను తోలు వానిని ప్రాధేయపడుతూ అనే మాటలు అవి : ''దయ

ఉంచి నా సలాములు తీసుకువెళ్లు, మక్కాకు!" అని. ఈ 'సలామ్ పాట' రేడియోలో ఉమ్రాజియా బేగమ్ వినిపిస్తూంటే, ఇళ్ళల్లో, వీధుల్లో ఉన్న వేలకు వేల జనం అట్టే ఆగి వినేవారు. కొందరు కన్నీరు రాల్చేవారు కూడా, భక్తిపారవశ్యంచేత. అంతటి అనుభూతిని కలిగించేది, ఉమ్రాజియా ఆ పాట ద్వారా.

నేను పనిలో ప్రవేశించిన మూడవనాడే ఆల్ ఇండియా రేడియోవారు దక్షిణ ప్రాంతాలకు ప్రత్యేక ప్రసారం ప్రారంభించారు. ఢిల్లీ కేంద్రమునుంచి, భారతీయ బ్రాడ్ కాస్టింగ్ విధానంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమన్నమాట.

సాయంత్రం సరిగ్గా ఆరున్నరకు, నేను మైక్రోఫోన్ ఎదుట కూర్చుని అన్నాను : "ఆల్ ఇండియా రేడియో, ఢిల్లీ కేంద్రము, దక్షిణ ప్రాంతాలకు ప్రత్యేక ప్రసారము, కుమారి కమల గానము" అని.

....ఎవరో పిలుస్తున్నారు నన్ను.... అవును, మా ఆఫీస్ జవాను. స్టేషన్ డైరెక్టర్ నన్ను వెంటనే రమ్మన్నాడు. చప్పు చప్పున స్నానం చేసి, ఆఫీస్ దుస్తులు తగిలించుకొని హాజరయ్యాను, వారిముందు.

ఏమిటో నాకు అర్థము కాలేదు. ఆయన ఆ ఉదయం హిందూస్థాన్ టైమ్స్ నా చేతికిచ్చారు, చూడమని. వార్తలలో ముఖ్య వార్తగా కనిపించింది, మద్రాస్ శాసనసభ ఉపాధ్యక్షురాలు. శ్రీమతి రుక్మిణీ లక్ష్మీపతి అఖిల భారత శాసన సభాధ్యక్షుల సభకు హాజరయ్యే నిమిత్తం ఢిల్లీ వచ్చి ఉన్నారని.

"అదా! ఆమె ఈ ఊరు వస్తారని నాకే తెలియదు!" అన్నాను, నేను.

డైరక్టర్ అన్నారు: "సరే! ఆమె మన రేడియోలో మాట్లాడాలి. ఏ విషయమును గురించి మాట్లాడితే బాగుంటుందో నీవే ఆలోచించి, ఏర్పాటు చెయ్యి. వీలైతే ఈ రాత్రే, తప్పితే, విధిగా రేపు రాత్రి 9.30కు ఆమె ప్రసంగము!" అన్నారు. నేను ఆలోచిస్తుంటే, ఆయన మళ్లా అన్నారు: "డ్యూటీ ఆఫీసర్‌కు ఫోన్ చేస్తాను. ఆఫీస్ కార్ తీసుకువెళ్ళి, పని ముగించుకురా!" అని. మా పిన్ని నన్ను చూచి "ఇక్కడున్నావా!" అంటూ, ఆశ్చర్యపోయారు.



రుక్మిణీ లక్ష్మీపతి

నేను ఆమెవద్దకు వచ్చిన పనిని గురించి విని, అన్నారు: "నేను ఉపన్యాసములు ఇయ్యవలసిన అవసరం ఉంటుంది అనుకోలేదు. ఈ నా ఢిల్లీ ప్రయాణములో ఉన్న పలాన పదిహేను నిముషాలు దేనిని గురించి మాట్లాడను? పైగా కాంగ్రెస్ సంబంధమైన రాజకీయ విషయాలు మీకు బొత్తిగా అంటరానివయ్యెను! మరి, నేను ఏమి మాట్లాడను! అసలు వ్యవధి ఏది?" అన్నారు.

కాని, ఉత్తరక్షణమే, నాకు ఆశాభంగము కలిగించడము ఇష్టములేక, మళ్ళీ అన్నారు, "సరే! నీ సలహా ఏమిటి!" అని.

...మరునాడు రాత్రి 9.30కు, మద్రాస్ శాసనసభ ఉపాధ్యక్షురాలు శ్రీమతి రుక్మిణి లక్ష్మీపతి "భారతీయ రేడియో విధాన వికాసము"ను గురించి ముచ్చటింపగా, ఢిల్లీ రేడియో కేంద్రము ద్వారా లోకమంతా విన్నారు. ఈ ప్రసంగమును పొందుపరచడానికి ఆధారము ఆనాడు నేను ఫీల్డెన్ చేతికందిచ్చిన నా వ్యాసము! రుక్మిణమ్మగారు మంచి వక్త. ఆమె ఇంగ్లీష్ ఉచ్చారణ ఎంతో వినసొంపుగా ఉండేది. ఆమె బ్రాడ్‌కాస్ట్ చేసిన ప్రసంగమును గురించి మా డైరెక్టర్ సహా, వినిన వారందరూ చాలా మెచ్చుకున్నారు.

ప్రసంగము ప్రసారమైన అరగంటలోనే ప్రసంగపు ప్రతి ఒక్కటి తీసుకువెళ్ళి హిందుస్థాన్ టైమ్స్ పత్రిక సహాయ సంపాదకుని చేతికిచ్చాను. ఆయన తమిళులు, మా కుటుంబాన్ని బాగా ఎరుగుదురు.

"ఇంతకు ముందే విన్నాను, ప్రసంగము, చాలా బాగుంది. ఆమె భాషా, ఆమె ఉచ్ఛారణా మరెవ్వరికీ రాదు! మా వద్ద ఫోటోకూడా ఉన్నట్టుంది. వెంటనే ప్రచురిస్తాము. రాత్రికి రాత్రే వచ్చావే, ఫరవాలేదే!" అన్నారు.

రుక్మిణమ్మగారి ప్రసంగం ప్రసారమైన పిదప రెండు, మూడు రోజులు నన్ను మా ఆఫీస్‌లో అందరూ చాలా అభినందించారు. ప్రసంగంలోని విలువను బట్టి కొంతా, డిప్యూటీ స్పీకర్‌కు కుమారుణ్ణి అనే గొప్పవల్ల కొంతా నాకీ పొగడ్తలు. కానీ ఇందువల్ల నేను గర్వపడేలోపుగానే ఉన్నట్టుండి నిర్మాలాకాశంలోంచి భూమిమీదికి వ్రాలిన పిడుగులాగ కంట్రోలర్ ఆఫీసునుంచి ఒకకాగితం వచ్చింది. నాతో కలసి, పని నేర్చుకుంటూన్న ఒక ముగ్గుర్ని మరికొన్ని నెలలు పనిలో ఉంచుతూ నాకూ, మరిద్దరికీ ఆ నెలాఖరుతో

మా ప్రొబేషన్ అంతము చేస్తూ పై వారు పంపిన ఆర్డర్ అది. నేను నిర్ఘాంతపోయాను.

అల్లాగే కంట్రోలర్ లయొనల్ ఫీల్డెన్‌నే వెళ్ళి చూచాను. ఆయన ఆఫీస్‌పని ముగించుకొని ఇంటికి వెళ్ళబోతున్నారు. కార్‌లో అడుగుపెడ్తూ నన్ను చూచి ఆగిపోయారు. "ఇలా వచ్చావేమిటి? ఏమి విశేషము!" అని ప్రశ్నించారు, అంత దస్సివున్నా చిరునవ్వు నవ్వుతూ.

బెంగతో నా చేతిలోని కాగితమును వారికందించాను.

"అదా! ఫరవాలేదు! ఇది ఆఫీస్ పద్ధతి. త్వరలోనే మద్రాస్‌లోనూ, తిరుచినాపల్లిలోనూ, రేడియో కేంద్రాలు స్థాపింపనున్నారు. అచ్చట మీకు స్థానం ఉంటుంది" అంటూ కార్ స్టార్ట్ చేసి చెయ్యి ఊపుతూ వెళ్ళిపోయారు ఫీల్డెన్.

ఆఖరు రోజున తతిమ్మా వారికి ఉత్తరాలు వచ్చాయి. ఫిబ్రవరి 12వ తేదీన మద్రాసులో జరుగనున్న ఇంటర్వ్యూకి హాజరుకమ్మని, నాకు మాత్రము అటువంటి తాకీదు రాలేదు. అప్పటి నా కంగారు వర్ణింపలేను.

....మరునాడు వేకువనేలేచి, సిద్ధమయ్యాను. మంచి చలి! ఐనా లెక్క చెయ్యలేదు నేను. ఆఫీస్ దుస్తులుగాక నాకు ఇష్టమైన నా అడయార్ దుస్తులే వేసుకుని స్టేషన్‌కు బయలుదేరాను. త్రోవలో గులాబీతోట వద్ద ఆగి కెంపుల కంటే ఎర్రని గులాబీలు, వెల్వెట్ కంటే మృదువుగా, నిగనిగలాడేవి, అతిసుకుమారమైన ప్రేయసి పెదవి విప్పి ఏదో రహస్యం చెప్పబోతున్నట్టు వికసిస్తూ వికసిస్తూన్నవి ఒకపది పువ్వులు, మరీ అందమైనవి ఏరి, గుత్తికట్టించుకు తీసుకున్నాను. స్టేషన్‌లో ఫీల్డెన్ కార్ ఆగి ఆగడంతోనే డవాలీ జవాను ఈ వేపు పరుగెత్తుకువచ్చి తలుపు తీసేటంతలో, కార్‌లోంచి క్రిందికి అడుగుపెడుతూన్న ఆయన ఎదుట నుంచున్నాను, రెండు చేతులతోటి ఎర్రగులాబీలను అందిస్తూ. నన్ను చూచి నా చేతులలోని పువ్వులను చూచి ఫీల్డెన్ పరమానంద భరితులయ్యారు.

"ఎంత చక్కని పువ్వులు! నాకోసమే తెచ్చావా? ఇంత అందమైన పువ్వులు ఎక్కడ దొరికాయి, నీకు ఇంత ప్రొద్దునే!... ఎంత బాగున్నాయి, నీ దుస్తులు! ఈ చలిలో కూడా నీ అడయార్ దుస్తులు మానలేదా!" అంటూ పువ్వులందుకొని, నా భుజం మీద తన కుడిచేతి నానించి ముందుకు నడువసాగారు ఆయన.

కంట్రోలర్ వెనుకనే స్టేషన్ డైరెక్టరూ, తదితర సిబ్బందీ వచ్చారు. తాను ఎక్కవలసిన కంపార్టుమెంట్ వద్దకు చేరి "ముందు పువ్వులను పదిలపరచి వస్తాను!" అంటూ లోనికి వెళ్ళి గులాబీ పువ్వులను సజ్జలో ఉంచి వచ్చారు ఫీల్డెన్. మళ్ళీ నా చెంత చేరి అన్నారు ఆయన, "రైలు వెళ్ళే వరకూ ఎందుకు ఉంటావు అనవసరంగా, నీవు ఆఫీస్‌కు వెళ్ళాలిగా, వెళ్ళిరా! మనము మళ్ళీ మద్రాస్‌లో కలుసుకుంటున్నాము కదా!" అని.

బిక్క మొహంతో నేను అన్నాను. "నన్ను, మీరు మద్రాస్‌కు రమ్మనలేదుగా! నాకు ఇంటర్వ్యూ ఉత్తరువు రాలేదు!!" అని.

ఫీల్డెన్ ఆశ్చర్యపోయారు. "అల్లాగా! ఏదో పొరపాటు జరిగి ఉంటుంది. నీవు మద్రాస్‌కు రాకపోవడమేమిటి?" అంటూ మాకు కాస్త దూరంలో ఎడమగా నిలుచున్న స్టేషన్ డైరెక్టర్‌ను తన వద్దకు రమ్మని "ఇదేమిటి! ఇతనిని మద్రాస్‌కు రమ్మనలేదా?" అని ప్రశ్నించారు. "లేనట్టుంది" అని డైరెక్టర్ అనగా, ఫీల్డెన్ అన్నారు ఆయనతో. "ఏదో ఆఫీస్‌వారి పొరపాటయి ఉంటుంది. మీరు ఆఫీస్‌కు జేరిన వెంటనే డిప్యూటీ కంట్రోలర్‌తో మాట్లాడి నా మాటగా చెప్పండి, ఇతనిని తప్పక మద్రాసులో జరుగనున్న ఇంటర్వ్యూకి పంపమని, వెంటనే ఈ పని చూడండి!" అన్నారు ఫీల్డెన్.

తిరిగి, అతి ప్రసన్నవదనముతో నన్ను పరికిస్తూ అన్నారు ఆయన. "చేయవలసినవన్నీ మీ డైరెక్టర్ చేస్తారు. మనము తప్పక కలుసుకుంటాము కదూ మద్రాసులో!" అని.

ఫీల్డెన్‌కు నా కృతజ్ఞతను ఎలా తెలుపాలో నాకు తెలియలేదు. ఎంత మంచిమాట చెప్పారు ఆయన! వారికి నా కృతజ్ఞతను ఎలా వెలువరించగలను! వంగి నమస్కరించాను, అంతే! నా కన్నులలో విరిసిన అంతులేని కృతజ్ఞతాభావము ఆయన తప్పక గుర్తించి వుంటారు. ప్రతినమస్కారం చేసి చేయి ఊపుతూ లోనికి వెళ్ళిపోయారు ఫీల్డెన్....

* * *

ఇంక పదిరోజులకు మా సెలెక్షన్ అనగా, నేను క్రొత్తగా రేడియో కేంద్రము ఏర్పాటుగానున్న భవనానికి వెళ్ళాను. చిత్రం! ఒక ఆరేళ్ళ క్రితము నేను మోటర్‌కార్ కొనుక్కోబోతు, డ్రైవింగ్ నేర్చుకుని లైసెన్స్ తీసుకున్న పోలీస్ కమిషనర్

ఆఫీస్ ఉండి ఉన్న భవనమే ఇది. ఆ మాటే అన్నాను కూడా. కొత్త నిలయానికి డైరెక్టర్‌గా వచ్చిన ఆయనతో. ఆయన నవ్వుతూ అన్నారు: "ఈ పనిన్నీ ఒక మోస్తరుగా శక్తివంతమైన వాహనాన్ని నడుపడమే... ఎటొచ్చీ, కార్ డ్రైవింగ్‌లో ఎంతో కొంత విరామముంటుంది. ఈ ప్రాపకంలో నిమిషం విరామం ఉండదు, సుమా!" అని. వెంటనే ఆయన నన్ను లక్షపనులకు వినియోగించారు. సంతోషముతో పూనుకున్నాను నేను, ఆయన నియమించిన పనులన్నీ నిర్వహించడానికి, ఆ నిమిషం ఆయన సందేహించలేదు, నేనూ సందేహించలేదు, నా సెలక్షన్ పర్యవసానం ఏమవుతుందో అని – నేను సెలక్షన్‌లో ఆరితేరినట్టే భావించాము ఇద్దరమూను, మాలో మేము.

ఇంటర్వ్యూలో కంట్రోలర్ ఫీల్డెన్ ఆ ఒక్కమాటా పట్టుకుని, కొంత నవ్వుతూ, ఎంతో ఆదరణతో, కొంత పరీక్షతో, అడిగారు నన్ను: "ఏదో తర్ఫీదు పొందానన్నావే, ఈ నీ దరఖాస్తులో, నీవు పొందిన ఆ తర్ఫీదును గురించీ, ఈ పెద్ద మనుష్యులకుగాను కొంచెము వివరిస్తావా!" అని. అందినదే అవకాశమని ఢిల్లీలోని నా కృషిని గురించి పూస గ్రుచ్చినట్లు చెప్పాను.

పెద్ద మనుష్యులందరూ నాకేసి ఆసక్తితోను, ఆదరణతోనూ చూస్తున్నారు. నా కథ శ్రద్ధతో వింటున్నారు. హేమా హేమీలున్నారు, నా ఎదుట. వీరినెలా మెప్పించాలో అనే ఆలోచనే లేదు నాలో. నా సంగతి నేను చెప్పుకు పోతున్నాను; ప్రప్రథమంగా, దక్షిణ భారత ప్రాంతాలకోసము వెలసిన రేడియో ప్రసార విధానంలోనూ నేను చేయగలిగిన తొలిరోజుల కృషిని గురించి ఉత్సాహంతో, ఉన్నది ఉన్నట్టు.

ఆ తర్వాత, ఫీల్డెన్ మళ్లా అడిగారు : "అక్కడ నీకు కలిగిన అనుభవం వల్ల, ఇక్కడ ఇకముందు వెలిసే రేడియో విధానంలో ఎటువంటి మార్పులు అవసరమైనవి అమలులోకి తేవాలో చెప్పగలవా?" అని.



కస్తూరి శ్రీనివాసన్

హిందూ పత్రికాధిపతి కస్తూరి శ్రీనివాసన్ నాకేసి చాల ఆసక్తితో చూసారు. నేను యేమేమి ఆశయాలను వెలిబుచ్చుతానో అని కాబోలు. నేను ధైర్యంగా చెప్పాను.... నాకు తోచినది, ఎంతో ఉత్సాహంతో ఉద్రేకంతో. మన ప్రాంతపు సంస్కృతినీ, మన సాహిత్య సంపదనూ విలువ గణింపరాని మన సంగీత సంపదనూ అందరకూ ఏ ఏ విధాల అందుబాటులోకి తేవాలో. ఆకాశాన్ని అంటే నా ఆదర్శాలు వారిలో కొందరికి ఆశ్చర్యం కలిగించినవి.

నాతో కూడా, మరి ఇద్దరు తెలుగువారున్నూ ఆరితేరారు, ఆ సెలక్షన్‌లో. ఆదిని, మా ముగ్గురి హోదాలలో కొంత తేడా ఉన్న, రేడియో కేంద్ర కార్యక్రమాలు ప్రారంభించేసరికి ముగ్గురమూ ఏక హోదాలో పనిచేస్తూ, ఎంతోగా కలిసి మెలసి ఉండేవారము. ఒకరి ఎడ ఒకరికి అపరిమితమైన గౌరవమున్నూ, స్నేహ భావమున్నూ. మద్రాస్ రేడియోకేంద్రపు మొదటి స్వరూపము మా ముగ్గురి కృషి వలననే. దేదీప్యమానము కాజొచ్చినకొలదీ రేడియో కార్యక్రమాలతో సంబంధము గలవారు మమ్మల్ని ముగ్గురనూ "త్రిమూర్తులు" అనడము ప్రారంభించారు. ఆ వర్ణన అంతపూర్తిగా సమంజసము గాకపోయినా, వారి అభిమానము అటువంటిదీ, మరి.

మేము ముగ్గురమూ కలిసి మిక్కిలి శ్రద్ధాభక్తులతో పనిచేసేవారము. మాలో ఎవరికి ఏ క్రొత్త ఆలోచన కలిగినా వెంటనే ఆ ఆలోచనను గురించి ముగ్గురమూ సంప్రతించే వారము. మా మా నైజములనుబట్టి, మా మా దృక్పథములను బట్టి కొన్ని కొన్ని విషయాలలో కొంత కొంత అభిప్రాయభేదముండుట సహజమే. కాని, రేడియో కార్యక్రమ విషయాలలో ఈ విభిన్న అభిప్రాయాలు కొంత నూతనత్వమూ, ఓ రీతి నవ్యతా రేకెత్తించడానికి సాయ పడడానికి సాయపడేవేగాని అందుకు ఆటంకమయ్యేవి కావు. ఇందుకు కారణము, మా ముగ్గురి ప్రధానాశయమూ ఒకటే అగుట. బహుముఖమైన ఆంధ్రసంస్కృతిని ఇంటింటా వ్యాపింపజేయాలి అనీ, విశ్వప్రయత్నము చేసి ఐనా, రేడియో విధానము ద్వారా, జనుల్లోని అజ్ఞానాన్ని తొలగించి, ప్రాజ్ఞులు చేస్తున్న సత్యాన్వేషణ, సౌందర్యాన్వేషణ, సౌభాగ్యాన్వేషణ అనే త్రివర్గమైన మహాకృషిలో ఉడుతాభక్తితో మేమున్నూ తోడ్పడాలి అనే మా ముగ్గురి ఆశయమున్నూ.

మా ఇన్నేళ్ళ కృషి ఈ త్రివర్గాన్వేషణకై అంకితమైనది.

* * *

రేడియోకేంద్ర కార్యక్రమాలు ప్రారంభించడానికి ఇంకా నాలుగు నెలలున్నా ఊపిరి సలపకుండా పనిచేయవలసి వచ్చేది. ప్రసంగాలు ఏర్పాటు చేయాలి. నాటకాలను,

నాటికలను సమకూర్చాలి. తెలుగులో మంచి నాటకమూ నాటికలూ బహుతక్కువ. క్రొత్తవి, రేడియో ప్రసారానికి అనుకూలమైనవి వ్రాయాలి. వ్రాయించాలి. ఒక నాలుగు నెలల తర్వాత ప్రసారము కానున్న కార్యక్రమం గురించి వ్యక్తులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి. మాట్లాడగలిగినా, మాట్లాడడానికి ఆసక్తిలేని వారిని ఎలాగో ఒప్పించి, వారివద్ద నుంచి మాట్లాడేందుకు అనుమతించినట్లు ఉత్తరం తెప్పించాలి. ఆఫీసులో నిరంతరం టెలిఫోన్‌లో ఎవరితోనో రాగల కార్యక్రమాలను గురించి మాట్లాడుతూనే ఉండాలి. ఒక్కొక్కప్పుడు, విచిత్రమైన అనుభవాలు కలుగుతూండేవి.

ఒకసారి టెలిఫోన్ తీసి మద్రాస్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మార్ష్ బాంక్స్‌ను పిలిచాను నేను. నేను ఫలానా అని చెప్పి "షేక్స్పియర్ నాయకులలో ఉత్తమనాయకుని గురించి ఒక పదిహేను నిమిషాలు ప్రసంగిస్తారా, రాగల జూలై 14వ తేదీన" అని అడిగాను నేను. "ఏమిటి? ఎవరు మాట్లాడేది?" అని మార్ష్ బాంక్స్ అడిగారు నన్ను, ఆశ్చర్యపడుతూ, నేను ఏదో తప్పుపని చేశాను అనే భావము కలిగిస్తూ నేను మళ్లా వివరించాను నా ప్రశ్నను. మార్ష్ బాంక్స్ అన్నారు, అప్పుడు : "ఇలా టెలిఫోన్ ద్వారా ఆహ్వానించడము క్రొత్తపద్ధతే! నాకు అలా టెలిఫోను ఆహ్వానాలు అలవాటు లేదు!" అని, కాస్త రోషంగానే, ఆయన రిసీవర్ పెట్టి వేయబోతున్నారు. నేను చప్పున అన్నాను : "క్షమించండి, ఒక్క నిమిషం. ఇది ఆహ్వానం కాదు. మద్రాస్‌లో క్రొత్తగా రేడియో కేంద్రము నెలకొల్పుతున్నామని మీకు తెలుసు అనుకుంటాను. ఆ ప్రసారాలలో జరుగనున్న ఇంగ్లీష్ ప్రసంగాలను గురించి ముందుగా ఏర్పాటు చేసే పని నాకు ఒప్పగించారు. మీకు షేక్స్పియర్ నాటకాలంటే చాలా ఆసక్తి అనీ, ఆ విషయాలలో మీరు కొంత పరిశోధన కూడా చేశారనీ, మిత్రులద్వారా విన్నాను. అందుచేత, ఇలా మీతో టెలిఫోన్‌లో మాట్లాడడానికి సాహసించాను. మీరు చాలా ముఖ్యమైన పనిలో ఉన్నారని తెలుసు. కాని, నాకు కొన్ని నిమిషాలు అవకాశమిస్తే, స్వయంగా మీ వద్దకు వచ్చి ఈ విషయంగురించి ప్రస్తావిస్తాను" అన్నాను.

మార్ష్‌బాంక్స్ వెంటనే అన్నారు:"అలాగైతే ఒక పావు గంటలో వస్తావా, నీ కోసం ఎదురుచూస్తూ ఉంటాను" అని.

ఒక పావుగంటలో, ఫోర్ట్‌సెంట్ జార్జ్‌కోటలో, ఆయన ఎదుట ప్రత్యక్షమైన నన్ను చూచి, మార్ష్‌బాంక్స్ చాలా సంతోషించారు. "సాధారణంగా, ఇచ్చటివారు ఇంత "పన్క్చువల్"గా ఉండరే! మీరు ఒక క్రొత్త పద్ధతి ఏర్పరుస్తున్నారన్నమాట. అవును, బ్రాడ్‌కాస్టింగ్‌లో నిమిషాలేగాక, సెకన్‌లు కూడా గణింపవలసి ఉంటుంది" అంటూ, తన ఆఫీస్ పనిని ఆ పూటకు కట్టిపెట్టి, నేను వచ్చిన విషయాన్ని గురించి నాతో ప్రస్తావించడము మొదలు పెట్టారు. వారు మాట్లాడవలసిన విషయాన్ని గురించి నాలుగు మాటలు చెప్పేసరికి ఆయన నవ్వుతూ అన్నారు: "షేక్స్పియర్ రచనలను గురించి నాకంటే నీకే ఎక్కువ తెలుసు లాగుందే... ఎక్కడ చదువుకున్నావు, నువ్వు!" అని. "డాక్టర్ జేమ్స్ కజిన్స్ మాకు ఇంగ్లీష్ సాహిత్యమును గురించి చెబుతూ ఉండేవారు, అడయార్‌లో" అన్నాను, నేను.

"అల్లాగా! ఇప్పుడు అర్థమైంది. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు చాలా సంతోషం. నేను కృతజ్ఞతతో అంగీకరిస్తున్నాను. నీవు కోరినట్లు ఒక పదిహేను రోజులలో నా వ్యాసము వ్రాసి పంపుతాను. నీవు ఒకసారి సరిచూసి, మళ్లా నాకు కనిపించు, ఏమైనా మార్పులు అవసరమైతే చూద్దాము" అని, లేచివచ్చి నన్ను ఆఫీస్ వరండావరకూ సాగనంపారు, మార్ష్‌బాంక్స్.

* * *

ఇతరులతో టెలిఫోన్‌లో మాట్లాడుతుంటే, కొన్ని కొన్ని మర్యాదలను తప్పక పాటింపమంటూ ఉండేవారు మా డైరెక్టరు. "ఈ రేడియో సంస్థ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారిది. కనుక మీరు ఎవరిని టెలిఫోన్‌లో పిలిచినా, "గవర్నమెంటు ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా రేడియో, మద్రాస్ కేంద్రము నుంచి, ఫలానా వారు మాట్లాడుతూంట, అని ప్రారంభించాలి" అన్నారు. ఆ ప్రకారమే నేను ఒకసారి శాసన సభ్యునిగా మద్రాస్‌కు వచ్చి ఉన్న శ్రీ అయ్యదేవర కాళేశ్వర రావును టెలిఫోన్‌లో పిలిచాను. నా పిలుపు విని ఆయన అన్నారు : "అబ్బో! చాలా ఉన్నదే!!... ఒక్క క్షణం ఉండు" అంటూ, రిసీవర్ చెంతనే ఉన్న మరి ఒకరికి ఇచ్చినట్లు చప్పుడైంది. ఆ మరి ఒకరు, సన్నని కంఠస్వరంతో అన్నారు :

"ఎవరూ మాట్లాడేది?" అని.


అయ్యదేవర కాళేశ్వరరావు



కమలాదేవి చటోపాధ్యాయ

నేను మళ్లా, ఆర్భాటంతో నా కితాబులతో సహా నా పేరు చెప్పేసరికి, అవతల గొంతు వారు ఫక్కున నవ్వి "నేను కమలాదేవిని, కాళేశ్వర రావుగారు, నీ పటా టోపం విని నవ్వుతున్నారు" అని, మళ్ళా ఎంతో ఆదరణతో "ఎలా ఉన్నావు! నన్ను చూడ్డానికి ఎప్పుడు వస్తావు?" అంటూ అడిగారు. నేను వెంటనే వెళ్ళి వారిద్దరినీ చూచాను.

కమలాదేవి చటోపాధ్యాయను చూచి వచ్చిన కొంత సేపటికి మిత్రుడు గూడవల్లి రామబ్రహ్మం నన్ను చూడడానికి వచ్చారు. నేనంటే ఆయనకు ప్రాణము. నాకు వారంటే చాలా ఇష్టము. రేడియో ఆఫీస్‌లో కొంచెము సేపు ఉండి, నేను ఆఫీస్‌పని ముగించుకున్నాక, నన్ను తన కార్‌లో ఎక్కించుకొని బీచ్‌కు తీసుకువెళ్లారు. సముద్రపుటొడ్డున విశ్రమించి మాట్లాడుకుంటూ ఉండగా, ఆయన నన్ను చూస్తూ అన్నారు : "నీ వద్దకు ఒక ముఖ్యమైన పనిమీదే వచ్చాను. చేసి పెడతావా?" అని. నేను వెంటనే అన్నాను, అవశ్యం చేస్తానని. "ఎల్లుండి మా "మాలపిల్ల" సినిమా శత దినోత్సవము. ఫలానా థియేటర్‌లో గొప్పగా చెయ్యాలని ఉన్నది. ఆ ఉత్సవానికి కమలాదేవి చటోపాధ్యాయ అధ్యక్షత వహించాలని చాలా ఉన్నది నాకు. ఆమెను తీసుకు వస్తావా?" అన్నారు, రామబ్రహ్మం. "అల్లాగే!" అన్నాను, నేను. ఆ ప్రకారమే కమలాదేవిని తీసుకువచ్చాను, అధ్యక్షురాలుగా సభకు.



రామబ్రహ్మం

* * *

ఈ సాహిత్యపు గొడవలలో ఉన్న నన్ను ఇంజనీయర్‌లు వెంటనే కంట్రోల్ రూమ్‌కు రమ్మని కబురు పంపారు.

ఇంజనీయర్ ముక్కవల్లి శాస్త్రి అన్నారు : "చూడండీ! మా ప్రసార యంత్రము తయారైంది. ఆంధ్రదేశమంతటా వివిధ ప్రాంతాలలో ఈ ప్రసారము ఎంతెంత ప్రస్ఫుటంగా వినిపిస్తుందో తెలుసుకోవాలి మనము, ఆయా ప్రాంతాల వారు విని, వ్రాస్తారు, మనకు ఈ పరీక్షా ప్రసారాన్ని గురించి, అదుగో! ఆ రికార్డులలోని కొన్ని మీకు నచ్చినవి తీసి ఇయ్యండి. అవి బ్రాడ్‌కాస్ట్ చేస్తూ అడుగడుగునకూ, ఒక ప్రకటన ప్రసారం చేస్తాము. ఆ ప్రకటనను మీరే చదివి రికార్డ్ చెయ్యాలి" అన్నారు.

రికార్డులు తీసి ఇచ్చాను. ప్రకటనా చదివాను... వారు నా ప్రకటనను రికార్డ్ చేశారు. ఆ తరువాత ఒక పదిరోజులు, రోజుకు మూడు పర్యాయాలు, కొన్ని గడియలసేపు; "ఆల్ ఇండియా రేడియో, మద్రాస్ కేంద్రము.... 60.98 మీటర్ల పైన, అనగా, 4020 కిలో సైకిల్స్‌పైన, పరీక్షా ప్రసారము... రికార్డుల సంగీతము" అంటూ నేల నాలుగు మూలలా మారుమ్రోగినది నా కంఠస్వరము. ఊళ్లో కూడా తెలిసినవారి ఇంటికి వెళ్ళితే, ఆ ఇంటిపిల్లలు నేను మాటల సందర్భాన "ఆల్ ఇండియా రేడియో" అనేసరికి వారు వెంటనే "పరీక్షా ప్రసారము!" అనేవారు.... "అమ్మగారీ ఇల్లు" అనేసరికి, "ధమ్మలోగిల్లూ!" అనే రీతిని. అన్నిసార్లు ఆ పిల్లలు విన్నారన్న మాట, నేను చేసిన ప్రకటనను.

* * *

జూన్ పదహారవతేది నా పుట్టినరోజు. ఆల్ ఇండియా రేడియో మద్రాస్ కేంద్రము పుట్టినరోజూ జూన్ పదహారే!

పెళ్ళివారిల్లులా కళకళ్ళాడుతూ అతిసందడిగా ఉన్నది, రేడియో నిలయము. నాదస్వర నాదమున దిక్కులు ప్రతిధ్వనిస్తున్నాయి. తోటలో బ్రహ్మాండమైన టీపార్టీ. ఆ వచ్చే వారిలో చాలామంది అతిథులను నేనే స్వయంగా వెళ్ళి ఆహ్వానించాను. కాని, వారిని కలుసుకొని ఇష్టాగోష్ఠిలో ఉండడానికి వీలులేదు, నాకు స్టూడియోలో అనార్కలీ నాటకము ఆఖరి రిహార్సల్ సరిజూస్తున్నాను, నేను... ఆర్టిస్ట్‌లను, పాపము, వారినీ పార్టీకి వెళ్ళనియ్యకుండా!

ఇది పదహారవ రిహార్సల్. ఇదివరకు పదిహేనుసార్లు సరిజూచాము, రేడియోలో ప్రప్రథమున ప్రసారము కానున్న ఈ ఏకాంకికను. ఇన్నిసార్లు సరిజూచినా, నాకు సంతుష్టి లేదాయె! బ్రాడ్‌కాస్ట్‌వేళ సమీపించినకొద్దీ, కంగారు కాదు గాని, ఆత్రుత ఎక్కువగుతోంది, నాటకము ఎలా వస్తుందో అని. బృందగానము, ముద్దుకృష్ణ వ్రాసిన ఈ నాటకము కోసము కృష్ణశాస్త్రి వ్రాసిన అందమైన పాటలతో అనుకున్నంత అందముగా అమరుతుందా అని బెంగ. పాత్రధారులు సరిగా చెపుతారా. ముఖ్యంగా అనార్కలీ వాచకములో ఉండవలసినంత ఉద్వేగమూ, అవసరమైనంత నిస్పృహా, ఆత్మార్పణా నిరూపిత మవుతుందా అనే బెంగ. నేపథ్యముగా మిక్కిలి ఓపికతో, ఎంతో నేర్పుతో అమర్చిన



చక్రవర్తి రాజగోపాలచారి

వాద్య సంగీతము తగినంత రక్తి గట్టుతుందా – ఇలాగనే ఆందోళన. అక్కడికీ పాపము, నటీనటులు నాకేసి ఎంతో సానుభూతితో చూస్తున్నారు : మరేం ఫరవాలేదు. మీ శిక్షణ అణువైనా మరచిపోము. ప్రతి అంశము, ప్రతి చిన్న అంశము కూడా మీరు అనుకున్న రీతినే ప్రసార మవుతుంది.... అని అభయమిస్తున్నాయి వారి చూపులు.

నియమితమైన నిమిషానికి కంట్రోలర్ లయొనెల్ ఫీల్డెన్ కోరగా మద్రాస్ ముఖ్యమంత్రి శ్రీ చక్రవర్తి రాజగోపాలచారి కేంద్రరవాణా శాఖ మెంబర్ సర్ అలెగ్జాండర్ క్లవ్‌ను శ్రోతలకు పరిచయం చేశారు. సర్ అలెగ్జాండర్ క్లవ్ మద్రాస్ రేడియోకేంద్రాన్ని ఉపక్రమిస్తూ దక్షిణ ప్రాంతాలకోసము ప్రత్యేకంగా వెలసిన ఈ నిలయపు ప్రాముఖ్యతను వివరిస్తూ ఈ నిలయ కార్యక్రమాలు ఈ ప్రాంతపు సంస్కృతిని సర్వతోముఖంగా విస్తరింపజేయడానికి అన్ని విధాల ఉపకరిస్తవనే ఆశయమును వెల్లడించారు. ముఖ్యమంత్రి వారికి వందనములర్పించారు, రాజధాని ప్రజల తరఫున.

నా రిహార్సల్‌లోంచి ఒక్క పదినిమిషాలు విరామం తీసుకుని ఫీల్డెన్ ప్రముఖులున్న స్టూడియోలకి వెళ్లాను నేను. ఈ విశేష సమయానికి అవసరమైన సూట్, బూట్, నెక్ టై వేషంతో ఉన్న నన్ను చూచి ఫీల్డెన్ కొంటెగా నవ్వారు ఈ వేషమూ నీకు బాగానే ఉన్నది అన్నట్టు. మా నిలయపు ''విజిటర్స్ బుక్'' చూపి, ఆ పుస్తకంలో వారి ముగ్గురి సంతకాలూ తీసుకున్నాను. మా డైరెక్టర్ ముందు నడువగా వారిని సాగనంపి నేను చప్పున మళ్లా మా నాటకము జరిగే స్టూడియోలోకి జేరుకున్నాను.

ఇక రెండు నిమిషాలకు నాటకం ప్రారంభం అనగా, ఢిల్లీ నుంచి వచ్చిన పెద్ద ఇంజనీర్ మైక్రోఫోన్ ముందు నేను మిక్కిలి జాగరూకతతో అమర్చిన బృందగానపు అమరికను అంతా మార్చివేసి తనకు నచ్చిన రీతిని కొందరిని ముందు, కొందరిని వెనక కూర్చోనియమించారు. నే పడిన కంగారుకు మేరలేదు. ఆ ఇంజనీర్‌ని మ్రింగివేయాలని పించిందన్న మాట. కాని అతను చాలా మంచివాడు. నా భుజము తట్టి, ''మరేం ఫరవాలేదు, నేను అమర్చిన విధానము బ్రాడ్ కాస్టింగ్‌లో సరికొత్త విధానము.... ఇప్పుడు మీ పాట మరింత శ్రావ్యంగా వినిపిస్తుంది" అన్నాడు. అతను చెప్పినది నిజమే కావచ్చు. కాని, నాకు ఆ ధైర్యమెలా ఉంటుంది? అప్పుడు నేనేమనను? ఏమనడానికీ వ్యవధి ఏది? భారమంతా భగవంతునిపై వేసి, స్విచ్ నొక్కాను, ఎర్రదీపం వెలిగింది. పిల్లలు పాడసాగారు, దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించిన ఆహ్వానగీతాన్ని, తేనెవానలు కురిపిస్తూ:

* * *

అప్పుడప్పుడు చిన్న చిన్న తమాషాలున్నూ జరుగుతూ ఉండేవి. ఒక పర్యాయం అడివి బాపిరాజు వచ్చారు రేడియో నిలయానికి, "నిత్య జీవితములో, సౌందర్య పిపాస"ను గురించి ప్రసంగించడానికి. ఆయనతో కూడా శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావూ, శ్రీ కాటూరి వెంకటేశ్వరరావూ, వచ్చారు. కళాతపస్వి బాపిరాజు రూపంలోనూ, చేష్టలలోనూ, అతిసుకుమారి. ఆయన ప్రతి చేష్టా ఒక అభినయము. రెండు చేతులూ విపరీతంగా త్రిప్పుకుంటూనే గాని ఆయన మాట్లాడలేరు. మన అందరిలోనూ ఎంతో కొంత "అర్ధనారీత్వము" ఉంటుంది. కాని, ఆయన కళాశీలీ, అతి సుకుమారవంతుడూ, సౌందర్య ప్రియుడూ కాబట్టి ఆయనలో "నారీత్వము" ఒకపాలు ఎక్కువగా కనుపించేదేమో. అంచేత, ఒకరీతి పొగడ్తగానే, ఆయన సన్నిహితులు, మిక్కిలి చనువైన వారు, బాపిరాజును "శ్రీమతి" అని, పిలిచేవారు. ఈ విషయాన్ని పురస్కరించుకుని శ్రీ రామకోటీశ్వరరావు అన్నారు నాతో, వేళాకోళంగానే; "బాపిరాజును ఏమని పరిచయం చేస్తారు? మేమంతా ఇతనిని ''శ్రీమతి'' అంటాము. మీరున్నూ "శ్రీమతి బాపిరాజు" అని పరిచయం చేస్తారా రేడియోలో!" అని. "నేను సరే! అలాగే చేస్తాను" అన్నాను. రామకోటీశ్వర రావు "ఆ! అలా చెయ్యగలరా!!" అన్నారు ఆశ్చర్యంతో. వెంకటేశ్వరరావు "ఆ! ఊరికే అంటున్నారు. అదెలా వీలు!!" అన్నారు.

నేను, అనినట్టుగానే, ప్రసారానికి ముందు బాపిరాజును పరిచయం చేస్తూ, మైక్‌లోకి అన్నాను: ''ఆల్ ఇండియా రేడియో, మద్రాస్ కేంద్రము. ''నిత్యజీవితములో సౌందర్య పిపాస''ను గురించి శ్రీమతి – క్షమించాలి – శ్రీయుత అడివి బాపిరాజు ముచ్చటిస్తారు"



అడివి బాపిరాజు

అని. బాపిరాజు నా వైపుజూచి చిరునవ్వు నవ్వి తన ప్రసంగమును ప్రారంభించారు. మైక్ ముందున్నూ, ఏక చేతులు త్రిప్పుకోవడమే! మైక్రోఫోన్ ఒక అందమైన అమ్మాయి అని భావించి, ఆమె ముందు చెప్పుకు పోతున్నాడు ఆయన. సౌందర్య పిపాసను గురించి, మద్రాస్ రేడియో నిలయపు కార్యక్రమాలలో మొదటి రోజులలో వెలువడిన చాలా మంచి ప్రసంగాలలో బాపిరాజు ప్రసంగము ఎన్నదగినది.

స్టూడియో నుంచి బయటకు వచ్చాక, రామకోటీశ్వర రావు ఆదుర్దాతో అన్నారు : "అన్నంతపనీ చేశారే! మరేం ఫరవాలేదుగదా! పైవారు మిమ్మల్ని ఏమి అనరుకదా!" అని. నేను నవ్వుతూ అన్నాను: "నేను ఏమంత సాహసమైన పని చెయ్యలేదు. మా డైరెక్టర్ అంటూ ఉంటారు మాతో : "మైక్ ముందు మీరు అతిసహజంగా ఉండాలి. మన 'డ్రాయింగ్ రూమ్'లో కూర్చుని ఒకరిద్దరు స్నేహితులతో ఆప్యాయంగా ముచ్చటించునట్లు ఉండాలి, మీ మాటల ధోరణి. అవసరమైతే, ఓ మాట చెప్పి, చిన్న దగ్గు దగ్గో, బుద్ధిపూర్వకంగానో చిన్నపొరపాటు చేసో, 'క్షమించండి, పొరపాటు' అంటూ తప్పుదిద్దుకునో, తద్వారా సంభాషణలో సహజత్వాన్ని కల్పించాలి అప్పుడప్పుడు అని" అన్నాను నేను! ''ఇంకేమి! పైవారు చెప్పిన పాఠమేగా!'' అన్నారు, వెంకటేశ్వరరావు.

* * *

జనవరి 1939లో నాకు తిరుచునాపల్లికి బదిలీ అని ఉత్తరము వచ్చింది. కొంత సంతోషమూ, కొంత విచారమూ కూడా. మరొక క్రొత్త రేడియో నిలయపు నిర్మాణములో నాకు అవకాశము కలుగుతూంది. మరొక భాషలోని అందచందాలను లక్షలాది జనులకు వెల్లడిచేయవచ్చును అని ఉత్సాహము. కాని, ఈ ఏడాదిలోనూ, మద్రాసు నాకు చాలా అలవాటైనది. ఎంత వద్దనుకున్నా నా వ్యక్తిగత జీవితములోకి కొన్ని కొన్ని కొత్త ప్రభావాలు ప్రసరించి, చీకటిమనుగడలో కొంత కాంతినియ్యసాగినవి. ఈ ప్రభావముల నుంచి దూరమగుట కష్టమే! కాని అది తప్పనసరి; నాకు మంచిదీ కూడా!

కావేరీ తీరమున పవ్వళించి ఉన్న శ్రీ రంగనాథస్వామి పిలుపు వినిపించింది. ఉత్సాహముతో సిద్ధమయ్యాను నేను.

తిరుచ్చినాపల్లి రేడియోకేంద్రములో తొలిరోజులలోనే ప్రసారమైనది నేను రచించిన 'కర్ణ, కుంతీ,' అనే తమిళ రూపకము. ఈ నాటకము రవీంద్రుని రచనకు అనుసరణ. "తమిళభాషకు నూతన అలంకారముగా రాణింపదగినది. ఇది వరకు తమిళములో ఇటువంటి నాటికలు లేవు" అని లేఖకునిగా నాకు సాయము చేస్తున్న పండితుడు అయ్యం పెరుమాళ్ కోనార్ అన్నారు. కాని, నా రచనలో తమిళమున విల్లిపుత్తూర్ మహాకవి రచించిన భారత భాగాలనూ ఉపయోగించాను. కథా ప్రారంభమునా, కుంతీదేవి సంభాషణలోనూ, కర్ణుని ప్రత్యుత్తరములోనూ, మిక్కిలి రసవంతమైనవి కొన్ని విల్లిపుత్తూర్ భారత వృత్తముల నుంచాను. ఈ వృత్తములు చాలా అందంగా ఉంటవి. నడకలో ఒక చక్కని ఉద్వేగముంటుంది. మనము సాధారణముగా వింటూన్న వాడుకభాష తమిళానికీ, గ్రంథస్థమైన ఈ తమిళభాషతో బాగా పరిచయమై ఆ భాష అంటే ఎంతో ప్రీతి కలిగినది. క్రమక్రమంగా తమిళులకు అత్యాధునికంగా కనిపించే ఎన్నో ఎన్నో నూత్న భావాలను నేను వారి ఈ గ్రంథస్థ తమిళభాషలో వ్రాయసాగాను నా నాటికలలో.

మద్రాస్ రేడియో కేంద్రములో మళ్ళా ప్రవేశించి ప్రవేశించడముతోనే, ఆ పరిస్థితి మారిపోయింది, ఒక్క నిమిషములో. అప్పటి డైరెక్టర్ పరంజ్యోతికి ఆఫీస్‌లో అందరూ ఇంగ్లీష్ దుస్తులను ధరించడమే అవసరము. అందరూ ఎ.ఐ.ఆర్. నెక్ టై వేసుకోవాలి. విధిగా, బసకు వెళ్ళి, నా పెట్టె అడుగున ఉన్న సూట్ తీసి, వేసుకున్నా – ఆఫీస్‌వారిచ్చిన నెక్‌టై సహా. వెంటనే తిరుచినాపల్లి డైరెక్టర్ – నా స్నేహితులు – గోపాలన్‌గారికి టెలిగ్రామ్ ఇచ్చాను : "ఐ యామ్ టైడ్;" అని... అంటే నా అర్థము : "ఇచ్చట పనిలో హాజరయ్యాను. ఇచటి నిబంధనలను పాటిస్తున్నాను" అని.

...తిరుచ్చి నుంచి మద్రాసుకు వచ్చిన ఆ రోజే సాయంత్రము గ్రామస్థుల కార్యక్రమములో వివరాలు చూడవలసి వచ్చింది, నేను. 'త్యాగరాయకృతి – జంత్రసమ్మేళనము' అని ఒక అంశము ఉండగా "ఏమికృతి?" అని ప్రశ్నించాను నేను, సంగీత నిర్వాహకుడు లింగప్పను. ఆయన "ఇంకా ఏదీ ఆలోచింపలేదు" అనగా, నేనన్నాను : ''ఎంతని నే వర్ణింతు, శబరీ భాగ్యము బాగుంటుందేమో''నని. లింగప్ప నావేపు నిదానించి

చూచారు. “ఎందుకలా చూస్తారు?” అనేసరికి ఆయన నన్ను కౌగలించుకొనేటంతటి సంతోష ఉత్సాహములతో అన్నారు: “ఇన్నాళ్ళకు కనిపించారు. పాత సంప్రదాయములందు ప్రీతిగలవారు. నాకూ, ఆ కృతి చాలా ఇష్టము. వాద్య బృందాన్ని తర్ఫీదు చేస్తాను. వెంటనే!” అని. ప్రసారము చాలా చక్కగా నడిచింది. ఆ భక్తి పారవశ్యము ఒక వింత అనుభూతి.

ఒకరాత్రి మా డైరెక్టర్ గోపాలన్ నేనూ, కలసి ఏ.ఆర్.పి. డ్యూటీలో ఉన్నాము. నాలుగైదు ఆటలు చదరంగము ఆడి, ఇక నిద్రపోదాము అని పడుకున్నాము – ఆఫీస్ బల్లలపైననే. గదిలో ఉన్న స్పీకర్‌పైన చర్చిల్ ఉద్బోధన వినిపిస్తోంది. మరీ క్లిష్టపరిస్థితులైనా, అతని అతి గంభీరసింహనాదము ఎంతో ఉత్సాహాన్ని కల్పిస్తోంది. ఆ మాటలు వింటూ, నేను మాగన్నుగా నిద్రపోసాగాను.

ఇంతట్లోకి, నైట్ వాచ్‌మన్ క్రింద నుంచి కేకవేశాడు: రేడియో నిలయానికి ఫర్లాంగు దూరానా ప్రవహిస్తున్న కూవమ్ నది పొంగి నీరు మా కాంపౌండ్‌లోకి వస్తోంది, వెల్లువగా.

గోపాలనూ నేను క్రిందికి వెళ్ళి చూతుము కదా మహా జలార్ణవమై ఉన్నది ప్రదేశమంతా. రోడ్‌మీదుగా లోనికి వచ్చే నీరేగాక, బిల్డింగ్ చుట్టూవున్న ప్రదేశంలోంచి గుడగుడమంటూ పైకి ఉబ్బుకు వస్తోంది, నది, పాతాళ గంగలాగ! పైన ఎక్కడో ఏదో చెరువు గండిపడి ఆ నీరంతా కూపంలోకి వస్తోందని తెలుసు, మాకు. కాని, ఇలా ఆ ప్రళయము మాపైన విరుచుకు పడుతుందనుకోలేదు మేము. నిమిషనిమిషమూ నీరు ఎక్కువవుతోంది. ఇక, ఒక అంఘడియలో స్టూడియోలోకి నీరు రాసాగింది. అప్పుడు, గోపాలన్ చప్పున ఫోన్‌వద్దకు వెళ్ళి ఏ.ఆర్.పి. మాప్లా బెటాలియన్ వారిని పిలిపించారు. వారు వచ్చేలోగా స్టూడియోలో ఉన్న వస్తువులను అన్నిటినీ మేడమీదికి జేరవేయసాగాము మేడమీదికి మోసుకువెళ్ళాను. స్టూడియోలు ఖాళీచేసేపని వారికి అప్పగించి, కంట్రోల్ రూమ్‌కి వెళ్ళి, అక్కడున్న ఇంజనీర్‌ను లేపి గోపాలన్ ట్రాన్స్‌మీటర్ యంత్రాన్ని బల్లలపైకి ఎత్తిపెట్టి భద్రపరచారు. నీరు ఇంకా ఎక్కువవుతోంది. కంట్రోల్‌రూమ్‌కు అంత దిట్టమైన కట్టడము లేదు. వెల్లువ ఎక్కువై ఏ నిమిషమైనా కూలి పోవచ్చును. అందుచేత, గోపాలన్ ట్రాన్స్‌మీటర్ యంత్రాలలోని వివిధ భాగాలను విప్పివేసి, మిక్కిలి విలువగల ఆ యంత్రపరికరాల్ని తానే స్వయంగా కొంత దూరాన ఉన్న మరో భవనము పైభాగాన భద్రపరచారు. మిగిలిన రాత్రి, ఒక్క నిమిషము నిద్రలేదు, మాకు. కోడికూసే సరికి, స్టూడియోలో మొలలోతు నీరు! టెలిఫోన్ రూమ్ జలమయమైంది. గోపాలన్ ఆ నీళ్ళలోనే పనిజేస్తూ టెలిఫోన్ మెయిన్ కనెక్షన్ మేడమీదికి మార్చారు. అక్కడనుంచే బహిర్ ప్రపంచకంతో మాట్లాడసాగారు. తెల్లవారేసరికి, ఇతర ఆఫీసర్లూ ఇంజనీయర్లూ వచ్చారు. ఈ భవనము అతిపురాతనమైనది! ఏ నిమిషమైనా దభాలున కూలి పోవచ్చును; మేడ పై భాగములో ఉన్న ఆఫీస్ కాగితాలూ, ఇతర సామాన్లు అన్నీ మరో భవనంలోకి తీసుకుపోవాలి అన్నారు ఇంజనీయర్లు. పదిగంటలయ్యేసరికి తతిమ్మా ఆఫీస్ జనమంతా వచ్చారు. అందరూ కలసి పూచిక పుల్లయినా పోకుండా, అంత సామాగ్రినీ అవతల భవనంలోకి జేరవేశారు, అంచీలపైన. ఈ పని రోజు రోజంతా పట్టింది. రేడియో నిలయము చుట్టూ జలమయము. రోడ్ మీద నీరు నదిలా ప్రవహిస్తోంది. అవతల, వంతెనపై నుంచే పారుతోంది నది! ఎలాగో అతికష్టంమీద, మరో చుట్టుదారిని వెళ్ళి ఇందరకూ అన్నపానీయాలు ఏర్పాటు చేశారు గోపాలన్.

సాయంత్రమయ్యేసరికి శోషవచ్చినట్టు పడిపోయి నిద్రలో మునిగిపోయాను నేను. కాని, పూర్తిగా దస్సిపోయినా నిద్ర కూరుకువస్తున్నా పెద్ద బాధ మనస్సులో: అయ్యో! ఒక్క రోజు రోజంతా రేడియోప్రసారము లేదే! లక్షలాది జనము ఏమనుకుంటారో! ఏ నిమిషమైనా జపానువారు మద్రాస్ తీరాన దిగుతారు అనే వదంతులు బయలుదేరిన సమయంలో ఇలా రేడియో మూగబోతే, జనులు ఒక్కటే అనుకుంటారు : ‘దేశము శత్రువశమైనద’ని ... ఎంత చప్పున నీరు తీసిపోతుందా ఎంత చప్పున రేడియోప్రసారము తిరిగి ఉపక్రమింప వచ్చునా అని యావ, నాలో.

అదృష్టవశాత్తూ రాత్రి ఏ రెండు జాములవేళనో నీరు తిరుగు మొగము పట్టింది. వెంటనే, గోపాలనూ ఇంజనీయర్లూ కంట్రోల్‌రూమ్‌కు వెళ్ళి, మోకాలు లోతు నీటిలో పనిచేస్తూ, విప్పివేసిన యంత్రసామగ్రిని ఒక్కొక్కటే తిరిగి అమర్చసాగారు. ఈ పని చాలా కష్టము. తీసివేయడం సులభం. మళ్ళా జతకూర్చడం కష్టం. ఎన్నో సీలలు

బిగించాలి. అతి జాగ్రత్తతో. కాని. గోపాలన్ సమయస్ఫూర్తి అద్వితీయము! అన్నిచోట్లా తానే ఐ అందరకూ తానే సలహాలనిస్తూ సూర్యోదయ సమయానికి, తీసివేసిన ట్రాన్స్‌మీటర్‌ను మళ్లా నెలకొల్పారు!

నాకు బాగా జ్ఞాపకము: ఆల్ ఇండియా రేడియో నిలయపు ప్రసారాలను గుర్తుపరచే ‘సిగ్నేచర్‌ట్యూన్’ గల రికార్డ్‌ను సిద్ధంగా ఉంచుకున్నాను నేను, ప్రసార సమయానికి ముందుగా రెండు నిమిషాలు శ్రోతలకు వినిపించడానికి. ఇంజనీయర్లూ అందరూ వారివారి పనులలో నిమగ్నులై ఉన్నారు, ఒక్కొక్క మరా సరిజూచుకుంటూ. ఏడుగంటలకు ఇక ఐదు నిమిషాలు. గోపాలన్ ఇంకా ఏదో సీల బిగిస్తూనే ఉన్నారు... ఇక మూడు నిమిషాలు... గోపాలన్ కళ్ళలో ఒక వంక గొప్ప ఉత్సాహము; ఒకవంక ‘ఏమవుతుందో’ అనే గొప్ప బెంగ!.... ఇక రెండు నిమిషాలు. నాకు సైగచేశారు గోపాలన్. వణికే చేతులతో, తిరుగుతూన్న రికార్డ్ పైన ముల్లు ఉంచాను. సరిగ్గా ఆ నిమిషానికే, చూరులోంచి త్రోవజేసుకొని ఉదయసూర్యుని కిరణజాలము ఒకటి పెళ్ళుమంటూ ప్రకాశించింది రికార్డ్‌పైన! ఆ నిమిషానికే వయొలిన్ తంబూరా సమ్మేళనమైన దివ్యనినాదము చేరువనే ఉన్న రేడియో సెట్‌పైన వినిపించింది రికార్డ్‌పైన! మా స్టేషన్!! గోపాలన్ కళ్ళు మెరిసిపోతున్నాయి. ఆయన ఆస్తికుడు కాడు; కాని, ఆ నిమిషం ‘థాంక్ గాడ్!’ అన్నారు ఆయన, స్పష్టంగా!!

నేను సరేసరి, విపరీతమైన ఉత్సాహముతోనూ అనిర్వచనీయమైన కృతజ్ఞతా భావముతోనూ పులకాంకితుడై పోయానన్నమాట... రేడియో గడియారము టంగు టంగున ఏడుగంటలు కొట్టింది. మైక్రోఫోన్ దగ్గరగా ముఖాన్ని ఉంచి, విశ్వప్రయత్నాన నా తొట్రుపాటును కప్పిపుచ్చుకొని, మామూలు కంఠస్వరంతోనే, ఎంతో ఆనందంతో అన్నాను: “ఆల్ ఇండియా రేడియో మద్రాస్ కేంద్రము, ఉదయ ప్రసారము ప్రారంభము” అంటూ. ఇక ఆ తర్వాత రికార్డ్‌ల కార్యక్రమమూ తెలుగులో వార్తలూ అనుసరించాయి. స్టూడియోలు జలమయమైనందున చాలా వరకు రికార్డ్‌లూ రిలేలూ ఏవో కొన్ని అతి ముఖ్యమైన ప్రసంగాలూ కంట్రోల్ రూమ్‌నించే ప్రసారము చేశాము.

ఒక్క ఇరవై నాలుగు గంటలే. ప్రసారములో విరామము కలిగింది అంతటి మహాప్రళయము విరుచుకుపడినా!

సేకరణ : జుజ్జువరపు చంద్రమౌళి
ఫోన్ : 9848043334



జానకిరామ్

డాక్టర్ ఆచంట లక్ష్మీపతిగారి కుమారుడు ఆచంట జానకిరాం గారు 1957-63 మధ్య కాలంలో ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో తమ ఆత్మకథను గురించి వ్యాసాలు వ్రాసినారు. తరువాత ఈ వ్యాసాలు మూడు పుస్తకాల రూపంలో వచ్చినవి.

1. నా స్మృతి పథంలో (దేశికవితామండలి) 1960;
2. సాగుతున్న యాత్ర - I (ఆదర్శ గ్రంథమండలి) 1962;
3. సాగుతున్న యాత్ర - II (ఆదర్శ గ్రంథమండలి) 1963;

సాగుతున్న యాత్ర రెండవ భాగంలో జానకిరాం తన ఆత్మకథ చెబుతూ తను All India Radio లో ఢిల్లీ, మద్రాసు, తిరుచునాపల్లి కేంద్రాలలో చేసిన కృషిని సందర్భానుసారంగ వేరు వేరు పేజీలలో వర్ణించారు.

ఆయా భాగములు పై వ్యాసములో ఉన్నాయి.

# అనువాద ప్రక్రియ

– ఆర్. వెంకటేశ్వరరావు (ఆర్వీయార్)

అనువాదాల ఆవశ్యకత గురించి చెప్పుకోవడం పునరుక్తి దోషం అవుతుంది. అనువాదాలు భిన్న భాషల మధ్య వారధులుగా పనిచెయ్యడమే కాదు ఒకో భాషలో ప్రబలంగా వున్న ప్రక్రియల్ని, ధోరణుల్ని ఇతర భాషలకి అందిస్తూ వుంటాయి. సాహిత్యాన్ని దేశ కాలావధి లేని పరిధిలో సుసంపన్నం చెయ్యడం కూడా అనువాదాల చలవేనని చెప్పాలి. ప్రక్రియాపరంగా చెప్పుకున్నప్పుడు ‘సానెట్’ అనే రూపం ఇటలీ నుంచి పాకింది. ఇంగ్లండ్‌లో షేక్స్పియర్ చేతిలో అది రూపం మారి ఆయన పేరు మీదనే వ్యవహారంలోకి వచ్చింది. (ఇటీవలే తెలుగులో దీని అనువాదం వచ్చింది కూడా). ఇటలీ వెట్రార్కక్ ‘సానెట్’ ఇంగ్లీషులో షేక్స్పియర్ సానెట్‌గా ప్రాచుర్యం పొందింది. అలాగే అనేక ఇతర ప్రక్రియలు, ధోరణులు అనువాదాల ద్వారానే విశ్వవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. సుశాన్ బాస్నెట్ చెప్పినట్లు ట్రాన్స్‌లేషన్ అంటే ట్రాన్స్‌ప్లాంటేషన్, అనువాదం అంటే తిరిగి నాటడం కొత్త నేలలో కొత్త శీతోష్ణస్థితిలో వర్ధిల్లడం అని.

భారతదేశంలో అనేక భాషలున్నాయి. ఒక భాష నుంచి మరో భాషలోకి అనువాదాలు చాలా అవసరం. సాంస్కృతిక వారసత్వం ఆసేతు శీతనగం ఒకటే వుండడం వల్ల భాషాభేదం అంతలా అడ్డం పడదు. ఇలాంటి సందర్భంలో ట్రాన్స్‌ప్లాంటేషన్ అలవోకగా సాగిపోతుంది. భారతదేశంలో అన్ని భాషలలోకి సంస్కృతం కుదురు నుంచి దిగుమతి అయి ఊడలు దించుకున్న శాఖలే ఎక్కువ. ఆ రకంగా భావాత్మకంగా వున్న భారత ఏకత కార్యరూపం ధరించడానికి వీలు ఎక్కువ. ఉమాశంకర్ జోషి ఈ మాటనే తన ఉపన్యాసాలలో ప్రస్తావించారు. “భారతదేశ సాహిత్యం అనే భావనను సాకారం చెయ్యడానికి రెండు అంశాలు దోహద పడతాయి. అనువాదాలు, తులనాత్మక సాహిత్య పరిశీలన విశ్వవిద్యాలయాలలో జరగడం” కేంద్ర సాహిత్య అకాదెమి, నేషనల్ బుక్‌ట్రస్ట్ లాంటి సంస్థలు యీ కృషి సాగిస్తున్నాయి. ఇవికాక అనేక ప్రైవేట్ ప్రచురణ సంస్థలూ అనువాద ప్రక్రియను అందుకుంటున్నాయి. ఆ రకంగా తెలుగు సాహిత్యాన్ని ఇతర భాషల్లోకి వెళ్ళే సానుకూలం కలిగింది. ఇక విదేశీ భాషల దగ్గరికి వస్తే ముఖ్యంగా ఇంగ్లీషు భారతదేశంలో ముందు పేజీన ఉంది. ఇంగ్లీషు నుంచి తెలుగులోకి, తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదాలు జరిగాయి. ఇంకా జరుగు తున్నాయి, ఇక ముందూ జరుగుతాయి.



షేక్స్పియర్

ఇంగ్లీషు భాష భారతదేశంలో ఇవాళ అనేక కార్యకలాపాలకి మాధ్యమంగా ఉంది. పాలనా వ్యవస్థలో, విద్యావిధానంలో ఇంగ్లీషు బాణీయే భారతదేశంలో అనుసరిస్తూ వున్నారు. భారతదేశంలో పరిఢవిల్లుతూ వున్న ప్రజాస్వామిక పాలనా విధానం బ్రిటీష్ నమూనాలోనే వుంది. దీనంతటికీ కారణం, బ్రిటిష్ వాళ్ళు భారతగడ్డ మీద అడుగుపెట్టినప్పటి నుంచి పాలన హస్తగతం చేసుకునే దాకా సాగించిన ప్రస్థానం. ఆ తరువాత పరిపాలనలో తమ విధానాన్నే అమలు చేసి భారతదేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకురావడం ఇదంతా సుదీర్ఘ చరిత్ర.

ఇంగ్లీషు వాళ్ళకి కొంచెం ముందు పోర్చుగీస్‌వాళ్ళు, డచ్‌వాళ్ళు, ఫ్రెంచ్‌వాళ్ళు వచ్చారు. ఆ రకంగా పాశ్చాత్య ప్రభావం భారతదేశం మీద పడింది. పోర్చుగీసు నుంచి తెలుగులోకి అనేక పదాలు వచ్చిచేరాయి. “పొగాకు” లాంటి దినుసు, బాతులాంటి పక్షి వాళ్ళవల్లనే యిక్కడ ప్రవేశించాయి. ‘పొగాకు’ మన నాగరికతమీద యెంత ప్రభావం చూపించిందో, యింకా చూపిస్తోందో తెలుస్తూనే వుంది. చారిత్రక పరిస్థితుల దృష్ట్యా ఇంగ్లీషువాళ్ళు భారతదేశంలో నిలదొక్కుకుని మిగిలిన యూరప్ దేశాల వాళ్ళ కంటే పై చేయి సాధించారు. క్రమేణా ఒక్కో ప్రాంతాన్నే తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. మొత్తం అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. 19వ శతాబ్దం ప్రారంభం నాటికి ఆంధ్రదేశమంతా బ్రిటీష్‌వాళ్ళ చేతుల్లోకి పోయింది. కంపెనీ పాలన విస్తరించింది. ఇంగ్లీష్ పాలన ఆచార వ్యవహారాలు ఆ ప్రాంతం వాళ్ళందరికీ అంది వచ్చాయి. మొదట్లో ఇంగ్లీషు వాళ్ళ ప్రస్తావన (వెంకటావధాని *విశ్వమాధుర్యం*లో లాగా 1640) పాలవేకరికరిరేపతి

*శుకసప్తతి* (1660) లో లాగా వున్నా ఇంగ్లీషు మాటలు తెలుగులోకి ప్రవేశించలేదు. చత్రాతి లక్ష్మీసరసకవి (1794) ఇంగ్లీషు పదాలు కూడా వాడాడు. బ్రౌన్ దొర వచ్చేనాటికి ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువాదాలు వచ్చేయి. ప్రింటింగ్ ప్రెస్‌ని తీసుకురావడం వల్ల అచ్చులో పుస్తకాలు వెలువడ్డమూ వచ్చింది. బ్రౌన్ దొర తెలుగు భాషకి, సాహిత్యానికి చేసిన సేవ గురించి ప్రత్యేకించి చెప్పుకోనక్కరలేదు. ఆ మహనీయుని చలవ వల్లనే అనేక ప్రాచీన తెలుగు తాళపత్ర గ్రంథాలు పరిష్కారానికి నోచుకున్నాయి. అచ్చులోనూ దర్శనమిచ్చాయి.

అప్పటికి తెలుగులోకి ఇంగ్లీషు నుంచి అనువాదం అయిన గ్రంథాలు ప్రధానంగా క్రైస్తవ మతానికి సంబంధించినవే. 1720 ప్రాంతంలో రోమన్ కాథలిక్కు మిషనరీలు *క్రిష్టియన్ వేదగ్రంథములు* అనే పేరుతో అనువాదం చేశారు. బెంజమిన్ ఫిల్ట్ అనువాదం మొదటగా తెలుగులో అచ్చయినదని అంటారు. డెస్ గ్రాంజెస్ అనే ఆయన తాను "క్రైస్తవ బ్రాహ్మణుడి"నని చెప్పుకున్నాడు. బ్రౌన్ దొర బైబిల్‌ని తెలుగులోకి అనువాదం చెయ్యడంలో ఎదురయ్యే కష్టనష్టాలని వివరించాడు. అనువాదాలు అలా ఇంగ్లీషు ప్రముఖుల నుంచి వెలువడడం మొదలైంది. అదే సమయంలో ఇంగ్లీషులో సొంతంగా తెలుగువాళ్ళే రాయడమూ వచ్చింది. కావలి వేంకట రామస్వామి ఇంగ్లీషు Biological Sketches of Dekkan Poets అని రాశాడు. అందులో 108 కవుల చరిత్రలు వున్నాయి. అది 1829లో కలకత్తాలోను, 1888లో మద్రాసులోను అచ్చయింది.

అప్పటికి విద్యావిధానంలోనూ మార్పులు వచ్చాయి. "పాశ్చాత్యులను చూచి మనవారు ముఖ్యంగా నేర్చుకున్నది నూతన విద్యావిధానము" అని కొత్తపల్లి వీరభద్రరావు రాశాడు. పాశ్చాత్య విద్యావిధానం వల్ల ఒక శిష్ట శ్రేణికే పరిమితమైన జ్ఞానసంపద ప్రజాబాహుళ్యం అంతటికీ అందుబాటులోకి వచ్చింది. గురజాడ రాసినట్లు సాహిత్యం అనేది ఒక వర్గానికే పరిమితమైపోకుండా జనసామాన్యానికి చేరువైంది. బ్రిటిష్ వాళ్ళ పుణ్యమా అని 'మాస్ ఎడ్యుకేషన్' వచ్చిందనీ, దానివల్ల వ్యావహారిక భాష, ఆధునిక తెలుగు వచన రచన విధాయకం అయ్యేదనీ ఆయన రాశారు. ఆధునిక తెలుగు వికసించాలంటే ఆధునిక భావాలు విస్తరించాలి. అప్పట్లోనే ఇంగ్లీషు నుంచి దేశభాషలలోకి గ్రంథాలని అనువాదం చేయించాలన్న ప్రయత్నం జరిగింది కాని "ఆంధ్రాంగ్ల భాషలలో సమాన పాండిత్యం కలవాళ్ళు" లేకపోయారు. దాంతో ఆ ప్రయత్నం సాఫీగా సాగలేదు. క్రైస్తవ మతగ్రంథాలు అనువాదం అయ్యాయి కాని తెలుగు మాతృభాష కానివాళ్ళు, ఆ పాశ్చాత్యులు అనువాదం చెయ్యడం వల్ల ఆ రచనల్లోని కారకము తెలుగు నుడికారానికి విలక్షణంగా వుండి "కొత్త బైబిల్ బాష" అనే మొహరు తగిలించుకున్న భాష అవతరించింది. ఇవాల్టికీ బైబిల్ భాష ఆ మూసలోనే వుంది.

తెలుగువాళ్ళే అనువాదం చేసిన గ్రంథాలైనా ఆనాటి గ్రాంథిక భాషలో వుండేవి. మొదట్లో ఇంగ్లీషు మాటలకి తెలుగులో అనువాదాలు వచ్చేవి. బ్రౌన్ దొర యీ విషయం గురించి కొంతరాశాడు. అసలు "హిందువులు ఏ అనువాదమూ అవసరం లేకుండా ఇంగ్లీషు మాటలనే వాడడానికి ఇష్టపడతా"రని ఆయన రాశారు. గవర్నర్, హాస్పిటల్, కాలేజీ, కోర్టు, పోలీస్, లాయర్, డాక్టర్‌లాంటి వాటిని అలానే వాడడం అప్పటికే ప్రాచుర్యమైందని ఆయన రాసినదాన్ని బట్టి తెలుస్తుంది. కాని తెలుగులో అనువాదం అయిన మాటలు కొన్ని యివాళ చిత్రంగా కనిపిస్తాయి. రైల్వేకి 'ఇనుపకమ్మితోవ' ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్‌కి "మెరుపుటప్పా" సేఫ్టీవాల్వ్‌కి "రక్షకమైన మూత" అంటూ వ్యవహార దూరమైన మాటలు వుండేవి.

పదాల మాట అలా వుంచినా గ్రంథాల అనువాదంలోనూ విధేయంగా లేని వర్ణనలు, పేరులు మొదలైనవి 'దేశీయములయినట్లు' మార్చడం వుండేది. గురజాడ శ్రీరామమూర్తి 1879లో ఇంగ్లీషు నుంచి తెలుగులోకి *చిత్రరత్నాకరం* అనే పేరుతో ఒక అనువాదం తీసుకువచ్చారు. అరేబియన్ నైట్స్‌లోని The sleeper awakened అనే దానికి అది స్వేచ్ఛానువాదం. అందులోని భాష గ్రాంథికం. ఈ విధంగా ఆంగ్లమూలము, భారతీయ విశేషించి ఆంధ్ర-సంప్రదాయానుసారం ఆంధ్రీకరింప బడినది. ఇది దీని యొక్క వైశిష్టము అని కొత్తపల్లి వీరభద్రరావు అభిప్రాయపడ్డారు. ఇలా భారతీయ సంప్రదాయాన్ని అనుసరిస్తూనే నాటకాలని అనువాదం చెయ్యడం వచ్చింది. 1879లో వావిలాల వాసుదేవశాస్త్రి 'జూలియస్ సీజర్' నాటకాన్ని ఇలా అనువదించారు. అప్పట్లో షేక్స్పియర్ నామాన్ని కూడా 'శూలపాణి' అంటూ అనువాదం

చేశారు. కందుకూరి వీరేశలింగం పంతులు తెలుగు సాహిత్య ప్రక్రియలలో ఎన్నిటికో శ్రీకారం చుట్టినవాడు. ఆయన అనువాదాలూ ఇంగ్లీషు నుంచి చేశారు. విలియం కేసర్ రాసిన *జాన్ గిల్పన్* కావ్యాన్ని ఆయన పద్యాల్లో అనువాదం చేశారు. అందులోని సాహిత్యాన్ని కొత్తపల్లివారు వివరంగా చూపించారు. చెన్నాప్రగడ భానుమూర్తిగారు రచించిన ప్రఖ్యాత *ఎలిజీ (ఎలిజీ ఇన్ ఎ కంట్రీచర్చియార్డ్) శైవశ్మశాన విలాపము*లని అనువాదం చేశారు. *ఎలిజీ* అనే విలాప కావ్యధోరణి ఆ రకంగా ఇంగ్లీషు నుంచి తెలుగులోకి వచ్చిందని చెప్పవచ్చు. ఆ తరువాత కాలంలో చాలామంది కవులు తెలుగులో *ఎలిజీ*లు రాశారు. ఆ తరువాత కాలంలో తిరుపతి వేంకట కవులు సర్ ఎడ్విన్ ఆర్నాల్డ్ *లైట్ ఆఫ్ ఏషియా*ని *బుద్ధ చరిత్ర* అని అనువాదం చేశారు. కవిత్వ అనువాదాలే కాక వచన రచనలూ అనువాదంలో కనిపించాయి.

కిడాంబి రామానుజాచార్యులు ఇంగ్లీషు నుంచి *బేకన్* వ్యాసాల్ని *బేకనుపన్యాసములు* అని అనువాదం చేశారు. ఇలా ఇంగ్లీషు నుంచి అనువాదాలు చేసుకోవడమే కాక ఇంగ్లీషు తరహాలో వ్యాసాలనీ, వ్యాకరణాలనీ రాయడం కూడా వచ్చింది. సామినేని ముద్దు నరసింహనాయుడు *హితసూచిని* (1862లో) యీ ధోరణిలో వ్యావహారిక భాషలో రాశారు.

ఆయన ఇంగ్లీషు (జురరఖువ) కి తెలుగులో 'ప్రమేయములు' అన్నారు. ఆ మాటకు తెలుగులో 'వ్యాసము' అని వ్యవహరించిన వాడు బ్రౌన్ దొర. అప్పటిదాకా యీ ప్రక్రియకు ప్రమేయం, సంగ్రహం, ఉపన్యాసం లాంటి మాటలు వ్యవహారంలో వున్నాయి. బ్రౌన్ దొర 'వ్యాసం' అని పేరు పెట్టినప్పట్నుంచి అదే స్థిరపడి ప్రాచుర్యం పొందింది.

"పాశ్చాత్యుల సంపర్కము లేక సర్వము తెలుగులో గల రచనలలో నూటికి తొంబది తొమ్మిది పాళ్ళు – శాస్త్ర గ్రంథములయినను, విజ్ఞానాత్మక రచనలయినను ఛందో బద్ధములైనవే" అని కొత్తపల్లి వీరభద్రరావు తమ పరిశోధనా గ్రంథంలో రాశారు. పాశ్చాత్య విద్యవల్ల వచన రచనకి జవం జీవం కలిగాయి. లింగం లక్ష్మీజీ పంతులు ఇంగ్లీషు వ్యాకరణ పద్ధతిలో *తెలుగు వ్యాకరణం* (1863) రాశారు. ఇలా ప్రక్రియాపరంగా భాషాపరంగా మార్పులు చాలా వచ్చేయి. అంతేకాక అచ్చుకు తూగేలా సంస్కరణలూ వచ్చాయి. దీనికీ నాంది పలికినవాడు బ్రౌన్ దొరగారే. అచ్చులో బ్రౌన్ 'ర'కారం (ప్ర) ని పేరు పడిన దానిని ఆయన ప్రవేశపెట్టారు. అలాగే అర్ధానుస్వార, శకటరేఫలు అవసరం లేదని వాటిని తొలగించాడు.

ఈ సంస్కరణతోబాటు ప్రజలని విజ్ఞానమార్గంలో నడిపించడానికి పుస్తక ప్రచురణలని చేపట్టడమూ జరిగింది. అలా రూపు తీసుకున్నదే *విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి*, కొమర్రాజు లక్ష్మణరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావు నిర్మాణాత్మక కార్యక్రమం యేదైనా చెయ్యాలని సంకల్పించారు. 'ఆ ఊహల్లోంచే *విజ్ఞాన చంద్రిక గ్రంథమండలి* భావం వచ్చింది. 1905లో బీజరూపంలో వున్న యీ భావం కార్యరూపం ధరించింది. 1911 నాటికి 15 గ్రంథాలను ప్రచురించారు.

తొలి ప్రచురణ హరి సర్వోత్తమరావు *అబ్రహం లింకన్ జీవిత చరిత్ర* ఈ గ్రంథమండలి తన ఆశయాలని ప్రకటించింది. 'ప్రకృతి శాస్త్రాది వివిధ విద్యలు జనులకు బోధించుటకు ఆ భాషలో అన్ని విషయములను గురించిన గ్రంథములను నిర్మించ వలసియున్నది. మాయల్పశక్తి కొలది యాంధ్ర మాతృభాషాసేవ చేయ ప్రయత్నింప వలయుననెడి ఇచ్ఛగలవారమై విజ్ఞాన చంద్రిక మండలియను పేరును భాషాభివృద్ధి సంఘము నేర్పరచినాము.

"దేశచరిత్ర, మహాపురుషుల జీవితములు, ప్రకృతి లేక భౌతికశాస్త్రములు, రాజకీయ ఆర్థిక శాస్త్రములు ఇంగ్లీషులోకి సర్వోపయోగ కరమైన గ్రంథమాల యొక్క భాషాంతరీ కరణములను మాత్రమే ప్రచురించదలిచినాము" అని చెప్పారు. భాషాంతరీకరణ గ్రంథాల ప్రచురణ సంస్థను నెలకొల్పడం ఇక్కడి విశేషం.

అలాగే *ఆంధ్ర ప్రచురణ గ్రంథమాల* కొన్ని నవలల్ని ప్రచురించింది. *దుర్గేశనందిని* లాంటి నవలల్ని ప్రచురించారు. అయితే దేశీయ భాషలైన బెంగాలీ, కన్నడం లాంటి వాటి నుంచి అనువాదాలు చేయించినవి. ఫ్రెంచి *లేమిజరబుల్స్, ఫౌస్ట్* లాంటి అనువాదాలనీ ప్రచురించారు.

ఇంగ్లీషు నుంచి అన్ని శాఖలలోనూ అనువాదాలు చాలా ఎక్కువ వచ్చాయి. ఇంగ్లీషు, దేశంలో అనధికారపాలక భాషగా వుండడం వల్ల ఆ భాష నుంచి అధికంగా తెలుగులోకి అనువాదాలు వచ్చాయని చెప్పవచ్చు. అదీకాకుండా ప్రపంచ భాషలన్నిటి నుంచీ మొదటగా అనువాదాలు వెలుగు చూసేది ఇంగ్లీషులోనే. ఆ రకంగా అన్ని భాషల నుంచి

ఇంగ్లీషులోకి వచ్చిన గ్రంథాలన్ని యితర భాషలలోకి అనువాదం అవడానికి వీలు కలిగింది. ఇంగ్లీషు భాషకి వ్యాప్తి ఎంత వుందో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. అందుచేత ఏ భాష నుంచి అయినా ఇంగ్లీషులోకి అనువాదం అయితే దానికి ప్రపంచవ్యాప్తంగా ఎందరికో చేరే సానుకూలం కలుగుతుంది. ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అంది వచ్చిన సాహిత్యం, ప్రక్రియలు ఎన్నో ప్రత్యేకంగా పట్టిక ఇవ్వాలంటేనే "అమలిన తారకా సముదాయం బులెన్నడం" లాంటిదని అంత మహత్తర భారాన్ని ఇక్కడ తలకెత్తుకోవడం కుదరదు. కాబట్టి ప్రముఖంగా వున్న వాటిని గురించి ప్రస్తావించుకుందాం.

*ఆంధ్రగ్రంథమాల* ఎన్నో ఇంగ్లీషు నవలల అనువాదాలని ప్రచురించింది. ఒక తరం పాఠకులు ఆ నవలలు చదివి సాహిత్య అభిలాష పెంచుకున్నారు. శివలెంక శంభుప్రసాదు మహోదయులు ఆ రకంగా చరిత్రలో నిలిచిపోయే కృషి చేశారు. డికెన్స్ *టేల్ ఆఫ్ టు సిటీస్ – రెండు మహానగరాలు* పేరుతో తెన్నేటి సూరి అనువాదం ముందు సీరియల్‌గా తరవాత పుస్తకంగా వచ్చింది. మార్క్‌ట్వైన్ రచనలు, ఆర్‌ఎల్ స్టీవెన్‌సన్ రచనలు ప్రచురితమయ్యాయి. హారీబీబెట్‌స్టర్ *అంకుల్ టామ్స్ కేబిన్* అమెరికా నీగ్రోల దుర్భర జీవితం గురించి కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తుంది. మార్గరెట్ మిచెల్ *గాన్ విత్ ది విండ్* నవల ఒక ఇతిహాస స్థాయి నవల. అది అమెరికన్ అంతర్యుద్ధం నాటి స్థితిగతుల్ని కళ్ళముందు సాక్షాత్కరింపచేస్తుంది. అలాంటి నవల ఇంగ్లీషులోనే ఎన్నో లక్షల ప్రతుల్లో అమ్ముడుపోయింది. ఇటీవలే ఎమ్.వి.రమణారెడ్డి దాన్ని *చివరికి మిగిలేది* అని అనువదించారు.

*దక్షిణ భాషా పుస్తక సహకార సంఘం* ఫోర్డ్ ఫౌండేషన్ వారి సహకారంతో దక్షిణాది భాషలలో పుస్తకాల అనువాదాలు ప్రచురించేది. ప్రధానంగా అమెరికన్ సాహిత్యం శాస్త్ర రచనలు వుండేవి. *దక్షిణ భాషా పుస్తక సంస్థ* దక్షిణాది భాషలలో గ్రంథాలను చౌకగా ప్రచురించాలన్న సంకల్పంతో ముందుకొచ్చింది. *ఫోర్డ్ ధర్మసంస్థ* నిధి వారు ఈ సంస్థ నిర్మాణాన్ని తలపెట్టారు.

"ఉన్నత సారస్వత శ్రేణికి చెందిన స్వతంత్ర రచనలనే కాకుండా వైజ్ఞానిక సాంస్కృతిక గ్రంథాలనూ ప్రపంచ సారస్వతంలోని ఉత్తమ గ్రంథాలనూ కూడా ప్రచురించడం" వీరి ప్రధాన లక్ష్యం. "ఒక్క మాటలో చెప్పాలంటే ఉత్తమ గ్రంథాలను చౌకగా అందించడం దక్షిణ భాషా పుస్తక సంస్థ వారి పరమాశయం" అని సుప్రసిద్ధ రచయిత న్యాయమూర్తి పాకాల రాజమన్నారు *తొలి మానవులు* (అనువాదం వేమరాజు భానుమూర్తి) అనువాదానికి 'పరిచయం'లో రాశారు. ఈ గ్రంథం ఇర్వింగ్, హాన్నాగోల్డ్‌మన్ రాసిన *ఫస్ట్‌మేన్*కి అనువాదం. ఇలా ఆ సంస్థ విశేషమైన కృషి చేసింది. ఇంగ్లీషు తర్వాత అనువాదాల ద్వారా తెలుగులోకి అత్యధికంగా గ్రంథాలు వచ్చింది రష్యన్ భాష నుంచి. రష్యన్ విప్లవం తరువాత భారతదేశంలో రష్యన్ సాహిత్యం పట్ల ఆసక్తి పెరిగింది. 1921 లోనే "ఆంధ్ర పత్రిక" సంవత్సరాది సంచికలో "సోవియట్టులు" అనే శీర్షిక కింద 8 పేజీల వ్యాసం ప్రచురించింది. అప్పట్లో వార్తలకీ, వ్యాఖ్యలకీ పాఠకులు ఆధారపడిన పత్రిక అది ఒక్కటే. రాజకీయ వార్తలతో బాటు సాహిత్య విశేషాలనీ అదే అందించేది.

రష్యన్ సాహిత్యం మొదట్లో కొందరు ప్రచురణకర్తల కృషితో అందుబాటులోకి వచ్చింది. *ఆదర్శ గ్రంథమండలి* గోర్కీ రాసిన *అమ్మ* నవలను తెలుగులో ప్రచురించింది. దాన్ని క్రొవ్విడి లింగరాజు అనువాదం చేశారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో అది ప్రజలలో ఉత్తేజాన్ని కలిగించింది. రష్యాలో విప్లవం రాక పూర్వమే గోర్కీ దాన్ని రాశాడు. దానికి ఒక చరిత్ర యూరప్‌లో అప్పటికే వుంది. *విశ్వ సాహిత్యమాల* వారు గోర్కీ *నా బాల్యం గోర్కీ కథలు*, టాల్‌స్టాయ్ కథలు, చెహోవ్ కథలు, షోలహోవ్ *బీళ్ళు దున్నేరు, నాద్య* అనే కథల సంపుటాలని ప్రచురించారు. కథలతో బాటు *విశ్వసాహిత్యమాల* వారు మనోరంజకమైన రష్యన్ నాటకాలను కూడా ప్రచురించారు. *భయం, బలిదాన్, విజ్ఞాని పొలోవ్, ప్రతీకారజ్వాలలు, దక్షిణ పవనం, సోవియట్ స్త్రీ* లాంటివన్నీ అలా వచ్చినవే. టాల్‌స్టాయ్ రాసిన *జీసస్ సందేశం* కూడా ఆ కాలంలోనే వచ్చింది. దేశీయ తత్త్వశాస్త్ర గ్రంథాలతోబాటు రష్యన్ సాహిత్యాన్ని తెలుగులో విస్తృతంగా అనువాదం చేసుకున్నారు. విస్కియా రాసిన *'ఇంద్రధనుస్సు', 'ఆదర్శప్రేమ'* దేశభక్తి ప్రబోధించే ఉత్తమ నవలలుగా గుర్తింపు పొందాయి. టాల్‌స్టాయ్ రాసిన ప్రపంచ ప్రఖ్యాత నవలలన్నీ ఈ రోజున ఆంధ్ర పాఠకులకు అందుబాటులో వున్నాయి. దాస్తాయెవస్కీ, కుప్రైన్, చెహోవ్, గొగోల్, గోర్కీ, షోలహోవ్ లాంటి ఉద్దండుల

రచనలన్నీ తెలుగు పాఠకులని అందుబాటులోకి వచ్చాయి.

రష్యన్ సాహిత్యం పట్ల ఆసక్తి అలా కలిగింది. ఆ ఆసక్తిని అలానే నిలబెట్టటానికా అన్నట్టు అక్కడి విదేశీ ప్రచురణాలయం తెలుగులో కూడా అనువాదాలు చేయించి ప్రచురింపచెయ్యాలని సంకల్పించింది. ఆ సంస్థే తర్వాత ప్రగతి ప్రచురణాలయంగా మారింది.తెలుగు అనువాదకుల్ని అక్కడకు తీసుకువెళ్ళి రాజకీయ, తత్త్వశాస్త్ర గ్రంథాల అనువాదాలు చేయించి ప్రచురించింది. దాంతో బూతు సాహిత్య అనువాదాలనీ, చిన్న పుస్తకాలనీ, విజ్ఞానశాస్త్ర గ్రంథాలనీ ప్రచురించేది. స్వెత్యానాద్జెనిత్ తెలుగు శాఖ అధిపతిగా చేసిన కృషికి తెలుగువారు ఆమెకి రుణపడి వున్నారు. ఆవిడ తెలుగు శాఖకు అధిపతిగా బాధ్యతలు చేపట్టేనాటికి ఆవిడకు తెలుగు భాష అనేది ఒకటున్నదని కూడా తెలియదు. ఆ ప్రచురణాలయం ఆవిడని తెలుగు నేర్చుకొమ్మని పురమాయించింది. 'ఆ భాష తెలిసిన వాళ్ళు ఎవరన్నా ఇక్కడ ఉన్నారా' అని ఆవిడ ఆరా తీసింది. ఆ రకంగా అప్పటికే సోవియట్ యూనియన్‌లో స్థిరపడిన కొలచల సీతారామయ్య పరిచయం అయ్యారు. ఆయన ఉయ్యూరు వాసి. మొదట అమెరికా వెళ్ళారు. అక్కడ నుంచి సోవియట్ యూనియన్ వెళ్ళారు.

చందన తైలాల పరిశోధన చేసి ప్రఖ్యాత శాస్త్రజ్ఞునిగా ఖ్యాతి గడించారు. రష్యన్ పేరు పెట్టుకుని అక్కడి యువతినే వివాహం చేసుకున్నారు. తన కూతుళ్ళకి నీల, లీల అని పేర్లు పెట్టుకున్నారు. ఆయన ఆవిడకు తెలుగు నేర్పారు. అలా మాస్కో ప్రగతి ప్రచురణాలయంలో తెలుగు శాఖకు బీజావాసన జరిగింది. అప్పట్నుంచి తెలుగు అనువాదకులు అక్కడ పనిచేస్తూ వచ్చారు. ఉప్పల లక్ష్మణరావు, రాచమల్లు రామచంద్రారెడ్డి (రా.రా.) కొండేపూడి లక్ష్మీనారాయణ, నిడమర్తి ఉమా మహేశ్వరరావు, ఆర్వీయార్ అక్కడ పనిచేసి ఎన్నో గ్రంథాలని తెలుగులోకి అనువాదం చేశారు. గోర్కీ *అమ్మ* అక్కడ మళ్ళీ ముద్రితం అయింది. టాల్‌స్టాయ్ *అన్న కరేనినా* అనువాదం వచ్చింది. అంతకుముందే ఎప్పుడో తాపీ ధర్మారావు ఆ నవల సంక్షిప్త భాగాన్ని అనువాదం చేశారు. కాని మాస్కో అనువాదం పూర్తి నవలగా వెలువడింది. శ్రీశ్రీ మయకోవస్కీ లెనిన్ కావ్యాలను అనువాదం చేశారు. మాస్కోలో తెలుగు అనువాదాల ప్రచురణే కాక తెలుగును బోధించడం కూడా జరిగింది. చాలామంది రష్యన్లు తెలుగు నేర్చుకుని రష్యన్‌లోకి తెలుగు నుంచి అనువాదాలు చేశారు. మాస్కో రేడియోలో కూడా తెలుగు ఛానల్ పెట్టారు. లెనిన్‌గ్రాడ్ యూనివర్సిటీలో తెలుగు శాఖ వుండేది. ప్రొఫెసర్ సరోవ్ ఎంతమందికో శిక్షణ నిచ్చారు. దానివల్ల మరెంతమందో ప్రచురణాలయంలో పని చెయ్యడానికి వీలు కలిగింది. *ప్రగతి* ప్రచురణాలయం ఆ తరువాత రెండుగా విభజితమైంది. *రాదుగ* ప్రచురణాలయం ఆవిర్భవించింది. ఈ సంస్థలతో *మీర్* ప్రచురణాలయం శాస్త్ర సాంకేతిక గ్రంథాల తెలుగు అనువాదాన్ని ప్రచురించేది. అనేక సోవియట్ డాక్యుమెంటరీలు తెలుగు డబ్బింగ్‌లో ఆంధ్రదేశమంతటా ప్రదర్శనకు నోచుకున్నాయి.

ఇలా రష్యన్, ఇంగ్లీషు గ్రంథాలు అనువాదం అయ్యి తెలుగు నేల మీద ప్రాచుర్యం పొందాయి. వీటితోబాటు ఫ్రెంచి, జర్మన్ భాషలలో ప్రసిద్ధి పొందిన రచయితల గ్రంథాలు తెలుగులో వెలువడ్డాయి. విక్టర్ హ్యూగో, బాల్జాక్, మపాసా లాంటి మహనీయుల రచనలు తెలుగులో వచ్చాయి. మోలియర్ నాటకాలు తెలుగులోకి అనువాదం అయ్యాయి. ఫ్రెంచి కవిత్వం కూడా తెలుగులోని అనువాదం అయింది. డాడాయిజం, క్యూబిజం, సర్రియలిజం లాంటి అనేక 'ఇజాల'కి తెలుగులో చోటు దొరికింది. శ్రీశ్రీ "అధివాస్తవికుల ప్రవేశం" అంటూ పద్యాలే రాశారు. కొన్ని ఫ్రెంచి కవితలనీ అనువాదం చేశాడు. జర్మన్ భాష నుంచీ అనువాదాలు వచ్చాయి. ముఖ్యంగా చెప్పుకోవలసినవి బెర్టోల్డ్ బ్రెక్ట్ నాటకాలు.

ఇలా పాశ్చాత్య భాషల నుంచి ఎన్ని శాఖల నుంచో తెలుగులోకి అనువాదాలు వచ్చాయి. అయితే యీ అనువాదాలన్నీ ఆ మూలభాషల నుంచే నూటికి నూరు పాళ్ళు వచ్చాయని చెప్పడానికి లేదు. ఇంగ్లీషు భాష నుంచి నేరుగా తెలుగులోకి అనువాదం చేసుకునే సౌలభ్యం వుంది. కాని రష్యన్, ఫ్రెంచి, జర్మన్ భాషల నుంచి అనువాదాలు ఎక్కువగా ఇంగ్లీషు మాధ్యమం ద్వారా వచ్చాయి. ఫ్రెంచి, జర్మన్ భాషలు అనువాదకులకు రావని కాదు. ఆ భాషలు తెలిసిన వాళ్ళు వున్నా మూలం నుంచి అనువాదం చేసేటంత పటిమ వుండకపోవచ్చు. ఆ కారణంగా ఇంగ్లీషు భాషలో ఆ భాషల గ్రంథాలు వెలువడితే వాటి ఆధారంగా తెలుగులో అనువాదం చేసుకోవడం జరిగింది. దీనివల్ల కొన్ని సందర్భాల్లో ఇబ్బంది ఎదురవకపోలేదు. సంజ్ఞావాచకాలకి సంబంధించి ఈ చిక్కు ఎదురైంది. ఉదాహరణకు ప్రఖ్యాత

రచయిత టాల్‌స్టాయ్‌నే తీసుకుందాం. రష్యన్‌లో 'ట' లేదు. ఆయన పేరు 'తోల్‌స్టాయ్', 'వెల్' ఆయన పేరు. కౌంట్ లియోటాల్‌స్టాయ్‌గా మన దేశభాషలలో వ్యవహరిస్తూ వుంటారు. ఇంగ్లీషు నుంచి సంక్రమించిన ఉచ్చారణ వల్ల టాల్‌స్టాయ్ అని తెలుగులో మారుస్తున్నారు. రూఢిలో ప్రసిద్ధమైన 'తోల్‌స్టాయ్' అని అసలు రష్యన్ ఉచ్చారణ రాస్తే తెలుగు పాఠకులకి వింతగా అనిపించవచ్చు. అలాగే 'స్టాలిన్'. 'స్తాలిన్' అనాలి. కాని స్థిరపడిపోయిన సందర్భంలో మార్పు చేయడం కష్టం. ఇలాంటి చిక్కులు నేరుగా మూలం నుంచే అనువాదం చేసుకుంటే బాధించవు.

పాశ్చాత్య భాషల నుంచి తెలుగులోకి వచ్చిన అనువాదాల గురించే ముచ్చటించుకున్నాం కాని తెలుగు నుంచి ఆ భాషల్లోకి జరిగిన అనువాదాల సంగతి మిగిలే వుంది. తెలుగు నుంచి ఇంగ్లీషులోకి అనువాదాలు జరిగాయి. ప్రపంచవ్యాప్త గుర్తింపు దక్కాలంటే ఇంగ్లీషులోకి అనువాదం కావలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకుగాను విశ్వవిద్యాలయాలు, ప్రముఖ సాహిత్య సంస్థలు, ప్రచురణ సంస్థలూ ఎంతో కృషి చెయ్యాలి. అలాంటి కృషి జరిగితే తెలుగు సాహిత్య ఔన్నత్యం అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడుతుంది. తెలుగు నుంచి ఇంగ్లీషులోకి ప్రాచీన కావ్యాల దగ్గర్నుంచి ఆధునిక రచనల దాకా అనువాదం అవుతూ వున్నాయి. ఇటీవలి కాలంలో వీటి సంఖ్య పెరుగుతూ వచ్చింది.

తెలుగు కావ్యాల అనువాదం జరిగింది. వెల్చేరు నారాయణరావు, డేవిడ్ షుల్‌మన్ "క్లాసికల్ తెలుగు పొయిట్రీ" అని కొన్ని అనువాదాలు చేశారు. శ్రీనివాస్ శిష్లా శ్రీకృష్ణదేవరాయలవారి *ఆముక్తమాల్యద*ని, అల్లసాని పెద్దనామాత్యుని *మనుచరిత్ర*ను పూర్తిగా అనువాదం చేశారు. ఇంతటి బృహత్తరమైన కృషి ఎలా జరిగిందీ ఆయనే "పర్సనల్ నోట్"లో వివరించారు. (దృశ్యకళాదీపిక ప్రచురణ).

శ్రీశ్రీ తన కవిత్వాన్ని ఇంగ్లీషులోకి అనువాదం చేసుకున్నాడు. కాని అది ఆ భాషలో అంతగా అలరించలేదని విమర్శకులు అంటారు. అనువాదాలకి సంబంధించి ఇలాంటి సొద్లు అందరికీ అన్నివేళలా వుంటూనే వుంటుంది. ఇవాళ్టికీ మకుటాయమానంగా వున్న గురజాడ *కన్యాశుల్కం* నాటకం ఇంగ్లీషులోకి అనువాదం అయింది. ఎస్.ఎస్. జయంతి అనువాదం చేశారు. ఆ తర్వాత యింకా రెండు మూడు అనువాదాలు ఇంగ్లీషులోకి వచ్చాయి. కథలూ, కవిత్వమూ ఫరవాలేదు అనే స్థాయిలోనే ఇంగ్లీషులోకి అనువాదం అయ్యాయి. *మోడర్న్ తెలుగు షార్ట్ స్టోరీస్* అన్న పేరుతో ఒక సంకలనాన్ని వి.పతంజలి, ఎ. మురళీధర్ కూర్చారు. దాన్ని జైన్ పబ్లిషర్స్ ప్రచురించింది. *ఎనదర్ బంచ్ ఆఫ్ తెలుగు స్టోరీస్* అని ఎమ్.వి. శాస్త్రి తెలుగు కథల ఇంగ్లీషు అనువాదాలని ప్రచురించారు.

*దట్ మేన్ ఆన్ ది రోడ్* అని వి.పి.రంగారావు అనువాదం చేసిన తెలుగు కథల సంకలనాన్ని 'పెంగ్విన్ బుక్స్' ప్రచురించింది. ఆయన అంతకుముందు 1995లో *క్లాసిక్ తెలుగు స్టోరీస్* అన్న సంకలనాన్ని కూర్చారు. దగ్గర దగ్గర 36 మంది రచయితల కథలు యీ రెండింటిలోనూ వచ్చాయి. ఇటీవలే వేల్చేరు నారాయణరావు డేవిడ్ షుల్‌మన్ చాసో (చాగంటి సోమయాజులు) కథల్ని ఇంగ్లీషులోకి అనువాదం చేసి ప్రకటించారు. ఆ సంకలనానికి *డాల్స్ వెడ్డింగ్* అని పేరు పెట్టారు. అందులో 20 కథలు వున్నాయి. వెల్చేరు నారాయణరావు కవిత్వ అనువాదాన్ని ప్రచురించారు. గురజాడ *కన్యాశుల్కం* ఇంగ్లీషు అనువాదాన్ని తీసుకు వచ్చారు. మాక్మిలన్ సంస్థ కూడా తెలుగు అనువాదాలని ప్రచురించింది. కవిత్వం అనువాదాలలో శ్రీశ్రీ తనే అనువాదం చేసుకున్న విషయం ప్రస్తావించుకున్నాం. ఎస్.ఎస్. ప్రభాకరరావు, శ్రీశ్రీ, దాశరథి, తిలక్ లాంటి వారి కవితల్ని అనువాదం చేశారు. కలకత్తా రైటర్స్ వర్క్‌షాప్ ప్రచురించారు.

తెలుగు నుంచి రష్యన్‌లోకి కథలు, కవిత్వం అనువాదం అయ్యాయి. జోర్స్‌వెత్సునిచేవ్ గురజాడ కవితల్ని *కన్యాశుల్కం*ను, కొడవటిగంటి కుటుంబరావు కథల్ని రష్యన్‌లోకి అనువాదం చేశారు. ఓ సంకలనానికి కాళీపట్నం రామారావు *జీవధార* కథని శీర్షికగా పెట్టారు. ఇలా చెప్పుకోవాలంటే యీ వ్యాసం సరిపోదు. ఇక్కడ గమనించవలసిన ముఖ్యమైన అంశం యేమిటంటే అనువాదాలు భిన్న భాషల మధ్య, సంస్కృతుల మధ్య ఎలా వారధులుగా పనిచేస్తున్నాయన్నదే. ప్రచురణ సంస్థలూ ఈ మహాయజ్ఞంలో తమ వంతు కృషి చేస్తున్నందుకు అభినందించాలి. ఈ కృషి యిలానే సాగుతూ మరింతగా ఫలవంతం కావాలని కోరదాం. ®

---

**ఆర్. వెంకటేశ్వరరావు (ఆర్వీయార్)**

# అట్టమీద బొమ్మలు

వర్తక వాణిజ్యాలకే కాదు గోదావరి తీర ప్రాంతమైన పాలకొల్లు ప్రజ్ఞాదురంధరులైన కళాకారులకు, చిత్రకారులకు ప్రసిద్ధి. అందుకొక మచ్చుతునకగా 1959వ సంవత్సరంలో జన్మించారు మార్లపూడి ఉదయకుమార్. అక్షరమాల నేర్చుకునే ముక్కుపచ్చలారని వయసులోనే, మొదటిసారిగా, ఆ ప్రాంతాలలో ప్రయాణానికి విరివిగా ఉపయోగించే గుఱ్ఱపుబండి చిత్రాన్ని వేసి అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేశారు. పండ్లూడని పసివయస్సులోనే రాష్ట్రస్థాయి చిత్రకళా పోటీలో పాల్గొని తాజ్‌మహల్ ముందు జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ గులాబి పరిమళాన్ని ఆఘ్రాణిస్తున్న షాజహాన్ బొమ్మను వేసి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇక అక్కడ నుంచి ఇప్పటి వరకూ లెఖ్ఖకుమించిన చిత్రాలను వేసి ప్రజాదరణ పొందుతూ వచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీలో చిత్రకళా కోర్సు చదువుతూ, విద్యార్థి దశలో వేసిన *ఊర్వశీ–పురూరవ, విదుర పత్ని, నా తరమా భవసాగరమీదుట*, ఇలా పురాణ, మైథలాజికల్ మకుటాలతో వేసిన అనేక చిత్రాలు ఆయనలోని మౌలిక సృజనాత్మకు అద్దంపడతాయి. పాలస్తీనా విమోచనోద్యమంపై ఆయన వేసిన పోస్టర్ డిజైన్స్ అంతర్జాతీయంగా ప్రశంసలందుకుంది. అంతేకాకుండా తండ్రి ఆశయాలకు అనుగుణంగా సారా వ్యతిరేక ప్రచారానికి అనుగుణంగా పెద్ద పెద్ద చిత్రాలను వేశారు. అలానే పర్యావరణ సంరక్షణపై, నీటికాలుష్యంపై, ఎయిడ్స్ మహమ్మారిపై చిత్రాలు వేసి సామాజిక సేవకునిగా తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. తెలుగు ప్రపంచ మహాసభల్లో ఆయన వేసిన పంచభూతాలు మొదలైన చిత్రాలు ఎందరినో ఆకర్షించాయి. క్రైస్తవ, ఆడియో గీతాల క్యాసెట్‌లపైన *'నీ శిలువ కొమ్మపై ఒక కోయిల'* చిత్రాన్ని వేసి అందరినీ అలరించగలిగారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్వీయప్రతిభతో రాణిస్తున్న ఉదయకుమార్ 1991వ సం॥లో తన స్వగ్రామమైన పాలకొల్లులో 'హరివిల్లు ఆర్ట్ అకాదెమి'ని స్థాపించి చిత్రకళా రంగాన్ని ప్రోత్సహిస్తూ, పోటీలు నిర్వహిస్తూ, ఔత్సాహిక కళాకారులను తీర్చి దిద్దుతూ తన వంతు సేవలందిస్తున్నారు. ఆయన శైలి ఇదమిత్థంగా ఇదీ అని చెప్పటం కష్టం. ఎందుకంటే స్వీయ ప్రతిభను తూచే కొలమానాలు ఎవరివద్దా లేవు. స్వయం ప్రకాశమైన వెలుగుకు పేరు పెట్టగలమా? లోపలిపేజీలోని చిత్రాల వివరణలు ఆయన మాటలలోనే విందాం:

1. పై చిత్రంలోని భావం చాలా గంభీరమైనది. యేసుప్రభువు గలిలయ సముద్ర తీరాన నడుస్తుండగా పేతురును, అతని సహోదరుడైన అంద్రెయ అనే ఇద్దరు సోదరులను చూచాడు. వీరిది గలిలయ సముద్ర తీరాన్నగల బెత్సయిదా అనే పట్టణం. గలిలయ సముద్ర తీర వైశాల్యం ఉత్తరాన్నుండి దక్షిణాదికి 13 మైళ్ళు పొడవు. తూర్పు నుండి పడమటికి 7 మైళ్ళు వెడల్పు అని చరిత్ర చెబుతోంది. ఆ ప్రదేశం బహు సారవంతమైనది. హెర్మోను పర్వత నీడలు, దాని నీలి ఛాయ నిత్యం నీళ్ళపై ప్రతిబింబిస్తాయి. పేతురు, అంద్రెయలు జాలరులు. "ఆయన నా వెంబడి రండి, మిమ్ములను మనుష్యులను పట్టే జాలరులుగా చేస్తానని వారితో చెప్పాడు. వెంటనే వారు తమ వలలను విడిచిపెట్టి ఆయనను వెంబడించారు". పేతురు అంద్రెయలు గొప్ప పండితులు కారు, పలుకుబడి గలవారు కాదు, ధనధాన్యాదులు గలవారు కూడా కాదు. విద్యలేని పామరులు. అతి సామాన్యులే కాని సోమరులు కారు. కష్టజీవులు, పనియందు శ్రద్ధ గలవారు, నిపుణులు. వారు తమ సమస్తాన్ని విడిచిపెట్టి ప్రభువు యొద్దకు వచ్చారు. దేవుని సేవలో వారు సంపూర్ణంగా తమ సమయాన్ని, శక్తిని వినియోగించారు. ఆయనను వెంబడించడం అనగా ఆయన అడుగుజాడల్లో నడవడం. ఆయన చూపిన మార్గాన్ని అనుసరించడం. అయితే ఈ శిష్యులకు చేపలు పట్టడం తెలుసు గాని, మనుష్యులను పట్టడం తెలియదు. వీరు శాస్త్రాలు ఎరిగినవారు కాదు. అయినా వారి విధేయత, శ్రమపడే మనస్సు, దేవుని రాజ్య సంబంధమైన పనిలో అసమాన్యులుగా చేసింది. మనుష్యులను పట్టే జాలరులంటే మానవుల్ని పాపాన్నుండి మళ్ళించి క్రీస్తుచెంతకు, శాశ్వత రక్షణకు తీసుకొని రావడం. ఇది అత్యంత ఘనకార్యం. వీరిని మనుష్యులను పట్టే జాలరులుగా చేసింది క్రీస్తే. అది వారి స్వభావాల్లో నుండి రాలేదు. అది వారు క్రీస్తును అనుసరిస్తూ ఉండగా ఆయన వారిని అలా తయారు చేసాడు. ఆయనను అనుసరించేవారిని ఎవరినైనా సరే ఆయన అలానే చేయగలరు. జాలరుల విధేయత, సమర్పణ, త్యాగం వారికి కీర్తిని తెచ్చి పెట్టింది.



అంద్రెయ

2. ఈ చిత్రంలో నిత్యజీవం కొరకు వచ్చిన ధనవంతుడైన యౌవనస్తుడు కనిపిస్తున్నాడు. నిత్యజీవనానికి వారసుడనగుటకై నేనేం చేయాలి? అని అడిగాడు. యేసు ప్రభువువారి ఆజ్ఞలు పాటించమన్నారు. అవి చేస్తూనే ఉన్నానన్నాడు. నీ ఆస్తిని అమ్మి బీదలకిమ్ము, నీవు వచ్చి నన్ను వెంబడించు అన్నాడు. మంచి క్రియలు చేసి నిత్యజీవనం సంపాదించాలని అతని ఉద్దేశ్యం. నిత్యజీవనం మంచిక్రియల ద్వారా కలిగేది కాదు. క్రియల ద్వారా ఎవరూ రక్షణ పొందలేరు. యేసుక్రీస్తు దేవుడని నమ్మడం ద్వారానే ఆ భాగ్యం దొరుకుతుంది. ఆ యౌవనస్తుని మనస్సంతా తన ఆస్తిమీదే ఉంది. యేసు తన శిష్యులను చూచి "ధనవంతుడు దేవుని రాజ్యంలో ప్రవేశించుటకంటే సూది బెజ్జములో ఒంటె దూరుట సులభం" అని చెప్పాడు. శిష్యులు ఈ మాటలకు ఆశ్చర్యపడ్డారు. అలాగయితే ఎవడు రక్షణ పొందగలడని అనుకొంటుండగా "ఇది మనుష్యులకు అసాధ్యమే గాని దేవునికి సాధ్యం" అన్నాడు. మి



ధనవంతుడు

# కూచిపూడి : ఇతిహాస కథలు

**- భాగవతుల వెంకటరామ శర్మ**



**నేను** భాగవతుల యజ్ఞనారాయణ శర్మ, లక్ష్మీతులశమ్మ దంపతుల ప్రథమ పుత్రుడను. నా పేరు భాగవతుల వెంకటరామ శర్మ. నేను చిన్నతనం నుండి మా తండ్రి వద్ద కూచిపూడి నాట్యాన్ని, భరతనాట్యాన్ని మా తండ్రి మరియు సీతారామమ్మ వద్ద, మా బావగారైన జోస్యుల వెంకటాచలపతి వద్ద అభ్యసించాను. అలాగే మా అమ్మాయి సౌమ్య నాదగ్గర నాట్యాభ్యాసం చేసి, మా తండ్రి వద్ద కూడా కొన్ని మెళకువలను నేర్చుకొన్నది. మా కుమారుడు శ్రీరామ్ కూడా నావద్ద నాట్యాభ్యాసం చేస్తూ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మా సతీమణి శ్రీవల్లి కూడా ఎక్కువ నాట్య ప్రదర్శనలివ్వకపోయినా నాట్యం మీద మక్కువతో నావద్ద నేర్చుకొంటూ నాట్యంలో కూడా నాకు తోడుగా ఉంటున్నది. మా తండ్రి ప్రోద్బలంతో *శ్రీ నృత్య ఆర్ట్ అకాడమీ* అనే పేరుతో నాట్యాలయాన్ని స్థాపించి ఎందరెందరో విద్యార్థులకు నృత్యశిక్షణనిస్తూ, ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నిర్వహించు సర్టిఫికెట్, డిప్లొమా కోర్సులకు పంపడమే కాక విశ్వవిద్యాలయ స్థాయిలో ఎం.ఏ కోర్సుకు కూడా పంపడం, ఎంతో మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులవడం జరిగింది. నా చిన్నతనంలో కూచిపూడిలో నేను నేర్చుకున్న *భక్తప్రహ్లాద, ఉషాపరిణయం* వంటి యక్షగానాలే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా నూతన నృత్యరూపకాలు చెయ్యాలనే సంకల్పంతో *సమతాజ్యోతి, విశ్వశాంతి, జోగిని, పరిణామక్రమం,* ఇలా అనేక రకాల సామాజిక కథాంశాలతో రూపొందించగా, చాలా మంది సామాజికాంశాలు కూచిపూడిలో అంత రాణించవు అని అన్నా ఎంతో పట్టుదలతో వాటిని చేసి సఫలీకృతుణ్ణయ్యాను. ఐతే కూచిపూడి శైలిలోనే సంప్రదాయం చెడకుండా వాటిని క్రొత్త దృక్పథంతో రూపొందించాము. విజయం అనేది మనమిచ్చే సందేశాన్ని చక్కగా రూపకల్పన చేయడంలో ఉంటుంది అని నా భావన. ఈ *సమతాజ్యోతి* రూపకాన్ని రచించినవారు స్టాన్లీ, సంగీతం జి.వి. ప్రభాకర్, అలాగే విశ్వశాంతికి పెమ్మరాజు సూర్యారావు సంగీతం చేశారు. *పరిణామక్రమం* నృత్యరూపకానికి రచన ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, సంగీతం సూర్యారావు. ఇంకా *మమతావర్షిణి,* అనే రూపకాన్ని హేమలతా లవణం రచించగా, కె. సూర్య నారాయణ సంగీతం చేశారు. స్త్రీయొక్క ఔన్నత్యాన్ని గూర్చి చెప్పే కథాంశం ఇది. అలాగే *పరిణామక్రమం* రూపకం మానవుడు ఎలా జన్మించాడు ఎలా పెరిగాడు ఎంతగొప్ప వాడయ్యాడు, విజ్ఞానాన్ని దుర్వినియోగం చేసి అణుబాంబులు వంటివి తయారుచేసి విశ్వవినాశనానికి ఎలా కారకుడయ్యాడు అనే కథాంశంతో సాగుతుంది. ముఖ్యంగా ఇటువంటి విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన రూపకాల కల్పనలో ముద్రలతో, అభినయంతో చూపలేని కొన్ని విషయాలను వెనుక తెరమీద స్లైడ్ షోతో వేసి చూపించేవాళ్ళం. ఈ తరహా ప్రక్రియలు కూచిపూడిలో ఇంతకు ముందు లేవు. ఇక సంప్రదాయ పౌరాణిక ఇతిహాసాలైన కథాంశాలతో *రామాయణం, భగవద్గీత, అష్టలక్ష్మీదర్శనం, గౌతమబుద్ధ, లీలాకృష్ణం, ఋతుసంభవం* మున్నగునవి చేసియున్నాము. వీటిలో *భగవద్గీత* నేను తయారు చేస్తున్నపుడు చాలామంది ఇది పురాణానికో, హరికథకో ఈ ఇతి వృత్తం బాగుంటుంది గానీ, నృత్య నాటకానికి సరిపోదని నన్ను వారించారు. ఐనా పట్టుదలతో ఈ *భగవద్గీత* ఎలా చేస్తే జనామోదం పొందగలము అని ఆలోచించి, గీత శ్లోక ప్రధానమైనది. దీనిని దరువుల రూపంలో ఎలా చూపించగలం? అనుకొని చావలి పేరమ్మనే ఆవిడ ఇచ్చిన స్క్రిప్ట్‌ని తీసుకొని, కొన్ని శ్లోకాలుగా, కొన్ని పాటలుగా కొన్ని వచన రూపంలోనూ విభజించి, కథాంశాన్ని ఎత్తుకుంటూనే గీతోపదేశం కాకుండా కూచిపూడి నాటకీయత కోసం శ్రీకృష్ణుని రాయబారం నుండి తీసుకుని, ఆ రాయబారం విఫలమవడం, యుద్ధం అనివార్య మవడం, బంధువులను, గురువులను చంపలేక అర్జునుడు విరక్తినొందగా, కృష్ణుని గీతోపదేశంతో అతడు ప్రేరణ పొంది కార్యోన్ముఖుడై యుద్ధం చేయడం, అనంతరం పాండవ విజయం సంభవించడం వంటి రసవత్తర సన్నివేశాలను కూర్చి రూపకల్పన చేశాము. ఈ నృత్యనాటకం అందరి అంచనాలనూ మించి అత్యంత ప్రజాదరణ పొందడమేకాక '2004వ సంవత్సరానికి గాను ఉత్తమ కూచిపూడి నృత్య నాటకంగా, బంగారు సిద్ధేంద్రయోగిని' మాకు తెచ్చి పెట్టింది. ఇది మా అందరికీ గర్వకారణం, దీనికి సూర్యనారాయణ సంగీతాన్ని సమ కూర్చారు. అలాగే *లీలాకృష్ణం, మోహినీవిజయం, అష్టలక్ష్మీ దర్శనం, గౌతమబుద్ధ, వరూధినీ ప్రవరాఖ్య* వంటివి మన సంప్రదాయంలోనే దరువులు, ప్రవేశ దరువులు, కందార్థాలు మున్నగు ప్రక్రియలు చేర్చి రూపొందించాము. వీటిలో కొంతవరకు నేను యక్షగాన పద్ధతిలోనే వెళ్ళినా కాలానుగుణంగా, సమయాభావం వల్ల,

సూత్రధారుడు ప్రతిసారీ లేచి వచ్చి సంధివచనాలు చెప్పి పాడి వెళ్ళడం ఇలాంటివి కుదరవు కనుక మనకిచ్చిన సమయంలోనే మనమనుకున్న విషయాన్ని సరిగ్గా చూపించగల్గడమే ప్రధానంగా నృత్యరూపక పద్ధతిలోనే ఎక్కువ శాతం రూపొందించాము. కూచిపూడి సంప్రదాయంలోని ఘనత వల్లే అనగా అడుగులు, పదవిన్యాసం, జతులు మొదలైన మన శైలివల్లే వీటికి విజయం చేకూరింది అని నా నమ్మకం. మాకు ఈ విజయాలకు తోడ్పాటునందించిన వారి వివరాలు చెప్పడం ధర్మం కనుక వాటిని మీ ముందుంచు తున్నాను. *లీలాకృష్ణం, రామాయణం* నృత్యరూపకం ఎస్.సి.హెచ్. జగన్నాథాచార్యులు రచించగా మధురమైన సంగీతాన్ని మండా కృష్ణమోహన్ అందించారు. *రామాయణం* నృత్యరూపకం ఎస్.సిహెచ్. జగన్నాథాచార్యులే రచించారు. అద్భుతమైన సంగీతాన్ని పెమ్మరాజు సూర్యారావు సమకూర్చారు. ఇది రాముని జననం నుండి వనవాసం, అనంతరం పట్టాభిషేకం వరకు సుమారు 2 1/2, గంటలు సాగే నృత్యరూపకం. తరువాత పోలవరపు కోటేశ్వరరావు రచన *గౌతమబుద్ధ* ఇందులో బుద్ధుని జననం నుండి మహాపరినిర్వాణం వరకు కథాక్రమం సాగుతుంది. దీనికి కె.సూర్యనారాయణ సంగీతం చేశారు. *అష్టలక్ష్మీదర్శనం* పైడిపాటి సుబ్బరామ శాస్త్రిగారు రచించగా ఉదయ కుమార్‌గారు సంగీతం చేశారు. దీనిలో భామాకలాప ప్రవేశ దర్వు ఆధారంగా ప్రతిలక్ష్మి తన గొప్పతనాన్ని చెప్పుకుంటూ సాగే ప్రవేశ దరువులతో రూపొందించాము. *గజేంద్ర మోక్షం* నృత్యరూపకాన్ని బసవయ్యగారి రచనలో సూర్యనారాయణ సంగీతంలో రూపు దిద్దుకున్నది. అలాగే *వరూధినీ ప్రవరాఖ్య, వివేకానంద* నృత్య రూపకాలను పింగళి వెంకట కృష్ణారావు రచించారు. *వరూధినికి* ఎస్.సి.హెచ్ బుచ్చాచార్యులు, *వివేకానందకు* సూర్యనారాయణ సంగీతాన్ని అందించారు. వీరందరి సమిష్టి కృషితో నాకీ విజయాలు లభించాయిగానీ నా ఒక్కడితోనే ఏదీ జరగదు. ఎందుచేతనంటే మాకు కావలసిన శైలిలో కవులు రచించడం, వాటిని మా బాణీలోకి సంగీత రచనలు చేయడం వంటివి అతి ముఖ్యమైన విషయాలు. ఏ నృత్య ప్రదర్శనకైనా సంగీతం ప్రాణం. నాటి భామాకలాపం నేటి వరకు పటిష్ఠంగా నిలబడడానికి కారణం చక్కని సాహిత్యం. దానికి తగిన సంగీతం అని నా ప్రగాఢ విశ్వాసం. ఈ సృజనాత్మక కళలలో ఈనాడు నేను చేసిన నృత్యీకరణలు 20 సంవత్సరముల తరువాత మార్పుచెంది కొత్తనీరు వచ్చి పాతనీరు స్థానే నిలచినట్లు అప్పటికి ఆకర్షణీయంగా ఉన్న అడుగులు విన్యాసాలు చోటుచేసుకోవచ్చు. కానీ నీలమేఘశరీర వంటి నారాయణ తీర్థుల తరంగాలు నేటికీ చెక్కుచెదరకుండా ఈ రోజువరకు నిలబడిన వంటే దానికి కారణం ఆ మహోత్కృష్టమైన సంగీత సాహిత్యాలే! ఈనాటి కళాకారులకు నేను చెప్పేదేమిటంటే సంప్రదాయబద్ధంగా గురుపరంపరలో నేర్చిన అంశాలను యథాతథంగా చేస్తూ మనలోని సృజనాత్మకతకు సాన పెట్టుకోవడానికి ఎన్నో నూతనాంశాలు, ఇతర వాగ్గేయకార రచనలు, ప్రాచీన వాగ్గేయకారుల రచనలు అన్నిటినీ తీసుకొని వాటిలో నృత్యాభినయానికి సరిపోయే పాటలను ఎంచుకొని వాటికి నాట్యాన్ని కూర్పుచేసుకోవడం, మనకి శక్తి ఉందికదా తెలివి ఉంది కదా కొత్త జతి రాసి బ్రహ్మాంజలి వంటి అంశంలో చేరుస్తాను అనడం తప్పు. అలాకాకుండా పాతవాటిని మార్పుచేయకుండా నూతన ప్రక్రియలు చేపట్టాలని నా అభిప్రాయం. సమాజంలో నాటికీ నేటికీ ఎన్నో మార్పులొచ్చాయి. కనుక వాటిని దృష్టిలో ఉంచుకొని అంటే ఆనాడు భామాకలాపం మూడు రాత్రులు ప్రదర్శించారు కనుక మేము కూడా ప్రదర్శిస్తాం అంటే చూసేవాళ్ళు ఈనాడు ఎంతమందున్నారు? అలా పరిస్థితులను బట్టి ఇచ్చిన సమయాన్నిబట్టి చూపించాలనుకొన్న అంశాలను ఆ సమయంలోనే పూర్తి చేసేటట్టు చేసుకోవడం, అలాగే చినసత్యం వంటి వారునూ ఆ భామాకలాపాన్ని అంశాలుగా విభజించి ఈ కాలానికి తగినట్లుగా ప్రదర్శిస్తున్నారేమో? అని నేననుకొంటున్నాను. ఈనాడు మనకు అందుబాటులో ఉన్న వనరులన్నీ సమృద్ధిగా వాడుకోవడం మనకి రావాలి. నేను భరతనాట్యం నేర్చుకొని, ప్రభుత్వం సంగీత కళాశాలలో నాట్యాచారుడిగా పనిచేస్తూ అనేక నృత్యాంశాలకు రూపకల్పన చేశాను. నృత్యరూపకాలు మాత్రం కూచిపూడి శైలిలోనే చేశాను. నాకున్న నృత్యరూపకాలూ సమానమే. ఇష్టమే! ఐతే వాటన్నింటిలోనూ సుమారు 80 ప్రదర్శనలిచ్చి ఎక్కువ సార్లు ప్రదర్శింపబడినది మాత్రం *భగవద్గీత*. నేటి తరంవారు ఈ నాట్యాన్ని చక్కగా అభ్యసించి దీనిని మరింత వృద్ధిలోకి తీసుకురావాలని, దానికి ప్రభుత్వం, మీడియా వంటివి సహకరించి మరెన్నో కూచిపూడి నాట్యం గురించి అవగాహన కల్పించే సదస్సులు, సమావేశాలు, ప్రదర్శనలు, ప్రయోగాత్మక ప్రదర్శనలు వంటివి జరిగి ఈ కళ దినదినాభివృద్ధిగా వెలుగొందాలని ఆకాంక్షిస్తున్నాను.



కూచిపూడి నృత్యం అనన్య

# గాలిని గాలిలో చిత్రీకరించడమే సంగీతం

- అజేయ చక్రవర్తి

**భా**రత శాస్త్రీయ సంగీత గాయకుడు అజేయ చక్రవర్తి బడే గులాం అలీఖాన్ కొడుకు మునావర్ అలీఖాన్‌కి శిష్యుడు. పాటియాలా ఘరానాకు చెందిన వాడని కొందరు అంటుంటారు. 'గుజరీ తోడి రాగం పాడడంలో సిద్ధహస్తుడని సంగీతజ్ఞులు పేర్కొంటున్నారు. ఒక సంగీత కుటుంబంలో 1952లో పుట్టిన అజేయ చక్రవర్తి మొదటి వరుసలో కూర్చునే ప్రసిద్ధ గాయకులలో ఒకరు. బి.బి.సి, పాకిస్థాన్ ప్రభుత్వాల ఆహ్వానం మేరకు సంగీత ప్రదర్శన యిచ్చిన మొదటి భారతశాస్త్రీయ గాయకుడు. శాస్త్రీయ, ఉపశాస్త్రీయ, సుగమ్, భక్తి, నజ్‌రుల్, బంగ్లా మొదలైన గీతాల్ని భావయుక్తంగా పాడడంలో ప్రతిభాశాలి.

**విజయశంకర్ మిశ్రా మాటా-మంతి:**

**నేటి సంగీతం, సంగీతకారులు, సంగీత విద్యలయొక్క పరిస్థితి గురించి మీ అభిప్రాయం తెలియజేయగలరా?**

భారతీయ శాస్త్రీయ సంగీతం నేర్చుకోవాలంటే కఠిన సాధన చేయాలి. ఎందుకంటే సంగీతం, సంస్కారంతోనే ఉత్పన్నమౌతుంది. ఇందులో సంగీత సాధకుడి యొక్క సకారాత్మక, నకారాత్మక ఆలోచనలు సంబంధపడి వుంటాయి. సంగీత గుణాల్ని అందరూ గానం చేస్తారు. ఇది ఒక మంచి కళగా నేర్చుకోవాలనే విషయాన్ని అంగీకరిస్తారు. అయితే తమ పిల్లలకు సంగీతం నేర్పించాలనే ప్రయత్నం మాత్రం చాలా తక్కువ మంది చేస్తారు. సమాజంలో పెళ్లి అనివార్యతను స్వీకరించినట్టే, వంశోద్ధరణ కోసం ఒక బిడ్డను పుట్టించుకున్నట్టే, తరిగిపోతున్న సంగీత సంప్రదాయం విషయంలో మాత్రం ఆలోచించడం లేదు. సంగీతకారులు దీనికి సమాధానం ఇవ్వాలి, లేకుంటే భవిష్యత్తరాలు వారిని క్షమించవు.

సంగీతం స్వకేంద్రీయ కళ అనే విషయాన్ని నేను వ్యతిరేకించను. అయితే హిమాలయ గుహల్లో కూర్చొని తపస్సుచేసే సాధువులకు మోక్షం గురించి తప్ప ఇతర ఏ సామాజిక భూమిక గురించి ఆలోచించలేరా? ఇదే అంశం సంగీతజ్ఞులకూ వర్తిస్తుంది. మనం నివసిస్తున్న సమాజం పట్ల మన బాధ్యత వుంది. మీరు నేర్చుకున్నారు, పాడారు. ఈ ప్రపంచం విడిచి వెళ్ళిపోయారు. దీని అర్థం మీరు మీ గురించి మాత్రమే ఆలోచించారు. మీరెలా అయితే ఇంకొకరి వద్ద సంగీతం నేర్చుకొని దివ్యానందాన్ని అనుభవించారో, అలాగే ఇతరులకు కూడా ఈ దివ్యానంద అనుభూతిని ఇవ్వవలసిన బాధ్యత మీదే.

మనం యీ ప్రపంచంలో జీవిస్తున్నాం. ఈ భూమిపై నివసిస్తున్నాం. ఇక్కడి గాలిని శ్వాసిస్తున్నాం. ఇక్కడి ఆహారాన్ని, నీటిని తిని, త్రాగి ప్రాణాలతోవున్నాం. సూర్యుని ద్వారా వెలుగు పొందుతున్నాం, పూలవాసనతో ఆనందాన్ని, వెన్నెల సుఖాన్ని అనుభవిస్తున్నాం. ఇలాగే ఈ విశ్వ సమాజం పట్ల మనకూ బాధ్యత ఉంది. ప్రకృతి నుంచి ఈ సుఖాలన్నీ ఉచితంగా పొందుతున్నాం. ఇప్పుడు నీరు అమ్మకపు వస్తువైంది. ఇది వేరే విషయం. ముఖ్య విషయం ఏమిటంటే- సంగీతాన్ని నేను నిర్మాణాత్మక అవసరంగా భావిస్తూ దీనిని అందరూ నేర్చుకోవాలని కోరుకొంటున్నాను. ప్రపంచంలోని ప్రతి పనిలో సంగీతాత్మకత వుండొచ్చు గాక, చెప్పడంలో కావచ్చు, ఆలోచించడంలో కూడా. ఎవరైతే శక్తి వంతులో, దీని అర్థాన్ని అభివృద్ధిపరచే ఏర్పాట్లు చేయగలరో వారంతా సంగీతం పట్ల ఉదాసీనంగా ఉంటున్నారు. కాబట్టి ఈ బాధ్యతను సంగీతకారులు తమ భుజాన వేసుకొని ఈ కళను అభివృద్ధి చేస్తూ వెళ్లాలి.

**మీరు సంగీతాన్ని ఒక నిర్మాణాత్మక అవసరం అని ఏ ఆధారంతో అంటున్నారు?**

ఈ విషయం పట్ల నా ఆలోచన చాల స్పష్టంగా ఉంది. ప్రపంచంలోని ప్రతి మనిషీ సంగీతకారుడు కాలేడనే విషయం నాకు తెలుసు. కాకూడదు కూడాను. దీనికి బదులు సంగీత సంస్కార గుణాలు ప్రతివ్యక్తిలో ఉండాలి. ఎందుకంటే ఎవరి మనసులో అయితే స్వర- లయలుంటాయో వారు అరాచకులుగా మారరు. హింసకు, పాల్పడరు, లంచ గొండులుగా మారరు. సంగీతం మనిషిలో మానవత్వాన్ని వికసింప చేయడంలో సహాయపడుతుంది. సంగీతం మానసిక గుణాల్ని వికసింపజేస్తుంది. అందుకని నేను సంగీతాన్ని నిర్మాణాత్మక విద్యతో చేర్చాలనే వారిలో ముందుంటాను.

**నేటి పాశ్చాత్య సంగీత ప్రాచుర్యం భారత శాస్త్రీయ సంగీతకారుల్ని భయపెడ్తోంది. వాస్తవానికి భారతీయ సంగీతానికి పాశ్చాత్య**

**సంగీతం నుంచి ఏదైనా ముప్పు పొంచి ఉందా?**

భారత సంగీతానికి ప్రమాదం పొంచి ఉందనే కళాకారుల మాటల్ని మీరు కూడ నమ్మినట్టు కన్పించుట లేదు. భారతదేశంలో పాశ్చాత్య సంగీతం ప్రవేశించడం ఇది మొటిసారేమీ కాదు. గతంలో కూడా అనేకమంది విదేశీ కళాకారులు భారతదేశంలో తమ ప్రదర్శనలు ఇచ్చారు. అనేకమంది భారతీయులు విదేశీ సంగీతాన్ని నేర్చుకుంటున్నారు. ఇందులో తప్పేముంది? పాశ్చాత్య సంగీత ప్రభావంతో మన మాల్‌కౌంస్ రాగం, విహగ్ రాగంగా మారిందా? భారత శాస్త్రీయ సంగీతం జీవమున్న సంగీతం అని చాలా మంది ఎందుకు అర్థం చేసుకోలేక పోతున్నారో నాకు అర్థం కావట్లేదు. అన్నింటికంటే మనది ప్రాచీన సంగీతమైనను దీని జీవంపై, తాజాదనంపై ఎప్పుడు ఎలాంటి ప్రభావం పడలేదు.

యమన్ ఎంత ప్రాచీన రాగం! దీనిని శతాబ్దాల తరబడి పాడుతున్నారు. అయితే దీని ప్రదర్శన కొత్త అంచనాలతో వుంటుంది. ప్రతిసారి దీని విస్తృతి కొత్తగా కన్పిస్తుంటుంది. దీని అర్థం యమన్ ఒక విస్తృతమైన రాగం. దీనిని ఇంతవరకు ఎవరూ పూర్తిగా తెల్సుకోలేక పోయారు. కాబట్టి ప్రతిసారి దీని రూపం మారుతుంది. అయితే దీని మూలం యమన్ రాగమే అయివుంటుంది. యమన్, యమన్‌లానే ఉంటుంది. పూరియా లాగా మారిపోదు. ఒక వేళ మీరు దీనిని ఒక పాత కథారూపంలో చూస్తే యమన్ ఒక ఏనుగులాంటిది. కొందరు దీని పాదం గురించి తెల్సుకుంటే, మరికొందరు తొండం గురించి, ఇంకొందరు దీని తోక గురించి మాత్రమే తెలుసుకున్నారు. ఒక వేళ ఏనుగులాంటి పూర్తి యమన్ రాగాన్ని ఎవరైనా నేర్చుకొనివున్నా, తెల్సుకొనివున్నా ఇందులోని ఆ స్వచ్ఛత, తాజాదనం ఇన్ని సంవత్సరాల వరకు వుండదేమో!

సంగీతంలో స్వరాల అన్వేషణ నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ఈ అన్వేషణలో ఒక ప్రత్యేకమైన ఆనందాన్ని మనం స్వయంగా అనుభవించవచ్చు. శ్రోతలకూ ఆనందం పంచవచ్చు. రాగాలు దేవుడిలాంటివి. దేవుణ్ణి మనం కొలుస్తాం. అతని శక్తి మన అనుభవంలో తెలుస్తుంది. అయితే దానిని మనం ఎప్పుడూ చూడలేం. ఎందుకంటే దేవుడు అనే శక్తి దృష్టిగోచరం కాదు, నిరాకారమైనది. కావున మనం భిన్న స్వరాల మాధ్యమంతో రాగమనే దేవుణ్ణి చిత్రించి, మన కల్పనాశక్తితో దానిని అనేక విధాలుగా అలంకరిస్తాం. ఈ శృంగారం ప్రతిసారి ప్రత్యేకంగా వుంటుంది.

**సంగీతానికి - సంఘర్షణకు మధ్య పాత సంబంధం వుందంటారు. దీనిని ఎలా చూస్తారు?**

నేను కటిక పేదరికాన్ని అనుభవించాను. మా నాన్న నెలకు 254 రూ. జీతం పొందే ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు. 2 పైసలకు ఉప్పు, 3 పైసలకు నూనె కొన్న రోజులు నాకింకా గుర్తున్నాయి. ప్లాట్‌ఫాంపై పడుకొని వున్నప్పుడు తిన్న పోలీసు లాఠీదెబ్బలు తెలుసు. నేను మీకు నా కథ విన్పించట్లేదు. వాస్తవం తెలియజేస్తున్నాను. అయితే నేడు నేను నన్ను అందరికంటే గొప్ప ధనవంతుడిగా, భాగ్యశాలిగా భావిస్తున్నాను. ఎందుకంటే నా దగ్గర దొంగలు దొంగిలించలేనంత ధనం ఉంది. నేను భవంతులు, మెర్సిడెజ్ కార్లు, బ్యాంకు బ్యాలెన్సులు కోరుకోవట్లేదు. ఇవి అందరివద్ద ఉంటాయి. అడ్డదారి తొక్కి, ఆత్మను చంపుకుంటే చాలు సంపాదించవచ్చు. నా దగ్గర ఉన్న సంపద చాల తక్కువ మంది అదృష్టవంతులకు మాత్రమే లభిస్తుంది. దీనికోసం శరీరాన్నే కాదు, మనస్సును పదును పెట్టాలి. మా వద్ద ఉన్న మాల్‌కౌంస్, విహగ్ రాగాల్ని పెద్ద-పెద్ద భవంతులు, కార్లవంటి సాధారణ వస్తువులతో పోల్చలేం.

**మీ దృష్టిలో సంగీతమంటే...?**

నేను సంగీతాన్ని మనిషి యొక్క ఒక నిర్మాణాత్మక అవసరంగా భావిస్తాను. ఇది గాలిని గాలిలో చిత్రీకరించడం లాంటి కఠినమైన పని. ఎందుకంటే గాలిని ఎవరు చూడలేరు. అయినా దానికి ఎన్నో రూపాలున్నాయి. రాగ సంగీతాన్ని సాధన చేసే వారు గాలి యొక్క ఈ భిన్న రూపాల్ని గాల్లోనే చిత్రిస్తున్నారు. గాలితోనే మనం శ్వాసిస్తున్నాం. శ్వాసను పీల్చడం, వదలడం అనే ప్రక్రియ సంగీత అంశం. గాత్ర సమయంలో శ్వాసను ఎప్పుడు, ఎక్కడ, ఎలా శ్వాసించాలనే టెక్నిక్ సంగీతంలో ఉంది. ఈ శ్వాస యొక్క ఒక నిశ్చిత స్థానాన్ని అవతారణా స్వరం అని అంటారు. సంగీతంలో difinite frequency, indefinite frequency కూడా వుంది. పాట స...రి...లలోనే వుండదు. స...రి...ల మధ్య నున్న అంతరం (Gap) లో కూడా సంగీతం ప్రయోగింప బడుతుంటుంది. మన రాగయుక్త సంగీతం వాస్తవానికి definite, indefinite frequency ల మిశ్రమం. ఈ space గురించి కేవలం సంగీతకారులకు మాత్రమే తెలుసు. తరువాత నిరంతరం నడిచే కాలం. మనం

మాట్లాడుకున్నది ఇప్పుడిప్పుడే గతమైపోయింది. అందుకే కాలం ఎవరికోసం నిరీక్షించదు. ఈ కాలంలోని కొంత భాగాన్ని తీసుకొని మనం స్వరపరుస్తుంటాం. ఇందులో స్వర- తాళాల సమతుల్యత ఉంటుంది. కాలం frequency ఇదంతా ప్రకృతి ప్రసాదించినది. ఇవే కాక సంగీతానికి అవసరమయ్యే తత్వాల్లో సౌందర్య దృష్టి Esthetic sense ఒకటి. ప్రతి ఒక్కరు మొగ్గను చూసి ఉంటారు. పువ్వునూ చూసి వుంటారు. అయితే మొగ్గ-పువ్వుగా మారుతున్నప్పుడు ఎవరైనా చూశారా? వాస్తవానికి ఇదే రాగం- సంగీతం. దీనిని అయిదారు స్వరాల, వివిధ విస్తార రాగపు మొగ్గని పువ్వుగా మార్చే ప్రక్రియ అని అంటారు. ప్రతి ఘరానాకు చెందిన గాయకులు ఇలాగే చేస్తుంటారు. చేసే విధానం వేరుగా ఉండొచ్చు. కిరానా ఘరానాకు చెందిన గాయకులు స్వరాల ఆధారంగా రచిస్తుంటారు. గ్వాలియర్ వాళ్లు, బిహలావా మాధ్యమంతోను, పాటియాల వారు తాన్ అంగంతోను పాడుతుంటారు. సంగీతంలో జరిగే రచనల ప్రదర్శనను బందీష్‌లని అంటారు. దీని తాత్పర్యం క్రమశిక్షణ. ఈ క్రమశిక్షణ సంగీతంలోనే కాదు, జీవితపు ప్రతిరంగంలోను దీని ప్రాధాన్యత ఉంటుంది.

**అయితే సంగీతం మరియు అభివ్యక్తపరమైన స్వాతంత్ర్యాన్ని విడిచి సంగీతకారుడు అనేక రకాల స్వతః స్వాతంత్ర్యాల్ని హస్తగతం చేసుకుంటున్నాడు. మరి ఈ బందీష్‌లు, క్రమశిక్షణల అర్థం ఏమిటి?**

కాలంతో పాటు క్రమశిక్షణ యొక్క అర్థం కూడా మారిపోతుంటుంది. ఒకప్పుడు గురువుకి సాష్టాంగ నమస్కారం చేసేవారు. తరువాత కేవలం కాళ్లు తాకేవారు. ఇప్పుడు చెయ్యెత్తి నమస్తే అంటే పని జరిగిపోతుంది అని భావిస్తున్నారు. సంగీత క్రమశిక్షణలో కళాత్మక స్వతంత్రత మరియు అభివ్యక్తికి సంబంధించిన Scope ఉంది. కళాత్మక విద్య విషయం వేరు. విలువైన విద్య కోసం నేను ఒక కొత్త ప్రణాళిక - Education series సిలబస్ తయారు చేస్తున్నాను. ఇది ఒక పుస్తకం, మరియు వీడియో రూపంలో ఉంటుంది.

**మీరు సంగీత ప్రపంచంలోకి రావాలని ఎప్పుడు నిర్ణయించు కున్నారు? దీనిని ప్రొఫెషనల్‌గా మార్చే ప్రయత్నం గురించి ఎప్పుడు ఆలోచించారు?**

నిర్ణయించుకోలేదెప్పుడు. నాకు 2 సం॥ల వయసు నుంచి పాడుతున్నాను. అప్పుడు దీనిని నేను కెరీర్‌గా మార్చుకోవాలనేంత తెలివి ఎక్కడిదండీ? మా అమ్మ-నాన్నలు బాగా పాడేవారు. కాని ప్రొఫెషనల్ సంగీతకారులు కారు. వీరే నన్ను సంగీతకారుణ్ణి చేయాలని నిర్ణయించారు. మా ఇంట్లో భక్తిగీతాలు,కీర్తనల వాతావరణం ఉండేది. అందుకే నాలోని సంగీత సంస్కారాలు మా ఇంటి నుంచే లభించాయి. నా దృష్టిలో సంగీతాన్ని ప్రొఫెషన్ అనడం సరికాదు. ఇది ప్రొఫెషన్‌కు సంబంధించిన వస్తువు కాదు. నా దృష్టిలో ప్రొఫెషన్ అంటే Perfection అని అర్థం. అయితే నేటి ప్రొఫెషన్ యొక్క అర్థం డబ్బు. ఎవరి దృష్టి అయితే ఫర్‌ఫెక్షన్ పై ఉంటుందో వారు ప్రొఫెషనల్స్‌గా మారుతారు. ఉదాహరణకు గవాస్కర్ ప్రొఫెషనల్ బ్యాట్స్‌మన్‌గాను, ఉస్తాద్ బడే గులాం అలీ ఖాన్ గారు ప్రొఫెషనల్ గాయకులుగా చెప్పొచ్చు. అయితే నేను ప్రొఫెషనల్ అంటున్న సందర్భం నిజానికి ప్రొఫెషనల్ కాదు, కమర్షియల్‌గా చెప్పొచ్చు. ఈ రెండు పదాలు చాల భిన్నమైనవి. నేటి కళాకారులు సంగీతం Professional Art కాదని గుర్తుంచుకోవాలి. ఇది అమ్ముకునే వస్తువు కాదు. అయితే నేడు సంగీతం యొక్క ఉద్దేశ్యం (coneption) పూర్తిగా మారిపోయింది. కళాకారుల్ని పరీక్షించే ప్రజల దృష్టికూడాను నేడు దుమ్ముకొట్టుకు పోయింది. గిటార్ పుచ్చుకొని అరిచే వాళ్లు కళాకారులే, మాల్‌కౌంస్ ఆలపించే వారూ కళాకారులే.

**శాస్త్రీయ సంగీత కార్యక్రమాల్లో ఎలాంటి ప్రవేశ రుసుము లేక పోయిన సభలు, సమావేశాలు ఎందుకు ఖాళీగా పడివుంటున్నాయి? ఉత్సాహం, ఊపు, యౌవనాల పేరుతో నిండిన సంగీతసభల్లో ఇసుక వేస్తే కింద రాలనంతజనం. శాస్త్రీయ సంగీతం ప్రాచుర్యం పొందక పోవడానికి గల కారణాలేంటో చెప్పగలరా?**

ఉత్సాహం, యౌవనాల పేరుతో మర్యాదపరమైన సంగీతాన్ని ప్రదర్శించలేమా? అని మీ ద్వారా తెలుసు కోవాలనుకొంటున్నాను. ఉత్సాహం పేరుతో ప్రతిసారి అసభ్యకరమైన నృత్యాన్ని ఎందుకు ప్రదర్శిస్తారు? సినిమాలు కూడా అసభ్యంగానే నిర్మింపబడుతున్నాయి. ఈ అసభ్యత వల్ల వికృత మానసికత్వం కల్గిన వారు తమ కామవాంఛల్ని (Frustration) శాంత పరచుకుంటుంటారు. అందుకని ఈ అసభ్యతను మీరు శాస్త్రీయ సంగీతంతో పోల్చలేరు. ఎందుకంటే శాస్త్రీయ సంగీతాన్ని సెక్స్‌లా అమ్ముకోలేం. జీవితంలో సెక్స్‌కు ప్రముఖమైన స్థానం ఉంది. ఇది కూడ మనకు తెలుసు. సెక్సే జీవితం కాకూడదు. అన్ని చోట్ల సెక్స్‌ని చిత్రీకరించడం సరి కాదు.

**శాస్త్రీయ సంగీతపు రసాస్వాదన గురించి తెలిసి వుండడం అవసరమా?**

నాకు అవసరంగా అన్పించట్లేదు. మాధురీ దీక్షిత్ అందంగా వుంది. ఇది తెల్సుకోవడానికి అనాటమీ చదవాల్సిన అవసరం ఉందా? రెండు కళ్లు సరిపోవా? మీతో నేను మొదటి సారి మాట్లాడుతున్నాను. మీతో మాట్లాడుతుంటే బాగుంది. ఈ సుఖం కోసం మీ గురించి మొత్తంగా తెల్సుకోవాల్సిన అవసరం లేదు. ఇలాగే ఎవరి సంగీతంలో బలం ఉంటుందో, ఎవరి సాధనలోనైతే వెలుగుంటుందో అది ప్రజల్ని ప్రభావితం చేస్తుంది.

**ఘరానా సంప్రదాయాన్ని మీరు నమ్ముతారా?**

ఘరానా సంప్రదాయాలపై నాకు నమ్మకం లేదు, దీనిని నేను అంగీకరించను.

**ఆశ్చర్యం, మిమ్మల్ని పాటియాలా ఘరానాకు చెందిన వారుగా అంటుంటారు. మిమ్మల్ని ఈ ఘరానాకు ప్రతినిధిగా భావిస్తున్నారు.**

తెలీదు, ఎవరంటున్నారో? ఎందుకంటున్నారో నేను నన్ను పరిచయం చేసుకునే సందర్భాల్లో ఎప్పుడూ పాటియాలా ఘరానా పేరే ఎత్తను. ఘరానా గీతాల్ని ఆలపించే వారు ఎవరో ఒకర్ని, యేదో ఒక ఘరానా పేరును చేర్చి ఆనందిస్తుంటారు. నేను మాత్రం ఘరానా సంప్రదాయాల్ని అంగీకరించను. ఎందుకంటే, ఇది సరైన ఆలోచన కాదు. ప్రపంచం మొత్తంగా ఒకే రూపంతో ఇద్దరూ ఎలా ఉండ లేరో, అలాగే ఒకే సంప్రదాయంతో ఉన్న నేను రెండు ఘరానాలకు ఎలా చెందుతాను? ఘరానా సంప్రదాయం అంటే దాని విశేషతల్లో అభివృద్ధి చెందే గుణం వుండాలి. ఉస్తాద్ బడే గులాం అలీఖాన్ గొప్ప గాయకుడు. ఎందుకంటే ఇలాంటి మరో గాయకుడు ఇంతవరకు పుట్టలేదు. ఇలాంటి మరో నలుగురు గాయకులు పుట్టివుంటే ఇతనికి ఇంత ప్రాధాన్యత ఉండేది కాదు. ఉస్తాద్ గులాం అలీఖాన్ సరసన నా పేరును ఉంచి మేం పాటియాల ఘరానాకు చెందిన వాళ్లమని చెప్తుంటారు. ఆయనెక్కడ? నేనెక్కడ? ఇంకో విషయం. చాలా విషయాల్లో నా ఆలోచన ఆయనకు భిన్నంగా వుంటుంది.

**ఇంకో మాటండి. పండిట్ రవిశంకర్, ఉస్తాద్ అలీ అక్బర్ ఖాన్, భీమ్‌సేన్ జోషి లాంటి వారు సంగీత విద్యను బోధించారు. అయితే వారి శిష్యులు గురువులంత ఎత్తు చేరుకోకపోతే గురువుల తప్పుందా? మరి భవిష్యత్తులో వీరి శిష్యులు అంత ఎత్తుకు చేరుకోగలరా? ఈ కళాకారులు పరిస్థితులతో పోరాడారు,... వీరు ఒక చరిత్ర లిఖిస్తారని ఎవరు కలగన్నారు?**

జరగబోయే దాని గురించి నేను భవిష్యవాణి విన్పించలేను. దోషమంతా శిష్యులనెత్తిన వేసి గురువుల్ని వొదిలి వేస్తున్నారు. శిష్యుడు పచ్చి మట్టిముద్దలాంటి వాడు. గురువే శిష్యునికి తనకు నచ్చిన రూపాన్ని తయారుచేస్తాడు. శిష్యుడు పిల్లవాడు. వాడిని పైకి తీసుకెళ్లే బాధ్యత గురువుదే.

**మీరు మరో అజయ్ చక్రవర్తిని తయారు చేయగలను అని అనుకుంటున్నారా?**

నేను అజయ్ చక్రవర్తికంటే మంచి కళాకారుల్ని తయారు చేస్తాను. నా శిష్యులు నాలాగే తయారైతే నేను ఓడి పోయినట్టే. అజయ్ చక్రవర్తిలోని మంచి-చెడుల్ని నా శిష్యులకు అలవాటు చేయించను. వారిని నేను నాలా కాక, నా కంటే మంచి కళాకారులుగా తయారు చేస్తాను. వారు నన్ను గుడ్డిగా అనుకరించ కూడదని సలహా ఇస్తాను. మీరు నాపై, నా శక్తులపై నమ్మకముంచాలి. నేను నా జీవిత కాలంలోనే నా కంటే మంచి కళాకారుల్ని తయారు చేస్తాను. నా శిష్యులు చాలా మంది బాగానే పాడుతున్నారు. మీకు గంటన్నరసేపు ఒక మంచి పాట పాడి, విన్పించి పైకి లేవనీయకుండ చేయగలరు.

**మీకు అనేక పురస్కారాలు, సన్మానాలు లభించాయి. దీనికి కారణం ఏమంటారు మీరు?**

సంగీతమే, సంగీతం ద్వారానే అన్నీ సంపాదించాను, సంగీతం కోసమే ఖర్చు చేస్తాను. భార్య నగల కోసమో, ఇల్లు కట్టుకునేందుకో, ఈ డబ్బులు ఖర్చు పెట్టడం నా దృష్టిలో అపరాధమే కాదు, పాపం కూడాను. మాల్‌కౌన్స్, బాగేశ్రీ రాగాల వల్ల నాకు లభిస్తున్న ధనరాశిని భౌతిక సుఖాల కోసం ఖర్చుచేయడం ఎంతవరకు ఔచిత్యమండీ? భారతదేశం ఇతర అనేక రంగాల్లో విదేశీ నిపుణుల సహాయం తీసుకుంటుంటారు. అయితే సంగీత రంగంలో మాత్రం విదేశీయులు భారతదేశాన్ని అనుకరిస్తుంటారు. కేవలం ఒక స్వరమో .స్వర సమూహమో వారిని ఆశ్చర్యానికి గురి చేస్తుంటుంది. సమ్మోహితుల్ని చేస్తుంటుంది. ఈ ప్రభావం సంగీతానిది. అందుకని ఇలాంటి సంపదను కాపాడుకోవడం మన బాధ్యత. సమర్థవంతులైన కళాకారుల్ని నేను ప్రార్థిస్తున్నదేమంటే... ఈ సంప్రదాయాన్ని కాపాడుకుంటూ... నిర్మించుకుంటూ, ఉండాలని కోరుకుంటున్నాను.

హిందీ : విజయ్ శంకర్ మిశ్రా, అనువాదం : పి. మస్తాన్ ఖాన్
ఫోన్ : 9985981901

# కవిత్వం - ప్రాచీన భాషలు

- కుర్రా జితేంద్రబాబు

కొన్ని సంవత్సరాల క్రితం లండన్ నగరంలో డెకార్డ్ అనే గ్రామఫోన్ కంపెనీవారు వారి కార్యాలయంను ప్రారంభించదలచి ఆ నాటి ప్రాచ్య భాషలలో పండితునిగా ప్రసిద్ధికెక్కి, వేదాలను ఆంగ్లంలోకి అనువదించిన మాక్స్‌ముల్లర్‌ను ఆవిష్కరణకు ఆహ్వానించారు. ఆయన ఆ కంపెనీని ప్రారంభిస్తూ ఋగ్వేదంలోని మొదటి సూక్తమైన....

**"అగ్ని మీళే పురోహితం**
**యజ్ఞస్యదేవ మృత్విజమ్**
**హెూతారం రత్న ధాతమమ్"**

ను పఠిస్తూ తన ఉపన్యాసాన్ని ప్రారంభించగానే, ఆ కంపెనీవారు, ఏమిటి, మనం మహాపండితుడిని పిలిస్తే సంస్కృతంలో మన దేశ బానిసల సారస్వతాన్ని ఇక్కడ చదువుతున్నాడు, మన సారస్వతమెంతో ఉండగా అని అనుకుంటున్న సమయంలో 'ఈ విశ్వంలో మానవుని కంఠం నుండి వెలువడిన తొలి కవితా కుసుమమిది' అని మాక్స్‌ముల్లర్ ఉపన్యాసం ప్రారంభించాడు.

తొలి కవితా కుసుమంగా ఋగ్వేదంను మాక్స్‌ముల్లర్ గుర్తించాడు. మనం కవిత్వానికి ఒక నిర్వచనం చేసుకొని ఆ పరిధిలో పరిశీలిస్తే ఋగ్వేదంలో ఉన్నది కవిత్వమా కాదా అన్న విషయం తేల్చుకోవచ్చు. ఒక రచనను కవిత్వంగా వ్యవహారిక భాషా ప్రక్రియ నుండి వేరుచేసి చూపాలంటే దీనిలో కొన్ని లక్షణాలు ఉండాలి. 1. వ్యవహారికానికంటే భిన్నంగా శైలి (వాక్యనిర్మాణం) ఉండాలి. 2. ప్రతిపాదించే విషయంలో లేక వివరించే విషయంలో వైశిష్ట్యం ఉండాలి. 3. ప్రతి పాదించే విధానం వ్యవహారికానికి భిన్నంగా లోకోత్తరమైన పద్ధతిలో జరగాలి. ఈ విధంగా పరిశీలిస్తే ప్రపంచ వాఙ్మయంలోనే అతి ప్రాచీనమైన ఋగ్వేదంలో, వాస్తవానికి అది భక్తి భావ భరితాలైనప్పటికి వివిధ దేవతా స్తోత్రాల రూపంలో ఉన్నప్పటికి అద్భుతమైన కవిత్వాన్ని మనం గమనించవచ్చు. ఋగ్వేదంలోనే కవిత్వానికి నిర్వచనం వుంది.

**"సక్తు మివ తిత ఉనాపునన్తో**
**యత్ర ధీరా మనసావా చమక్రత**
**అ త్రా సఖాయః సఖ్యాని జానతే**
**భద్రైషా లక్ష్మీ ర్నిహి తాధి వాచి"** *(x 712)*

విజ్ఞులు తమ బుద్ధిబలంతో గింజలను జల్లెడతో జల్లించి శుభ్రముచేసే విధంగా పదాలను జల్లించి తీసి, మంచి పదాలతో కవిత్వం చెప్పెదరు. క్రమమైన బుద్ధి విశేషం గల వారు ఈ కవిత్వాన్ని అవగాహన చేసుకొంటారు. అట్టి కవిత్వంలో శుభ ప్రదమైన శ్రేయస్సు కలదు అని భావం. ఈ సూక్తమునే 'నిరుక్తం' లోను, 'మహాభాష్యం' లోను, 'సాహిత్య మీమాంస' లోను కూడా ఉదహరించారు. ఋగ్వేదంలోని ఈ సూక్తం వల్ల వ్యవహారిక ప్రయోగానికి, కవుల ప్రయోగానికి, భాషకు భేదం ఉన్న విషయం అవగాహన అవుతుంది. కవులు పదాలను ఏరి ఏరి ఉత్తమ పదాలనే కవిత్వంలో ప్రయోగించే వారని తెలుస్తుంది. ఆ కవిత్వమే ఆనందదాయక మని, శుభప్రదమని ఆనాటి వారి అభిప్రాయంగా మనం గమనించవచ్చు. రాజశేఖరుడు మొదలైన అలంకారికులు ప్రతిభను కారయిత్రి, భావయిత్రి అని రెండు విధాలుగా పేర్కొన్నారు. ఆ ప్రతిభా ద్వైవిధ్యం ఈ సూక్తంలో సూచించబడింది.

కవిత్వానికున్న మరో లక్షణాన్ని కూడా ఋగ్వేదంలోని మరో సూక్తంలో గమనించవచ్చు.

**"ఉత త్వః పశ్యన్న దదర్శ వాచయుత**
**త్వః శృణ్వన్న శృణో త్యేనామ్**
**ఉతోత్వ స్మై తన్వం విసస్రే**
**జాయేవ పత్య ఉశతీ సువాసాః"** *(x 71.4)*

ఒకడు వాక్కును వినుచున్నా వినుట లేదు (విననట్లే). గ్రహించాలనుకున్నా గ్రహించలేడు. ప్రేమించు భార్య చక్కని వస్త్రములు ధరించి భర్తకు మాత్రమే తన అంతర శరీర సౌందర్యాన్ని లేక స్వస్వరూపాన్ని అభివ్యక్తము చేసినట్లు, వాక్కు తన సౌందర్యాన్ని ఏ ఒక్కరికో మాత్రమే చూపిస్తుంది.

ఇక్కడ చూచిన చూడకపోవుట, విన్నా వినకపోవుట అనగా కవి మాటలలోని అంతరార్థాన్ని గ్రహించ లేని వారని తెలియుచున్నది. అవే మాటలు వింటున్నా అంతరార్థం గ్రహించేవారికి చాలా భేదం ఉంది అని ఋగ్వేద సూక్తం తెలుపుతున్నది. ఈ అభిప్రాయాన్ని వ్యంగార్థముగా గాని, తాత్పర్యార్థముగా గాని స్వీకరించ వచ్చు. ఇక్కడ 'చూచుట' అను పదము 'రూపకము'ను సూచించు పదంగా గాని, 'లిపి' సంబంధించిన మాటగా గాని చెప్పవచ్చు. ఈ సూక్తం ద్వారా మనం, కవిత్వం అనగా వ్యవహారికానికంటే భిన్నమైన పదాలతో చెప్పినదని భావించవచ్చు.

ఋగ్వేదములో కావ్య నిర్మాణశక్తిని సూచించు సూక్తము ఒకటి ఉన్నది. అది :

**"ఇంద్ర యస్తే న వీ యసీం**
**గిరం మంద్రా మజీజనత్**
**చికిత్విన్ మనసం ధియం**
**ప్రత్నా మృతస్య పివ్యుషీమ్"** *(VIII.95.5)*

ఓ ఇంద్రా! నూతనమైన, ఆహ్లాదకరమైన సూక్తమును నీకై రచించినాడు. చక్కని బుద్ధి నుండి ఉత్పన్నమైంది. ప్రాచీనం, పవిత్రమైన సత్యంతో నిండిన ఈ సూక్తం కావ్య నిర్మాణ శక్తి నుండి ఉత్పన్నమైంది.

**"కన్యే వతన్వాశాశదానా**
**ఏషి దేవి దేవమియిక్షమాణం"** *(I.123.10)*

ఓ ఉషాదేవి కమనీయమైన కన్యలాగా నీవు నీ శరీరం చే ప్రకాశిస్తున్నదానవై అభిమతముల నొసగు సూర్యుని వద్దకు పోవుచున్నావని భావము. దీనిలో ఉపమాలంకారము ఉంది.

కవి కల్పనాశక్తికి సంబంధించి మరొక సూక్తం కూడా ఋగ్వేదంలో ఉన్నది.

**"చత్వారి వాక్పరి మితా పదాని**
**తాని విదుర్బ్రాహ్మణా యే మనీషిణః**
**గుహాత్రీణి నిహిహితా నేంగ యంతి**
**తురీయం వాచో మనుష్యా వదంతి"** *(I. 164.45)*

భాషను నాలుగు భాగాలుగా విభజించినచో, ఈ నాలుగు భాగాలు భావన (కల్పన) గల కవికి అవగతాలవుతాయి. వీనిలో మూడు భాగములు గుహలో కదలికను తీసుకొని రాక యున్నవి. నాల్గవ భాగమునే మానవులు ఈ లోకములో వ్యవహారికమున ఉపయోగించెదరు అని భావం.

కవి ఒక్కడే భాషను పూర్తిగా సద్వినియోగం చేస్తున్నాడు. ఇక్కడ కవి కల్పనా శక్తిని (మనీషా) వివరించటమే కాకుండా, సంస్కృత అలంకారికులు పేర్కొనిన పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ అను వాగ్రూపాలను ఇక్కడ ప్రస్తుతించాడు.

ప్రపంచ వాఙ్మయంలో అతిప్రాచీనమైన వేదాలలో అలంకారశాస్త్రానికి సంబంధించిన ఎన్నో అంశాలు గమనించవచ్చు. ఈ అలంకార ప్రయోగమే తరువాత వచ్చిన వాఙ్మయంలో మరికొంత విస్తృతంగా, నియమబద్ధంగా కనపడడంతో వాటి స్వరూప స్వభావాలగూర్చి, మౌలిక అంశాల గూర్చి జిజ్ఞాస ఏర్పడింది. అదే అలంకార శాస్త్రంగా అభివృద్ధి చెందింది. ఋగ్వేదంలోని అనేక సూక్తులను సంస్కృత అలంకారికుల కవిత్వ నిర్వచనాల ప్రకారం కూడా కవిత్వంగా నిరూపించవచ్చు. కవితా సంపన్నమైన, భావనా భరితమైన ఎన్నో సంవాదాలు, సంభాషణలు, చమత్కారాలు ఎత్తి చూపవచ్చు.

ఋగ్వేదంలో ఉన్న నదీ విశ్వామిత్ర సంవాదము (III.33), యమ యమీ సంవాదం (x. 10), సరమాపణి సంవాదము (x.108), ఇంద్రవరుణ సంవాదము (VIII.33), ఇంద్ర–అగస్త్య సంవాదము (I.70), ఇంద్ర–వసుక్ర పత్నీ సంవాదము (x. 51.53) మొదలైన భావోత్తేజితాలూ, రసభరితాలు అయిన సంవాదాలే భారతీయ రూపకాలకి మూలం. నృత్త–నట– సంగీతాలను గూర్చి వేదాలలో ఎన్నో పర్యాయాలు పేర్కొనబడినాయి. అందుచేత అలంకార శాస్త్ర బీజాలు వేదాలలో ఉన్నాయని చెప్పవచ్చు.

అయితే ఆనాటికి కవిత్వ నియమాలు గాని, కావ్య లక్షణాలు గాని ఉన్నాయా అని ప్రశ్నించుకుంటే...

'కావ్య' శబ్దం ఋగ్వేదంలో అనేక సందర్భాలలో కనపడుతుంది. ఉదా॥

**1. "ఆ దేవా నామభవః కేతురగ్నే మన్ద్రో విశ్వాని కావ్యాని విద్వాన్"** (III.1.17). (అగ్ని నీవు దేవతల ధ్వజానివి. నీకు అన్ని కావ్యాలు తెలుసును.)

**2. "అగ్నిర్విశ్వాని కావ్యాని విద్వాన్"** (III.1.18)

**3. "నివచనా కావ్యే కావ్యేన్యా సంశిషమ్"** (IV.3.16)

గానానికి సంబంధించి :

**4. "మధుచ్ఛన్దో భవతి రేభ ఇష్టో"** (VI.12.3)

(గాయకుడు యజ్ఞంలో మధురమైన శ్లోకం గానం చేస్తున్నాడు.) తీయని కవితను చెప్తున్నాడని భావం.

**5. ''ఉదుత్యే మధుమాత్తమా గిరఃస్తోమాస ఈరతే''** (VII.3.15) (మనుష్యులు అతి మధుర పదాల రూపాలలో ఉన్న గీతాలను స్తుత్యర్థం పంపుతున్నారు.)

'గాథ' అనగా గానం చేయబడే శ్లోకం. ఈ పదాన్ని కూడా ఋగ్వేదంలో గమనించవచ్చు.

**6. "తం గాథయా పురాణ్యా పునానమభ్యనూషత"** (VIII.6.43) (శుద్ధి చేయబడుతున్న సోమం వద్దకు వారు పురాణ గాథ ద్వారా స్తుతిని పంపుతున్నారు.)

ఈ పై చరణాల వల్ల ఋగ్వేదం కాలం నాటికి కావ్యశాస్త్ర సంబంధిత సిద్ధాంతాలు లేనప్పటికి వాటి ప్రాథమిక రూపాలను గమనించ వచ్చు. ఋగ్వేదంలో కవిత్వానికి సంబంధించి కొన్ని సూక్తములను పరిశీలిద్దాం :

**"ధేనుం నత్వా సూయవసే దుదుక్షో**
**న్ను ప బ్రహ్మాణి సస్ఋ జే వశిష్ఠః"** *(VII. 18. 4)*

చక్కని పచ్చిక బయలులో ఉన్న ఆవు పాలను ఏవిధంగానైతే ఇస్తుందో అదే విధంగా వశిష్ఠుడు సూక్తములను సృష్టించి ప్రవహింపజేశాడు.

**ఏవాతే గృత్సమదాః శూర**
**మన్మావస్యవోనవయునానితక్షుః –** *(II. 19. 3)*

(ఓ ఇంద్రా) ప్రయాణము చేయగోరు పురుషులు మార్గాలను నిర్మించినట్లు, నిన్ను స్తుతించటానికై గృత్స మదులీ స్తోత్రమును నిర్మించినారు.

**ద్వాసుపర్ణా సయుజాసఖాయా సమానం**
**వృక్షం పరిషస్వ జాతే।**
**తయోరన్యః పిప్పలం స్వాద్వ త్తి–**
**అనశ్నన్నన్యో–అభిచాకశీతి॥** *(I. 164. 20)*

శోభనములయిన రెక్కలు గలవి, ఎల్లప్పుడు కలిసియుండునవి, పరస్పరమైత్రి గలవియైన రెండు పక్షులు ఒక చెట్టునాశ్రయించి ఉన్నవి. ఆ రెండు పక్షులలో ఒకటి రుచిగల ఫలమును ఆశ్వాదించుచున్నది. మరియొక పక్షి ఏమియు తినకుండా ప్రకాశించుచున్నది. ఈ సూక్తంను జగన్నాథపండితరాయలు తన *రసగంగాధరం*లో, అలంకార ప్రకరణంలో అతిశయోక్తి అలంకారానికి ఉదాహరణగా పేర్కొన్నాడు. దీనికి **'విషయిణా విషయస్య నిగరణమతిశయః, తస్యోక్తిః అతిశయోక్తిః'** అని లక్షణమును చెప్పినాడు. రాజశేఖరుడు **'ఉపకారకత్వాత్ అలంకారః సప్తమమఙ్గమ్' ఇతి యాయావరీయః ఋతేచ తత్స్వరూప పరిజ్ఞానద్వేదార్థానవగతిః యథా– "ద్వాసువర్ణా – అభిచాకశీతి"** అని అన్నాడు. ఉపకారముగాన, అనగా వేదార్థజ్ఞానమునకు ఉపకరించినదిగాన అలంకారశాస్త్రము ఏడవ అంగము అని యాయావరీయుని అభిప్రాయం. అలంకారశాస్త్ర స్వరూపము తెలియనిచో వేదార్థజ్ఞానము కలగదని తెలుపుతూ రూపకవ్యతిరేక అలంకారములను ఉపయోగించి జీవాత్మ పరమాత్మలు ఒకే దేహమును ఆశ్రయించి ఉన్నవని, వారిలో జీవాత్మ కర్మఫలమును అనుభవించుచుండగా, పరమాత్మ మాత్రము కర్మఫలభోగవిహీనుడై చూచుచున్నాడని బోధించుచున్నది.

రూపక ఉపమాదులతో నిండిన వేదముల అర్థము స్పష్టముగ తెలియవలెనన్న అలంకారశాస్త్రజ్ఞానము అవశ్యకమని రాజశేఖరుని (కావ్యమీమాంస II–1) అభిప్రాయము.

**"ఏషా స్యా నవ్యమాయు ర్దధానా గూఢ్వ తమో జ్యోతిపోషా అబోధి।**
**అగ్ర ఏతి యువతి రహ్రయాణా ప్రాచి కితత్సూర్యం యజ్ఞ మగ్నిం"**
*(VII. 80. 3)*

కడచిన రోజులలో కనపడుతూవస్తున్న ఉషోదేవిని నవతర యౌవనము దాల్చి తన తేజస్సుతో గాఢమైన అంధకారమును తొలిగించుచు భర్తముందు సిగ్గువిడిచి యుండు యువతి వలె సూర్యుని ముందు కన్పిస్తున్నది. అట్టి ఈమె సూర్యుని, యజ్ఞమును, అగ్నిని కూడ చక్కగా జ్ఞప్తికి తెచ్చుచున్నది.

**"హంసా ఇవ కృణుథ శోక మద్రిభి**
**ర్మదంతో గీర్భి ర ధ్వరే సుతే సచా"** *(III. 53. 10)*

యజ్ఞము నుండి సోమమును తీస్తూ, స్తోత్రములతో దేవతలను ఆనందింప చేయుటకు హంసలవలె శ్లోకాలను రచించండి. హంసల పాటలవలె శ్లోకాలను రచించి పాడాలనేది దీని భావం.

**"కవిః కవిత్వా దివి రూపమానజత్"** *(IX. 124. 7)*

ద్యులోకములో తన రూపాన్ని కవి కవిత్వ రూపంలో స్థిరపరిచినాడు.

ఋగ్వేదములో భార్యాభర్తల మధ్య సంభాషణ – బృహస్పతి దుహితయైన రోమశ తన పతిపొందుకై పిలిచినది. రోమరహితమైన ఆమె అంగములు చూసి అతడు నవ్వినాడు. ఆ సందర్భంలో వారి సంభాషణ:–

భర్త :– **"ఆగధితా పరిగధితా యాకశీ**
**కేవ జంగహే దదాతి మహ్యాం**
**యా దురీ యా శూనాం భోజ్యా శతా..."**

భార్య:– **"ఉపోపమే పరామృశ మాయే**
**ద భ్రాణి మన్యథాః సర్వాహ మస్మి రోమశా**
**గంధారీణా మివావికా..."** *(II. 1. 11. 7)*

'వయసింకను సరిగా రాక పోయినా, నా భార్య నన్ను పునః సంభోగార్థమై ఆడముంగివలె పట్టుకొని విడవదు. ఆమెకి ఇంకా సంభోగార్హమగు వయసు రాలేదు' అని భర్త అనగా...

'నేను సంభోగార్హ వయస్సుకు వచ్చి ఉన్నాను. నన్ను బాగా అంటి, ముట్టి, తడిమి చూడు, గాంధార దేశస్థుల గొఱ్ఱెవలె నేను దేహమంతటా రోమాలు కలిగి ఉన్నాను' అని భార్య సమాధానం చెప్పింది.

యుక్తవయస్సు వస్తే రోమాలు మొలుచుట సాధారణం. ఇక్కడ ఆరు+ఇందా అనగా నేను యుక్త వయస్సు దానను అని అర్థం.

ఇది కవిత్వం ఎట్లా అవుతుందని ప్రశ్న ఉదయిస్తుంది. దానికి సమాధానం రాజశేఖరుడు 'కావ్యమీమాంస'లో (6-35) ఉన్నది.

**"ప్ర క్రమాపన్నో నిబన్ధనీయ ఏవాయమర్థః" ఇతియా యావరీయః తదితం శృతౌ శాస్త్రే చోపలభ్యతే,** అనగా ప్రసంగానుసారంగా శృంగారవిషయములు కూర్చినను తప్పులేదు అని యాయావరీయుడు పేర్కొన్నట్లు తెలుపుతూ, ఇది (కావ్యములలోనే కాదు) వేదములందును, శాస్త్రములందును కానవచ్చుచున్నది అని ఋగ్వేదమునందలి...

**"యోని రు రూఖలం శిశినం ముసలం / మిథున మేతత్ ప్ర జననం క్రియతే"**

అన్న సూక్తాన్ని ఉదహరించాడు. యోని రోలు, శిశ్నము రోకలి, ఇది మిథునము. సంతానోత్పాదనము చేయ బడుచున్నది అని భావం.

ఋగ్వేదంలోని మరొక సూక్తంలో చక్కని ఉపమానాలను ఉపయోగిస్తూ ఉషస్సును వర్ణించిన తీరు గమనించండి.

**"అభ్రాతేవ పుంస ఏతి ప్రతీచీ**
**గర్తా రు గివసనయే ధనానామ్**
**జాయేవ పత్య ఉశతీసువాసా**
**ఉషా హస్రేవ నిరిణే తేఅప్సః"** *(1.124.7)*

సోదరులు లేని స్త్రీ, తండ్రి మొదలైన వారి వద్దకు ఎలా వెళ్ళునో, భర్త లేని స్త్రీ, తనకు రావలసిన ధనాన్ని రాబట్టు కొనుటకు కచ్చేరికి ఎలా వెళ్లునో, శృంగారానుభవానికి స్త్రీ వస్త్రాభరణాదులచేత అలంకరించుకొని భర్త చెంతకు ఎలా వెళ్ళునో, చిరునవ్వు పలువరుసనెలా ప్రకాశింపజేయునో, అలాగే సకల వస్తువులను ప్రకాశింపజేయు ఉషస్సు సూర్యుని నివాసస్థానమైన అంతరిక్షమునకు వెళ్ళును అని భావం.

దీనిలో వివిధ భావాలు ఏ విధంగా మిశ్రితాలై ఒక దృశ్య చిత్రంగా ఉత్పన్నమౌతున్నదో అలాగే రచనారూపం కూడా ఛందస్సు యొక్క లయాదిగుణాలద్వారా వస్తు భాషాశైలి విశేషాలు కూడా ఐక్యతను పొంది కవిత్వమైంది. జీవితానుభవ వ్యక్తిత్వము ఇందులో చూడవచ్చు.

పైన పేర్కొన్న సూక్తముల వల్ల వాచ్యార్థ, లక్ష్యార్థ, వ్యంగ్యార్థము (Primary, Secondery and Suggestive meanings) లే కవిత్వమని కూడ వారు భావించినట్టు గమనించవచ్చు.

ఈ సూక్తములనుంచి మనం పదాలకూర్పు, ఔచిత్యము, విశిష్టార్థం, అలంకారాలను కవిత్వ లక్షణాలుగా ఆ కాలం నాటి వారు గుర్తించినట్లు గమనించాలి. భావ రూప సమ్మేళనమే కవిత్వమని కూడా వారు భావించనట్లు మనం గమనించవచ్చు. సుకవనానికి భాషాశైలితో పాటు రచనా రూపం కూడా ముఖ్యమన్న విషయం ఈ సూక్తములలో మనం గమనించవచ్చు.

అతిప్రాచీనమైన వేదాలలో అలంకారములను వారు యాదృచ్ఛికముగా ప్రయోగించినారు. కానీ వీటికి సరియైన లక్షణాలను, వీటిలో అవాంతర భేదాలను (Classification) చాలా కాలం తరువాత మాత్రమే గుర్తించారు. కాలక్రమంలో కావ్య సంబంధమైన సామాగ్రి, భాషలు పెరిగిన కొద్దీ, విజ్ఞులు కావ్య లక్షణాలను, అలంకార లక్షణాలను నిర్వచించుటకై ఆలోచనలు సాగించారు.

ఋగ్వేదంలో ఉన్న భాష ప్రాచీనమైన సాహిత్య భాష. దీనితో పాటు జనులు మాట్లాడుకొనే వ్యవహారభాష ప్రచారంలో ఉండి ఉంటుంది. ఋగ్వేదభాష, వ్యవహారికభాష భిన్నంగా ఉన్నాయని చెప్పడానికి ఆధారాలైతే ఇప్పుడు లభించవు. సాహిత్య భాషలో పదాలు ఒకే విధమైన, నిశ్చితమైన రూపంలో ప్రయోగిస్తారు. లోక వ్యవహారంలో పదాలు మార్పులకు గురి అవుతాయి. అనగా వ్యవహారభాష, సాహిత్యభాష కంటే భిన్నంగా ఉంటుంది. వీటికి వ్యాకరణాలను శాకటాయనుడు, స్ఫోటాయనుడు, శాకల్యుడు, అపిశలి మొదలైన పది మంది పూర్వికులు రచించినట్లు పాణిని తన వ్యాకరణంలో పేర్కొన్నాడు.

భారతదేశంలో మగధ సామ్రాజ్యం చిన్న చిన్న గణతంత్ర రాజ్యాలను ఐక్యంచేసి ఆనాడు ఏర్పడింది. అనగా క్రీ.పూ. 250 నాటికి అశోకుడు తన శాసనాలను లిఖించేనాటికి ఉన్న భాష, వైదికభాషకు, పాణిని తన వ్యాకరణంలో పేర్కొన్న భాషకు భిన్నమైన ప్రాకృతభాషలు వ్యాప్తిలో ఉన్నవని లభ్యశాసనాలవల్ల గమనించవచ్చు. ఆ శాసనభాషలే ప్రజలు

మాట్లాడుతున్న ప్రాకృతభాషలు. ఆ తదనంతర కాలంలో వీటికంటే భిన్నమయి, వీటి నుండి సంస్కరింపబడి అభివృద్ధి చెందిన భాషే సంస్కృతము. వైదిక కాలానంతరం వాడుకలో ఉన్న మాండలిక భాషలలో ఒక భాషకు పాణిని వ్యాకరణం రచించాడుగానీ అది నేటి వ్యవహారిక, లభ్య సంస్కృత భాషకు కాదు.

ప్రాకృతశబ్దానికి అనేక అర్థాలున్నాయి. **'ప్రకృత్యా స్వభావేన సిద్ధమ్ ప్రాకృతమ్'** ప్రకృతి యనగా స్వభావము. ప్రాకృతమనగా స్వభావ సిద్ధమని భావము. **'ప్రకృతీనాం సాధారణ జనానా మిదం ప్రాకృతమ్'** ప్రకృతి యనగా సాధారణ జనులు. ఈ సాధారణ జనులు మాట్లాడే భాషే ప్రాకృతమని భావము. ప్రాకృత శబ్దానికి వివిధ నిఘంటువులు తెలిపిన అర్థాలు- **ప్రకృతి ర్యోని శిల్పినోః పౌరామాత్యాది లింగేషు గుణసామ్య స్వభావయోః ప్రత్యయాత్ పూర్వికాయాం చ।।** (అనేకార్థ సంగ్రహము); **స్వామ్యా మాత్యః సుహృత్కోశో రాష్ట్రదుర్గబలానిచ। రాజ్యాంగాని ప్రకృతయఃపౌరాణాం శ్రేణయోపి చ।।** (అభిదాన చింతామణి); **అమాత్యాద్యాశ్చ పౌరాశ్చసద్భిః ప్రకృతయః స్మృతాః** (అభిదాన చింతామణి టీక); లను పరిశీలించిన సాధారణ జనులు మాట్లాడుతుండిన భాష అగుటవల్ల దానికి ప్రాకృతమని పేరు స్థిరపడినట్టు గమనించవచ్చు.

వేదంలోఉన్న భాష సాహిత్యభాషయైతే, జన సామాన్యంలో ప్రచారంలో ఉన్న భాష సర్వసాధారణభాష. ఆ భాషే కాలాంతరంలో మాండలిక, ప్రాంతీయ భేదాలతో, వ్యవహారికంలో, శబ్దాలు వివిధాలుగా రూపాంతరం చెంది అనేక భాషలకు మూలమైంది. ప్రాచీన లాక్షణికుల చర్చలలో పాలీ, మహారాష్ట్రి, శౌరసేని, మాగధీ, అర్ధమాగధి, పైశాచి, చూళికా పైశాచి, అపభ్రంశ మొదలైన ప్రధాన ప్రాకృతాలే కాక వీటి ప్రాంతీయ మాండలిక భేదాలగు, పాంచాలి, ప్రాచ్య, శాకరీ, శాబరీ మొదలైనవి ఆనాడు వ్యవహారములో ఉన్న సాధారణ భాషలు. ప్రాకృత వ్యాకర్తలు గాని, ప్రాచీనాలంకారికులు గాని, పాలీని ప్రాకృత భాషలో ఒకటిగా పరిగణించకపోయినా పాలీ కూడా ఒకనాటి వ్యవహారిక భాషే.

వరరుచి రచించిన 'ప్రాకృత ప్రకాశము' లభ్యమైన ప్రాకృతభాషా వ్యాకరణాలలో మొదటిది. ఇది క్రీ.పూ. రెండవ శతాబ్ది కాలంలో రచింపబడింది. ఇందులో మహారాష్ట్రీ, మాగధీ, శౌరసేనీ, పైశాచి ఈ నాలుగు ప్రాకృతాల రూపభేధాలను మాత్రమే వివరించాడు.

'అపభ్రంశ' భాషను గూర్చి మొదటి సారిగా పతంజలి మహాభాష్యంలో పేర్కొన్నాడు. "ఏకైక స్యహిశబ్దస్య, గావీ, గోణీ, గోతా, గోపోతాది కేత్వేవవ మాదయో అపభ్రంశా" (మహాభాష్యం 1.1.1) ఇందులో అపభ్రంశంగా పేర్కొన్న పదాలు ప్రాకృత భాషల్లో ప్రసిద్ధాలు.

పాణిని వేదంలోని భాషను, లౌకిక వ్యవహారంలో ఉన్న భాషలను ఒకటిగానే పరిగణించి రెండింటికి వర్తించే వ్యాకరణం తయారు చేశాడు. "అధ శబ్దాను శాసనమ్. కేషాం శాబ్దానామ్? లౌకికానాం వైదికానాం చ" అని పతంజలి పస్పశాహ్నికంలో స్పష్టంగా చెప్పాడు. వేదంలో ఉన్న ఉదాత్తానుదాత్తాది స్వరాలు వ్యవహారిక భాషలో కూడా ఉన్నాయి. కొంతకాలం తర్వాత వాడుక నుండి దూరమయ్యాయి. కొన్ని ప్రత్యయాల చివర 'చ్', 'ట్' మొదలైన అక్షరాలను ఇత్యంజ్ఞకాక్షరాలుగా చేర్చి వాటికి ప్రయోజనం ఆయా ప్రత్యయాలు చేర్చినపుడు ఆ పదాల స్వరం మారడం గూర్చి పాణిని, పంతంజలులు తమ వ్యాకరణాలలో వివరించారు.

ప్రాకృత భాషారూపాలు యజుర్, అధర్వణ వేదాలలోనూ, బ్రాహ్మణాలలోనూ అక్కడ అక్కడా కనపడుతున్నాయి. రేఫంతో కూడిన శబ్దాలలో మూర్ధన్యీకరణము ప్రాకృతంలో సహజం. ఉదా: గంఠి> గ్రంథి; వుడ్డ>వృద్ధ; వడ్డి >వృద్ధి. ప్రాచీన వేదభాషలో ఇట్టి మార్పులతో కూడిన రూపాలు చాలా గలవు. ఉదా: వికృత>వికట; దంద్ర>దండ; పఠ్<ప్రథ్, , సంయుక్త హల్లుల సమీకరణం ప్రాకృత భాషల ప్రధాన లక్షణాలలో ఒకటి.

"అగ్ని మీళే పురోహితం, యజ్ఞస్యదేవ మృత్విజమ్, హోతారం రత్న ధాతమమ్" అనే ఋగ్వేదంలోని ప్రథమ సూక్తంలో అన్ని పదాలు వ్యవహారిక భాషలో ప్రయోగించేవే. వేదంలోని కొన్ని పదాలు వ్యవహారిక భాషాప్రయోగానికి అనగా అసాధారణ భాషాప్రయోగానికి దూరమయ్యాయి. కాని కొన్ని పదాలు వేదంలో రెండేసి విధాల ప్రయోగంలో ఉంటే (వైకల్యరూపాలు) సాధారణ భాషలో ఒక విధమైన రూపం ఉన్నది.

ఉదా: వేదంలో 'కర్ణ' శబ్దం తృతీయా బహువచనాంత రూపం 'కర్ణేభిః', 'కర్ణైః' అని రెండు రూపాలలో కనబడితే వ్యవహారిక ప్రయోగంలో 'కర్ణైః' అన్న రూపమే ఉన్నది. 'జన' శబ్దం ప్రథమ బహువచన రూపం వేదంలో 'జనాసః', 'జనాః' అని రెండు విధాలుగా ప్రయోగిస్తే జనభాషలో 'జనాః'

అనే ప్రయోగించారు. ఇలాంటి బేధాలను సూచిస్తూ పాణిని రెండు భాషలను ఒకే భాషగా పరిగణించి పాణిని వ్యాకరణం రచిస్తూ వేదంలో ఉన్న భాషను 'ఛందస్సు' అని, సాధారణ ప్రజల వాడుక భాషను లేక వ్యవహారికి భాషను 'భాష' అని పిలిచాడు. వ్యాకరణంలో పేర్కొన్న అనేక పదాలు 'భాష'లో లేవు. దానికి కారణం వాటికి బదులు పదాంతరాలను ఉపయోగించడం చేత వాటి అవసరంలేక వ్యాకరణానికి దూరమైనాయి.

అష్టాధ్యాయికి 'మహాభాష్యం' రచించిన పతంజలి 'ఛందస్సు', భాష అనే రెండింటిని అంగీకరించాడు. కాని సంస్కృతం ప్రస్తావన – పాణినీయంలో గాని, మహాభాష్యంలో గాని, వార్తికాలలోగాని ఎక్కడా లేదు. పాణిని 'ఛందస్సు' 'భాష' అను పేర్లను ప్రయోగిస్తే, వైదిక శబ్దాలు (వేదశబ్దాలు), 'లౌకిక శబ్దాలు' అని పతంజలి పిలిచాడు. వ్యాకరణ సమ్మతాలైన శిష్ట ప్రయుక్తాలైనవి శబ్దాలని, వాటికి భిన్నమైనవి 'అపశబ్దాలని' పిలిచి వాటినే 'అపభ్రంశా'లన్నాడు. "భూయాంసః అపశబ్దాః, అల్పీయాంసః శబ్దాః ఇతి. ఏకైకస్య శబ్దస్య బహువః అపభ్రంశాః, తద్యథా గౌరిత్యస్యగావీ, గోణీ, గోతా, గోపోతలికా ఇత్యేవమాదయః అపభ్రంశాః" (మహాభాష్యం పస్పశాహ్నికం). శబ్దాలు (సాధుశబ్దాలు) తక్కువగా వుంటాయి. వాటినుండి వచ్చిన అపశబ్దాలు అత్యధిక సంఖ్యలో ఉంటాయి. ఉదాహరణకు : 'గౌః' అనే ఒక సాధు శబ్దానికి గావీ, గోణీ, గోతా, గోపోతలికా మొదలైన అనేక అపశబ్దాలు, అపభ్రంవాలు, ఉండవచ్చు అని దీని భావం. ఈ రూపాలన్నీ పాలీ, ప్రాకృత, ఇతర భాషల్లో ఉన్నాయి. పతంజలి ఛాందస వ్యవహారిక శబ్ద వ్యతిరిక్తాలైన శబ్దాలను అపభ్రంశాలని మాత్రమే అన్నాడు కాని పాలీ, పాకృతాలని అనలేదు. పతంజలి నాటికి ఆ పేర్లు ఆ భాషలకు వాడుకలో లేక పోవచ్చు.

సంస్కృత భాషా పదాలకంటే అత్యంత ప్రాచీనమైన వేద భాషలో కన్పించే పదాలు, వాటి శబ్దరూపాలు పాలీభాషలో కన్పిస్తున్నాయి. ముఖ్యంగా తమర్థేసే, సేౕ, అసే, అసేౕ, క్సే, కసేౕ, అధ్యై, అధ్యైౕ, కధ్యై, కధ్యైౕ, శధ్యై, శధ్యైౕ, తవై, తవేజ్, తవేనః వేదభాషలో ఉన్న ఈ ప్రత్యయాలు 'తుమర్థ'ములో ధాతువుల పరంగా వస్తాయి. ఇవి రాగానే తవే, కేతవే, హేతవే అనే రూపాలు, త్వాన ప్రత్యయాంతాలైన కత్వాన, సుత్వాన మొదలైన రూపాలు, ఆదర్శ శబ్దానికి షష్ఠ్యేక వచన రూపమైన ఇమస్య (ఇమస్స) అనురూపం, గోశబ్దానికి గోనామ్ అను షష్ఠీ బహువచన రూపం, త్రి అను శబ్దానికి త్రీణామ్ అను షష్ఠా బహువచనరూపం, కృత ధాతువునకు 'కరత్' అను ప్రథమ పురుష రూపం, బుద్ధేభిః , దేవేభిః అను తృతీయా బహువచన రూపములు పాలీ భాషలో వాడుకలో ఉన్నాయి. ప్రాచీన సంస్కృత భాషలో గురుశబ్దానికి 'గరు' అను రూపాంతరం ఉన్నది. పాలీ భాషలో కూడా ఈ శబ్ద రూపం ఉన్నది.

పాలీ భాష ఆనాటి వ్యవహారికానికి దగ్గరగా ఉన్న సంగతి కూడ మనం గమనించవచ్చు. అత్రజ (ఆత్మజ), వీమాంస (మీమాంస), నిసదా (దృషద్), జలాబు (జరాయు), పారుపన (ప్రావరణ), మకస (మశక), అగ్గినీ (అగ్గి), పింజ (పిచ్ఛ) భము (భ్రూ) సుంసుమార (శింశుమార), మొదలైన శబ్దాలన్నీ పాలీ వ్యవహారంలో ఉపయోగించటం వల్ల ఒక రీతి సంధి ఉన్నా, సంస్కృత సంధికి ఉన్న అక్షర వ్యత్యాసం, కఠిన నియమాలు పాలీలో లేవు. అందువల్ల అగ్గిని, అగ్గి, గిని, సాన, సొన, సూన, స్వాన, శ్వాన, చతుద్దశ, చుద్దశీ, చద్దశ, (చతుర్దశ) సునిసా, సుంహా, హుసా (స్నుషా), భవస్సతి, హేస్సతి, హేపితి, భొస్సతి, హొస్సతి (భవిష్యతి) మొదలైన శబ్దాలకు ఒక్కొక్క దానికి మూడేసి, నాలుగేసి రూపాలుండటం వల్ల పాలీ భాష సంస్కృత భాషకన్నా ముందు వేద భాషల తరువాత వ్యవహారికంలో ఉన్న ప్రాకృత భాషల నుండి ఉత్పన్నమయిందని భావించవచ్చు. సంస్కృతభాషలో కానరాని అనేక శబ్దాలు వేదభాషలోను, పాలీ భాషలోను కనిపిస్తున్నాయి.
పణ్ణకార = కానుక; సంగనిక = సభ; సంప్రవక్త్ర = స్నేహితుడు; వివచనం = పర్యాయపదం; అన్యదస్తు = నిశ్చయంగా; కధికా = సంభాషణ; సహవ్యతా = సహవాసము; సప్రాయ = ఉపకారకమైన; విభాషా = మాటచేత భయపెట్టుట; ఏకాంసిక = నిశ్చయము; ప్రణీత = మధురమైన; అలోకసంధి = గవాక్షము మొదలైనవి పాలీభాషలోనే కనిపిస్తున్నాయి.

ఈ పాలీభాషా శబ్దజాలమే అనేక మార్పులుచెందింది. దీనిలో ఋ, ౠ, ఌ, ౡ వర్ణములు ఐ, ఔ లు,హల్లులలో శ, ష, న, విసర్జనీయములు లేవు. క్రియలలో నామవాచకాలలో ద్వివచనము లేదు. లుట్, ఆశీర్లిజ్ లు లేవు, సన్నంత రూపాలు, కృదంత రూపాలు లేవు. పాలీ

భాషలో ద్వివచనం లేదు. చతుర్థీవిభక్తి రూపాలు, షష్ఠీవిభక్తి రూపాలు సమంగానే ఉన్నాయి. తృతీయావిభక్తి రూపాలు, పంచమీవిభక్తి రూపాలు సమంగా ఉన్నాయి. పాలీలో ప్రయోగించే 'స' కారం సంస్కృతంలో 'శ ష స' లు గా మారింది. ఉదా : దేసో>దేశః; పురిసో>పురుషః. పాలీలో సంయుక్తాక్షరానికి పూర్వం ఉన్న 'ఏ' సంస్కృతంలో 'ఆ'గా మారుతుంది. ఉదా: ఫెగు>ఫల్గు; సెయ్యా>శయ్యా. పాలీలో సంయుక్తాక్షరానికి పూర్వం ఉన్న హ్రస్వ స్వరం సంస్కృతంలో దీర్ఘ స్వరం అవుతుంది. ఉదా: చెతియో>చైత్యః; ఓటో>ఓష్ఠః; మొరియో>మౌర్యః. పాలీభాషలో విసర్గ ఉండదు. ఉదా: దుక్ఖం>దుఃఖమ్; దుస్సహో>దుఃసహ; దేవో>దేవః; అగ్గి>అగ్నిః; ధేను>ధేనుః. సంస్కృత భాషలో శబ్దమధ్యంలో ఉన్న ఘ్, ధ్, భ్, మొదలైన మహాప్రాణ ఘోష వర్ణాలు (గ ఘ జ ఝ ఞ ట డ ఢ ణ ద ధ న బ భ మ హ య ర ల వ అను వర్ణాలు ఘోషాలు). 'హ్' గా పలుకుతాయి. ఉదా: లహు>లఘు; రుహిరో>రుధిరః; సాహు>సాధుః. పాలీలో మకారం సంస్కృతంలో యకారంగాను, సంస్కృతంలో ప్రయోగించే వకారం యకారంగాను మారుతుంది. ఉదా: సమన్త > సుపన్త; దూమాయతి>ధూపాయతి; కందువతి> కణ్డయతి; దాయ > దవ. సంయుక్త వ్యంజనాలలో సాధారణంగా మొదటి అక్షరం రెండవ అక్షరం రూపాన్ని తీసుకుంటుంది. ఉదా: ముత్తో > ముక్తః; దుద్దో > దుగ్ధః; పచ్భారో > ప్రాగ్భారః; ఖగ్గో > ఖడ్గః; పుగ్గలో > పుద్గలః. సంయుక్త వ్యంజనాలలో మొదట ఉన్న 'ర్' తన తరువాత వచ్చే వ్యంజన రూపాన్ని తీసుకుంటుంది. ఉదా: సక్కరా > శర్కరా; వగ్గో > వర్గః; కప్పూరో > కర్పూరః; కమ్మ > కర్మ; దస్సనం > దర్శనమ్. పాలీలో 'ల'కారం తన తరువాత ఉన్న వర్ణంగా మారుతుంద.ఇ 'వ' కారం తన పూర్వం ఉన్న వర్ణంగా మారుతుంది. 'జ్ఞ' 'ణ్య'ల స్థానంలో ఞ్ఞ వస్తుంది. ఉదా: కప్పో > కల్పః; ప్రగబ్భో > ప్రగల్భః; అస్సో > అశ్వః; పక్కో > పక్వః; చత్తారో > చత్వారః; సర్వఞ్ఞో > సర్వజ్ఞః; కఞ్ఞా > కన్యా; పఞ్ఞో > పుణ్యః.

ప్రాచీన వేదభాషలోని ఋకారము ఐ ఔలు పాలీభాషలో లేవు. ఋ సాధారణముగ అకారముగ (కొన్ని పదాలలో ఇ ఉ లు గను ) మార్పు చెందింది. ఈ మార్పు ప్రాకృతంలో వలె పద మధ్యమందే గాక పదాదిని కూడా జరిగింది. పాలీలో 'అచ్ఛ' శబ్దము సంస్కృతంలో 'ఋక్ష' అయినది. పాలీలో వక శబ్దము వృక అయింది. పాలీలోని ఏ ఓ లు సంస్కృతంలో ఐ, ఔ, లు గాను, అయ, అవలుగా మారినవి. ఉదా: జేతి > జయంతి; తేరస > త్రయందశ. సంయుక్తాక్షరాలు: పాలీలో సంయుక్తాక్షరాలు, ద్విత్వాక్షరాలు, అసుస్వారము వీటికి ముందున్న హ్రస్వత్వము సంస్కృతంలో దీర్ఘాచ్చులుగా మారినవి. ఉదా: కంతమ్ > కాంతామ్. అందువల్ల సంస్కృతంలో చంద్రః; చాంద్రః అను రెండు భిన్న పదములను మధ్య అర్థ భేదము గుర్తించుఓట కష్టమైంది.

కొన్నిసార్లు సంయుక్తాక్షరానికి ముందున్న హ్రస్వాచ్చు దీర్ఘత్వము పొంది సంయుక్తాక్షరాలలో ఒక దానిని లోపింప చేస్తుంది. ఉదా: సస్సప > సాసప > సర్షప; దంఠ > దాఠ > దంష్ట్ర; వీసతి > వింశతి; సిహో > సింహః. పాలీ ప్రాకృతాలలో పదాంత హల్లులు మారినవి. అక్కడక్కడ పాలీభాషలోని సరళాలకు పరుషాలు సంస్కృత భాషలో వస్తాయి. పాలీలోని మహాప్రాణాలు సంస్కృతంలో అల్ప ప్రాణాలవుతాయి. ఉదా: ముతింగ > మృదంగ; సుఖుమాల > సుకుమార; ఖుబ్జ > కుబ్జ. సంయుక్తాక్షరాలలో వర్ణ సమీకరణము (assimila-tion) దీర్ఘాచ్చులు హ్రస్వములగుట, సంయుక్తాక్షరములలో ఒక వర్ణము లోపించుట మొదలైన లక్షణాల వల్ల పాలీ భాష ఇతర ప్రాంతీయ భాషలలో పూర్తిగా కలిసిపోయింది. పాలీ భాషా సాహిత్యం మనకు లభ్యమౌతున్నదంతా బౌద్ధ గ్రంథాలలో లభించిందే. లౌకిక సాహిత్యానికి సంబంధించిన గ్రంథాలు లభ్యంకాలేదు.

పరిణామశీలమైన సంఘం మారుతున్నపుడు భాష కూడ మార్పు చెందడం సహజం. మనకు లభ్యమయ్యే శబ్దాలు వాటి పుట్టు పూర్వోత్తరాలు, అవి చెందిన పరివర్తనము అర్థంలోను, రూపంలోను గుర్తించినపుడే ప్రాచీన భాషల స్వరూప స్వభావాలు అర్థం చేసుకోగలుగుతాం. మానవ సమాజం, సమూహాలు, ఇతర సమాజాలతో, సమూహాలతో అన్యోన్యాశయాలతో అభివృద్ధి చెందుతూ, పరివర్తనం చెందుతూ విభిన్న భాషల సాన్నిహిత్యం ఏర్పడి, సాంగత్యంతో సద్యః భాషల సాంకర్యం అనివార్యమై కొన్ని భాషల అభివృద్ధికి, వికాసానికి, కొన్ని భాషలు కాలగర్భంలో కలిసిపోవటానికి కారణమైంది.

---

కుర్రా జితేంద్రబాబు
చరిత్ర పరిశోధకులు, ఫోన్ : 9848882600

# నెల్లూరు కృష్ణపట్నం:
# మనుమసిద్ధేశ్వర ఆలయం

*– దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి*

నెల్లూరుకు తూర్పుగా 25 కి.మీ. దూరంలో కృష్ణపట్నం ఉంది. ఇక్కడున్న దేవాలయాల్లో మనుమ సిద్ధేశ్వర దేవాలయం, వేణుగోపాలస్వామి దేవాలయం ముఖ్యమైనవి. వీటిలో మనుమ సిద్ధేశ్వరాలయం అద్భుత శిల్ప సంపదను కలిగి ఉంది. ఇవేగాక, మరికొన్ని ఆలయాలు కృష్ణపట్నంలో, దాని పొలిమేరలో ఉండేవని అక్కడి శిథల శిల్పాలముక్కలు తెలియజేస్తున్నాయి. ఇక, ఊరి పొలిమేరలోని మనిషి ఎత్తు గల పార్శ్వనాథుని శిల్పం, విష్ణ్వాలయానికి నైరుతి దిక్కులోని జైన సంప్రదాయాల దిగంబర స్త్రీ (?) విగ్రహం ఈ తీరపట్నంలోని ఒకప్పటి జైనమత ప్రాభవాన్ని తెలుపుతున్నాయి. ఇక్కడ, పట్టణం, పట్టిణం, పట్నం అనగా ఓడరేవు ఊరు.

కృష్ణపట్నానికి తొలుత 'కల్లత్తుర్రై' (అనగా, పెద్ద నగరం) అను పేరుండినట్లు తెలుస్తోంది. దీనికే, గండగోపాల పట్టణం అను పేరుండేది (నెల్లూరు తెలుగుచోడ పాలకుల బిరుదు గండగోపాల ఆధారంగా). రాజవిభలపట్టణం అని మరొక పేరు కూడా ఉండేది (విజయనగర పాలకుడైన ఒకటవ దేవరాయల బిరుదు రాజవిభల ఆధారంగా). అంతేగాక, కల్‌పట్టణం అను పేరుండినట్లు కూడా కొందరు మేధావుల అభిప్రాయం. ఈ కల్‌పట్టణమే శ్రీనాథుని పూర్వీకుల జన్మభూమియని ఒక అభిప్రాయం ఉంది. శ్రీనాథుడు కూడా కృష్ణపట్నం వాసియేయని, శృంగార శ్రీనాథంలో వేటూరి ప్రభాకరశాస్త్రి అభిప్రాయపడినారు. రాజశేఖర కవి రచించిన సంస్కృత గ్రంథం హరవిలాసాన్ని ఆంధ్రీకరించి తన బాల్య మిత్రుడు, అవచితిప్పయ్య శెట్టికి (త్రిపురాంతక శెట్టి), శ్రీనాథుడు అంకితమివ్వడం, తిప్పయ్య నాటి కృష్ణపట్నంలో విదేశీ వ్యాపార లావాదేవీలు జరుపుచుండడం (సుగంధద్రవ్యాలు, అరబ్బు గుర్రాలు, మసాలా దినుసులు దిగుమతి), తిప్పయ్య కుమారుడు మాచన్నకు పిల్లలమర్రి పెద్దన్న గురువుగా ఉండడం, శ్రీనాథునికి పిల్లలమర్రి బంధువు కావడం, పిల్లలమర్రి నేటి కలికివాయి (కలువాయి) బిట్రగుంట వాసి కావడం, ఆతని వద్దకు శ్రీనాథుడు అపుడప్పుడు వెళ్ళివస్తుండడం, నాటి పాకనాడులోని నెల్లూరుసీమ (మండలం) నేటి ఒంగోలు పట్టణ ఉత్తర భాగం వరకు విస్తరించి ఉండడం వంటి అంశాలు బట్టి శ్రీనాథునిది కృష్ణపట్నమేయని భావన కలదు.

ఇక, శ్రీనాథుని బాల్యమిత్రుడు తిప్పయ్య కుటుంబాన్ని పరిశీలిస్తే, పావాణిశెట్టి అనేవాడు నెల్లూరు నగర వర్తక మండలి శ్రేష్ఠియని, అతని కుమారుడు అవచితిప్పయ్య శెట్టియని, ఆతని భార్య మాచాంబయని, వీరిరువురి, కుమారుడే త్రిపురారి శెట్టియని, ఇతడే తిప్పయ్య శెట్టియని, ఇతడు విదేశీ వ్యాపారంలో ప్రసిద్ధుడని, ఈతడు నెల్లూరులో జన్మించాడని, ఇతడే శ్రీనాథుని బాల్యమిత్రుడని, కాబట్టి శ్రీనాథుడు కూడా నెల్లూరు వాడేయని భావన కలదు. ఐతే, శ్రీనాథుడు నేటి ప్రకాశం జిల్లా (పూర్వపు నెల్లూరు సీమలో (జిల్లాలో) ఉత్తర భాగం) తీరగ్రామం పాకల (ఒకప్పటి పాకాల్) నివాసియని, ఇతని పోషకుడు పంటమైతర యని, ఈ పంటమైతర క్రీ.శ 1482లో నేటి ఒంగోలు తాలూకా చదలవాడ గ్రామ ఆలయానికి దానం చేశాడని తెలుస్తోంది. శ్రీనాథుని తాత కమలనాభామాత్యునిది పాకనాటి యందలి పాకల యని తన భీమఖండంలో చెబుతూ "వార్ధితట పాకాల్ పట్టణాధీశ్వరున్" అని చెప్పడం బట్టి శ్రీనాథునిదికూడా పాకాలయని భావించడం గలదు. ఏదిఏమైనా శ్రీనాథుడు నాటి విశాల నెల్లూరు సీమ వాసియనేది మాత్రం సత్యం.

ఇక, మనుమసిద్ధేశ్వర ఆలయ విషయానికి వస్తే, ఇది తెలుగుచోడుల నిర్మాణమని తెలుస్తోంది. చోళ–చాళుక్య ఉమ్మడిరాజ్య పాలకుడైన కుళోత్తుంగచోళుడు వంటి చోళ పాలకులకు సామంతులుగా ఉంటూ, చోళ వంశీయులమని చెప్పుకొంటూ, విక్రమసింహపురమని పిలువబడు చుండిన నేటి నెల్లూరును రాజధానిగా కల్గి తెలుగు చోడులు

పరిపాలిస్తూండేవారు. ఈ వంశానికి చెందినవాడే రెండవ మనుమసిద్ధి, కృష్ణపట్నం మనుమసిద్ధేశ్వరాలయ నిర్మాత ఇతడే. ఇతని పేరు మీదుగనే ఈ శివాలయం నిర్మితమైంది. ఇతనికే వీరగండగోపాలుడు అను బిరుదు ఉండేది. ఇతడు నెల్లూరు (ఇప్పటి ఒంగోలువరకు), కడప జిల్లాలను కలుపుకొని నెల్లూరు సీమ అను పేరుతో క్రీ.శ. 1248-1263 మధ్య పాలించాడు. ఇతని ఆస్థానంలోనే కవిబ్రహ్మ తిక్కన ఉండేవాడు. ఇతడే *నిర్వచనోత్తర రామాయణము*ను రచించినవాడు. ఇందులోనే మనుమసిద్ధి పూర్వుల గురించి తెలుపబడి ఉంది. దీని ప్రకారం తెలుగుచోడులలో మొదటివాడు 'బిజ్జన'. ఇతనికే తెలుగుబిడ్డ లేక తెలుగు విద్య అనుపేర్లుండేవి. ఇతడు పశ్చిమ చాళుక్య రాజైన మొదటి సోమేశ్వరుని సామంతుడుగా ఉండేవాడు. చోళరాజ్య పతనాన్ని అవకాశంగా తీసుకొని ఇతడు సొంత రాజ్యస్థాపన చేసుకున్నాడు.

బిజ్జన తరువాత మనుమసిద్ధి ముఖ్యుడు. ఇతని అన్న తిక్కభూపతి. (తిరుకాళత్తిదేవ మహారాజు) కడప, చిత్తూరు, చెంగల్పట్టు జిల్లాల్లోనికి, కాంచీపురం వరకు రాజరాజు పేరుమీదుగా రాజ్యవిస్తరణ చేసి, వెలనాటి రాజును, పశ్చిమచాళుక్య సేనుని, హోయసల రాజప్రతినిధులను ఓడించి అధికారవ్యాప్తి చేసుకొన్నాడు. క్రీ.శ. 1248 వరకు పాలించాడు. తిక్కభూపతి తరువాత అతని కుమారుడు రెండవ మనుమసిద్ధి పాలించాడు. ఇతని ఆస్థానంలోనే తిక్కన సోమయాజి మంత్రిపదవిని అలంకరించాడు. మనుమసిద్ధి దాయాదులు అక్కన్న, బయ్యన్నలు మనుమసిద్ధిని ఓడించి రాజ్యాక్రమణ చేయగా తిక్కన ఓరుగల్లు కాకతీయ గణపతి దేవుని సహాయాన్ని పొంది అక్కన్న, బయ్యన్నల్ని ఓడించి మనుమసిద్ధి తిరిగి అధికారం పొందేట్లు చేశాడని తెలుస్తోంది. గణపతి దేవ కుమార్తె రుద్రమదేవి కూడా తన సేనాని గంగయ్యను నెల్లూరుకు పంపి మను గండ గోపాలుని అధికారాన్ని నిలబెట్టిందని, అలా కాకతీయ ప్రాబల్యం నెల్లూరులో ఏర్పడిందని తెలుస్తోంది. కాకతీయుల కాలంలోనే నెల్లూరును కొంతకాలం చక్రనారాయణులు అను యాదవ వంశీయులు పాలించినట్లు తెలుస్తోంది. ఇక, రెండవ మనుమసిద్ధి కాలంలోనే మధుర రాజైన పాండ్యవంశ జాతవర్మ సుందర పాండ్యుడు నెల్లూరును ముట్టడించాడు. ఇతనితో క్రీ.శ. 1263లో జరిగిన ముత్తుకూరు యుద్ధంలో మనుమసిద్ధి ప్రాణాలను కోల్పోయాడు. కాకతీయ రాజ్యక్షీణదశలో స్వతంత్ర రాజ్య స్థాపన చేసుకొన్న రెడ్లు, వీరిని ఓడించిన గజపతి వంశ కపిలేశ్వరుడు, తీరాంధ్రను ఆక్రమించిన విజయనగరరాజులు వరుసగా నెల్లూరుపై పాలన సాగించారు. ఇలా పల్లవ, తూర్పుచాళుక్య, చోళ, పాండ్య, తెలుగుచోడ, కాకతీయ, చక్రనారాయణ, రెడ్డిరాజులు, గజపతి విజయనగరరాజులు, నెల్లూరును పాలించారు. అందుకే రెండవ మనుమసిద్ధి నిర్మిత కృష్ణపట్నం శివాలయం వీరందరి ప్రభావంతో మిశ్రమ శిల్పకళను కల్గిఉంది. (తెలుగుచోళులకు త్రిపురాంతక చోళులని, మధురాంతక చోళులని, విక్రమసింహపురి చోళులని, గండ గోపాలురని బిరుదులు గలవు).

కృష్ణపట్న మనుమసిద్ధేశ్వరాలయం పశ్చిమ ముఖంగా నిర్మింపబడిఉంది. ఇది చతురస్రాకార ప్రాకారం మధ్య నిర్మింపబడి ఉంది. గర్భగృహ, అంతరాళ, అర్ధమండప అను నిర్మాణ భాగాల్ని కల్గి ఉంది. ప్రాంగణమందే కామాక్షి, మల్లికేశ్వర అను ప్రత్యేక దేవగృహాలు నిర్మింపబడి ఉన్నాయి. ప్రాకారపు పశ్చిమ కుడ్యమును ఆనుకొని వెలుపల భాగమున ఒక స్తంభ ముఖ మండపం నిర్మింపబడి ఉంది. స్తంభ ముఖమండపం దీర్ఘచతురస్రాకారంగా నిర్మింపబడి ఉంది. దీనికి సుమారు నాల్గు అడుగుల ఎత్తైన అధిష్టానం ఉంది.



**ఎ.** అధిష్ఠానం పట్ట, గళ, పద్మ అను విభాగాల్ని కలిగివుంది. ఇవన్నీ ఒక చిన్న ఉపపీఠంపై నిర్మింపబడి ఉన్నాయి. పద్మ, గళల మధ్య సుమారు ఒక అడుగు వెడల్పు గల శిలా దిమ్మెల ముఖ భాగాలపై అర్ధశిల్పాలు ఉన్నాయి. వీటిలో భక్తి పారవశ్యాన నాట్యం చేయుచున్న భక్తులు, భిక్షాటన మూర్తి వెంబడి పయనిస్తున్న సప్త ఋషులు, వారి సతులు, శివునిపై గురిపెట్టుచున్న విల్లంబులు గల మన్మథుడు, సంగీత–నాట్యములందు మైమరచియున్న గణ చిత్రములు, గ్రామ పడుచుకన్యలు మెురటైన ప్రాంతీయ కోలాట ఆటలు ఆడుచున్న చిత్రములు ముఖ్యమైనవి.

**బి.** స్తంభమండప అధిష్ఠానం ఎత్తుకు సమాన, ఎత్తుగల తిన్నెపై తూర్పు – పశ్చిమాలుగా నాల్గువరుసల స్తంభాలు మండపం యొక్క పై కప్పునకు ఆధారంగా నిలుపబడి ఉన్నాయి. మండపం యొక్క ఉత్తర – దక్షిణాలలోని కుడ్యాలలో రెండు వైపులా నాల్గు కుడ్య స్తంభాలు ఉన్నాయి. ఇచటి స్తంభాలకు మూలము, అండము, కాపిటల్ , కార్బెల్ అను విభాగాలు ఉన్నాయి. స్తంభాల బ్లాకుల ముఖ భాగాలపై, సెక్షన్ భాగాలపై అద్భుత శిల్పసంపద ఉంది. వీటిలో దిక్పాలకులు, కిన్నెరలు, కింపురుషులు, వేణుగోపాలుడు, కాళీయమర్ధనుడు, పూతన సంహారం, త్రిపురాంతక సంహారమూర్తి, కుమారస్వామి, దేవీశిల్పం కొన్ని ఉదాహరణలు. మండప ఎడమభాగంలో రెండవ స్తంభంపై ఉత్తర ముఖభాగంపై చెక్కబడి ఉన్న త్రిపురాంతక సంహారమూర్తి శిల్పం చెప్పుకోదగినది. ఇందులో రథారూఢుడై ఉన్నాడు. పరివార దేవతలు ఈతనికి ఎండ తగులకుండా ఛత్రాన్ని పట్టుకొని ఉన్నారు.

మండప స్తంభాలలో కొన్ని విభాగాలు స్థూపాకారంలో, అధో ముఖ స్థూపాకారంలో ఉన్నాయి. స్తంభాల అండ, విభాగాల్లో కుంభపంజర రూప చిత్రణ ఉంది. స్తంభాలపై పథక చిత్రరూపణ కూడా ఉన్నాయి. స్తంభాల కాపిటల్ ముఖభాగాలపై కూడా శిల్పాలు ఉన్నాయి. స్తంభాల కార్బెల్, 'పోతిక' లేక 'పుష్పభూతిక' ఆకారంలో ఉన్నాయి. పుష్పభూతిక ఆకారం బట్టి ఈ మండప విజయనగరకాలాన నిర్మితమైనట్లు భావించవచ్చు. శాసనాలు కూడా దీనినే ధృవీకరిస్తున్నాయి.

**సి.** మండపపు ఉత్తర, దక్షిణ ముఖాలలో రెండు కుడ్య స్తంభాలున్నాయి. ఇవి ఏకశిలా నిర్మితాలు కావు. కుడ్య నిర్మాణ శిలలతోనే రూపొందింపబడి ఉన్నాయి. ఇక, మండపపు కపోత విభాగం క్వార్టర్ సర్కిల్ ఆకారంలో ఉంది; మహాబలిపుర తీరదేవాలయ కపోత వలె. కపోత భాగంలో కూడు (గేబుల్) డిజైన్లు ఆరు ఉన్నాయి. ఐతే, శిథిల దశలో ఉన్నాయి. కార్నిస్‌పైన మండప పైకప్పు కాకిరాయి (గ్రానైట్) పలకలతో నిర్మితమైవుంది. మండప ఉత్తర, దక్షిణ భాగాలలోని కుడ్యాల వెలుపలి ముఖ భాగాలలో కుడ్యస్తంభాలు, కుంభపంజరలు ఉన్నాయి. మండపం మధ్యలో ఆలయ ప్రవేశమార్గం ఉంది. ఈ దారికి ఇరువైపులా తిన్నెలున్నాయి. వీటిపైనే రెండు వరుసలతో కూడిన నాల్గు వరుసల స్తంభాలున్నాయి.

స్తంభ ముఖమండపం ద్వారా ఆలయంలోకి ప్రవేశిస్తే ఎదురుగా గర్భగృహ, అంతరాళ, అర్ధమండపాలతో కూడిన ముఖ్య దేవగృహం ఉంది.

**ఎ.** గర్భగృహ అధిష్ఠానం సుమారు నాల్గు అడుగుల ఎత్తు ఉంది. ఇది పట్ట అను విభాగాల్ని మూడింటిని క్రింది భాగాన కల్గివుంది. వీటిపైన త్రిపట్ట, పట్ట అను విభాగాలున్నాయి.

**బి.** గర్భగృహ ప్రాంత కుడ్యం వెలుపలిభాగంలో కుడ్య స్తంభాలున్నాయి. శాలాకోష్టలున్నాయి; వీటికి, ఇరువైపులా సామాన్య కార్బెల్ గల కుడ్య స్తంభాలు; వీటి పైనే కుడ్యమందే శాల రూప నిర్మాణం ఉన్నాయి. ఇచటి శాలాకోష్టల్లో పరివార దేవతా ప్రతిష్ఠానం లేదు. ఇవి ఖాళీగా ఉన్నాయి. ఇక్కడి శిలాకోష్టలకు ఇరువైపులా కొంత దూరంలో పెద్దసైజు సామాన్య కార్బెల్ గల కుడ్యస్తంభాలున్నాయి. వీటిమధ్య కాకతీయుల నాటి విమానస్తంభాలు వంటి విమానస్తంభాలు ఉన్నాయి. కుడ్యంపైన క్వార్టర్ సర్కిల్ కపోత (కార్నిస్) ఉంది. కార్నిస్‌ల ముఖ భాగాల్లో కూడు డిజైన్లు ఉన్నాయి. ఇవి భైరవకోన కూడులవలె ఉన్నాయి.

**సి.** గర్భగృహ కపోత పైన మూడు తలముల విమానం ఉంది. ప్రతి తలంలో కూట, పంజర, శాల, 'హారము'ల వరుసలున్నాయి. ఐతే, మూడవ తలంలో 'హారము' లకు బదులు దాని 'ఫలక' నాల్గు మూలలందు నంది ప్రతిమలున్నాయి. మహాబలిపుర తీరదేవాలయంలో కూడా ఇలాగే నంది ప్రతిమలున్నాయి. పంజర విభాగంలో సింహలలాటం ఉంది. ప్రతి తలం మూలల్లోని కూట ముఖభాగాల్లో స్పేడ్‌హెడ్ టాప్ ఆకారంలోని మానవ తలలు,

గల కూడు డిజైన్లు ఉన్నాయి. విమాన రెండవ తలంలో పంజరల పైభాగములందు దేవతా ప్రతిమలు ఉన్నాయి. మూడవ తలం నాల్గు దిక్కుల్లో కొసల్లో శిఖరాన్ని అనుకొని దేవతా ప్రతిమలు ఉన్నాయి. ఈ విధానం చోళదేవాలయాల సాంప్రదాయాన్ని గుర్తుకు తెస్తోంది.

**డి.** మూడవ తలం పైన మధ్యగా చతురస్రాకారం గల శిఖర నిర్మాణం ఉంది. ఇది నాగర తెగకు చెందింది. ఈ దేవాలయ విమానం ద్రవిడ తెగకు చెందింది కాగా, శిఖరం నాగర తెగకు చెందిందిగా ఉండడం గమనించదగిన అంశం. శిఖరం నాల్గుముఖాల్లో సింహలలాట గేబుల్ డిజైన్లు పెద్దవిగా నాల్గు నిర్మింపబడి ఉన్నాయి. శిఖరం పైన కపురి ఉంది.

**ఇ.** చతురస్రాకారంగా నిర్మింపబడియున్న గర్భగృహం లోపల బ్లాక్‌బసాల్ట్‌తో రూపొందించబడియున్న శివలింగం స్థాపితమైఉంది. ఇది సుమారు ఒక అడుగు ఎత్తు ఉంది. సుమారు ఒకటిన్నర అడుగుల ఎత్తుగల చతురస్రాకార పానవట్టంపై అమర్చబడి ఉంది. పానవట్టం చతురస్రాకార దమరు వలె ఉంది. గర్భగృహకు ద్వారం లేదు. అంతరాళం వద్దే ద్వారం నిర్మితమై ఉంది. గర్భగృహ కుడ్యములపై పేర్చబడి ఉన్న కొయ్య దిమ్మెలపై గర్భగృహ విమానం నిలచి ఉంది. గర్భగృహకు ముందు అంతరాళం ఉంది. దీని ఉత్తర, దక్షిణ కుడ్యాల వెలుపలి ముఖ భాగాల్లో చిన్న దేవకోష్టలున్నాయి. అంతరాళపు పైకప్పు చదరంగా ఉంది.ఐతే, దీని లోపలి ముఖభాగం రాతి దూలాలతో పద్మాకారంలో నిర్మితమై ఉంది. అంతరాళం వద్దే ద్వారం బహుచక్రాలున్న రీతిలో ఒకే శిలలో రూపొందించబడి ఉంది. ఈ ద్వారం ఇరు వైపులా గధారూధులైన ద్వారపాలకులు ఉన్నారు. వీరికి నాల్గు చేతులున్నాయి. ఉష్ణీష, కర్ణకుండలాల్ని ధరించి ఉన్నారు. చేతుల్లో ఆయుధాలున్నాయి. భుజకీర్తుల్ని కల్గి ఉన్నారు. వీరు గంభీర రూపాల్ని కలిగి ఉన్నారు. సుమారు ఆరు అడుగుల ఎత్తు ఉన్నారు.

అంతరాళమునకు ముందు అర్ధమండపం ఉంది. ఇందులో మూడు వరుసల స్తంభాలు వరుసకు మూడు చొప్పున ఉన్నాయి. అర్ధమండప దక్షిణ కుడ్యంలో మూడు కుడ్య స్తంభాలున్నాయి. ఉత్తర కుడ్యాన్ని ఆనుకొని ఉన్న ఎత్తైన తిన్నెపై సుబ్రమణ్యేశ్వర, గణపతి, శివ ప్రతిమలున్నాయి. అర్ధమండప స్తంభాలకు టెనన్-లైక్ ప్రొజెక్షన్ గల కార్బెల్ ఉంది. ఇచటి స్తంభాలు గుండ్రంగా టేపరింగ్ ఆకారంలో ఉన్నాయి. ఇవి పై కప్పుకు ఆధారమిస్తున్నాయి. అర్ధమండపం తూర్పు పడమరలుగా దీర్ఘచతురస్రాకారంగా ఉంది. దీని మధ్య భాగంలో నంది ఉంది. దీని పైకప్పు నాల్గుమూలల్లో నంది ప్రతిమలు ఉన్నాయి. దీని పశ్చిమంలో ప్రవేశద్వారం చక్రాల రూపంలో ఏకశిలతో నిర్మితమై ఉంది. అర్ధమండప ద్వారానికి ఇరువైపుల రెండు శాసనాలున్నాయి. దీని కుడ్యం వెలుపల భాగంలో కుడ్య స్తంభాలున్నాయి.

అర్ధమండప ఉత్తరకుడ్యంలో ప్రవేశం కలిగి అంతరాళకు ఆనుకొని ఒక చిన్న చండికేశవ దేవగృహం ఉంది. దీని ద్వారం శిలానిర్మితమైవుంది. ఈ ద్వారం పైన లోపలి భాగంలో ఒక తమిళ శాసనం ఉంది.

అర్ధమండపముకు దక్షిణాన ఆనుకొని ప్రత్యేక స్తంభమండపం ఉంది. ఇందులో మూడువరుసల స్తంభాలు పైకప్పుకు ఆధారంగా ఉన్నాయి. ప్రతి స్తంభానికి మూడు బ్లాకులు ఉన్నాయి. బ్లాకుల మధ్య ఆక్టాంగిల్ సెక్షన్ ఉంది. బ్లాకుల్ని కలుపుచూ చిన్న తరహా స్తంభం ఉంది. ఇక్కడి స్తంభాలకు పుష్పభూతిక రీతి కార్బెల్ ఉంది. స్తంభాలపైన, మండప ముఖంపైన గణపతి, చండికేశ్వర అర్ధ శిల్పాలున్నాయి. మండప పశ్చిమ కుడ్యంలో, కుడ్య స్తంభం ఉంది. ఈ మండప కపోత క్వార్టర్ సర్కిల్‌లో ఉంది.

ముఖ్య ఆలయానికి ముందు నంది మండపం ఉంది. ఇందు నాల్గు స్తంభాలున్నాయి. వీటికి టెనన్-లేక్ ప్రొజెక్షన్ కార్బెల్ గల క్యాపిటల్ ఉంది. స్తంభాలు పైనున్న స్టెప్‌డ్ విమానాన్ని, దాని నాగర శిఖరను మోస్తున్నాయి. శిఖరం నాల్గుముఖాల్లో సింహలలాట గేబుల్ డిజైన్‌లను కలిగి, దేవతా ప్రతిమల్ని కలిగి ఉన్నాయి. శిఖరం నాల్గుమూలల్లో నంది ప్రతిమలున్నాయి. శిఖరం పైన కపురి ఉంది. ఈ మండపం ముందు ధ్వజస్తంభం ఉంది.

ముఖ్య ఆలయ ప్రాంగణంలో పశ్చిమ మూలల్లో రెండు దేవగృహాలున్నాయి. అవి: కామాక్షి దేవగృహం, మల్లికేశ్వర దేవగ్రహం. మొదటిది వాయవ్యమూలలో ఉంది. రెండవది నైరుతి మూలలో ఉంది. మొదటిదానికి చతురస్రాకార గర్భగృహ, దీర్ఘచతురస్రాకార అంతరాళ,

దీర్ఘచతురస్రాకార ముఖమండపం ఉన్నాయి. గర్భగృహంలో బ్లాక్ బసాల్ట్‌తో రూపొందించబడిఉన్న కామాక్షిదేవి ప్రతిమ ఉంది. గర్భగృహ ద్వారం ఇరువైపులా సింహలలాటం గల గదారూఢులైన ద్వారపాలక ప్రతిమలున్నాయి.

ఈ దేవగృహపు ముఖమండపంలో రెండు స్తంభాలు, రెండు కుడ్య స్తంభాలున్నాయి. వీటికి అండ భాగంలో మూడు బ్లాకులు, వాటిమధ్య రెండు ఆక్టాంగిల్ సెక్షన్ భాగాలు, క్యాపిటల్‌లో పుష్పభూతిక కార్బల్ విభాగాలున్నాయి. స్తంభాల బ్లాకులపై గణపతి నటరాజ వంటి శైవ అర్ధ శిల్పాలున్నాయి. దేవీ గృహ ప్రవేశమార్గం ఇరువైపులా కుడ్యంలో నాల్గు కుడ్యస్తంభాలున్నాయి.

ఈ దేవగృహ కుడ్యం వెలుపలి భాగాల్లో అన్ని వైపులా శాలాకోష్టములు, కుడ్య స్తంభాలు ఉన్నాయి. దీని ముఖ్యమండపమందు ముందు వైపుగల కుడ్యం పై భాగంలో తూర్పు-పడమరల్లో రెండు వ్యాళ ప్రతిమలు ఉన్నాయి. దీని అంతరాళం, ముఖమండపలు చదరపు పైకప్పును కలిగి ఉన్నాయి. ఇచటి గర్భగృహం పైన గజపృష్ట ఆకారంగల విమానం ఉంది. దీని నాల్గు ముఖభాగాలపై పెద్ద సింహలలాట గేబుల్ డిజైన్లు ఉన్నాయి. గజపృష్ట శిఖరంపై మూడు కలశాలు నిర్మితమై ఉన్నాయి.

ఇక మల్లికేశ్వరదేవగృహం చతురస్రాకార గర్భగృహ, దీర్ఘ చతురస్రాకార అంతరాళమును కలిగి ఉంది. వీటి పైకప్పు చదరంగా ఉంది. ఐతే, గర్భగృహ ప్రాంత పైకప్పు లోపలి భాగం పద్మాకారంలో ఉంది.

ఇప్పటి వరకు చర్చించిన నిర్మాణాలన్నీ ఐదు అడుగుల ఎత్తుగల చతురస్రాకార ప్రాకారంలోపల ఉన్నాయి. ప్రాకారంపైన నాల్గుమూలల్లో నంది ప్రతిమలున్నాయి. ప్రాకార పశ్చిమ కుడ్యం లోపలి ముఖ భాగంలో దేవకోష్టలు, అందులో దేవతా ప్రతిమలు ఉన్నాయి.

మనుమసిద్ధేశ్వర ఆలయ ముఖమండపంలోని తిన్నెపై తూర్పు పశ్చిమాలుగా ఉన్న నాల్గు వరుసల స్తంభాలు, దీని ఉత్తర, దక్షిణాల్లోని కుడ్యాల్లోని నాల్గు కుడ్య స్తంభాలు ఇతర ఆలయాల్లోవలె అండము, కాపిటల్, కార్బెల్ విభాగాల్ని కలిగి ఉన్నాయి. వీటి బ్లాక్‌ల మధ్య, సెక్షన్ భాగాల్లో అద్భుత శిల్ప సంపద ఉంది. వీటిలో దిక్పాలకులు, కిన్నెర, కింపురుషులు, వేణుగోపాలుడు, కాళీయమర్దనుడు, పూతనసంహారం, త్రిపురాంతక సంహారమూర్తి వంటివి కొన్ని. స్తంభాల పై విభాగం స్థూప ఆకారంలో, ఇన్వర్టెడ్ స్థూప ఆకారంలో ఉన్నాయి. వీటి అండ భాగంలో కుంభ పంజర ఉంది. వీటి కాపిటల్‌లోని కార్బెల్, పోటిక లేక పుష్పభూతిక ఆకారంలో ఉంది. కాపిటల్ ముఖభాగంపై కూడా శిల్పాలున్నాయి.

**శాసనాలు :** ఈ ఆలయ ఉత్తర కుడ్యంపై క్రీ.శ. 1256-1257 (శక 1178) నాటి వీర రాజేంద్ర చోళదేవుని 13వ పరిపాలనాకాలపు తమిళ శాసనం ఉంది. ఇందు కళ్ళత్తురై లేక వేణుగోపాల పట్టణ ప్రజలు, 18 విదేశీ రాజ్యాలకు చెందిన ప్రజలు మనుమసిద్ధేశ్వ రాలయానికి కొద్ది దూరంలోని దేశనాయకన్ ఉద్యానవనంలో కలసి ఈ ఆలయంలో నిత్య ధూప, దీప నైవేద్యాలు వంటి ఖర్చులకై కొంత ధనాన్ని ఇవ్వడానికి నిశ్చయించినట్లు తెలుపబడి ఉంది. ఈ శాసనం క్రిందే ఇదే రాజు యొక్క 15వ పరిపాలనాకాలపు నాటి తెలుగు చోళరాజయిన రెండవ మనుమసిద్ధి శాసనం ఉంది.

ఈ ఆలయ దక్షిణ కుడ్యంపై క్రీ.శ 1279-1280 (శక 1201) నాటిది, రెండవ తిక్క (క్రీ.శ.1279-82) లేక ఇరుమడి (ఇమ్మడి) తిరుకళత్తి దేవ రెండవ పాలనా సంవత్సరపు శాసనం ఉంది. దీని ప్రకారం అనేక నాడులు, పట్టణాలు, పర్వత ప్రాంతాలు, పంచమండలాల నుండి వచ్చిన వ్యాపారులు కళ్ళత్తురై యందు దేశనాయకన్ ఉద్యానవనంలో సమావేశమై ఈ ఆలయ నిర్మాణ ఖర్చులకు, అన్నదానాలకు, దేవతా ఆభరణాలకు, నైవేద్యాలకు గాను తమ దిగుమతి సరకులపై వచ్చెడి ఆదాయంలో నాల్గవ వంతు దానం చేయుడానికి నిశ్చయించడమైంది. (తిరుకాళత్తిదేవుడు తిక్కన సోమయాజిని ఆదరించిన మనుమసిద్ధి తండ్రి. ఈయనకు గండగోపాలుడనే పేరుండేది. ఆయన పేరు మీదుగనే కృష్ణపట్టణానికి ఆనాడు గండగోపాల పట్టణమనే పేరుండేది.)

ఈ నగరంలో లభించిన తమిళ, తెలుగు భాషల్లోని ఒక శాసనంలో విజయనగర సంగమ వంశపు విరూపాక్ష దేవర బిరుదాంకితుని కాలంలో ఇచట కొందరు కాపు కులస్తులు దానమిచ్చినట్లు తెలుస్తోంది. క్రీ.శ. 1408-1409 (శక.1330) నాటి రెండవ హరిహర రాయల కుమారుడు ఒకటవ దేవరాలయ నాటి ఒక తమిళ

శాసనం గురించి మనుమసిద్ధిరాజు తనకు పూర్వంనాటి ఒక దానం గురించి తెలిపినాడు. ఒకటవ దేవరాయల నాటి మండలాధీశ్వరుడు. అయ్యవారప్ప కండ్రిగను మనుమసిద్ధేశ్వరాలయానికి దానంగా ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుత దేవళాల కండ్రిగను పూర్వం హరిహరరాయల కండ్రిగగా పిలిచేవారని తెలుస్తోంది. క్రీ.శ. 1548-1549 (క్రీ.శ.1470) నాటి సదాశివరాయల తమిళ శాసనం బట్టి శ్రీమాన్ మహామండలేశ్వర రామరాజు తిక్కయదేవ మహారాజ ప్రతినిధిగా (కార్యకర్తగా) ఉండిన వెంకన్న కూడ ఈ ఆలయానికి దానమిచ్చినట్లు తెలుస్తోంది. ఈ శాసనాలన్నీ కృష్ణపట్నం ప్రాముఖ్యతను తెలుపు తున్నాయి. అనగా ఆలయం తెలుగు చోళ రెండవ మనుమసిద్ధి కాలానిదని, 13వ శతాబ్ది పూర్వార్థం నాటిదని తెలుస్తోంది. ఆలయ నిర్మాణంపై చోళ, కాకతీయ, తూర్పు చాళుక్య వాస్తుశిల్ప ప్రభావం ఉండగా, అర్ధమండప కార్బెల్ చోళసాంప్రదాయంలో, దీన్ని ఆనుకొని ఉన్న మండపంలో కార్బెల్ చోళ, పాండ్య సాంప్రదాయంలో ముఖమండప నిర్మాణభాగాల్లో విజయనగర సాంప్రదాయం అగుపడుతుంది. రామ సుగ్రీవులమైత్రికి బీజం వేసిన సప్తతాళభంజిక శిల్పం ఇచటి శిల్పాల్లో ముఖ్యమైనది. మి

**డాక్టర్ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి**
**ఫోన్ : 9849584324**




# సప్తపర్ణి

333 ఆర్ట్‌పేపర్ పుటలతో,
హార్డ్‌కేస్ బౌండ్ 514 చిత్రాలతో
కళాత్మకంగా వెలువడిన అద్భుతమైన గ్రంథం.

—ప్రముఖుల అభిప్రాయాలు—

*"It is a joy to hold, A beauty to behold*
*Just like Krishna, What more can i say"*
*-V. A. K. Ranga Rao*

సప్తపర్ణి (₹ 777/-) **మిసిమి** పాఠకులకు
కేవలం ₹ **500/-** లకే అందజేస్తున్నాము.

*మీ కాపీ కోసం మిసిమి కార్యాలయాన్ని సంప్రదించండి.*

**మిసిమి** మాసపత్రిక
**Kala Jyothi Process Pvt.Ltd.,**
1-1-60/5, R.T.C 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020
Ph : 040-27645536, Cell: 99480 83387
E-mail : misimi_monthly@yahoo.in
e-magazine : www.kinige.com/misimi

# వీలునామా

– రేబాల లక్ష్మీనరసారెడ్డి

నెల్లూరు ఎందరెందరో, మహనీయుల్ని స్మరించుకుంది. మరెందరో మహోన్నతుల ప్రశంసలు అందుకుంది. అన్ని రంగాల్లో నిష్ణాతులైన వారిని సన్మానించడం నెల్లూరి గౌరవం. ఆ సన్మానాలను టౌనుహాల్‌లో నిర్వహించడం సన్మానితులకు, గ్రహీతులకు గౌరవం. అంతటి గౌరవాన్ని సంపూర్ణత్వాన్ని నెల్లూరుకు కలిగించిన అపురూప వదాన్యుడు రేబాల లక్ష్మీనరసారెడ్డి. కల్యాణానికి కాంతను చేపట్టలేదు కాని కీర్తి కాంత మాత్రం తనకు తానుగా రెడ్డిగారి కరగ్రహణం చేసింది.

లక్ష్మీదేవి లక్ష్మీనరసారెడ్డిని జిల్లాలో అపరకుబేరుడిగా చేస్తే, దానధర్మాలు ఆయన పేరును నెల్లూరు చరిత్రలో బంగారు అక్షరాలతో లిఖితమై శాశ్వతత్వాన్ని పొందించాయి. కోవూరు తాలూకా నార్తుమోపూరులో పుట్టిన లక్ష్మి నరసారెడ్డి నెల్లూరు కీర్తికిరీటంలో కలికితురాయిగా మారారంటే దానికి ఆయన దాష్టత్వమే (వదాన్యం) కారణం. చెన్నై నుంచి నెల్లూరు నగరానికి ప్రత్యేకరైలులో పార్థివశరీరాన్ని తరలించారంటే అది లక్ష్మీనరసారెడ్డి నామక భౌతికచిహ్నానికే చెల్లింది. నెల్లూరు జిల్లా కోవూరు తాలూకాలోని నార్తుమోపూరులో రేబాల పట్టాభిరామి రెడ్డి, అక్కమ్మ దంపతులకు లక్ష్మీనరసారెడ్డి నాల్గవసంతానంగా జన్మించారు. 1868 ప్రాంతంలో పుట్టినట్లు తెలుస్తుంది. కాని సరైన సమాచారం మాత్రం లభ్యం కాలేదు. పట్టాభిరామిరెడ్డి, అక్కమ్మలకు ఆరుగురు పుత్రులు, ఆరుగురు పుత్రికలు. వారిలో ముగ్గురు పసిప్రాయంలోనే అసువుల బాసారు.

లక్ష్మీనరసారెడ్డి విద్యాభ్యాసం తొలుత స్వగ్రామంలో జరిగింది. తర్వాత నెల్లూరులోని ఫ్రీ చర్చి మిషనరీస్కూల్‌లో సాగింది. పాఠశాలకు వెళ్ళే సమయంలో వీరికి ఓ పెద్ద రెండెద్దుల బండి వుండేది. ఆ బండి భారీగా ఉండడంతో తోటివారంతా దానికి రేబాల వారి ఓడ అని చమత్కరిస్తుండడం కద్దు.

పట్టాభిరామిరెడ్డి స్వయం కృషితో ఆస్తులు, భూమిని సంపాదించారు. కొంత వ్యాపారదక్షత కూడా ఉండేది. అనూచానంగా వస్తున్న వ్యాపారదక్షత లక్ష్మీరసారెడ్డిలో కూడా వుంది. దీంతో యౌవనంలోనే ప్రభుత్వ కాంట్రాక్టు పనులను దక్కించుకుని వ్యాపారశీలతను నిరూపించుకున్నారు. ఆ కాలంలో అభ్రకంమైన్లు (మైకామైన్స్)లో నెల్లూరు జిల్లాలో అపరకుబేరుడిగా మారిన ఇందుకూరు పేట వాస్తవ్యులు కీర్తి శేషులు అంచూరి సుబ్బానాయుడి విజయాలను వినివున్న లక్ష్మీరసారెడ్డికి మైకా వ్యాపారం పై ఆసక్తి కలిగింది. గూడూరు మండలం రావూరు తాలూకాలో మైకామైన్స్‌పై ఆయన పెట్టుబడి పెట్టి లక్షాధికారిగా మారాడు. ఆ సమయంలో చెన్నైలో వ్యాపారం సాగించే శ్రీ పాచ్చాసాహెబ్ కంపెనీతో రావూరులోని మైకామైన్ల హద్దుల విషయమై స్పర్ధలు రేగాయి. ఈ స్పర్ధ న్యాయస్థానం ముంగిలికి వెళ్లింది. న్యాయస్థానంలోనూ వ్యాజ్యం లక్ష్మీనరసారెడ్డికి అనుకూలంగా వచ్చింది. దీంతో ఆయన పేరు జిల్లాలో మారు మ్రోగిందంటే అతిశయోక్తి కాదు. ఆ తర్వాత ఆయన సంపాదన దాదాపు కోటి దాటింది. కుంటుంబంలో భారీగా సంపాదించిన వ్యక్తిగా లక్ష్మీనరసారెడ్డి పేరు పొందారు.

నెల్లూరు రేబాల వారి వీధి (ఆనాటి పేరు రంగరాజపురం) లో వీరు భూరి భవనమును ఫలపుష్పాల తోటలతో, కార్లను నిలుపుకునేందుకు షెడ్లతో పాటు ఏర్పాటు చేసుకున్నారు. దీనికి 'లక్ష్మీ నివాసం' అని పేరు

పెట్టుకున్నారు. ఇది వారి రాజఠీవికి దర్పణంగా రాజిల్లింది. నెల్లూరు జిల్లాలోని పామూరు, సీతారామపురం తాలూకాల్లో మంచి ఆదాయాన్నిచ్చే తెల్లపాడు గ్రామాన్ని శ్రీకాళహస్తి జమీందారు నుంచి కొనుగోలు చేశారు. సీతారామపురం తాలూకాలో నూజివీడు ప్రభువులు రాజా వెంకట రంగయ్య అప్పారావు బహదూర్ వారి నుంచి పెదకొండూరులోని ఐదు గ్రామాలను కొనుగోలు చేశారు. వాటిని సర్కారు లెక్కలలో 'కొండూరు ఎస్టేటు'గా రిజిస్టర్ చేయించుకున్నారు. దీంతో వీరికి జమీందారీ హోదా లభ్యమైంది. నెల్లూరు తాలూకాలోని మంగలదొరువు శ్రోత్రీయము వీరిదే. కందుకూరు తాలూకాలోని కొన్ని గ్రామాల్లో భాగస్వాములు కూడా. మద్రాసు బ్యాంకులో ఈయనకు మాత్రమే హక్కు కలిగిన మూడు షేర్లు ఉండేవి.

అక్కడ నుంచి ఆయన దాన పరంపర ప్రారంభమైంది. దీనికి ఆయన మరణానికి ఏడాది ముందు రాసిన వీలునామా అద్దం పడుతుంది.

కళాప్రపూర్ణ వేదం వేంకట్రాయ శాస్త్రి రాసిన "సర్వాంకషాఖ్య" శృంగారనైషధం పై వ్యాఖ్యను రెడ్డిగారు అచ్చువేయించారు. రంగనాథస్వామి ఆలయంలో శిలామంటపాన్ని నిర్మించారు. అది నేటి కుంభహారతి మంటపంగా పేరొందింది.

రెడ్డి గారు ఎన్నడూ ఒంటిగా భోజనం చేసి ఎరుగరు. బంధువులో, స్నేహితులో లేనిదే ముద్ద గొంతుదిగదంటే ఆశ్చర్యం లేదు.

తన ఇంట్లో ఎందరికో భోజనాలను పెట్టే రెడ్డి విదేశీయుల డిన్నర్లను మాత్రం ఇచ్చగించే వారు కాదు.

టౌనుహాల్‌కు పునాది...

1910వ సంవత్సరంలో సర్ బయ్యా నరసింహేశ్వర శర్మ నెల్లూరులో కాంగ్రెస్ సమావేశం నిర్వహించాలని సంకల్పించారు. దీనికి వేంకటగిరి రాజాల పాఠశాలనుగాని, మిషనరీ స్కూల్ ప్రాంగణాన్నిగాని ఏర్పాటు చేయాల్సిందిగా స్థానిక నాయకులను కోరారు. అది వీలుకాక పోవడంతో కాంగ్రెస్ సమావేశం రద్దైంది. ఈ విషయం పలువురు ప్రసంగవశంగా లక్ష్మీనరసారెడ్డి చెవిన వేశారు. దీంతో ఆవేదన చెందిన రెడ్డి నెల్లూరుకు ఈ గతి రాకూడదని తలచారు. పట్టణంలో సమావేశాలు, నాటకాలు, సభల నిర్వహణకోసం పబ్లిక్‌హాల్‌ను నిర్మించాలని సంకల్పించారు.

1911 డిసెంబరు 12న ఐదో జార్జి పట్టాభిషేకం జరగనుందని రెడ్డికి తెలిసింది. అదే సమయం పబ్లిక్‌హాల్ నిర్మాణాన్ని ప్రారంభిస్తే సబబుగా వుంటుందని భావించారాయన. అప్పటి నెల్లూరు కలెక్టర్ బాబూ జ్యోతీంద్రనాథ్ రాయ్ ఐసీఎస్‌తో శంకుస్థాపన చేయించారు. మద్రాసు గవర్నర్ ఎగ్జిక్యూటివ్ సుందరమయ్యర్ శివస్వామి అయ్యర్ నేతృత్వంలో 1915 ఏప్రిల్ 9 శుక్రవారం టౌన్‌హాల్‌ను ప్రారంభించారు. ఈ భవనానికి లక్ష్మీనరసారెడ్డి పబ్లిక్‌హాల్‌గా నామకరణం చేశారు. ఆ సమయంలోనే ఆయన ట్రస్ట్‌డీడ్‌ను రాయించారు. వెంకటగిరిరాజా పాఠశాల పాలకసభ నుంచి ఒకరు, నెల్లూరు మున్సిపల్ కౌన్సిల్ నుంచి ఒకరు, ప్రోగ్రెసివ్ యూనియన్ వారి నుంచి ఒకరు, లక్ష్మీనరసారెడ్డి కుటుంబ సభ్యుల తరఫున ఒకరు వంతున నలుగురితో ట్రస్టును ఏర్పాటుచేశారు. 1915 సెప్టెంబర్ 17న అప్పటి కలెక్టర్ దివాన్ బహదూర్ ఆర్. రామచంద్రారావు ఒక సభలో లక్ష్మీనరసారెడ్డి చిత్రపటాన్ని టౌన్‌హాల్‌లో ఆవిష్కరించారు. 1916 నవంబర్ 20న తన వీలునామాను స్వదస్తూరితో రాసి కవరులో ఉంచి మద్రాసు చెంగల్పట్టు రిజిస్ట్రార్ కార్యాలయంలో సీలువేసి రెడ్డిగారు భద్రపరిచారు.

విస్తీర్ణం విషయంలో టౌన్‌హాల్ మద్రాస్ ప్రెసిడెన్సీలోనే పెద్దదిగా గణుతికెక్కింది. మద్రాస్‌లోని విక్టోరియా టౌన్‌హాల్ కంటే ఇది పెద్దది. వీటన్నింటి నేపథ్యంలో అప్పటి భారతదేశ చక్రవర్తి లక్ష్మీనరసారెడ్డికి రావుబహదూర్ బిరుదును ప్రదానం చేశారు.

లక్ష్మీనరసారెడ్డి అనారోగ్యంతో మద్రాసులోని కీల్పాకం లో విశ్రాంతి తీసుకునేవారు. ఆయన ఉబ్బసం వ్యాధితో ఇబ్బందిపడే వారు. 1917 అక్టోబరు 17న డాక్టర్ కోమన్ రెడ్డి గారిని పరిశీలించారు. ఫర్వాలేదని నెల్లూరుకు తీసుకెళ్లవచ్చని తెలిపారు. దీంతో అంత వరకు అక్కడ ఉన్న బంధువులు స్నేహితులు, సోదరులు నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు. ఆ రోజు సాయంత్రం లక్ష్మీనరసారెడ్డి తన అనుంగుమిత్రుడు గునుపాటి యానాదిరెడ్డి చేతుల్లో దీర్ఘనిద్రలోకి జారుకున్నారు. నెల్లూరు చేరిన మిత్రులు, బంధువులకు వారికంటే ముందు చేరిన లక్ష్మీనరసారెడ్డి మృతివార్త ఆశనిపాతమైంది. అన్నదమ్ములు సుబ్బారెడ్డి, సుందర రామిరెడ్డిలు లక్ష్మీనరసారెడ్డి పార్థివదేహాన్ని ప్రత్యేక

రైలులో చెన్నైనుంచి నెల్లూరుకు తరలించారు. దీంతో ఆ శకం ముగిసింది. ఆయన మరణానంతరం 1917 నవంబర్ 2న వీలునామాను చెంగల్పట్టు రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఓ అధికారి వచ్చి వెలువరించారు.

**టౌన్‌హాల్ పునర్నిర్మాణం :**

నెల్లూరు 1927 నవంబర్ ఒకటిన తుఫాను తాకిడికి గురైంది. టౌన్‌హాల్ భారీగా ధ్వంసమైంది. అప్పటికే లక్ష్మీనరసారెడ్డి తమ్ముడు సుందరరామిరెడ్డి అన్నగారి బాటన వెళ్లిపోయారు. వారి కుమారులు టౌన్‌హాల్ జీర్ణోద్ధరణకు పూనుకున్నారు. అప్పట్లో 30,900 రూపాయల పైచిలుకు ఖర్చుచేసి టౌన్‌హాల్‌కు పూర్వరూపును యథాతథంగా తీసుకువచ్చి నెల్లూరీయులకు కానుకచేశారు. ఈ పునర్‌ప్రవేశోత్సవం 1933 నవంబర్ 12న మద్రాసు మంత్రి కుమారస్వామిరెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది.

**రావుబహద్దూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి చరమశాసనం (వీలునామా) :**

1916వ సంవత్సరం నవంబరు నెల తే 25 ది నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా నార్తుమోపూరు కాపురస్తుడున్నూ నెల్లూరు స్టవునసు పేటలో ఉండే పంటకాపు భూస్తితివల్ల జీవనం చేసే రేబాల పట్టాభిరామిరెడ్డి గారి కుమారుడైన లక్ష్మీనరసారెడ్డి అనే నేను స్వస్థచిత్తముతోనున్నూ మంచి తెలివితోనున్నూ వ్రాసిన వీలునామా: నాకు పిత్రార్జితము ద్వారా లభ్యపడి నాకు హక్కుకలిగి నా స్వాధీన అనుభవములో వుండేటటువంటిన్నీ, నా స్వార్జితం ద్వారా సంపాదించబడి నాకు హక్కు కలిగి నా స్వాధీన అనుభవములో వుండటటువంటిన్నీ, నా తాలూకు యావత్తు స్థిరచరాస్తిని గురించి నా తదనంతరం యీ దిగువ వ్రాసిన ప్రకారం జరగవలసినది.

2. నెల్లూరు తాలూకా మంగలదొరువు శ్రోత్రియములో య. 6.50 ఆరు యకరములు యాభై సెంట్లు విస్తీర్ణం గల మెట్టభూమిన్నీ సదరు భూమిలో నేను వేయించిన అంటేమామిడి చెట్లు వగయిరా యావత్తు చెట్లున్నూ, సదరు తోపుకు తూర్పుతట్టు కరను ఆనుకొనియుండే రామిరెడ్డి కయ్య పల్లివాండ్లు చేసే కయ్య య 3.37 మూడు యకరముల యిరవైయేడే సెంట్ల విస్తీర్ణం గల మాగాణిభూమిన్ని గాక తక్కిన యావత్తూ గుడికట్టులోపల వుండే అధీనం, అనాధీనం మెట్ట మాగాణి, ములుంజరీబు, పశువులబీళ్ళు, కంచెలు, చెరువు, చెరువుతొట్టు, వాగులు, కాలువలు, కుంటలు, బావులు, పోరంబోకులు, నానాజాతి వృక్షములు వగయిరా యావదాస్తిన్నీ, మద్రాసు బ్యాంకులో నా పేరనున్నూ నా తమ్ముడు రేబాల సుందరరామిరెడ్డి పేరనున్నూ వుండి నాకు మాత్రమే హక్కుగలిగి వుండే మూడు షేర్లునున్నూ నా తదనంతరం నెల్లూరిలో వుండే లక్ష్మీనరసారెడ్డి పబ్లికు హాలు ట్రస్టీలు స్వాధీనపరచుకొని సదరు శ్రోతియం సర్కారు శిస్తు కలెక్షన్ నౌకర్ల జీతాలపోను నిలువవచ్చే వరుమానములో నుంచిన్నీ మద్రాసు బ్యాంకు మూడు షేర్లు వరుమానంలోనించిన్నీ (3) ప్యారాలో వివరించిన ప్రకారం ధర్మకార్యములకు వినియోగపరుస్తున్న మిగిలిన పైకమును (4) ప్యారాలో వివరించిన ప్రకారం రిజర్వు చేసివుంచవలసినది. సదరు మంగలదొరువు శ్రోత్రియములో నుంచి మినహాయించిన వనం తోపు మెట్టకు య 1-కి రు 1-0-0 వకరూపాయ లెఖనున్ను మాగాణి య 1-కి రు 6-0-0లు ఆరురూపాయల లెఖనున్ను అయ్యె అసలు శిస్తునున్నూ అందుకు అయ్యే రోడ్డు రైలు శిస్తునున్నూ సదరు మెట్ట మాగాణి స్వాధీనములో వుంచుకొన్నవారు సదరు ట్రస్టీలు గాని వారి వల్ల నియమింపబడిన గుమాస్తా పరంగాగాని ప్రతిసంవత్సరం సదరు శ్రోత్రియం శిస్తు వసూలు వాయిదాల ప్రకారము ఆయా తారీఖుల నాటికి చెల్లించి రశీదు తీసుకొంటూ వుండవలసిది. ఆ ప్రకారం చెల్లించక తప్పిన యెడల సదరు శిస్తుకు సదరు మెట్ట మాగాణి భూములు ఫస్టు చార్జిగా వుండవలసినది.

(3) సదరు రెండో ప్యారాలో వివరించిన మంగల దొరువు శ్రోత్రియమునున్ను మద్రాసు బ్యాంకు షేర్లనున్ను నా తదనంతరం సదరు లక్ష్మీనరసారెడ్డి పబ్లికు హాలు ట్రస్టీ స్వాధీనం చేసుకొని సదరు ఆస్తి వల్ల ప్రతిసంవత్సరం వచ్చే నికరాదాయములో నుంచి మద్రాసు ప్రెసిడెన్సీలో వుండే ఏ కాలేజిలోనైనా సరే బి.యే. పరీక్షలో సైయెన్సులో ప్రెసిడెన్సికి ఫస్టుగా ప్యాసు చేసే విద్యార్థికి "రేబాల పట్టాభిరామిరెడ్డి గారి మెడల్" అని యింగ్లీషు అక్షరములతో చెక్కబడిన కూలితోకూడ రు. 60/- అరవై రూపాయలు ఖరీదు చేయు ఒక బంగారు మెడలును ప్రతి సంవత్సరం కాన్వొకేషన్ కాలమందు ప్రజంటు చేసేలాగ్గు యేర్పాటు చేయవలసింది. పైవిధముగానే మద్రాసు ప్రెసిడెన్సిలో

వుండేటటువంటిన్ని మయిసూరు స్టేట్‌లో వుండేటటువంటిన్ని యె కాలేజిలోనైనా సరే బి.య్యే పరీక్షలో ఆడవారిలో యింగ్లీషులో ఫస్టుగా ప్యాసుచేసిన హిందూ లేడికి "రేబాల అక్కమ్మగారి మెడల్" అని యింగ్లీషు అక్షరములతో చెక్కబడిన రు. 60 ఖరీదు చేయు ఒక బంగారు మెడలును ప్రతి సంవత్సరం కాన్వొకేషన్ కాలములో ప్రజంటు చేసేలాగ్ను యేర్పాటు చేయించవలసింది. యె సంవత్సరమునైనా సరే బియ్యే పరీక్షలో హిందూ లేడీలు ప్యాసు చేయని యెడల ఆ సంవత్సరం సదరు మెడలును పైన వ్రాసిన ప్రకారం యఫ్యె పరీక్షలో ఆడవారిలో ఇంగ్లీషులో ఫష్టుగా ప్యాసుచేసి వారికి ప్రజంటు చేయులాగ్ను యేర్పాటు చేయవలసింది. పై విధముగానే మద్రాసు లా కాలేజిలో ప్రెసిడెన్సి ఫస్టుగా ప్యాసు చేసిన విద్యార్థికి "రేబాల లక్ష్మీనరసారెడ్డి మెడలు" అని యింగ్లీషు అక్షరములతో చెక్కబడిన రు. 60 ఖరీదు చేయు ఒక బంగారు మెడలును ప్రతి సంవత్సరం సదరు బియెల్ డిగ్రి యిచ్చే కాలమందు ప్రజంటు చేసేలాగ్ను యేర్పాటు చేయించవలసింది. సదరు మూడు మెడల్సుకు అయ్యే మొత్తం రు. 180 ప్రతి సంవత్సరం సదరు మెడల్సు ప్రజంటు చేయుకాలమునకు మూడు మాసములు ముందుగా యూనివర్సిటి రిజిస్ట్రారు వారి తావుకు ఈ ట్రస్టీలు పంపించి సదరు ధర్మమును వారు ప్రతి సంవత్సరం దప్పక జరిగేలాగ చేయించవలసింది. మరిన్ని ప్రతి సంవత్సరం వకటింటికి రు. 45-ల లెఖను నెల్లూరులో వుండే రెండు హైస్కూళ్ళకును రు. 90-లు సదరు స్కూళ్ళ కమిటీ మెంబర్ల పరంగా యీ ట్రస్టిలు యిచ్చి సదరు ప్రకారం ప్రతి హైస్కూలుకు యిచ్చిన రు. 45 లలో ఆయా స్కూలు కమిటీ మెంబర్లు ఆయా స్కూళ్ళలో మొదటి ఫారంలో ఫస్టుమార్కులు తీసిన పిల్లకాయకు రు. 1-8-0 ఖరీదు చేసే పుస్తకములున్ను సెకండుగా మార్కులు తీసిన పిల్లవానికి రు. 1 ఖరీదు చేసే పుస్తకములున్ను, రెండవ ఫారంలో ఫస్టుగా మార్కులు తీసిన పిల్లవానికి రు. 2-8-0 లు ఖరీదు చేసే పుస్తకములున్ను, సెకండుగా మార్కులు తీసే పిల్లవానికి రు. 2 లు ఖరీదు చేసే పుస్తకములున్ను, మూడవ ఫారంలో ఫస్టుగా మార్కులు తీసే పిల్లవానికి రు. 3-8-0లు ఖరీదు చేసే పుస్తకములున్ను సెకండుగా మార్కులుతీసే పిల్లవానికి రు. 3 లు ఖరీదు చేసే పుస్తకములున్ను, నాల్గవ ఫారంలో ఫస్టుగా మార్కులు తీసే పిల్లవాడికి రు. 4-8-0 లు ఖరీదు చేయు పుస్తకములున్ను, సెకండుగా మార్కులు తీసే పిల్లవానికి రు. 4 లు ఖరీదు చేసే పుస్తకములున్ను, అయిదవ ఫారంలో ఫస్టుగా మార్కులు తీసిన పిల్లవానికి రు. 5-8-0 లు ఖరీదు చేసే పుస్తకములున్ను, సెకండుగా మార్కులు తీసే పిల్లవానికి రు. 5 లు ఖరీదు చేసే పుస్తకములున్ను, ఆరవ ఫారంలో ఫస్టుగా మార్కులు తీసిన పిల్లవానికి రు. 6-8-0 లు ఖరీదు చేసే పుస్తకములున్ను, సెకండుగా మార్కులు తీసే పిల్లవానికి రు. 6 లు ఖరీదు చేసే పుస్తకములున్ను ప్రతి సంవత్సరం ప్రయిజులు యిస్తావుండేలాగున యేర్పాటు చేయింవసినది.

మరిన్ని నెల్లూరులో యిపుడు వుండే హైస్కూళ్ళకున్ను ప్రతిసంవతర్సరం స్కూలు వకటింటికి రు. 150 లు లెఖను సదరు రెండు స్కూళ్లకు రు. 300 లు ఆయా స్కూళ్ళ కమిటీమెంబర్ల పరంగా యీ ట్రస్టీలు యిచ్చి వారు సదరు పైకమును ఆయా స్కూళ్ళ 4,5,6 ఫారములలో తెలివిగా చదివే బ్రాహ్మణులు, వైశ్యులు తప్ప తక్కిన శూద్రజాతి బీదపిల్లకాయలకు స్కూలు జీతములకు యిచ్చే లాగున యేర్పాటు చేయించవలసినది. సదరు రెండు హైస్కూళ్ళలో యేదైనా వకటినిల్చిపొయ్యే యెడల సదరు స్కూలుకుగా నిర్ణయమైన ప్రయిజుల మొత్తము రు. 45లు 4,5,6 ఫారములలో తెలివిగా చదివే నాన్ బ్రాహ్మిణ్ బీద పిల్లకాయల జీతమునకు నిర్ణయమైన మొత్తము రు. 150 లున్ను రెండవ స్కూలులో 4,5,6 ఫారములలో తెలివిగా చదివే నాన్ బ్రాహ్మిణ్ బీద పిల్లకాయలకు జీతము యిచ్చెలాగున యేర్పాటు చేయవలసినది.

మరిన్ని సంవత్సరం వకటింటికి రు. 540-0-0 ల లెఖను ఖర్చుచేసి సదరు రు. 45లు ఖర్చు అగుటకు తగినంత మంది పనిచేసికొనుటకు శక్తిలేని బీదలకు ప్రతిదినం అన్నం పెట్టించేలాగున యేర్పాటు చేయించ వలసినది. పనిచేయుటకు శక్తిలేని బీదలు జాస్తిగా వున్నయెడల వారమునకు ఒక దఫా మార్చు చుండ వలయును. ఒక వేళ ఈ వీలు అమలులోకి వచ్చేలోపలగాని అమలులోకి వచ్చిన పిమ్మటగాని సదరు బీదలకు అన్నం వేయుటకుగాని మునిసిపాలిటీలో యేర్పడి వుండె కమిటీ పైన వ్రాసిన ప్రకారము అన్నం వేయుటకు వప్పని యెడల సదరు రు. 540 లు బీదలకు అన్నం వేయుటకుగాను

నెల్లూరులో యింకా యేమైనా కమిటీ యేర్పడియున్న యెడల వారిపరంగా యిచ్చి సదరు పైకములో నుంచి పైన వ్రాసిన ప్రకారము ప్రతిదినం బీదలకు అన్నం పెట్టించేలాగున యేర్పాటు చేయవలసినది. అటువంటి కమిటీలు కూడ యేవిన్ని లేనియెడల గాని లేక వుండిన కమిటీలు నిజాయితీగా బీదలకు అన్నం పెట్టించక అక్రమములు జరిగినట్టా యున్న యెడలగాని సదరు రు.540లలో నుంచి పైన వ్రాసిన ప్రకారం పనిచేసుకోలేని బీదలకు ఈ ట్రస్టీలే ప్రతి దినం అన్నం పెట్టించుటకు తగువయిన యేర్పాటు చేయించి ఆ ప్రకారం ప్రతిదినం అన్నం పెట్టించుతూ వుండవలసినది.

మరిన్ని ప్రతిసంవత్సరం దశరా పండుగనాడు రు. 100 లు వెలగల జాకినాడు తానులు తెప్పించి వాటిలో కుంటివాండ్లకున్ను, గుడ్డివాండ్రకున్ను, కుదరని దీర్ఘవ్యాధి కలవారికిన్ని చాలా వృద్ధులుగా వుండి పనిజేసుకొనుటకు శక్తిలేని బీద ఆడవాండ్లకు, మనిషి 1కి ఆరేజి గజముల లెకను అరవైమందరికిన్ని పయిన వ్రాసినటువంటి బీదమొగవాండ్లకు మనిషి 1కి మూడు గజముల లెఖనున్ను, ముప్ఫయి మందికిన్ని ఈ ట్రస్టీలు ప్రతి సంవత్సరం దశరాపండుగనాడు తప్పక యిస్తూ వుండవలసినది.

మరిన్ని నెల్లూరు మునిసిపాలిటీలో వుండే పెద్ద ఆసుపత్రి డాక్టరుగారిపరంగా ప్రతిసంవత్సరం అక్టోబరు నెలలో రు. 150 లు లెఖన ఈ ట్రస్టీలు యిచ్చి వారు సదరు పైకములో నుంచి సదరు ఆసుపత్రి రోగులకు కావలసిన బ్లాంకెట్లు తెప్పిస్తూ వుండవలసినదిగానున్నూ, వాటికి పోను మిగత పైకములో నుంచి సదరు కాళ్ళుపోయిన బీదవారికి కొయ్యకాళ్ళు తెప్పించి యియ్యవలసి నదిగానున్నూ యింకా మిగిలియున్న యెడల ఆసుపత్రికి వచ్చిన రోగులకు వారు తిరిగిపోవునపుడు వారు ఊరు చేరేవరకు రైలు చార్జి భత్యపు ఖర్చులు యిచ్చి పంప వలసినదిగా యేర్పాటు చేయవలసినది.

మరిన్ని నెల్లూరు రైలు వద్ద వుండే అమెరికన్ ఆసుపత్రి లేడి డాక్టరు పరంగా ప్రతి సంవత్సరం రు. 100 లు లెఖనున్నూ కోర్టువద్ద యుండే జూబిలీ ఆసుపత్రి లేడి డాక్టరు గారి పరంగా ప్రతిసంవత్సరం రు.100ల లెఖనున్ను ఆయా ఆసుపత్రిలో ప్రతి అక్టోబరు నెలలో యిస్తూ వుండవలసినది. ఈ ట్రస్టీలు యిచ్చి సదరు పైకములో నుంచి వారు సదరు రెండు ఆసుపత్రులకున్ను ఆయా ఆసుపత్రిలో వుండే రోగులకు కావలసిన బ్లాంకెట్లు తెప్పించుటకున్ను వాటికి పోను మిగిలియుండే పైకములో నుంచి సదరు ఆసుపత్రులకు వచ్చే బీదరోగులకు తిరిగి పోవునపుడు వారు ఊరు చేరే వరకు రైలు చార్జి భత్యపు ఖర్చులుయిచ్చి పంప వలసినదిగా యేర్పాటు చేయ వలసినది. ఆఖర్చు యెందుకుగా చేసినదిన్నీ యీ ట్రస్టీలకు సదరు లేడి డాక్టరు సంవత్సరమున ఒక దఫా తెలియ పర్చులాగున యేర్పాటు చేయవలసినది.

(4) రెండవ ప్యారాలో వివరించిన సదరు టవున్ హాలు ట్రస్టీలు సదరు మంగలదొరువు శ్రోత్రియంలో నుంచి వచ్చే నికరాదాయములో నుంచి మూడోప్యారాలో వివరించిన ధర్మకార్యములకు గాను ప్రతి సంవత్సరం రు. 1560లు యిస్తు సదరు శ్రోత్రియం వల్లనున్నూ బ్యాంకి షేర్లవలనున్నూ వచ్చేనికరాదాయంలో సదరు రు. 1560 లు పోను నిలవ పైకమును ప్రతి సంవత్సరం రిజర్వుఫండు క్రింద మద్రాసు బ్యాంకిలో లేక గవర్నమెంటువారు ఒప్పుకొనే యితర బ్యాంకిలోగాని డిపాజిటు చేసి వుంచుతూ సదరు డిపాజిటు పైకం రు. 5000 లకు మించిన యెడల అమ్మించిన మొత్తమునున్ను ఆవల ప్రతి సంవత్సరం వచ్చే నికరాదాయములో రు. 1560 లు పోను నిలిచిన మొత్తమున్ను సదరు ట్రస్టీలు మూడో ప్యారాలో వివరించిన ధర్మములలో మెదల్సు తప్ప తక్కిన ధర్మములకున్ను ఆయా వెుత్తము దామాషా ప్రకారం హెచ్చుగా యిసన్తా వుండవలసినది. యే సంవత్సరమైనా సదరు మంగల దొరువు శ్రోత్రియములో వర్ష ప్రతికూలమువల్ల కరువు వచ్చి ఆ సంవత్సరం శిస్తు అంతాగాని, కొంతగాని, వసూలు గాక అట్టి సంవత్సరములలో వచ్చిన నికరాదాయము సదరు మూడో ప్యారాలో వివరించిన ధర్మకార్యములకు యివ్వవలసిన రు. 1560 లకు పూర్తిగాగాని లేక కొంతకు గాని తక్కువ పడిన యెడల అలాంటి సంవత్సరములలో ఈ తక్కువ పడిన మొత్తమును సదరు రిజర్వు ఫండులో నుంచి తీసియిచ్చి సదరు రిజర్వు ఫండులో యిందువల్ల తగ్గిన మొత్తమును ఆ వెంబడి సంవత్సరములలో వచ్చే నికరాదాయములలో రు. 1560 లు పోను నిలిచిన మొత్తమును తిరిగి సదరు రు. 5000 లు భర్తీ అయ్యేవరకు సదరు రిజర్వు ఫండుకు పంపిస్తు వుండవలసినది.

మరిన్ని మంగల దొరువు శ్రోత్రియంలోవుండే

చెన్నారాయని చెర్వును వుత్తరోత్తరా యెప్పుడయిన సరె సర్కారు వారు యెత్తివేసే యెడల సదరు చెర్వు అడ్గుభూమిని య 2–0 లెఖను సర్విచేయించి సదరు భూమికి య 1 కి రు 13 లు చిల్లర లెఖను అసలు శిస్తు యేర్పాటు చేయించి సదరు భూములను ప్రతి సంవత్సరం సదరు శిస్తు చెల్లించె షరత్తుతోటి బహిరంగమయిన యేలం వేయించి ఆయాలం వల్ల వసూలు అయిన పైకమునకు దొరికినపుడు ఒక యినాం భూమిని కొనుగోలు చేయించి ఆ భూమివల్ల వచ్చె నికరాదాయమున్ను సదరు యినాం భూమి విక్రయమునకు దొరికే వరకు సదరు పైకమును మద్రాసు బ్యాంకిలో డిపాజిటు చేయించి ఆ డిపాజిటువల్ల వచ్చె వడ్డి పైకమున్ను సదరు చెన్నారెడ్డి చెర్వు అడ్గుభూమికి వసూల అయ్యే శిస్తులో సర్కారు శిస్తు పోను నికరాదాయమునున్ను సదరు ట్రిస్టీలు మూడో పేరాలో వివరించిన ధర్మములలో మెదల్సు తప్ప తక్కిన ప్రతిధర్మమునకున్ను ఆయా ధర్మముల దామాషా ప్రకారం హెచ్చుగా యిస్తా వుండవలసినది.

(5) పయిన వ్రాసిన నిబంధనలకు లోబడి సదరు ధర్మకార్యములు జరిగించుటకు సదరు లక్ష్మీనరసారెడ్డి పబ్లికు హాలు ట్రస్టీలు సమ్మతించని యెడల రేబాల సుందరరామిరెడ్డి వల్లగాని అతని వార్సులవల్లగాని నియమింపబడిన అయిదుగురు ట్రస్టీలు సదరు ఆస్తిని స్వాధీనపరచుకొని సదరు నిబంధనల ప్రకారం సదరు ధర్మకార్యములను జరిగించు చుండవలసినది.

మరిన్ని సదరు లక్ష్మీనరసారెడ్డి పబ్లికుహాలు ట్రస్టీలుగాని లేక సుందరరామిరెడ్డివల్లగాని లేక ఆయన వారసుల వల్లగాని యేర్పరచబడిన ట్రస్టీలుగాని పయిన వ్రాసిన ప్రకారం సదరు ధర్మములు చక్కగా జరిగించక వుపేక్షజేసినా లేక అక్రమములు చేసినా లేక యితర యేలాటి లోపములు చేసినా సదరు లోపములను సరిచేయించి సదరు ధర్మములు సరిగ జరిపెలాగున యేర్పాటు చేయుటకున్ను అందుకు ట్రస్టీలు సమ్మతించని యెడలగాని, సదరు ట్రస్టీలు పయిన వ్రాసిన వరుంబడిలో నుంచి ఖర్చులుపోను నిలవ పయికముకు సరి అయిన లెఖను వుంచి ఆలెఖను యితరులు కోరినప్పుడు కనుపర్చకపోయిన యెడలగాని వారిని నిలుపదలచేసి వారికి బదులు యోగ్యులుగా వుండే ట్రస్టీలను యేర్పాటు చేయించమని కోర్టులో దావాతెచ్చి కోర్టు వారివల్ల సరి అయిన ట్రస్టీలను యేర్పాటు చేయించుటకు ప్రతివారికి హక్కుగలిగి వుండవలసినది. కోర్టులో యెవరు గాని దావాలు వగయిరాలు తెచ్చుటకు అయ్యేఖర్చులను వరుంబడిలో నుంచి ఖర్చులు పోను నిలిచియుండె డిపాజిటు పయికములో నుంచి కోర్టువారు దావా తెచ్చిన వారికిప్పించవలయును.

(6) నాకు హక్కుగల యావత్తు స్థిరచరాస్తిలో పయిన వ్రాయబడిన ధర్మములకుగాను యివ్వబడిన మంగలదొరువు అగ్రహారమున్ను మెడ్రాసుబ్యాంకులో పేరుతోనున్న సుందరరామిరెడ్డి పేరుతోనున్న దీసికొన్న రు. 4500 లు ఖరీదు గల మూడు షేర్లగాక శేషించిన యావత్తు నా స్థిరచరాస్తిలో నుంచి మనకు అన్నలుగా వుండే రేబాల పేరారెడ్డిగారి కొమాళ్ళకు రు. 10,000 పదివేల రూపాయలు యివ్వవలయును. రేబాల హరిశ్చంద్రారెడ్డికి 10,000 పదివేల రూపాయలున్ను నాయుడు చెర్వులో నా భాగమునకు వచ్చియుండే యిరవై యకరముల భూమిన్ని నేను కాళహస్తి రాజాగారి పామూరు తాలూకాలో కొనుగోలు చేసియుండే తెల్లపాడు గ్రామములో సగభాగమున్ను యివ్వవలయును. రేబాల సుబ్బారెడ్డిగారికి పామూరు తాలూకాలో కొనుగోలు చేసివుండే తెల్లబాడు గ్రామంలో హరిశ్చంద్రారెడ్డికి యిచ్చిన సగభాగముగాక తక్కిన సగభాగము యియ్యవలయును.

మన తోబుట్టువులను ముగ్గరిని ద్రవ్యముగలచోట్లనే యిచ్చియున్నాము. గనుక నామకార్థముగ వారి ధర్మఖర్చులకుగాను ముగ్గురికి రు. 6000 లు యివ్వవలయును.

మన పినతల్లి కుమార్తె అయిన బెజవాడ సుబ్బమ్మ నా తదనంతరం వరకు జీవించియున్న యెడల ఆమె ధర్మఖర్చులకు గాను రు. 3000 లు యివ్వవలయును.

మన అన్నగారైన పేరారెడ్డిగారి కుమార్తెలలో శేషమ్మకు రు. 2000 ఖరీదు చేసే రవ్వకమ్మల జత తెప్పించి యివ్వవలయును.

వనజాక్షమ్మకు రు. 500 లున్ను రుక్మిణమ్మకు రు. 500 లున్ను యివ్వవలెను.

మన అన్నగారైన రామచంద్రారెడ్డిగారి కుమార్తెలకున్ను మనిషి ఒకటింటికి రు. 500 ల వంతున యివ్వవలయును. రేబాల మన హరిశ్చంద్రారెడ్డి కుమార్తెలకున్ను మనిషి ఒకటికి రు. 500 యివ్వవలయును.

మన తోబుట్టు జానకమ్మ కొమార్తెలకు మనిషి 1-కి రు 500 లు యివ్వవలయును.

మన తోబుట్టు సీతమ్మ కొమార్తెలకు మనిషి 1-కి రు 500 లు యివ్వవలయును.

యీ క్రింద వ్రాయబోవు వారిలో నాతనంతరం వరకు జీవించియుండువారికి యివ్వవలయును.

గునుపాటి యేనాదిరెడ్డికి రు. 1000 లున్ను.

పిశుపాటి శేషాచలంశాస్త్రుల్లవారికి రు. 200 లున్ను

నెల్లూరు సంతపేటలో ఘడియారములు బాగేచేసే కంచనపల్లి శేషగిరిరావుగారికి రు. 200 లు.

ఆమంచర్ల ఆదినారాయణరావుకు ధర్మఖర్చులకుగాను రు. 500 లు.

గనివద్ద వుండిన దగ్గుమాటి శివయ్యకు రు. 200 లు.

గట్టుపల్లి కొండయ్యకు రు. 100 లు.

పోలవరపు కన్నయ్యకు రు. 100 లు.

రహ్మతుల్లా సాహెబ్‌కు రు. 100 లు.

మోపూరులో రామకొలను కామయ్యకు ఆయన కొమాళ్ళకు రు. 300 లు.

చెరుకుమూడి అప్పయ్యకు ఆయన కుమాళ్ళకు రు.200లు.

అద్దంకి లక్ష్మీనరసయ్యకు రు. 100 లు.

సూరం కామయ్యకు రు. 100 లు.

చతుర్వేదుల శ్రీరామయ్యకు నామకార్థం రు. 200 లు.

మద్రాసులో వుండే జె.కృష్ణస్వామి నాయుడికి రు.1500లు.

ఆకుల నరసింహుల నాయుడి భార్యకున్ను, కుమారుడికి రు. 500లు యివ్వవలసినది.

నేను చనిపోయ్యేటప్పటికి అయిదు సంవత్సరములకు తక్కువ లేకుండా యింటిలో పనిచేయుచుండె నౌకర్లకు మనిషి 1-కి రు. 200 లు.

మూడు సంవత్సరములకు తక్కువ లేకుండా యింటిలో పనిచేయుచుండె నౌకర్లకు మనిషి 1-కి రు. 150 లు.

మూడు సంవత్సరములకు తక్కువగాయుండె నౌకర్లకు మనిషి 1-కి రు. 100 లు.

నెల్లూరులో వుండె గుఱ్ఱపు వాండ్లకున్ను, తోటవాండ్లకున్ను, కావలివాడికిన్ని, యింటిలో పనిజేసె యానాది వాడికిన్ని, మోటర్ల క్లీనరుకును మనిషి 1-కి రు 50 లున్ను యియ్యవలయును.

ఒక సంవత్సరమునకు తక్కువలేకుండా వుండే చాకలివాడికిన్ని, మంగలివాడికిన్ని మనిషి 1-కి రు50లున్ను, మోటారు డ్రైవరు మూడు సంవత్సరములకు తక్కువ కాకుండా వున్నయెడల రు. 300 లు యివ్వవలయును.

డబ్బు యివ్వవలసినట్లు వ్రాసిన వారి కందరికిని ఆరుమాసములలోపల వసూలు చేసి వడ్డి లేకుండ యివ్వవలయును. ఆరుమాసములలో కానియెడల యింకా ఆరుమాసములలోపల యెనిమిది అణాల వడ్డికూడా యివ్వవలసినది. ఆ వడ్డి మొదటి ఆరుమాసములకు యివ్వవలసినది.

నెల్లూరు అమెరికన్ ఆసుపత్రికి ప్రసవించుటకు వచ్చేవారికి అన్నపానాదులను వారి స్వంత మనుష్యులు తయారు చేసి యిచ్చుటకుగాను ఆసుపత్రి కాంపౌండులోనే ఆరువేల రూపాయలు ఖరీదు చేసే వంటకు వుండుటకు తగిన కొట్లను కట్టించి, ప్రసవించుటకు వచ్చేవారి యిలాకావారు వుండె షరత్తుమీద ఆసపత్రి వారి స్వాధీనం చేయవలెను. ఈ లోపల నేను కట్టించిన యెడల వెనుక కట్టించవలసిన ఆవశ్యం లేదు. ఇపుడు నేను కట్టించియున్న నెల్లూరు టవున్ హాలు జీతములు వగైరాలకుగాను వకేదఫా రు. 5000 గాని లేక సంవత్సరమునకు రు. 300 గాని యిచ్చేలాగ్గు ఒప్పుకొని యున్నాను. కాబట్టి యిష్టమున్న యెడల వకేదఫా రు. 5000 టవున్ హాలు ట్రస్టీలు పరముగా యివ్వవలయును. లేని యెడల సంవత్సరమునకు రు. 300 ల వంతున టవున్ హాలు ట్రస్టీలపరంగా యిస్తూ వుండవలయును. యిప్పుడే నేను రు. 5000 లు యిచ్చిన యెడల రేబాల సుందరరామిరెడ్డి యివ్వనక్కరలేదు.

పైన వ్రాసిన ప్రకారం యావత్తు రేబాల సుందర రామిరెడ్డి జరిపించవలయును. నా తాలూకు యావత్త స్థిరచరాస్తిన్ని నా తదనంతరం రేబాల సుందరరామిరెడ్డిన్ని, సుందరరామిరెడ్డి వారసులున్ను దాన విక్రయాది సర్వ స్వాంతత్ర్యములకు హక్కు కలిగి అనుభవించు కొనవలసినది.

ఇది నా మనస్ఫూర్తిగా స్వదస్తూరిన వ్రాసి వుంచిన వీలునామా.

**ఓం, మృత్యోర్మా అమృతంగమయ.**

**ఓం శాన్తి శాన్తి శాన్తి.**

# పోలాండ్ కవిత్వం

- ముకుంద రామారావు

యూరప్ ఖండానికి మధ్యలో, క్రమపద్ధతిలో లేని వృత్తాకార భూభాగం పోలాండ్. ఉత్తరాన బాల్టిక్ సముద్రం, ఈశాన్యాన రష్యా, లిథువేనియ, తూర్పున బెలారస్, యూక్రేయిన్, దక్సిణాన జెకోస్లోవేకియా, స్లోవేకియా, పశ్చిమాన జర్మనీ - ఇన్ని రాజ్యాలు సరిహద్దులుగా ఉన్న దేశం పోలండ్.

రాతియుగం, కాంస్యయుగం నాటికే స్లావిక తెగల మూలంగా ఆ దేశ అస్తిత్వాలున్నా, ఒక దేశంగా పోలండ్ చరిత్ర క్రీ.శ. 966 లో పియాస్ట్ సామ్రాజ్యపు పోలండ్ మొదటి రాజు, మెయిస్కోతో మొదలయింది. క్రైస్తవం జాతీయ మతంగా ఆ రాజే ప్రవేశపెట్టాడు. దేశానికి పోలండ్ పేరు రావడానికి కారణం అప్పటి వార్తా నది (ఇప్పుడది పోజ్నాన్) ఒడ్డునున్న స్లావిక్ తెగలలోని ఒక తెగ పేరు పొలానీ (అంటే పొలాల్లో పనిచేస్తూ నివాసముండేవారు). ఆ తెగ నాయకుడే పియాస్ట్. అతనే చెల్లాచెదురైన స్లావిక్ తెగల్ని ఏకత్రితం చేసి 10వ శతాబ్దానికి ఒక సామ్రాజ్యంగా నెలకొల్పి, ఆ దేశానికి పొలాస్కా (అంటే గొప్ప పోలాండ్) గా నామకరణం చేసాడని చరిత్రకారుల నమ్మకం. 14వ శతాబ్దానికి, జగియెల్లోనీన్ సామ్రాజ్యంలో పోలండ్ ఉన్నత శిఖరాల్ని చేరుకుంది. లిథువేనియా దేశంతో కలిసాక యూరప్‌లో అతి శక్తివంతమైన కలయికగా మారింది. 1410లో జరిగిన అతి పెద్ద యుద్ధంలో జర్మనీకి చెందిన టెయుటొని నైట్స్‌ని ఓడించారు. 14వ శతాబ్దం నుండి 18వ శతాబ్దం వరకూ చరిత్రలో దాదాపు 400 సంవత్సరాలు పోలాండ్ లిథువేనియా కలిసే ఉన్నాయి- మొదట్లో ఆయా రాజుల వ్యక్తిగత కారణాల మూలంగా (లిథువేనియా శ్రేష్ఠ సేనాధిపతి జగియెల్లోనీన్, పోలాండ్ రాణి జడ్విగాని వివాహం చేసుకున్న కారణంగా), తరువాత పూర్తి రాజకీయ కలయిక మూలాన. అయినా 250 సంవత్సరాల తరువాత 1795 నాటికి ఆ సామ్రాజ్యం విచ్ఛిన్నమై రష్యా, ప్రష్యా, ఆస్ట్రియా మధ్య విభజించబడింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత పోలాండ్ అమెరికా జోక్యంతో 1918లో మళ్లీ స్వతంత్ర దేశమయింది. కానీ రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ పోలాండ్‌ని పూర్తిగా ఆక్రమించుకుంది. ఆ యుద్ధం పోలాండ్ దేశ చరిత్రలో అతి భయంకరమైనది. 60లక్షల మంది పోలండ్ వాసులు చంపబడ్డారు. అందులో 30లక్షల మంది యూదులు మారణహోమంలో చంపబడినవారు. వార్సా లాంటి అనేక నగరాలు ధ్వంసం చేసి, నేలమట్టం చేయబడ్డాయి. ఆ యుద్ధం తరువాత పోలాండ్, సోవియట్ కమ్యూనిస్టుల వశమయింది. దరిమిలా సోవియట్ సమాఖ్యకు పోలాండ్, ఒక ఉపగ్రహంలాంటి దేశమయింది. సోవియట్ సమాఖ్య విచ్ఛిన్నమైనాక పోలాండ్ ప్రజాస్వామిక ప్రభుత్వంగా మారింది.

పోలిష్ భాషనే 98 శాతం ప్రజలు అక్కడ వాడుతున్నారు. ఈ భాష ఇండో యూరోపియన్ భాషా కుటుంబంలోని స్లావిక్ వర్గానికి చెందింది. ఈ భాషకు ఇప్పటికీ లాటిన్ లిపినే వాడుతున్నా, పోలిష్ భాషకే ప్రత్యేకమైన ధ్వనులున్న వాటితో కొన్ని కొత్త అక్షరాల్ని సమకూర్చుకున్నారు. మొదటి నుండీ క్రైస్తవం అక్కడ ప్రచలితంగా ఉన్న మతం.

**పోలాండ్ సాహిత్యం :** 14వ శతాబ్దం వరకూ వచ్చిన సాహిత్యమంతా లాటిన్‌లో వచ్చిన క్రైస్తవమత సంబంధమైనవే. నిజానికి 10వ శతాబ్దానికి ముందు పోలిష్ కవిత్వం అస్పష్టంగాను, సందేహాస్పదంగాను ఉండింది. పోలాండ్‌లో క్రైస్తవం ప్రవేశపెట్టబడ్డాకే కవిత్వం మొదలయిందంటారు. నికొలజ్ రేయ్ (1505-1569)ని పోలాండ్ సాహిత్యానికి తండ్రిలా భావిస్తున్నా, లాటిన్ భాషలో పోలాండ్‌లో రాసిన మొట్ట మొదటి కవి క్లెమెన్స్ జనిటియస్ (1516-43). అప్పటి యూరప్‌లో ప్రసిద్ధులైన వారితో పోల్చబడిన గేయకవిత్వం రాసినవారు. పోలాండ్ కవిత్వానికి దశాదిశ నిర్దేశం చేసినవారిలో ప్రథముడు అప్పటి ప్రముఖ

కవి జాన్ కొహనోవ్ స్కీ (1530-1584). మొదటి నుండి, ముఖ్యంగా 13-18 శతాబ్దాల మధ్య, పోలాండ్ సాహిత్యం యూరప్ సాహిత్యంలోని సాహసకార్యాలకు ప్రత్యక్ష సాక్షి. యూరప్ పునరుజ్జీవన వికాస సాహిత్యాన్ని గమనిస్తూనే ఉంది. 17వ శతాబ్దం మధ్య నుంచి 18వ శతాబ్దం ఆరంభం వరకూ గల కాలానికి, పోలిష్ సాహిత్యంలో బరొకీ యుగం అనిపేరు. స్వచ్ఛందం, విశృంఖలత్వంతో కూడిన శైలి మూలంగా ఆ పేరు. 18వ శతాబ్దం నుండి 19వ శతాబ్దం వరకూ నీతిబోధక కావ్యాలు ఎక్కువ వచ్చాయి. ఈ యుగంలోనే రూపక రచన ఆరంభమయింది. 19వ శతాబ్దంలో 1863 వరకూ కాల్పనిక కవితా యుగం అని చెప్పుకోవచ్చు. ఈ కాల్పనికోద్యమం మూలంగా స్వాతంత్ర్య కాంక్ష ఎక్కువై 1863లో తిరుగుబాటుగా పరిణమించింది. దాన్ని ప్రభుత్వం తీవ్రంగా అణచి వేసింది. పోలాండ్ అస్తిత్వాన్ని 120 ఏళ్లకు పైగా లేకుండా చేసిన సమయంలో, 18వ శతాబ్దాంతానికి, అక్కడి సాహిత్యకారులు ఒక అసాధారణ స్థితిలో ఉండాల్సొచ్చింది. అది వారికి ఒక కొత్త శక్తిని, ఘాతుక పర్యవసానాలకు ప్రోత్సహించింది. దేశంతో బాటు అన్నింటినీ పోగొట్టుకున్న సాహిత్యకారులు, ఆధ్యాత్మిక, రాజకీయ, నైతిక, న్యాయ గురువులుగా మారిపోయారు. సాహిత్యం వారికి జాతీయ సాంస్కృతిక గుర్తింపుని ప్రసాదించే సాధనం అయింది. భాషే వారికి తల్లీ, తండ్రీ అయింది. దానితో 19వ శతాబ్ద సాహిత్యంలో కవులు, కవుల మాట ప్రజల్ని సరైన దిశలో నడిపిస్తున్న ప్రవక్తలుగా తీసుకోబడింది. ఆ సమయంలో ఆవిర్భవించిన కవులు ఆడం మిట్జ్ కెవిట్చ్ (1798-1855), జూలియస్జ్ స్లొవస్కీ (1809-1849), జిగ్మంట్ క్రాసిన్ స్కీ (1812-1859), సైప్రీన్ కమిల్ నోర్విడ్ (1821-1883). వీరిలో మొదటి ముగ్గుర్నీ పోలాండ్‌లో కవిత్రయంగా తీసుకున్నారు. పోలిష్ చరిత్రలో అనేక సందర్భాలలో సాహిత్యం ప్రజల తిరుగుబాటుకో ఒత్తిళ్లకో లొంగిపోయింది. కర్తవ్యానికి తిరుగుబాటుకీ మధ్య వ్యాపించిన విస్తీర్ణం, భావన సౌందర్యం రెండింటిలోను విలువైనదిగా వారికి తోడ్పడింది. ఆ బీజాలే పోలాండ్ సాహిత్యాన్ని వెలిగించాయి. జర్మనీ నుండి దిగుమతి అయిన ఇడ్డిష్ భాషలో కూడా పోలాండ్‌లో కవిత్వం వచ్చింది. అది ఎక్కువగా రెండు ప్రపంచ యుద్ధాల మధ్యే వచ్చింది.



జిగ్మంట్ క్రాసిన్ స్కీ

కమ్యూనిస్ట్ పాలనలో సాహిత్యం రెండు పాయలుగా చీలిపోయింది. ఏ విధమైన అదుపాజ్ఞలు అడ్డంకులూ లేక, దేశాన్ని విడిచి వలసలో ఉన్న సాహిత్యకారులది ఒక మార్గమైతే, దేశంలోనే ఉండి నిర్బంధాలున్నా అస్తిత్వం కాపాడుకుందుకు ఏర్పర్చుకున్న భాషతో కాలం గడిపిన సాహిత్యకారులది మరోమార్గం. చెస్వావ్ మిలోష్ లాంటివారు మొదటి మార్గంలోని వారు. అయినా వారు ఒకరినొకరు ప్రభావితం చేసుకోవడం, అర్థం చేసుకోవడం మూలాన ఎవరెక్కడున్నారన్నది కవిత్వానికి ప్రతిబంధకం కాలేదు. 1976 నుండి 1989 వరకూ, ద్వితీయప్రచారం పేరుమీద చట్ట విరుద్ధంగా రహస్యంగా చలామణి అయిన సాహిత్యం కూడా పోలాండ్ సాహిత్యాన్ని కాపాడింది అని చెబుతారు. అప్పటి చారిత్రక నేపథ్యం, మాటాడే స్వేచ్ఛ కోల్పోవడం ఒక విధమైన పోలాండ్ కవిత్వంగా రూపుదిద్దుకుంది. చరిత్రలో చిక్కుకుపోయిన వారిని గురించి మాటాడడం, అస్తిత్వాన్ని పారలౌకికతని చరిత్రతో జోడించడం అది చేసిన పని. ఆ కవిత్వంలో ప్రముఖులు-చెస్వావ్ మిలోష్ (1911-2004), టాడెస్జ్ రోజెవిక్జ్ (1921-), బిన్యూ హెర్బర్ట్ (1924-1998), విస్లావా సింబోర్స్కా (1923-2012) , ఆడం జగజెవ్స్కీ (1945-) మొదలైనవారు.

పోలాండ్‌లో కవిత్వ పఠనానికి అత్యంత ఆదరణ ఉంది. కవుల మీద గౌరవం ఉంది. వారు ఇచ్చే సందేశాన్నో, వారి జీవితాలను కవిత్వం ద్వారా తెలుసు కోవాలనో, అక్కడి ప్రజలకు ఆసక్తి ఉంది. అది అనాదిగా అక్కడ సాగుతున్న



జూలియస్జ్ స్లొవస్కీ



జాన్ కొహనోవ్ స్కీ

ఆచారం. కవి కేవలం పదాల్ని అందంగా అమర్చి చెక్కడం కాదు, మీ కవితలో పాటలో అనేకమంది పెదాలమీద ఉంటాయి కాబట్టి, అవి ప్రజలకు ఇష్టమైన విషయాల్నే ప్రతిబింబించాలని అక్కడ సంప్రదాయం గట్టిగా అడుగుతుంది. అంత ప్రజాదరణ ఉన్న దేశంలో కవులకు, కవిత్వానికి కొదవేముంటుంది. ఫ్రాన్స్‌లో ఏడాదికి 300 నవలలు 30 కవిత్వ సంకలనాలు వస్తే పోలాండ్‌లో, ఏడాదికి 300 కవిత్వ సంకలనాలు 30 నవలలు వస్తాయి అని ఎవరో అతిశయోక్తిగా అన్నదానిలో ఆశ్చర్యపోవలసింది ఏమీలేదు.

**నోబెల్ బహుమతులు :** పోలాండ్‌కి ఏకంగా ఏడు నోబెల్ బహుమతులొచ్చాయి. అందులో నాలుగు సాహిత్యానికే వచ్చాయి. వాటిల్లో రెండు కవిత్వానికి. తతిమా మూడు బహుమతుల్లో రెండు మేడం క్యూరీగా పిలవబడే మరియ స్కొడొవ్ స్కా-క్యూరీ (1867-1934)కి, మరొకటి శాంతి బహుమతి. సాహిత్యానికి వచ్చిన బహుమతుల్లో - 1905 లో హెన్రిక్ సియెంకివిస్జ్ (1846-1916), 1924 లో వ్లాడిస్లావ్ స్టనిస్లావ్ రేమోంట్ (1867-1925) ల నవలలకు, 1980లో చెస్వావ్ మిలోష్ (1911-2004), 1996లో విస్లావా సింబోర్స్కా (1923-2012)ల కవిత్వానికి బహుమతులొచ్చాయి.

పోలాండ్ కవిత్వాన్ని యుద్ధాలకు ముందు, యుద్ధాల తరువాతగా విభజించి చూడొచ్చు. ఆ విభజనలో కొందరు కవులు, వారి కవిత్వం -

**యుద్ధాలకు ముందు పోలాండ్ కవిత్వం :**

**నికొలజ్ రేయ్ (1505-1569) :** పోలాండ్ కవిత్వానికి తండ్రిలా భావించే రేయ్, అప్పటి రాజుకే కాక, ప్రజలందరికీ ప్రీతిపాత్రుడు. పోలాండ్ కవిత్వ ఎదుగులకి తోడ్పడ్డ కవిగా కూడా గుర్తింపు పొందారు. పోలాండ్ అంతా పర్యటించారు. పదవీకాంక్షలేని నిస్వార్థుడుగా పేరుంది.

**దుర్మార్గం :**

**అన్ని కాలాల్లోనూ ఒకేలా పడుండే సర్పం దుర్మార్గం**
**కనబడకుండా జీవిత రహదారి పక్కన రాయికి చుట్టుకొనుంటుంది**
**మోసగాడు, మూర్ఖుడు, తాగి తందనాలాడి దగ్గరైతే**
**బుసకొడుతూ హెచ్చరిస్తూ దాని విషవలయాన్ని గుర్తుచేస్తుంది**

**జాన్ కొహనోవ్ స్కీ (1530-1584) :** పోలాండ్ కవిత్వానికి నిజమైన ప్రతినిధి. వీరికిముందు పోలాండ్ కవిత్వానికి సరైన నమూనా లేదు. అప్పటివరకూ ఉన్న కవిత్వ పద్ధతుల్ని కాదని, సరికొత్త శైలి, భాష, కవిత్వ రీతుల్ని మొట్టమొదటి సారిగా పోలాండ్ కవిత్వంలో ప్రవేశపెట్టిన ప్రముఖ కవి. వీరి కవిత్వంలోను జీవితంలోను రెండు విభిన్నమైన పాయలు కనిపిస్తాయి. ఒకటి- ఆవేశం, అల్పత్వము, ప్రేమ విషయాలు, సుఖాలు; మరొకటి - ఆత్మశాంతి, పరిత్యాగము, నిర్మలమైన ఆధ్యాత్మిక భావనలు. సౌందర్యం, శ్రావ్యమైన కవిత్వం వీరిది.

**సారాంశాలు :**

**ఎంత బీదవైనా, నీకు దొరికేది తక్కువైనా**
**చిరునవ్వు నవ్వే ఆశను, అత్యంత నిరాశలో వదిలిపెట్టొద్దు**
**అది ఈ దినాన్ని వెళ్లగొడుతున్నా, పోతున్న సూర్యునికి భయపడొద్దు**
**రేపు కాంతివంతమైన రోజు రావచ్చు**

**దాని హృదయం బాధతో ఉన్నా, పూర్తి సుకుమారమైన వేదనతో**
**చెట్టుమీద చకోరపక్షి పాడుతుంది,**
**ఓరి భగవంతుడా! ఒక్కోమారు మనిషీ అంతే**
**హృదయానికి నమ్మకంతో ధైర్యం చెప్పుకుంటూ,**
**అతను కన్నీళ్లతో దుఃఖిస్తాడు**

**ఈబీద ప్రపంచంలో అన్నీ అంతుబట్టని రహస్యాలే**
**అతను ఎంత వివేకంతో**
**వాటిని పరిష్కరించాలని ప్రయత్నించినా**
**అంధకారం, అగాధం, అసాధారణ రహస్యాలే ఎదురుపడుతుంటాయి**

**ఆడం మిట్జ్ కెవ్ విట్చ్ (1798-1855) :** పోలాండ్ కవులందరిలో గొప్పవాడుగా చాలామంది భావిస్తారు. అసాధారణ ప్రతిభతో యుక్తి, సాక్ష్యం ఆధారంగా వీరి కవిత్వ ఊహ సాగేది. దానితో పోలాండ్ కవిత్వంలో కాల్పనిక కవితా యుగానికి బలమైన పునాది వేసారు. పోలాండ్ దేశపు గొప్ప సృజనాత్మక మేధావిగా ప్రజలు వీరిని భావిస్తారు. దానికి కారణం, వీరు ప్రజలకే ప్రతినిధి కాదు, వారి సంవేదనలకు కూడా ప్రతినిధే. వీరి కవిత్వం బహుముఖీనమైనది, వైవిధ్యమైనది. కవిత్వంలో వీరు స్పర్శించి మెప్పించలేనిదేదీ లేదు. సాహితీ పిపాసలో అనేక దేశాలు పర్యటించారు.

అయితే వీరు లిథువేనియాలో జన్మించడాన్ని, అక్కడే ఉండి, ఒక కవితలో లిథువేనియాని వారి మాతృదేశంగా రాయడాన్ని, మిట్జ్ కెహ్ విట్చ్ ని, లిథువేనియా తమ కవి అని, పోలిష్ భాషలో రాయడాన్ని పోలాండ్ వారు తమ జాతీయ కవి అని, ఒక వివాదం ఇప్పటికీ ఉంది. *లిథువేనియా చివరి దోపిడీ* కథా కావ్యం వీరి మహా కావ్యం. అది నాటకంగాను, చలనచిత్రంగానూ రూపొందింది. విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చబడింది.

**ప్రకాశమంత సొగసైనది ఆమె**
**ఆకాశమంత ఎత్తులో విహరిస్తుంది**
**నీలాకాశంలో సూర్యుని లేచాయలా**
**ఆమె కన్ను దయగా కాంతివంతంగా ఉంటుంది**
**జ్వాల జ్వాలతో కలిసినట్టు**
**రెండు వీణల ఏకస్వరం మధురంగా ఏకమైనట్టు**
**ఆమె ప్రియుని పెదాలు ఆమెని కలుసుకుంటాయి**

*– పూర్వీకులు కవిత నుండి*

## యుద్ధానంతర పోలాండ్ కవిత్వం

**లియోపోల్డ్ స్టాఫ్ (1878–1957) :** మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో యువ పోలాండ్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న కవి. తోటి తరం కవులే కాకుండా, తరువాతి తరం కవులతో కూడా సఖ్యతగా ఉంటూ నేర్చుకుంటూ నేర్పుతూ కాలం గడిపిన కవి. లాటిన్, ఇటాలియన్, ఫ్రెంచ్, జర్మనీ భాషలనుండి చేసిన అనేక అనువాదాలు అక్కడి సాహిత్య పురోగమనానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి. సరళమైన కవిత్వం రాయడం ప్రత్యేకంగా ఇష్టం.

**మూడు నగరాలు**

**మూడు నగరాలు / చాలా చిన్నవి**
**అన్నీ ఒక దానిలో ఒకటి ఇమిడిపోయేవే**

**దేశపటంలో అవి ఉండవు / అవి యుద్ధంలో ధ్వంసం చేయబడ్డాయి**
**అందులో మనుషులు ఉండేవారు / కష్టజీవులు, నెమ్మదస్తులు**
**శాంతి కాముకులు**

**ఓ నులివెచ్చని ఉదాసీన సోదరులారా**
**మీలో ఎవరైనా ఆ నగరాలకోసం ఎందుకు వెదకరు**
**ఎంత బీదవాడు మనిషి / ప్రశ్నలే అడగనివాడు**


మిస్టిస్లా జాస్టన్

**మిస్టిస్లా జాస్టన్ (1903–1983) :** ఏ విధమైన వివాదాల్లోకీ పోకుండా, శోకపూరితంగాను, మధ్యస్థంగానూ ఉన్న కవి. జర్మనీ కవి రిల్కేకి అభిమాని. రిల్కే రచనల్ని విరివిగా అనువాదం చేశారు. సుకుమారుడు, దుర్బలుడు, దయార్ద్ర హృదయుడు కావడంతో తాత్విక ఆలోచనలకి నైతిక రాజకీయ ఒత్తిళ్లకు మధ్య నలిగిపోయేవారు. అదే వారి కవిత్వంలోనూ ప్రతిఫలిస్తుంది.

**మనిషి :**

**నేనొక మనిషిని చూసాను / దేవతలతో హత్యచేయబడ్డాడు**
**ప్రశ్నలతో హింసించబడ్డాడు**
**గొంతుపిసకబడ్డ అరుపులతో ఉబ్బిపోయాడు / సజీవ శవం**
**నైతికతకు బలైపోయాడు**

**నేను అతనికి సాయపడలేక పోయాను**
**జాలికంటే అర్థమైన వాడు కాదు కాబట్టి,**
**అయినా అదీ బహిష్కరించబడింది. / అతని నికృష్ట హృదయాన్ని**
**ఏదైతేనేం అతని మానవ హృదయాన్ని**
**దేవతలతో కలిసి చివరి దెబ్బ నేనూ వేయాలి**
**కాళ్ళతోతొక్కుతూ, చీలుస్తూ, చంపుతూ**

**అన్నా స్విర్జ్ (1909–1984) :** అసలు పేరు అన్న స్విర్జ్ జిన్స్కా. ఒక చిత్రకారుని కుమార్తెగా, యుద్ధకాలంలో సైన్యంలో నర్స్‌గా అనుభవం, స్త్రీగా తనదైన అనుభూతులు కలగలిపి వీరి కవిత్వం. తానే చెప్పుకున్నట్టు – రచయితకు రెండు ప్రాథమికమైన పనులుండాలి; ఒకటి తనదైన శైలిని నిర్మించుకోవడం; ఆ శైలిని తానే రూపుమాపుకోవడం. మొదటిదానికంటే రెండవదే కష్టమైనది. ఆ పనిలోనే జీవితాంతం గడిపిన ప్రముఖ కవయిత్రి. రెండవ ప్రపంచ యుద్ధంలో వార్సా నగర విధ్వంసం గురించి ఆమె రాసిన వచనం ఎవరికైనా కంటతడి పెట్టిస్తుంది.

**నా నెత్తిని గోడకు కొట్టుకునే దాన్ని**

**శిశువుగా / నిప్పులో వేలు పెట్టాను**
**సన్యాసిని అవుదామని / యుక్త వయస్సులో**
**ప్రతీరోజూ నా నెత్తిని గోడకు కొట్టుకునే దాన్ని**

**యువతిగా / మిద్దెమీద పైకప్పుకి, కిటికీగుండా వెళ్లేదాన్ని**
**దూకేయటానికి**

**స్త్రీగా నా ఒళ్లంతా పేలు**
**నా చలికొడుగును ఇస్త్రీ చేస్తున్నపుడు అవి చిట్లేవి**

**నెరవేరడానికి అరవయి నిమిషాలు ఎదురుచూసాను**
**ఆరు సంవత్సరాలు ఆకలితో ఉన్నాను**

**తరువాత ఒక బిడ్డను కన్నాను**
**నిద్రపోనివ్వకుండా వాళ్లు నన్ను చెక్కేవాళ్లు**

**ఒక పిడుగు నన్నపుడు చంపింది**
**మూడుసార్లు**
**ఎవరిసాయమూ లేకుండా**
**నేను ఆ మూడుసార్లూ చావునుండి లేవాల్సొచ్చింది**

మూడు పునర్జీవాల తరువాత
నేనిప్పుడు విశ్రాంతి తీసుకుంటున్నాను

**సముద్రం మనిషి**

నువు ఈ సముద్రాన్ని లొంగదీసుకోలేవు
నమ్రతతోగాని, ఉల్లాసంతో గాని
కానీ దాని మొహమ్మీద నువ్వు నవ్వగలవు / నవ్వుని
కనుగొన్న వాళ్లు / దడాలున నవ్వినంత క్లుప్తంగా / బతికిన వాళ్లే
శాశ్వతమైన సముద్రం / నవ్వడం ఎన్నటికీ నేర్చుకోలేదు

**చెస్వావ్ మిలోష్ (1911–2004) :** 20వ శతాబ్దంలో పోలాండ్ సాహిత్యంలో గౌరవించబడే కవి, సమకాలీన ప్రపంచ కవుల్లో కూడా అంతే గౌరవించబడే అగ్రశ్రేణి కవి. ఆకస్మిక క్రియావాదులు కింద ముద్రపడ్డ కవి. సాంప్రదాయకమైన కవిత్వం ఇష్టం. వీరిది వ్యతిరేక ప్రతీకాత్మకత అని కొందరి వాదన. దేశీయతని పిల్లలు వివివరించేట్టు చేసిన తన కవితలే తనకు అతి దగ్గర అని చెప్పుకున్నారు. జ్ఞాపకాల గాయాలతో వీరు, శిథిలాల అవశేషాల్నుండే కవిత్వం ఆరంభమవు తుందని నమ్మేవారు. బాల్యం రష్యాలో గడిచినా మొదటి ప్రపంచ యుద్ధం తరువాత పోలాండ్‌కు తిరిగొచ్చారు. వివిధ కారణాల మూలంగా 1951 నుండి 1960 వరకూ, పారిస్ లోను, ఆ తరువాత దాదాపు జీవిత చరమాంకం వరకూ అధ్యాపక వృత్తిలో అమెరికాలో ఉన్నారు. కవిత్వానికి నోబెల్ బహుమతి గ్రహీత. నవలాకారుడు, అనువాదకుడు. 15 భాషల్లో వీరి కవిత్వం అనువాదమయింది.


చెస్వావ్ మిలోష్

**అంకితం**

నిన్ను నేను రక్షించలేకపోయినా నన్ను విను
నా ఈ సరళమైన ఉపన్యాసాన్ని అర్ధంచేసుకుందుకు ప్రయత్నించు
ఇంకొక ఉపన్యాసానికి సిగ్గుపడుతున్నాను
నేను ప్రమాణం చేసి చెప్తున్నాను, నాలో ఏ మాటల మంత్రాలూ లేవు
మబ్బులా, చెట్టులా నీతో నేను నిశ్శబ్దంతో మాటడుతున్నాను

ఘాతుకమే నన్ను నీకోసం దృడంగా ఉంచింది
కొత్తగా మొదలయాక నువ్వు వీడ్కోల్ని యుగానికి మిళితం చేసావు
భావుక అందంతో విద్వేష స్ఫూర్తిలో
సిద్ధించిన గుడ్డి బలం

ఇక్కడ లోతులేని లోయలో పోలాండ్ నదులు, విస్తృత వంతెన
తెల్లటి పొగమంచులోకి పోతే, ఇక్కడి ధ్వంసమైన నగరం
నీతో మాటాడుతున్నప్పుడు
సముద్రకొంగల అరుపుల్ని నీ సమాధిమీదకు తోస్తున్న గాలి

దేశాల్ని ప్రజల్ని రక్షించలేని కవిత్వమేమిటి?
అధికారిక అబద్దాలకు రహస్య అంగీకారం
ఇంకో క్షణంలో కంఠం కత్తిరించబడే తాగుబోతుల పాట
రెండవ తరగతి బాలికల కొలతలు
అదేమిటో తెలియకుండా మంచి కవిత్వం కావాలనుకున్నాను
ఆలస్యంగా తెలుసుకున్నాను దానిది ఆరోగ్యకర ధ్యేయం
అందులోనే, కేవలం అందులోనే నాకు ముక్తి లభిస్తోంది

పురుగుల్ని గసగసాల విత్తనాల్ని వాళ్లు సమాధులమీద, ఒంపేవారు
చచ్చినవారు పక్షుల మారువేషంలో వచ్చేవారి మేతకోసం
ఇక ఎప్పుడూ నువ్వు మమ్మల్ని సందర్శించకుండా
ఒకప్పుడు బతికిన నీకోసం, నేనిక్కడ ఈ పుస్తకం ఉంచుతున్నాను

**టాడెస్జ్ రోజెవిక్జ్ (1921–) :** యుద్ధగాయాలు రేపిన కవిత్వం వీరిది. కళ మానవ వేదనలకు విరోధి అని నమ్మిన కవి. ఆ కారణంగా ఏవిధమైన కవిత్వ పరికరాల్నీ వాడకుండా మామూలు మాటలతో అకవిత్వం రాసిన కవి. శూన్యవాద మానవతావాది. వీరి దిగంబర కవిత్వం యువ రచయితల్ని విశేషంగా ఆకట్టుకుంది. 20 భాషల్లో వీరి కవిత్వం అనువాదమయింది.

**ఒక శబ్దం :**

ఛిన్నాభిన్నం చేసుకుంటూ / వాళ్లు ఒకరినొకరు హింసించుకుంటుంటారు
నిశ్శబ్దాలతోను శబ్దాలతోను / వాళ్లకి జీవించటానికి
మరో జన్మేదో ఉన్నట్టు

వాళ్ల శరీరాలు మృత్యువు పాలవాల్సిందేనని
మనిషి లోపలివి సునాయాసముగా ఆగిపోతాయని
అదేదో మరచిపోయినట్టు వాళ్లలా –

ఒకరిపట్ల ఒకరు క్రూరంగా ఉన్నా / మొక్కలకంటే జంతువులకంటే
వాళ్లు దుర్బలులు / వాళ్లని ఒక మాటతోనో
ఒక నవ్వుతోనో, ఒక చూపుతోనో / చంపొచ్చు

**బిన్యూ హెర్బర్ట్ (1924–1998) :** సమకాలీన కవిత్వానికి గత దశాబ్దాల సమష్టి అనుభవమే గీటురాయి అయితే, వీరు అందులోని చారిత్రక నిందాస్తుతిని అత్యంత నేర్పుగా చెప్పిన కవి. ఇటలీ, ఫ్రాన్స్ లో కొన్నాళ్లున్నారు. శుద్ధ కవిత్వానికి విరోధి.


హెర్బర్ట్

**మన భయం**

మన భయం / రాత్రి దుస్తులు తొడుక్కోదు
గుడ్లగూబలా కళ్లుండవు / పీపా మూత తెరవదు
దీపాన్ని ఆర్పేయదు / చచ్చిన మనిషి మొహంలా కూడా ఉండదు

మన భయం / గజిబిజి రాతలతో

జేబులో దొరికే / ఒక చెత్త కాగితం

మన భయం / కల్లోలపర్చే రెక్కలతో ఎగరదు
ఆలయ శిఖరం మీద కూర్చోదు / అది చాలా నిరాడంబరం

వెచ్చని దుస్తులు / ఇంటి సరుకులు
వగైరాలతో / తొందర తొందరలో / కట్టిన మూట

మన భయం / చచ్చిన మనిషి మొహంలా కూడా ఉండదు
చచ్చినవారు మనతో శాంతంగా ఉంటారు
వారిని మన భుజాలమీద మోస్తాం / వారి కళ్లు మూస్తాం
వారి పెదాల్ని సరిచేస్తాం / పొడి ప్రదేశాన్ని చూసి
వారిని ఖననం చేస్తాం / మరీ లోతుగా కాదు / మరీ పైపైకీ కాదు

**విస్లావా సింబోర్స్కా (1923-2012) :** కవిత్వానికి నోబెల్ బహుమతి పొందిన అద్భుతమైన కవయిత్రి. వీరివి కటువుగా, సంశయాత్మకంగా, చమత్కారంగా కొన్ని కవితలుంటే, మానవ విజ్ఞాన శాస్త్రం, తత్త్వ శాస్త్రంలోని భావాల ఆధారంగా రాసిన కవితలు మరికొన్నుంటాయి. బరువైన పదాల్ని ఎరువు తెచ్చుకుని వాటిని ఆ తరువాత కష్టపడి తేలికపరుస్తాను అని వారే చెప్పుకున్నారు. పోలాండ్‌లో అత్యంత ప్రజాదరణ ఉన్న కవయిత్రి. కొన్ని రాజకీయ కవితలు రాసినా, తన కవిత్వం రాజకీయ కవితలు కావని ఎక్కువగా ప్రజలు, వారి జీవితాల కోసమని అనేకమార్లు చెప్పుకున్నారు. 22 భాషల్లో వీరి కవిత్వం అనువాద మయింది.



విస్లావా

**ఆకస్మిక సమావేశం :**

మేము ఒకరికొకరం మర్యాదగా ఉన్నాం
ఇన్నేళ్ల తరువాత ఒక మంచి సమావేశం అనుకున్నాం

మా పులులు పాలు తాగుతాయి / మా గద్దలు నేలమీద నడుస్తాయి
మా సొరచేపలు నీటిలో మునిగిపోతాయి
మా తోడేళ్లు తెరిచిన బోనుముందు ఆవులిస్తాయి
మా సర్పాలు మెరుపుని విముక్తిచేస్తాయి
కోతుల - ఉత్తేజం, నెమళ్ల - ఈకలు
ఇప్పుడు చాన్నాళ్ల క్రితం గబ్బిలాలు - మా తలల్నుండి ఎగిరిపోయాయి

ముక్తికావల నవ్వుతూ / మధ్యలో మేము నిశ్శబ్దులమైపోతాం
మా ప్రజలకు / చెప్పేందుకు ఏమీలేదు

*- విస్లావా సింబోర్స్కా (1923-2012)*

**టిమోట్జ్యూస్ కార్పొవిజ్ (1921-2005) :** భూమిని అమితంగా ప్రేమించిన కవి. చెట్లతోను, పూలతోను, జంతువులతోను ఆత్మీయ బాంధవ్యం ఉన్న కవి. సిరాతో గీసిన సూక్ష్మచిత్రాలు వీరి కవితలు. అన్ని వయస్సులవారిని ఆకర్షించిన కవి.

**నిశ్శబ్ద పాఠం :**

ఎప్పుడైనా సీతాకోకచిలుక / చాలా తీవ్రంగా
తన రెక్కల్ని ముడుస్తున్నపుడు / దయచేసి నిశ్శబ్దం అన్నట్టుంటుంది

బెదిరిన పక్షి ఈక / కిరణానికి విరుద్ధంగా
వెనువెంటనే పెనుగులాడుతున్నపుడు
దయచేసి నిశ్శబ్దం అన్నట్టుంటుంది

అలా నేర్పబడ్డాం / ఏనుగు తన ఢంకా మీద
మనిషి తన భూమిమీద / శబ్దం చేయకుండా నడవడం

భయంలో జుత్తు నిక్కబొడుచుకున్నట్టు
పొలాలమీద మౌనంగా / చెట్లు ఎదుగుతూనే ఉన్నాయి

**బోగ్డన్ జాయకొవ్స్కీ (1932-2007) :** కుటుంబంతో బాటు ఉత్తర రష్యాకు, పర్సియా గుండా ఆఫ్రికాకి, ఆ తరువాత ఇంగ్లాండ్‌లో స్థిరపడ్డ కవి. అయినా మాతృ భాషని మరచిపోక అందులోనే కవిగా ప్రముఖుడయారు. వలసలో ఉన్నప్పటి కవుల మానసిక స్థితిని దాపరికంలేకుండా వ్యక్తపరిచిన కవి.

**పద్యంలో ఒక తిరుగుబాటు :**

నేనక్కడ పుట్టాను / ఆ స్థలాన్ని నేను ఎన్నుకోలేదు
నేను నేరుగా గడ్డిలోనే ఎందుకు పుట్టలేదు / గడ్డి సర్వత్రా పుడుతుంది
కేవలం ఎడారులే అంగీకరించవు / లేదా గాలి శ్వాసిస్తున్నపుడు
గిరగిర తిరుగుతున్న గాలిఉండలో పుట్టేవాడిని / కానీ నేనక్కడ పుట్టాను
నేను శిశువుగా ఉన్నపుడు వాళ్లు నాకు సంకెళ్లు వేసారు
ఆ చిరుసంకెళ్లతో నన్ను ప్రపంచంలోకి ప్రవేశపెట్టారు
నేనిక్కడున్నాను. నేనక్కడ పుట్టాను
కనీసం నేను సముద్రం దగ్గర పుట్టుంటే
ధ్రువాలవైపు నిరంతరం తిప్పే బరువైన అయస్కాంతలోహంతో
నా బరువుసంగతి తెలియకనే పోయేది
అంచాత నా చిరు సంకెళ్లను భరిస్తాను
వాటిని ఎగరవేస్తాను సింహం జూలు ఎగరేసినట్టు
అక్కడనుండి ప్రజలు అరుస్తారు: / తిరిగొచ్చేయ్
వాళ్లు నన్ను పిలుస్తారు: రావా, రావా, రావా
జొన్నల కలుపుమొక్కలని వ్యర్థంగా పడేస్తారు
కుక్కని కుక్కలదొడ్డిలో.
నేను కవిని (ఏదో ఒక పేరుండాలి కదా) / భాష నా సంకెళ్లు
పదాలు నా మాలిక / నేనక్కడ పుట్టాను
నేను నేరుగా గడ్డిలోనే ఎందుకు పుట్టలేదు

**ఆడం జగజెవ్స్కీ (1945-) :** కొన్ని సంవత్సరాల కింద ఊహకు కూడా అందని విషయాలతో స్పష్టంగా సామాన్య భాషలో రాసే కవిత్వం వీరిది. యువ కవుల్లో వచ్చిన

సమూలమైన మార్పుకు వీరి కవిత్వం ఒక ఉదాహరణగా చెప్పుకుంటారు. విద్యార్థులుగా ఉన్నప్పుడు నేర్చుకోని సహజమైన సత్యాల్ని సునాయాసంగా చేప్పె నేర్పున్న కవి. ప్రకృతి దృశ్యపు నిశ్శబ్దం ,పరిశీలకుని ఏకాంతవాసం వీరి కవిత్వంలో ఎక్కువ కనిపిస్తుంది.



ఆడం జగజెవ్స్కీ

**స్వేఛ్ఛ :**

**తత్వవేత్తలు అడుగుతారు / స్వేచ్ఛ అంటే ఏమిటి?**
**నాకూ సరిగ్గా తెలియదు / అది రాజ్యాధికారంలో**
**హామీతోకూడిన స్వాతంత్ర్యమని / ఒక్కోసారి నేను సమర్థిస్తాను**
**లేదా అది దృఢవిశ్వాసపు శక్తి అని నొక్కిచెప్తాను**
**జీవాధిపత్యం / ఎవరి వృత్తిపట్ల వారి విశ్వాసం.**
**కానీ స్వేచ్ఛ సారాన్ని నిర్వచించలేకపోయినా**
**నాకు బానిసత్వం అంటే మాత్రం / బహు బాగా తెలుసు**

ప్రపంచంలో మానవ పురోగమనాన్ని సత్యాన్ని, గమనిస్తూ నమోదు చేసుకుంటూ, సంప్రదాయం ఏకకాలానికీ మధ్య, కర్తవ్యం తిరుగుబాటుకీ మధ్య, పారలౌకికత చరిత్రకి మధ్య, ఇప్పటి పోలాండ్ సాహిత్యం ఎదుగుతూ ముందుకు సాగుతూ ఉంది. పరంపరగా అగ్రశేణి కవులు నడిచొచ్చిన దారిలో పోలాండ్ కవిత్వం అనేక విషయాలు, శైలులతో సంధానించబడి అలరారుతూ ఉంది. పౌర బాధ్యతని పునరుద్ధరించే జ్ఞానం దిశగా పోలాండ్ కవిత్వం ఇప్పుడుంది.

ముకుంద రామారావు
ఫోన్ : 99083 47273

మిసిమి
మాసపత్రిక
చందాదారులుగా చేరండి, చేర్పించండి
**అరుదైన బహుమతి**
పొందండి!






నెల నెలా ***మిసిమి*** పత్రికను మీ ఇంటిదగ్గర అందుకొనేందుకు చందాదారులుగా చేరండి.
నాలుగు సంవత్సరాలకు వెయ్యి రూపాయలు పంపండి. (పంపే విధానం కోసం 80వ పేజి చూడండి.) మీకు ప్రతినెల ***మిసిమి*** పత్రిక మీ ఇంటికే వస్తుంది. చందా అందిన వెంటనే మీకు **అరుదైన బహుమతి *చార్లీ చాప్లిన్ (నా కథ)* ఉచితంగా పంపిస్తాము.**

*ఈ అరుదైన అవకాశాన్ని పాఠకులు ఉపయోగించుకొంటారని ఆశిస్తున్నాము.*

మిసిమి
మాసపత్రిక
**Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020. Ph. 040-27645536
E-mail : misimi_monthly@yahoo.in e-magazine: www.kinige.com/misimi

# క్రీస్తు చరిత్ర-జాషువా పద్యాలు

**కాల** చక్ర గమనం ఏ వొక్కరి కోసమూ ఆగదు. ఏసుప్రభువు చూసస్తూ చూసస్తూనే పెద్దవాడయ్యాడు. మూడుపదులు నిండిన క్రీస్తుకు భూలోక రక్షణ స్థిర దీక్ష గైకొనే సమయం ఆసన్నమైనది. స్నానం నిమిత్తమై యోర్దాను నదికి వచ్చిన క్రీస్తు తన భక్తుడు యోహానును పుణ్య స్నానం బిమ్మని ఆనతి నిస్తాడు. యోహాను క్రీస్తు జన్మ రహస్యం తెలిసిన వాడు కనుక కొంత వెనుకాడుతాడు.

**కం॥ నాకున్ స్నానం బీగల**
**శ్రీకరుడవు, గరుడవతి విశిష్టుడ వౌరా!**
**నాకెటు చేయాడెడు నని**
**వాకొన, కానిమ్మటంచు ప్రభువు వచించెన్.**

స్నానమాడి, ఒడ్డుకు చేరినంతనే ఆకాశం నుండి దేవవాణి ఇలా వినిపిస్తుంది. ”నితండ నాప్రియుండైన తనూభవుండితనియందు మదీప్సిత మాలకింపుడీ వీని నటంచు నంబరము ప్రీలి వినంబడె నొక్క యద్భుత ధ్వానము, యేసునాథు తలపై నిలిచె న్నవ పావనాత్మయున్”. దీక్షా స్నానమైన తరువాత ఏసుక్రీస్తు నలభై రోజులు ఉపవాసాలతో అడవి ప్రాంతాలలో సంచరించారు. ఆ సమయంలో సైతానులు ఆయనను అనేక ప్రలోభాలకు గురి చేయడానికి ప్రయత్నించాయి. కాని సఫలం కాలేదు. అటు తర్వాత క్రీస్తు తన శిష్య బృందాన్ని ఎంపిక చేసుకొంటాడు. 12మంది ఆయన శిష్యత్వాన్ని వరిస్తారు. తమ ఆస్తి పాస్తులను, భార్యా పుత్రులను విడచి అనుయాయు లౌతారు.

శిష్యులతో కలసి క్రీస్తు ఒకరింట్లో పెండ్లికి వెళ్తాడు. ఆ ఇంటి యజమాని పేదవాడు, ఇంట్లో తగినంత తిండి పదార్థము కాని, త్రాగుట కనువైన ద్రాక్ష పానీయం కాని లేవు. అది గ్రహించిన మరియమ్మ ఆ విషయం కుమారునికి తెలిపి ఇంటి యజమానికి సహాయపడమని సూచిస్తుంది. ఏసు ప్రభువు ఆ ఇంటిలోని పెను రాతి బానలన్నిటినీ నీటితో నింప వలసినదిగా ఆదేశిస్తాడు. తర్వాత తన మహిమతో ఆబానలలోని నీటినంతా ద్రాక్షరసముగాజేసి, పెండ్లి కార్య క్రమాన్ని నిర్వహించేస్తాడు. అది గమనించిన వారంతా ఆశ్చర్య చకితులౌతారు. దీనిని క్రీస్తు ప్రదర్శించిన మొదటి అద్భుతంగా పేర్కొంటారు. ఇలాంటివి దాదాపు 41 అద్భుతాలు క్రీస్తు ప్రదర్శించినట్లుగా Gaspels లో పేర్కొన బడినది. ఇవి అనేక సందర్భాలలో ప్రకటిత మైనట్లుగా చెప్ప బడినది. సందర్భానుచితంగా కొన్నింటిని ఈవ్యాసంలో ఉల్లేఖించడం జరిగింది.

తర్వాత కాలంలో యెరూషలేములోని దివ్యాసమ దైవ మందిరం పవిత్ర భావంతో సందర్శిస్తాడు. ఆసమయంలో–

**మ॥ గుడిలో జూదములాడు వారి, గృకవాకుశ్రేణి నంగళ్ళ న**
**మ్మెడివారిం గొనువారలంగనియె న మ్మేరీ తనూజుండు, బం**
**డెడు దుఃఖంబును క్రోధమున్ గదుర నగ్నింగంట వర్షించుచున్**
**బడ దన్నెన్ వివిధాపణంబులు వణి గ్వర్గంబు స్తంభింపగన్.**

అది గమనించిన ఒక యూదుడు మాకేదైన అద్భుతాన్ని చూపించమని ప్రార్థించగా

**ఉ॥ కట్టుదు దేవళంబు నొడికంబుగ మూడు దినాలలో పడం**
**గొట్టి, యటన్న క్రీస్తు పలుకుల్ విని గ్రాహ్యము గాక యూదు లి**
**ట్టట్టన లేక యొండొరుల ఆస్యములం బరికించు చుండిరా**
**గుట్టును శిష్యసత్తములకున్ వివరించె స్థలాంతరంబునన్.**

**గీ॥ అందమైనట్టి యీ శరీరాలయమును**
**ధరణి బడగొట్టి వాసరత్రయములోన**
**తిరుగ నిర్మింపగలను సందియమువలదు**
**శిష్యవరులార! సోదర శ్రేష్టులార!**

అని జవాబు చెప్పాడు ఏసుప్రభువు! . . . .

హేరోదు రాజు తన తమ్ముని భార్యను ఉంపుడు కత్తెగా అనుభవిస్తాడు. అది తెలుసు కొనిన “యోహాను” అతనిని మందలిస్తాడు. తమ్ముని భార్యను అనుభవించుట పాతకమని, నేర పూరితమని రాజుకు సలహానిస్తాడు. తమ్ముని భార్యను విడిచిపెట్టమని అర్థిస్తాడు. ఆ మాటలు ప్రక్కనుండి విన్న ఆప్రియురాలు “యోహాను”ను బందితునిజేసి కారాగారంలో వుంచమని రాజుకు చెబుతుంది. ఆవిషయం తెలుసుకొన్న ఏసుప్రభువు యోహాను చూచు నిమిత్తమై ప్రయాణమౌతాడు. మార్గమధ్యంలో ఆయనకు దాహం వేస్తుంది. దాహం తీర్చుకొనుటకై మంచి నీటి కోసం యత్నిస్తాడు. ఆ సమయంలో ఒక స్త్రీ బావినుండి నీరుతోడుట క్రీస్తు కంట బడుతుంది. ఆ అమ్మాయి ఒక సమరయ స్త్రీ. ఏసుక్రీస్తు

ఆమెను దాహ మివ్వమని అడుగుతాడు. ఆమె "యూదులకు, సమరయులకు సంబంధ బాంధవ్యాలు లేవని తెలిసి కూడా నీవెట్లు దాహ మడుగుచున్నావని" క్రీస్తును ప్రశ్నించింది. ఆ ప్రశ్నకు సమాధానంగాను, ఆత్మీయతా ముద్ర ప్రతి ఫలింప జేసేదిగాను జాషువా వ్రాసిన పద్యాలు దర్పణం పడతాయి. పరికించండి –

**ఆ॥వె॥ జలము తోడుతున్న సమరయ స తి జూచి**
**యేసు సావి దాహమీయ మనియె;**
**ఇతడు యూదు కులజు డీరాదనెడు చింత**
**నింతి సుంత సంశయించు చుండి.**

**శా॥ ఏనస్పృశ్యను యూద వంశజులు మీరీ బావి నీరంబు తా**
**మానం గూడదు దోష మంచనిన యేసాత్మన్ విచారించి, అ**
**మ్మా నీవిచ్చు జలంబు దాహ దహనం బార్పన్ సమర్థంబు గా**
**దే నిత్తు బ రి శుద్ధ జీవ జలముల్ దృప్త్యుత్సుఖారంభముల్.**

**మ॥ జలముల్, వాయువు, నగ్నియున్ బరమ రాజన్యుండు, భూలోక వా**
**సులకుం బంచి యొసంగి పోయిన స్థిరాస్తుల్, స్పృశ్యతా స్పృశ్యతల్**
**కుల గోత్రాలు ప్రపంచ సభ్యతకు సిగ్గుం జేటు జుమ్మి మ్మహా**
**కలుషం బెల్ల మహా పదార్థములకున్ గల్పింతు రల్పాశయుల్.**

జాషువా తన రచనల్లో అస్పృశ్యతను గురించి నిరసించిన సందర్భాలెన్నో ఉన్నాయి. క్రీస్తు చరిత్ర మత ప్రబోధక కావ్య మైనప్పటికీ, కొన్ని సన్నివేశాలు కల్పించుకొని అస్పృశ్యతా నివారణ విషయమైగట్టి వాదన వినిపించారు. పైన పేర్కొన్న పద్యాలు అందుకు ఉదాహరణలుగా గ్రహించ వచ్చును.

క్రీస్తు దైవాంశ సంభూతుడు, దీనజన రక్షణార్థమే భువిలో జన్మించాడు. ఆ కారణాన, ప్రభువు గలియలలోని అనేక వ్యాధి గ్రస్తులకు, కుష్ఠ రోగులకు స్వస్థత చేకూర్చి బాధా నివారణజేశారు. జబ్బు పడిన ప్రధాని కుమారుని కరుణించి స్వస్థత కూర్చారు, మృత్యుముఖం నుండి రక్షించారు. ప్రభువు దీనజనోద్ధరణా కార్య కలాపాలు రోజు రోజుకూ పెరుగుతూ వచ్చాయి. కరుణామయుని కీర్తి నలుమూలలా ప్రాకింది. ఆయన ఉపదేశములు విని ఆనందించే నిమిత్తం జనులు తండోప తండలుగా రాను మొదలెట్టారు. ఒకానొక సందర్భంలో...

**ఉ॥ ముద్దుల మూట గట్టగ ప్రభుం దుపదేశము చేయు నొక్కపెన్**
**మిద్దియ జుట్టుముట్టుకొని మేటి ప్రజాతతి నిల్చియుండ, నా**
**ప ద్దశయందు మోసికొని వచ్చిరి కొందరు వాత రోగియై**
**ముద్దగ నున్న వాని, పదముం గదలింపగలేని దీనునిన్.**

**ఆ॥వె॥ గుంపు నుండి వాని గొంపోయి ఆయన**
**ముందు నుంప సుంత సందులేక**
**ఇంటి కప్పు విప్పి యేసునాథుని సమీ**
**పమున దింపి రతని పడక తోడ.**

ఆ పక్షవాత రోగిని చూచిన యేసుప్రభువు "నీ పాపాలన్ని క్షమించాను" అని అంటాడు. అది గమనించిన ప్రజలలోని కొందరు వీడు భగవంతుడా తప్పులను క్షమించుటకు? వీడి కెంత గర్వమని తమలో తాము గుసగుసలాడుకొన్నారుట! ఆ మాటలు విన్న ప్రభువు – రోగిని ఉద్దేశించి "లేచి పక్కను మోసుకుని వెళ్ళు" అనగానే ఆ రోగి వెంటనే పట్టరాని సంతోషముతో పడక నెత్తుకొని పరుగిడినాడట! ఆ మహిమను కనులార గాంచిన జన సందోహం ప్రభువును కీర్తించి పూజలర్పించారట! అంతేకాదు–

**కం॥ పెక్కు పిశాచ గ్రస్తుల**
**జక్క పరచి పేతు రత్త జ్వర పీడితయై**
**దిక్కరి యుండన్ గుదురిచె**
**నక్కాంతయు నొసగె ప్రభున కాతిథ్యంబున్.**

**చ॥ గురుతర కుష్ఠ రోగమునకున్ గురియై, పుర బాహ్య సీమలన్**
**గరము తపించు దీనులను గాంచి స్పృశించి కుదిర్చె తద్భయం**
**కర దురితా మయాల్, ప్రభుని కాలి రజో లవమింత సోకినన్**
**గరిగె నఖండ కిల్బిషపు గండశిలల్ విషఖండ చండముల్.**

ఈ విధమైన సత్కార్యములను చేయుచూ తన శిష్య బృందము దూతలుగా వ్యవహరింపగా ఏసుక్రీస్తు సువార్తను ప్రకటించారు. ఆయన చేసిన సత్కార్యాలు లెఖ్ఖకు మించినవి. యెంత మంది బాధితులను పీడ విముక్తులను గావించారో, యెంత మందికి యెన్ని విధాల సహాయ పడ్డారో చెప్పలేం! ప్రేమ స్వరూపుడూ, కరుణా పయోనిధి అయిన ఆయన ప్రబోధాలు నలుమూలలా ప్రతిధ్వనింప సాగాయి!



జాషువా

# లోకేష్ సాహస యాత్ర




రెండున్నర వేల సంవత్సరాల క్రితం ఆసియా, యూరోప్ దేశాల మధ్య సముద్రయానం అంతగా అభివృద్ధి లేని కాలంలో వారధిగా ఉపయోగపడిన మార్గమే సిల్క్‌రూట్– ఆ మార్గం గుండా ప్రయాణం చేయాలనుకున్న లోకేష్ చిన్ననాటి కలలసాకారమే మన ముందున్న సిల్కురూట్ పుస్తకం.

ఒంటరిగా, 62 సం॥ల వయస్సులో పరిచయస్థులెవరూ మచ్చుకైనా లేనిచోట, వారు మాట్లాడే భాష తనకు అర్థంకానిచోట, ప్రాణాల్ని పణంగాపెట్టి, ఆత్మవిశ్వాసం తోడురాగా ఘుమక్కర్ పరవస్తు లోకేష్ సాగించిన సాహస యాత్ర ఇది.

పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ గగన తలాలపై విహంగ విహారం చేసి తాష్కెంట్ చేరుకోవడంతో 55 రోజుల ఈ సుదీర్ఘ  యాత్ర ప్రారంభమవుతుంది.

మొదటి మజిలీ తాష్కెంటు. ఇక్కడ ముస్లిములు ఉన్నా 'దిల్ ఖోల్‌కే దక్కనీ జుబానీ' మాట్లాడే అవకాశం లేదు. అలానే ఉజ్బెకిస్థాన్, కిర్గిజ్‌స్థాన్, చైనాలలో కూడా అంతా మూగ భాషే, మౌన సంజ్ఞలే! ఇంత అనితర సాధ్యమైన యాత్రలో తనకు తానే ఒక ఆగంతకునిగా మారి, గోబీ ఎడారి ఇసుక తిన్నెల మీద పాద ముద్రలతో సంతకం చేసి తిరిగి రావటమంటే తలుచుకుంటేనే గుండెలవిసిపోతున్నాయి. ఎంత దుస్సాహసం! అనిపిస్తుంది.

ఈ ఛల్ అకేలా ముసాఫిర్ చేరుకున్న మొదటి దేశం ఉజ్బెకిస్థాన్. ఇక్కడ హిందుస్థాన్ అంటే అందరికీ గుర్తొచ్చేది హిందీ సినిమాలే. వీరితో దోస్తీ చేసుకోవాలంటే అందులోని పాటలను ఆలపించటం ఒక్కటే సాధనం. మొఘల్ సామ్రాజ్యాధినేత బాబర్ "మా దేశంలో ఉన్న అందమైన స్త్రీలు ప్రపంచంలో ఎక్కడా కానరారు" అన్నమాట అక్షరాలా నిజమేనంటాడు స్వానుభవంతో ఈ యాత్రా రచయిత. అన్నిచోట్లా తిండి ఒక పెద్ద సమస్య. నాన్ వెజిటేరియన్ ఫుడ్ దొరుకుతుంది కాని, వివరాలలోకి వెళితే తినలేము అనిపించి, దాని గురించి తెలుసుకోకుండా తినడం ఒక విచిత్రానుభూతి.

మనలానే అక్కడ కూడా స్థల పురాణాలున్నాయి. వాటి అందం, చరిత్ర, స్థితిగతులను విడవకుండా చెప్తాడు లోకేష్.

పురా స్మృతులను నెమరు వేసుకుంటూ లోకేష్ ఇతిహాసాలలోకి వెళ్లిపోయి –

"ఒకప్పుడు ఈ మధ్యాసియా దేశాలన్నీ మన ప్రాచీన భరత ఖండంలో అంతర్భాగంగానో లేక దగ్గరి సంబంధంగల దేశాలుగానో ఉండేవి. వేదాలలో, రామాయణం, మహాభారతాలలో వీటి ప్రస్తావన ఉంది. ఈ మధ్యాసియా ప్రాంతాన్ని 'ఉత్తర కురుభూమి' అనీ, పామీరు పీఠభూమిని 'మేరుపర్వతమనీ' హిందూఖుష్ పర్వతాలను 'హిమనందన మార్గమనీ' తజికిస్థాన్‌ను 'కాంభోజ'దేశమనీ, కాంథహార్‌ను 'గాంధార' దేశమనీ, కాబూల్‌ను 'కపిశ' అనీ, పెషావర్‌ను పురుషపుర'మనీ అనేవారు. అలాగే అనేక జాతులు, మార్గాల ప్రస్తావన కూడా ఉంది. కపిశకు పైన ఉన్న మార్గాన్ని కైకేయ పథం" అన్నారు.

రెండవ దేశం కిర్గిజ్‌స్థాన్. ఇక్కడి మంచు వానను, చైనాలోని గోబీ ప్రాంతంలో ఇసక తుఫాన్‌ను చూసి పులకించటం లోకేష్ మనందరితో పంచుకున్న ఒక అనుభూతి. కిర్గిజిస్థాన్‌లో మనం దొంగలున్నందుకు కాదు, పోలీసులున్నందుకు భయపడాలన్నాడు.

ప్రయాణానికి ముందు ఈ ప్రాంతాలకు చెందిన చరిత్రను క్షుణ్ణంగా చదివి ఆకళింపు జేసుకొని, దానిని గుర్తుచేసుకుంటూ కొన్ని ప్రదేశాలను ఎంపిక చేసుకొని,  తనకు తానే గైడ్‌గా, తన యాత్రను విజయవంతం చేసుకున్నాడు. మానవునిలో ఎన్ని లోపాలున్నా, అతను  స్నేహశీలి అని, తోటివారిని ప్రేమించే గుణం సహజంగానే వుంటుందని తెలుస్తుంది. లోకేష్‌ది ఒక ప్రత్యేకశైలి. మిక్చర్ తింటున్నప్పుడు మధ్య మధ్యలో తీయగా తగిలే కిస్‌మిస్ పళ్ళలా అక్కడక్కడా దక్కనీ ఉర్దూ మనకు గిలిగింతలు పెడుతుంది.

ఈ పుస్తకం కొని చదివితే వచ్చే అనుభూతే వేరు. లోకేష్ ఖుష్, మనమూ ఖుష్–

---

**పరవస్తు లోకేష్, ఫోన్ నెం.9160680847**

# చదవండి...

- ఎన్నార్కె





✦ **క్రీస్తు అద్భుత గీతాలు :** రచయిత డాక్టర్ లంకా శివరామ ప్రసాద్. కరుణారస ప్రధానమైన క్రీస్తు జీవనంపై ప్రపంచ ప్రఖ్యాతి పొందిన మహాకవుల వంద కవితలకిది స్వేచ్ఛానువాదం. వీటితోబాటుగా జీసస్ క్రీస్తు వికీ నోట్సును (ఇది ఇంగ్లీషులో) కూడా అనుబంధంగా ఇచ్చారు.

*పేజీలు :180, వెల : ₹ 150/-, ప్రతులకు – ఫోన్ : 8897849442*

✦ **శ్రీ ధర్మపురి క్షేత్ర చరిత్ర:** రచయిత డా॥ సంగనభట్ల నరసయ్య సాహిత్యంలోని చారిత్రక ఆధారాలను, జానపదగాథలలోని ఆధారాలను సూక్ష్మ పరిశీలనచేసి రచన సాగించారు. ఇందులో నేత్రావధానం, శూత్రనామావధానం, ఓంకారావధానం లాంటి విషయాలపై విశ్లేషణలున్నాయి.

*పేజీలు :300, వెల : ₹ 180/-, ప్రతులకు – ఫోన్ : 9666849180*



✦ **శ్రీ మదాంధ్ర మహాభక్త విజయం :** 76గురు భక్తుల జీవిత చిత్రణ. శ్రీ పంగులూరి వీరరాఘవులుగారి మూల రచనకు యల్లాప్రగడ ప్రభాకరరావు. పంగులూరి హనుమంతరావు చేసిన అను సృజన. ఎవరో ఒకరు పూనుకొని యువతను జాగరూకం చేయకపోతే భావిభారతం ఎలా ఉంటుందోనన్న ఆందోళనతో అక్షరం ద్వారానే ఈ పనికి పూనుకొన్నట్లు శ్రీ కౌండిన్య పబ్లికేషన్స్ వారు పేర్కొన్నారు.

*పేజీలు :325, వెల : ₹ 150/-, ప్రతులకు – ఫోన్ : 9908648474*



✦ **భారతీయ నవల :** వాడ్రేవు వీరలక్ష్మీదేవి. 25 సుప్రసిద్ధ భారతీయ నవలల పరిచయాల సంపుటి. చినుకు పత్రికలో ధారావాహికంగా వచ్చి ఎందరినో అలరించిన రచనలివి. ఆంగ్లంతోబాటు కన్నడం, అస్సామీ, బెంగాలీ, ఒరియా, తమిళం, మరాఠీ భాషలలోని సమాంతర సాహిత్యాన్ని సూక్ష్మంలో మోక్షంగా మన ముందుంచుతాయి ఈ రచనలు.

*పేజీలు :120, వెల : ₹ 120/-, ప్రతులకు – చినుకు ప్రచురణలు.*



✦ **తమిళ సరస్వతి అందెల రవళి సంగం కవిత్వం :** రచయిత లంకా శివరామ ప్రసాద్. ఈ సంకలనంలో 120కు పైగా ఉన్న కవితలు ఆగమ్, పురానాం నూరు ప్రక్రియలో రచించబడినవి. వీర శృంగార రసాలు ప్రధానంగా ఉన్న సంగం కవితలు చదివి తీరవలసిందే.

*పేజీలు :150, వెల : ₹ 50/-, ప్రతులకు – ఫోన్ : 8897849442*



✦ **కొత్తపలక :** మట్టినుండి ఉద్భవించిన ఊహలు, మట్టిని చీల్చుకొని నింగికెగసే కలలు, జీవితపు కొసవేళ్ళ నుండి జారిపోతున్న ఆశయాలు రచయిత ఏనుగు నరసింహారెడ్డి కవితా వస్తువులు. ఇందులో యాభైరెండు కవితలున్నాయి.

*పేజీలు :134 వెల : ₹ 60/-, ప్రతులకు – పాలపిట్ట బుక్స్ ప్రచురణ*




✦ **మూడు యాభైయిల మన గురజాడ :** ఇ. రామినాయుడు, పొనుగూటి వలస, రాజం, శ్రీకాకుళం వారు ప్రచురించిన యాభై మూడు గురజాడ వ్యాసాల సంపుటి. అమేయమైన వ్యాసాలతో బాటుగా బాపూ వేసిన కార్టూన్లు, కూర్మపు నరసింహం వేసిన గురజాడ, ఆనంద గజపతి చిత్రాలు. చిత్రకారుడు అక్బర్ వేసిన యువ గురజాడ చిత్రం, కన్యాశుల్కం నాటిక ఘట్టాలకు చిత్రకారిణి ప్రవల్లిక వేసిన చిత్రాలు – ఈ పుస్తకానికి మరింత శోభనిచ్చింది. గురజాడ అభిమానులందరివద్దా ఉండదగిన పుస్తకం.

*పేజీలు : 410, వెల : ₹ 200/-, ప్రతులకు – ఫోన్ : 0866 2573500*




✦ **శ్రియ స్మృతిలో :** అపహరణకుగురియై తరువాత హత్యకావించబడ్డ ఆరేళ్ళ శ్రియ స్మృత్యర్థం నిర్వహించబడ్డ కవిసమ్మేళనంలో కన్నీరు కార్చిన కవితలివి.

*పేజీలు :60, వెల : ₹ 30/-, ప్రతులకు – అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభ్యం.*



✦ **యువశతకం :** నాగం గోపాలరెడ్డి రచించిన యువశతకం. అమ్మభాషకు సరిపోలదన్న భాష కన్నతల్లి పాలసమమె? లాంటి చక్కటి గేయాలున్నాయి.

*పేజీలు : 60, వెల : ₹ 20/-, ప్రతులకు – ఫోన్ : 8374409667*




✦ **జిప్సీ :** సాగర్ శ్రీరామకవచం. బహుశ నా నడక ఆధోజగత్ సహోదరుల కోసం కావచ్చు అంటూ రచయిత ప్రాచీన పద్యరూపాన్ని ఆధునిక వచన కవిత్వాన్ని కలిపి ఈ రూపం ఎంచుకున్నాడు. చిక్కటి రచనకు, చక్కటి బొమ్మలు అలరింపబడ్డాయి.

*పేజీలు :130, వెల : ₹ 100/-, ప్రతులకు – అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభ్యం.*

✦ **సంభాషణ :** రచయిత కె.శ్రీనివాస్. అనేక సందర్భాలలో రాసిన వ్యాసాలు. వస్తురీత్యా ఎంతో వైవిధ్యం ఉన్న రచనలు. ఈ వ్యాస సంకలనం వ్యక్తుల గురించి, సంఘటనల గురించి కాక వాటిని ఉపయోగించుకుని మనల్ని నడిపిస్తున్న భావజాలాన్ని గురించి, వాటి ప్రభావాల గురించి హెచ్చరిస్తున్నట్లుగా ఉంటాయి. తెలుగు నుడికారం, జాతీయాలప్రయోగం అలవరచుకోవాలనే విద్యార్థులకు ఇవి ఉపయుక్తమవుతాయి.

*పేజీలు : 160, వెల : ₹ 150/-, ప్రతులకు – విశాలాంధ్ర సోల్ డిస్ట్రిబ్యూటర్స్*




✦ **దేశభక్తి-ఒక శతాబ్ది కిందటి ముందుచూపు :** మోనోగ్రాఫ్ అనదగిన ఈ రచనకు ఎన్.వేణుగోపాల్ రచయిత. కవి, విమర్శకులు, రాజకీయార్థికశాస్త్ర విశ్లేషకుడాయన. దేశమును ప్రేమించుమన్నా అన్న గురుజాడ రచనాకాలం 1910. దీనిని స్థలకాల పరిమితుల దృష్ట్యా చేసిన విశ్లేషణ.

*పేజీలు : 50, వెల : ₹ 20/-, ప్రతులకు – ఫోన్ : 8985922183*



✦ **ఏది తెలుగు? ఎవరు తెలుగువారు? :** ఇతర వ్యాసాలు. ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న వాసిరెడ్డి భాస్కరరావు గారు వ్రాసిన 12 వ్యాసాల సంపుటి. ఇందులో మానవహక్కులు – సమాచార చట్టం 2005 పై సమగ్రమైన విశ్లేషణలున్నాయి. 'సుగుణం' అనే మకుటంతో నున్న వ్యాసం విద్యార్థులందరూ చదవాలి. మరికొందరిచే చదివించాలి.

*పేజీలు : 122, వెల : ₹ 40/-, ప్రతులకు – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.*




# నవలాహృదయావిష్కరణ

**కా**లం మారింది. వేగం పెరిగింది. చదువరుల సంఖ్య తగ్గిందంటున్నారు. (ఎంత వరకు నిజమో తెలీదు) నవలలు చదివే ఓపిక పాఠకులకు లేదనేది ఒక వాదం. తెలుగు సాహిత్యాన్ని నవలలే ఏలాయి. పత్రికల సీరియల్ నవలలు ఒకప్పుడు నలుగురు కలిసే వేళ చర్చనీయాంశాలు. ఆ నవలలు అచ్చయి పుస్తకాలుగా వస్తే వేల సంఖ్యలో ప్రతులు రోజుల్లోనే చెల్లిపోయేస్థితి. ఆ స్థితి ఇప్పుడు లేని మాట వాస్తవమే అయినా, పట్టణ పాఠక సంఖ్య కాస్త తగ్గినా ఇప్పటికీ నవలలకు ఆదరణ తగ్గిందని పూర్తిగా అనుకోలేం. పునర్ముద్రణలు పొందుతున్న క్లాసిక్ నవలలే అందుకు ఉదాహరణలు.

ఇప్పుడీ వాదమంతా ఎందుకంటే...

వంద నుంచి వెయ్యి పేజీల వరకు ఉండే నవలల్ని నాలుగైదు పేజీలకు కుదించి కొత్తతరం పాఠకులకు పరిచయం చేస్తే ఎలా ఉంటుంది? అనే ఆలోచన, కొత్తతరం పాఠకుల్లో ఆయా రచయితల పట్ల, రచనల పట్ల ఆసక్తి కల్పించవచ్చుననే అవగాహనల నుంచి పుట్టిందే నవలాపరిచయం. ఈ పనిని అమెరికా నుంచి వెలువడే 'తెలుగునాడి' మాసపత్రికలో మొదలు పెట్టారు కీ.శే. 'సహవాసి'. తర్వాత ఆ పనిని రాజారామమోహనరావు చేస్తున్నారు. ఇలా ఆయన రాసిన 27 నవలల పరిచయాల మాలిక ఈ నవలా హృదయం పుస్తకం.

ఇలాంటి పరిచయాలను కీ.శే. మాలతీచందూర్ 40 సంవత్సరాలు నిర్విఘ్నంగా చేశారు. కాకపోతే ఇవి ఇంగ్లీషు నవలల పరిచయాలు. ఇలా తెలుగు నవలలను క్లుప్తంగా పరిచయం చేయడంలో కొన్ని ఇబ్బందులున్నాయి. పరిచయం చదివాక పాఠకుడికి, నవలను పూర్తిగా చదవాలనిపిస్తే ఆ పరిచయానికి అర్థం ఉంటుంది. అలాకాకుండా పరిచయానికే తృప్తిపడిపోయి ఇహ నవలను చదవనవసరంలేదనే అభిప్రాయానికొస్తే అది అనర్థమే అవుతుంది. కాబట్టి పరిచయం అర్థవంతంగా ఉండాలి. కేవలం నవలలోని కథ చెప్తే సరిపోదు. ఆ నవల చుట్టూ పర్చుకున్న వాతావరణం, జీవితం, కాల పరిస్థితులను అర్థం చేసుకుని పాఠకులకు అవి క్లుప్తంగా నవల చదవాలనిపించేట్లు రాయాలి. ఇది ఒక రకంగా కత్తిమీద సాము వంటిదే. నవలాహృదయంలో ఈ ఫీట్‌ని అవలీలగా సాధించారు రాజారామమోహనరావు. రచయిత స్వతహాగా నవలాకారుడు కావటం వల్ల నవలల్లోని జీవాన్ని పట్టుకుని పాఠకులకందించటంలో నేర్పు చూపించారు. ఈ 27 నవలా పరిచయాల్లో సెక్రటరీ (యద్దనపూడి సులోచనారాణి); *అంటరాని వసంతం* (కల్యాణరావు); *మోహనవంశి* (లత); *బతికిన కాలేజి* (పాలగుమ్మి పద్మరాజు); *పాకుడురాళ్ళు* (రావూరి భరద్వాజ) వంటి ప్రసిద్ధ నవలలతోపాటు, అంతగా ప్రాచుర్యం కాని *స్వర్ణసీమకు స్వాగతం* (మహేంద్ర); *పితృవనం* (కాటూరి విజయసారథి); *విరామం* (అంగర వెంకట కృష్ణారావు), వంటి మంచి నవలలు కూడా ఉన్నాయి.

*రంగుల వల* (ముక్తవరం పార్థసారథి); *వలసదేవర* (జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి); కౌసల్య (పోలాప్రగడ) వంటి నవలలను పరిచయం చేయడంలో ఇబ్బంది లేదు. కానీ, సెక్రటరీ లాంటి పాప్యులర్ నవలను, అనుభూతి ప్రాధాన్యతతో సాగిన *మోహనవంశి* నవలను, విస్తారమైన *పాకుడురాళ్లు* నవలను, *సంసార వృక్షం* (ఆర్.ఎస్.సుదర్శనం) లాంటి తాత్త్విక నవలను, చైతన్య స్రవంతి పద్ధతిలో సాగిన *ఊబి లో దున్న* (వినుకొండ నాగరాజు) నవలను, ఇల్లు కట్టిచూడు (పురాణం) లాంటి హాస్య నవలను పరిచయం చేయడంలోనే చిక్కంతా ఉంది. ఎందుకంటే వాటికున్న స్వభావం రీత్యా ఇటువంటి నవలల్లో కథ కనబడదు. ధోరణులుంటాయి. మానసిక విశ్లేషణలుంటాయి. అద్భుత వాక్య విన్యాసాలుంటాయి. చమత్కారాలుంటాయి, చమక్కులుంటాయి. తాత్త్విక చింతన ఉంటుంది. వీటి మధ్య అంతర్లీనంగా దాగున్న పాత్రల వ్యక్తిత్వాన్ని, కథను పట్టుకోవడం, దాన్ని పాఠకులకు సూటిగా చెప్పడంలో రాజారామ్మోహనరావు నేర్పుని ప్రశంసించకుండా ఉండలేం.

మొత్తం మీద ఈ పుస్తకం చదివాక 27 నవలలు చదివేశామన్న తృప్తికాకుండా, 27 నవలలూ ఆసాంతం చదవాలన్న ఆసక్తి పాఠకులకు తప్పకుండా కలుగుతుంది. రచయిత ప్రయత్నం నెరవేరినట్లే!

**– వాసిరెడ్డి నవీన్**

*ఈ క్రింది పుస్తకాలు మీకు అవసరమయితే మాకు తెలియచేయండి. వాటి విలువకు తపాలా ద్వారా పంపిస్తాం.*

## I. మిసిమి ప్రచురణలు

| | | ₹ |
|---|---|---|
| 1. | బాపు బొమ్మలు | 200.00 |
| 2. | మహాబౌద్ధ విజ్ఞాన సర్వస్వ నిఘంటువు | 500.00 |
| 3. | బుద్ధుని దీర్ఘ సంభాషణలు – *ఎ.వి.రెడ్డి* | 200.00 |
| 4. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–1 ” | 200.00 |
| 5. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–2 ” | 200.00 |
| 6. | బుద్ధుని మధ్యమ సంభాషణలు–3 ” | 200.00 |
| 7 | ఆచార్య నాగార్జునుడు | 150.00 |
| 8. | దూర తీరాలలో... – *వి. అశ్వినీకుమార్* | 60.00 |
| 9. | అమాహ ” | 60.00 |
| 10. | అంతర్వీక్షణం ” | 50.00 |
| 11. | సిద్ధార్థ ” | 50.00 |
| 12. | నాలో నేను ” | 30.00 |
| 13. | అగాధం ” | 75.00 |
| 14. | కథాంజలి–1 **– ఎస్సారె** | 80.00 |
| 15. | కథాంజలి–2 ” | 110.00 |
| 16. | THE THUNDERCLOUD ” | 120.00 |
| 17. | మిసిమి వ్యాసాలు – *నరిసెట్టి ఇన్నయ్య* | 125.00 |
| | **ఇతరములు** | |
| 18. | భట్టిప్రోలు కథలు | 150.00 |
| 19. | రెండు దశాబ్దాలు – కథ 1990–2009 | 150.00 |

## II. వేమన ఫౌండేషన్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | లోకకవి వేమన – *ఎమ్. కోదండ రామిరెడ్డి* | 100.00 |
| 2. | మన వేమన – *ఆరుద్ర* | 80.00 |
| 3. | వేమన – *నార్ల వెంకటేశ్వరరావు* | 50.00 |
| 4. | VEMANA - *V.R. Narla* | 50.00 |
| 5. | VEMANA - Through Western Eyes. - *V.R. Narla* | 50.00 |
| 6. | విశ్వకవి వేమన – *గుర్రం వెంకటరెడ్డి, పోచన రామిరెడ్డి* | 100.00 |
| 7. | పురాణ ప్రలాపం *(ప్రొ. హరిమోహన్ ఝూ, అనువాదం: జె.లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 8. | THE FIRST POETICAL READER *(Walter Joyes and N.C. Sashacharloo)* | 50.00 |
| 9. | వేమన – *రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ* | 100.00 |
| 10. | వేమన ఉపదేశామృతం –*ఎస్.ఎమ్. సుభాని* | 25.00 |

## III. ధర్మదీపం ఫౌండేషన్ ప్రచురణలు

| | | ₹ |
|---|---|---|
| 1. | మహాపరిత్తం – *బోధ చైతన్య* | 100.00 |
| 2. | జాతక కథలు – *శివశంకర స్వామి* | 60.00 |
| 3. | బౌద్ధ దర్శనమ్ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : బి. గోవర్ధన్)* | 70.00 |
| 4. | మహామానవ బుద్ధ *(రాహుల్ సాంకృత్యాయన్ ; అనువాదం : డా. జె. లక్ష్మిరెడ్డి)* | 75.00 |
| 5. | మిళిందపన్హ: ఉపమలు – *బోధ చైతన్య* | 75.00 |
| 6. | బ్రాహ్మణ, బౌద్ధ, హిందూ మతాలు – *అన్నపరెడ్డి బుద్ధఘోషుడు* | 40.00 |
| 7. | వర్ణవ్యవస్థా లేక మరణ వ్యవస్థా *(భదంత ఆనంద కౌసల్యాయన్; అనువాదం:జె.లక్ష్మి రెడ్డి)* | 50.00 |
| 8. | జయమంగళం – బొర్రా గోవర్ధన్ | 40.00 |
| 9. | బుద్ధుని చివరి రోజులు – *డాక్టరు ఈమని శివనాగిరెడ్డి* | 30.00 |
| 10. | భగవాన్ బుద్ధ *(ధర్మానంద కోశాంబి; అనువాదం: బొర్రా గోవర్ధన్)* | 150.00 |
| 11. | విపశ్యనా ధ్యానమార్గదర్శిని *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 50.00 |
| 12. | మిళింద ప్రశ్నలు – *బోధచైతన్య* | 150.00 |
| 13. | బౌద్ధ ధర్మదర్శిని *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 100.00 |
| 14. | ప్రజ్ఞాదీపిక *(తియ్యగూర సీతారామిరెడ్డి & నందం శ్రీనివాసరావు)* | 60.00 |
| 15. | శీలం–ధ్యానం – *బోధ చైతన్య* | 150.00 |
| 16. | లోకక్షేమ గాథలు – *బోధ చైతన్య* | 75.00 |
| 17. | జాతకమాల – *బోధ చైతన్య* | 150.00 |
| 18. | తథాగత – *(భదంత ఆనంద కౌసల్యాయన్ – అనువాదం జె. లక్ష్మిరెడ్డి)* | 50.00 |
| 19. | సంఘమిత్ర కథలు – బొర్రా గోవర్ధన్ | 75.00 |
| 20. | నిత్యజీవితంలో అభిధర్మం – ఆంగ్లమూలం: ఉకోలే, తెలుగు: వోలేటి | 150.00 |

## IV. ఆర్ట్స్ & లెటర్స్ ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | తెలుగా, ఆంధ్రమా? – వాగరి | 40.00 |
| 2. | యతిగీతం– స్వామి వివేకానంద (అనువాదం ; గజ్జెల మల్లారెడ్డి) | 50.00 |
| 3. | చార్లీ చాప్లిన్ (నా కథ) – *వి. అశ్వినీకుమార్* | 299.00 |
| 4. | తిరుపతి తిమ్మప్ప – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* | 250.00 |
| 5. | రైతు రాయలు – *గుత్తి చంద్రశేఖర రెడ్డి* | 50.00 |
| 6. | తెలుగులో పాళీ పదాలు – *చీమకుర్తి శేషగిరిరావు* | 50.00 |
| 7. | ఆంధ్రనగరి – *సాయి పాపినేని* | 290.00 |

మిసిమి మాసపత్రిక

**మిసిమి** *విజ్ఞాన దాయకం, వినోద ప్రసాదం!*

**మిసిమి** పత్రిక ప్రతినెలా మీ ముంగిట చేరేందుకు మీరు చేయాల్సిన చిన్న పని, ఈ క్రింది వివరాలు మీ సంవత్సర చందా ₹240/- తో పాటు పంపండి. బయటి **చెక్కులకు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు** అదనంగా ₹30/- కలపండి.

1. **పేరు:** ........................................

2. **చిరునామా:**

ఇం.నెం. ........................................

వీధి ........................................

పేట ........................................

ఊరు ........................................

పిన్ ........................................

సెల్ ........................................

3. **సంతకం:** ........................................

---

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | STATE BANK OF INDIA |
| Account | : | MISIMI |
| A/c. No. | : | 10261569316 |
| Branch | : | Saifabad, Hyderabad, INDIA |
| IFS Code | : | **SBIN0007315** |

---

*చందాలు **మిసిమి** పేర ఈ క్రింది చిరునామాకు పంపించగలరు.*

★ **మిసిమి** లో నూతన చందా దారులుగా చేరండి : **'అగాధం' పుస్తకాన్ని బహుమతిగా పొందండి.**

★ రెండు సంవత్సరాల చందా దారులకు **'బాపు బొమ్మల' పుస్తకం పంపిస్తాము.**

★ నాలుగు సంవత్సరాల చందా దారులకు **'చార్లీ చాప్లిన్' నా కథ గ్రంథాన్ని బహుమతి.**

★ ఐదు సంవత్సరాల చందా దారులు '2011 **మిసిమి పాత సంచికల బౌండు'లను అందుకోవచ్చు.**


మిసిమి
మాసపత్రిక

**Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 500 020.

Ph. 040-27645536, E-mail : misimi_monthly@yahoo.in

e-magazine : www.kinige.com/misimi




అంద్రెయ

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2012-14



కారుణ్యమూర్తి